

An Accomplished Author With World-Wide Releases
Of Two Of His English Novels
"The Enemy of the Mankind" and
"The Dictator of the Dark"
సూర్యదేవర
రామ్ మోహన రావు
AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU
ఐశ్వర్యరాయ్
V/S ఆకలి

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి

125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత

**The Number One Best Selling Author**


## సూర్యదేవర
## రామ్‌మోహనరావు


# ఐశ్వర్యారాయ్ వర్సెస్ ఆకలి


మధుప్రియ పబ్లికేషన్స్

మాచవరం • విజయవాడ - 520 004

# ISWARYARAY VARSES AAKALI

(Direct Novel)

By

**SURYADEVARA RAM MOHANA RAO**

Sri Venkata Anantha Sai Nilayam

Flat No.63, Road No.71

Navanirman Colony, Jubilee Hills

Hyderabad - 500 096

E-mail : suryadevaranovelist@gmail.com

www.suryadevararammohanrao.com

www.suryadevaranovelist.com.

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 0866 - 2431969

Edition :

**2015**

Price :

**Rs. 170-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

# ఐశ్వర్యారాయ్ వర్సెస్ ఆకలి

**అందం....**

**అద్భుతమైన అందం....**

**అనంతమైన అందం....**

**అందానికి నిర్వచనం ఏంటి?**

**అది అనిర్వచనీయం కాదా?**

**ఇవేనా అందాన్ని వర్ణించే పదాలు?**

**మరింకేంటి?**

నల్లటి మేఘాల మధ్యనుంచి తొలిపొద్దు కిరణం పుడమిపై విచ్చిన పూరేకును తాకినప్పుడు సిగ్గుపడే పూబాల చెక్కిలి ఎరుపుదనం కూడా అందం....?

అడవి, మత్తెక్కిన పూలసుగంధాలని పిల్లతెమ్మరను తోడు చేసుకొని ప్రకృతిపై విసరినప్పుడు పరవశించే మనసు నడి కూడా అందం....?

గోదావరి ఇసుక తిన్నెలపై విరహోత్కంటి తలా ఓ యవ్వనం పరుండినప్పుడు ఆ నడుము వంపులో పరవశించే చంద్రకిరణానిది కాదా అందం...?

యవ్వనం అందానికి మెరుగులు అద్దవచ్చు.

కానీ...

యవ్వనమే అందం కాదు.

పసిపాప మొలక నవ్వు... గాంధీతాత బోసి నవ్వు... మదర్ థెరిస్సా మానవత్వం... సంగీత సాగరంలో ఓలలాడించే ఎమ్మెస్ సుబ్బలక్ష్మి...

ఏ పదవి లేకుండా, ఎవరి అండా లేకుండా మహాత్ముడు కలలుగన్న మరో ప్రపంచానికీ జలరక్షణే ఆధారమని ఆచరణాత్మకంగా నిరూపించుకున్న ఆరావళీ ముద్దుబిడ్డ మెగసెసె అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్.

అక్రమ కట్టడాల్ని అడ్డంగా అడ్డుకున్న ముంబాయి ఖైర్నార్... ముంపు పొలాల పేదరైతులకోసం... నిరంతరం పోరాడుతున్న మేధాపార్కర్... భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన స్వామీ వివేకానంద...

తను బిచ్చమెత్తి లక్షమందికి అన్నంపెట్టిన షిర్డీసాయి... తనకు భక్తులిచ్చిన సంపదను ప్రజల దాహార్తికి వాడుతున్న పుట్టపర్తి సాయి... ఏదయినా నిర్భయంగా మాట్లాడగలిగే అరుంధతీరాయ్... అందాలకి చిరునామా కార్రా...?

ఐతే...

ఈ ప్రపంచంలోని సౌందర్యం అంతా ఒక ఎత్తు మాత్రమే.

నా హృదయ పీఠాన్ని అలంకరించిన రసరమ్య సామ్రాజ్ఞి... దేవలోకపు వయ్యారాల వల్లువ...

ఊహాతీతమైన స్నిగ్ధ సుకుమార లావణ్యం.

అన్నీ కలబోస్తే వచ్చే నిలువెత్తు రూపం...

ఆమె...

ఆమె ఎవరో కాదు... ఈ అఖండ భారతదేశాన్ని తన నటనా చాతుర్యంతో, తన మేని సొగసులతో జ్వలింపచేస్తున్న ఐశ్వర్యారాయ్...

ఎస్... ఐశ్వర్యారాయ్...

ప్రపంచ సుందరి... సౌందర్య ప్రపంచపు సామ్రాజ్ఞి.

వయస్సుతో నిమిత్తం లేకుండా కోట్లాదిమంది... మనుషుల కలల రాకుమారిగా మారిపోయిన ఐశ్వర్య.

అంతేనా....?

అంతే కోట్ల మంది స్త్రీలకూ అసూయపుట్టించే అందగత్తె...

తమ బాయ్‌ఫ్రెండ్స్ జేబుల్లోకి వెళ్ళకూడని నిషిద్ధ వస్తువు ఐశ్వర్యారాయ్ చిత్రం అని భావించే అమ్మాయిలు...

తమ భర్తల మనసు పొరల్లో ఇరుక్కోకూడని ప్రమాదకర వస్తువు ఐశ్వర్య ఆలోచన అని ఎందరో గృహిణులు....

అంతటి అందాలరాశి తమ కూతురుగా పుడితే బావుండునని తల్లిదండ్రులు... తమ కోడలయితే అదృష్టమని అత్తమామలు... తమకు హోదరయితే చాలని సోదర సోదరీమణులు... తమకు మనవరాలయితే చాలని అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు...

తమ దేశంలో పుట్టుంటే ఎంత గొప్పగా వుండేదని విదేశస్థుల మనోభావాలు... అన్నీ... ఇవన్నీ ఒక్క అందం చుట్టే అల్లుకుపోయున్నాయి... ఇది నిజం.

ఈమె ఒక ప్రపంచసుందరే కాదు. అంతే అయితే ఇంతగా చెప్పుకోవడం వుండేదికాదు... ప్రపంచ సుందరీమణులు చాలామందే వున్నారు. వాళ్ళ ఎదుగుదల అక్కడితోనే ఆగిపోయింది. కానీ ఈమె అలా కాదే.... ఎక్కడా ఆగకుండా ఎదుగుతూనే పోతోంది... ఎక్కడెక్కడికో... రైజ్... అండ్... రైజ్....

ఎప్పటికప్పుడు మీడియాకి చేతులనిండా పని కల్పిస్తూ... ప్రపంచ ప్రతిష్ఠాత్మక పత్రిక టైమ్ ముఖచిత్రంగా వచ్చిన తొలి అందగత్తె....

లండన్ టుస్సాడ్స్ మైనపు మ్యూజియమ్‌లో విగ్రహమై కొలువు దీరిన మొదటి భారతీయ సినీనటి.

ఇండియానుంచి ఇంగ్లాండ్ పెళ్ళి అంతర్జాతీయ ఆంగ్ల చిత్రం బ్రైడ్ అండ్ ప్రిజుడీస్‌లో నటించిన తొలి సినీ కధానాయక.

లండన్ కేన్స్ ఫెస్టివల్ జ్యూరీలో ఒక న్యాయనిర్ణేతయిన అతి పిన్న వయస్కురాలు.

ఎన్నో... ఇంకెన్నో...

ముందు ముందు ఇంకెన్ని ఆమెని వరిస్తాయో ఎవరు చెప్పలేని ఉద్విగ్న స్థితి...

వీటన్నిటికీ ఆమె అందం ఒక్కటే కారణం కాదు... ఆమెలోని మానసిక పరిణితి.. మానవత్వపు కోణం... చతురత... తెలివితేటలు, సమయానుకూల స్పందన.

ఆత్మవంచన లేకుండా ఇష్టమైతే ఇష్టమని... కష్టం కలిగించేదయితే వద్దని గట్టిగా చెప్పగల ఆత్మస్థయిర్యం ఆమె సొంతం.

మేధస్సు వున్న వ్యక్తికి అందం తక్కువయినా నష్టం లేదేమో గాని... అందంగా వుండి మేధస్సు లేకపోతే అది ఎలాతెలా పోతుంది.

బ్రహ్మకయినా గొప్ప కష్టమేమో ఐశ్వర్యలాంటి అందగత్తెని సంవత్సరానికి ఒకర్నయినా సృష్టించడం... అందుకేనేమో వందల సంవత్సరాలక్రితం క్లియోపాట్రాని... హెలెన్ ఆఫ్ ట్రాయ్‌ని సృష్టించాక, తిరిగి ఎంతో కాలవ్యవధి తీసుకునిగాని, ముంతాజ్ బేగమ్‌ని సృష్టించలేదు.

మరలా ఎన్నో వందల ఏళ్ళకి ఐశ్వర్య...

బ్రహ్మకే క్లిష్టతరమైంది మనిషికి అబ్బురం కాక మరేమవుతుంది?

ఐశ్వర్యారాయ్‌ని నేను పిచ్చిగా అభిమానిస్తున్నాను, అంటే ఎవరికి ఆశ్చర్యం కలిగించే విషయం కాదు.

ఎందుకంటే ఈ ప్రపంచంలో నాలాగే ఎందరో...

కాని నాకే తెల్సు. ఆ సౌందర్యం కోసం నాలో చెలరేగుతున్న కాంక్షా జ్వాలలు ఎంత తీవ్రమైనవో... నేను జీవితంలో ఐశ్వర్యారాయ్‌ని చూడలేకపోవచ్చుగాని, చూసే అవకాశం కోసం... కాదు... కాదు... అదృష్టం కోసం ప్రయత్నిస్తాను.

ఆ అపురూప సౌందర్యాన్ని, ప్రకృతి సహజత్వంలో మెరిసిపోయే ఆ సుకుమార తనువును, హరిత వర్ణంలో మెరిసే ఆ కళ్ళను, పగడపు దీవుల్లో విరిసే ఆ పెదాలను, సంపెంగను సవాలుచేసే ఆ నాసికను, ఉత్తుంగ పర్వతాలను తలపించే ఎత్తయిన ఎద లోయలను తను స్పర్శించగలిగితే!! అప్పుడేకదా తన జీవితం ధన్యం.

ఈ కోరిక వయస్సులో వున్న తనకి సహజమైన కల... ఇతర యువకులకి సహజాతి సహజమైన కల...

దేవుడే ప్రత్యక్షమై వరం అడిగితే ఇంతకంటే ఏమి కోరుకుంటాడు తను.

డైరీ మూసివేసి దీర్ఘంగా నిట్టూర్చి లేచాడు త్రినాథ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

అది ఒక మిడిల్ క్లాస్ ఏరియా.

పల్లె, పల్లెతనాన్ని వదులుతూ పట్టణంలా గడుసుతనాన్ని నేర్చుకొంటున్న ఛాయలు మనకి అక్కడక్కడ కనిపిస్తాయి. ఊరి మొదట్లో పూర్వపు రచ్చబండ శిధిలమైపోయి ఓ కాకా హోటల్‌గా మారిపోయింది. ఆ హోటల్ చుట్టూ తడికలకు అంటించిన వాల్‌పోస్టర్లవంక వచ్చీపోయే జనాలు ఆబగా చూస్తుంటారు.

ఆ ఊర్లో వున్నది ఒకే ఒక టూరింగ్ టాకీస్. సిటీలో సినిమా రిలీజ్ అయిన మూడు నెలలకు ఆ టూరింగ్ టాకీస్‌లో ప్రదర్శిస్తారు. జనాలు విరగబడి చూస్తుంటారు.

ఇక కాకా హోటల్ పక్కన కిళ్ళీబడ్డీ.

ఆ కిళ్ళీబడ్డీముందు నులకతాడును కట్టి దానిమీద అటు కొన్ని పేజీలు, ఇటు కొన్ని పేజీలు వచ్చేలా వేలాడదీసిన వారపత్రికలవంక తాపీగా చూస్తూ వుంటారు.

అక్కడికి కొంచెం దూరంలోనే వుంది టూరింగ్ టాకీస్. ఎప్పుడో పెద్దిరెడ్డిగారున్నప్పుడు యన్.టి.రామారావు సినిమాల మీద మోజుతో కట్టించారు హాలు.

టౌన్‌లో బొమ్మ మారినప్పుడల్లా ఇంటిల్లి పాదీ బండి కట్టుకుని సినిమాకి వెళ్ళేవారు. ఆ తరువాత తన హోదా కది తగదనిపించింది. అందుకని తనే స్వయంగా పూనుకొని ఆ సినిమాహాలు కట్టించాడు. దానికి సుబ్రమణ్యేశ్వర టాకీస్ అని తన కొడుకు పేరు కలిసివచ్చేలా పెట్టుకున్నాడు.

చిన్నప్పుడు తండ్రి వేలు పట్టుకుని ఆ హాలు నిర్మాణాన్ని పరిశీలించిన సుబ్బుకి ఆ హాలుమీద ఎనలేని మమకారం ఏర్పడింది.

పెద్దిరెడ్డిగారి హయాం నశించింది...

ఇప్పుడు సుబ్బుదే రాజ్యమంతా...

ఊళ్ళో వున్న ఒక వర్గం కుర్రాళ్ళను పోగేసి పెద్దపెద్ద హీరోల సినిమాలను తెచ్చి నడిపిస్తుంటాడు.

అతనికి ప్రధాన ఆటంకం త్రినాథ్.

త్రినాథ్ అంటే ఆ ఊళ్ళు తెలియని వారుండరు. అంటే అతనేదో గొప్ప హీరో అని కాదు. అతను ఆ వూరి ప్రజలకు సేవ చేయలేదు. కానీ అతనందరికీ తెలుసు.

అతనికి ఈ ప్రపంచంలో ఒకే ఒక వ్యక్తిపట్ల వున్న ఫాసినేషన్. అది కొందరికి పిచ్చితనంగాను, మరికొందరికి హేళన చేయదగిన అంశం గాను కన్పిస్తుంది.

కానీ అతనదేమీ పట్టించుకోడు.

ఎప్పట్లాగే ఆ రోజు కూడా పొలంపని ముగించుకొని హాలువైపు బయలుదేరాడు. ఈసారి త్రినాథ్‌కి చాలా పంతంగా వుంది. మంచి వూపు మీద బయలుదేరాడు. హాలు దగ్గరికి వెళ్ళేసరికి సుబ్బు నలుగురైదుగురు స్నేహితులతో కూర్చుని బాతాఖానీ వేస్తున్నాడు.

మార్నింగ్ షోకి జనం విరగబడి వచ్చారు. ఆ క్యూలో ఓర చూపులు చూస్తూ టిక్కెట్లు కోసం ఓపిగ్గా నిలబడివున్న ఆడవాళ్ళ వంక చూస్తూ కామెంట్ చేస్తున్నారు సుబ్బు, అతని స్నేహితులు.

ఆ సమయంలోనే వెళ్ళాడు త్రినాథ్. అతన్ని చూడగానే కళ్ళతో సైగచేసుకొని ముసి-ముసి నవ్వులు నవ్వసాగారు సుబ్బు, అతని స్నేహితులు.

అదేమీ పట్టించుకోనట్టు సరాసరి వాళ్ళ ఎదుటకి వెళ్ళి నిలబడ్డాడు త్రినాథ్.

"సుబ్బూ! నీతో మాట్లాడాలి..." త్రినాథ్ స్వరంలో లీలమాత్రంగా ధ్వనిస్తున్న అసహనాన్ని పసిగట్టాడు సుబ్బు.

"ఏంటి చెప్పు...?" అక్కడనుండి లేవకుండా అడిగాడు సుబ్బు.

"పర్సనల్..." అన్నాడు త్రినాథ్.

అక్కడున్నవాళ్ళ మొహాల్లో హేళనగా నవ్వులు విరిసాయి.

అది చూడగానే ఒళ్ళు మండుకొచ్చింది త్రినాధ్‌కి. కానీ తమాయించుకున్నాడు.

“వచ్చేనెల నువ్వు ఐశ్వర్యారాయ్ సినిమా వెయ్యాలి.”

అతని మాట పూర్తయిందో లేదో అందరూ వినరాని విషయం విన్నట్టు ఫకాలున నవ్వారు.

“ఏంటీ...?” తను విన్న విషయం కన్‌ఫర్మ్ చేసుకోవడానికన్నట్లు అడిగాడు సుబ్బు.

“ఔను ఐశ్వర్యారాయ్ సినిమా” నెక్ట్స్‌మంత్ తన పుట్టినరోజు. అప్పుడు వేసి తీరాలి...” చెప్పాడు.

“హలో! నీకో విషయం తెలీదనుకుంటా! ఈ సినిమా ఈ ఊరులో యాభైరోజులు ఆడేవరకూ తీయను. నాకు లాస్ వచ్చినా సరే...” ఖండితంగా చెప్పాడు సుబ్బు.

“అదంతా నాకు తెలియదు. నెక్ట్స్ మంత్ బొమ్మ మారాలి. నా ఆరాధ్య దేవత ఈ వూరులో నటించడం నేను చూడాలి...” తనూ పట్టుదలగా అన్నాడు త్రినాధ్.

ఆ మాటలు వినేసరికి నషాలానికి అంటింది సుబ్బుకి. కూర్చున్న కుర్చీ తన్నేసి లేచి నిలబడ్డాడు.

“ఏంట్రా! వాగుతున్నావ్... నా హాలుకి వచ్చి నామీద పెత్తనం చెలాయిస్తావేంటి? నేను సినిమా మార్చను. ఏం చేసుకుంటావో చేసుకో పో!...” గట్టిగా అరిచాడు సుబ్బు.

అంతే!

అతని అరుపులకి ఎక్కడి జనం అక్కడే స్థంభించిపోయి ఇటు చూడటం మొదలుపెట్టారు.

పేలడానికి సిద్ధంగా వున్న రెండు అగ్నిపర్వతాలు ఎదురెదురుగా నిల్చున్నట్టు కనిపించింది అందరికీ. త్రినాధ్ మొహంలో ఉక్రోషం స్థానంలో కౄరత్వం చోటుచేసుకుంది.

సుబ్బు వెనకాల అర్ధచంద్రాకారంలో నిల్చున్నారు అతని స్నేహితులు. అందరూ ఊపిరి బిగబట్టి ఏం జరుగుతుందో అన్నట్టు చూడసాగారు.

త్రినాధ్ అంతరంగమంతా ఉద్విగ్నతతో నిండిపోయింది. అతనొక్కడే... కానీ సుబ్బు వెనకాల చాలామంది...

భయపడలేదు అతను. అతని అంతరంగమంతా తన అభిమాన నటికోసం ఆరాటం...

ఆ ఆరాటంలో... ఒక అమాయకత్వం... ఆ ఆతృతలో ఒక అభిమానం... ఆ ఆవేశంలో ఒక కాంక్షా సముద్రం...

అతను ఒక అభిమాని... కాని అందరిలాంటివాడు కాదు. అతనో సామాన్యుడు. కానీ అసాధారణ నైజం.

త్రినాధ్ పెద్ద అందగాడు కాదు. కానీ నిరంతర కష్టం మూలంగా శారీరక ధారుఢ్యం ఎక్కువ. మరీ పొడవూ కాకుండా, మరీ పొట్టీ కాని సమాన విగ్రహం...

చామనఛాయ రంగు... ఒకింత బొద్దుగా కనిపించే శరీరం... చూడగానే కొట్టొచ్చినట్టు కనిపించే మొరటుతనం. అతన్ని ఎవ్వరూ హృదయానికీ దగ్గరగా వెళ్ళనివ్వదు.

కానీ అతని కళ్ళు...

ఆ కళ్ళు సూదంటురాయిలా ఎదుటివారిలోని బలహీనతను గేలంవేసి లాగుతాయి.

అతని చూపులు చురకత్తుల్లాంటివి. అడ్డువచ్చిన వాళ్ళను చీల్చేస్తాయి.

త్రినాధ్ తీక్షణమైన చూపులకు మనస్సులో దడగా వున్నా, ఒక్కడే ఏం చేయగలడు అన్న ధీమతో నిలబడ్డారు సుబ్బు, అతని స్నేహితులు.

“సినిమా మారుస్తావా లేదా...?” ఉరుములా వినిపించింది త్రినాధ్ కంఠం.

“మార్చను...” తల అడ్డంగా వూపాడు సుబ్బు.

అంతే!...

ఒకే ఒక్కక్షణం!...

ఆ ఒక్క క్షణంలో ఏం జరిగిందో వూహించేలోపు బిగించిన త్రినాధ్ పిడికిలి సుబ్బు దవడను తాకింది.

ఎగిరి అంత దూరంలో పడ్డాడు సుబ్బు.

అతని పెదాల చివరినుండి రక్తం బొట్లు బొట్లుగా జారింది. అది చూడగానే అతని స్నేహితుడు ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు. చేతి కందిన కర్రను పట్టుకుని అతనిమీద దాడిచేశాడు.

క్యూలో నించున్న జనాలంతా కకావికలై పరుగుతీసారు. ఆ ప్రదేశమంతా పరుగెడుతున్న జనాలతోను, ఏడుస్తున్న పిల్లల అరుపులతోను నిండిపోయింది.

పదిమంది కలిసి తన మీదకి వచ్చినా చలించలేదు త్రినాధ్. అంత మొండి ధైర్యం అతనిది.

తను కూడా చేతికందినదాన్ని పట్టుకుని ఎదురుదెబ్బ తీయడం మొదలుపెట్టాడు.

సుబ్బు పక్షంలో ఇంకో ఇద్దరికి తలలు పగిలాయి. క్షణాలమీద కబురు తెలియడంతో వారి స్నేహితులు వచ్చిపడ్డారు. వాళ్ళను ఆపే ప్రయత్నం చెయ్యబోయిన ఇద్దరు పెద్ద మనుషులకు కూడా దెబ్బలు తగిలాయి. దాంతో ఆ ప్రయత్నాన్ని ముగించుకొని వాళ్ళ త్రోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

అటు ఇటు కలుపుకుని ఓ నలుగురైదుగురికి దెబ్బలు తగిలాక బతుకుమీద ఆశ పుట్టుకొచ్చింది అందరికి "మళ్ళీ చూసుకుందాంలే..." అనుకుంటూ ప్రతిజ్ఞలు విసురుకుంటూ ఆ ప్రదేశం నుంచి నిష్క్రమించారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

అదొక చిన్న పెంకుటిల్లు...

చుట్టూ శిధిలమైపోతున్న ప్రహరీగోడ... ఇంటిముందున్న ఖాళీ స్థలంలో కొబ్బరిచెట్టు, వేపచెట్టు, జామచెట్టు, మామిడిచెట్టు కళ్ళకి పచ్చదనాన్నిస్తున్నాయి. అక్కడక్కడ పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్టు మొదళ్ళలో రాలిపడిన ఎండుటాకులు నిర్విహణాలేమిని సూచిస్తున్నాయి.

ఇంటి ముందున్న వరండాలో నులకమంచంలో పడుకున్నాడు త్రినాధ్. అతని వీపు, భుజాలు కర్రదెబ్బలకి కమిలిపోయి కనిపిస్తున్నాయి. చుట్టూ అతని కుటుంబసభ్యులు రకరకాల హావభావాలతో నిలబడి ఉన్నారు.

అతని తల్లి సావిత్రమ్మ ముఖంలో కోపం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

తండ్రి రాఘవరావు... ఈయన చిన్నప్పటినుంచి కుటుంబంపట్ల ఏ బాధ్యతలని స్వీకరించలేదు. సావిత్రమ్మే కష్టపడి పిల్లల్ని పెంచింది. త్రినాధ్‌కి ఒక చెల్లెలు, ఒక తమ్ముడు. తమ్ముడు పాలిటెక్నికల్ చదివి ఇంట్లో ఖాళీగా వున్నాడు. చెల్లెలు భారతి టెన్త్ చదివి ఇంట్లో ఖాళీగా వుండకుండా మిషన్‌మీద కుట్లు, అల్లికలు చేస్తూ తల్లికి చేదోడువాదోడుగా వుంటుంది.

ఇక త్రినాధ్ బి.యస్.సి చదివాడు. ఆ పట్టా చేతికి వచ్చాక అతనికి జ్ఞానోదయం అయ్యింది. ఈ చదువులు ఎందుకూ పనికిరావని.

ఇవపై చదువులు చదవాలనుకోలేదు. రాఘవరావు బాధ్యతారహితంగా బీడు పెట్టిన నాలుగెకరాల పొలాన్ని సాగుచెయ్యడం మొదలుపెట్టాడు. చదవటం మానేసినందుకు, చదివిన చదువుకి ఉపయోగంలేకుండా చేసుకున్నందుకు, ఊళ్ళో అందరు అతన్ని ఓ వెర్రివాడికింద జమకట్టారు. అతను దేన్నీ లెక్కచేయలేదు.

అతని స్వభావమే అంత. మొండితనం పాలు కాస్త ఎక్కువ. గత ఐదేళ్ళనుంచి అతను పొలం విషయంలో రాజీపడకుండా కృషి చేస్తూనే వున్నాడు. ఆ బంజరును సాగులోకి తేవడానికి అతనికి మూడేళ్ళు పట్టింది. గత రెండేళ్ళనుంచి పొలంమీద ఆదాయాన్ని చవిచూస్తున్నాడు త్రినాధ్.

పాలిటెక్నికల్ అయిపోయిన తమ్ముడికి ఏదొక ఉద్యోగం చూడాలి. చెల్లికి పెళ్ళిచేసి పంపాలి. ఈ రెండూ ప్రస్తుతం అతని ముందున్న బాధ్యతలు.

కుటుంబంలోని అందరి ప్రాణాలు ఇతనిమీదే. వీళ్ళందరి బాధ్యతలు మోస్తున్నా, మనసులో వాళ్ళంటే అభిమానం వున్నా అది పైకి వ్యక్తం చేయడు.

ఇప్పుడు త్రినాధ్ దెబ్బలు తగిలించుకుని మంచంలో పడుకుని మూసుగుతుండడం చూసి సావిత్రమ్మ బెంబేలెత్తిపోయింది. దానికితోడు కొడుకు దేనికోసం ఇంత గొడవపడ్డాడో అది ఆనోటా ఈ నోటాపడి ఆవిడ చెవిన పడింది. అప్పటినుంచి మరింత కినుకుగా వుందామె.

అదంతా పైకి దాచుకుని "మళ్ళీ ఏంచేసి వచ్చావురా..." విసుగు నిండిన స్వరంతో అంది సావిత్రమ్మ.

"ఏం లేదులే..." మొహం పక్కకి తిప్పుకుంటూ అన్నాడు త్రినాధ్.

భారతి ముసిముసిగా నవ్వింది. తమ్ముడు అర్ధంకానట్టు చూశాడు. రాఘవరావు అక్కడుండాలా, వెళ్ళిపోవాలా అర్ధంకానట్లు తచ్చాడుతున్నాడు.

"ఏం లేకపోవడం ఏంటి? హాల్ దగ్గర ఏదో జరిగిందంటగా! నీవు అటికేసి ఎందుకెళ్ళావ్?" ఆరాగా అడిగింది సావిత్రమ్మ.

"ఏం లేదన్నాగా..." కసురుతున్నట్లు అన్నాడు త్రినాధ్.

సావిత్రమ్మ కాపడం పెడుతుందల్లా లేచి విసవిస నడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

భారతి గుడ్డను వేడినీళ్ళలో ముంచితీస్తూ "అన్నయ్యా! నీకీ పిచ్చి ఏంటి?" బాధ, కోపం కంఠంలో మేళవిస్తూ అడిగింది.

"ఏం పిచ్చీ?" విసుగ్గా నొసలు ముడేస్తూ అడిగాడు త్రినాధ్.

"పిచ్చికాక మరేంటి? ఊళ్ళో అందరూ ఈ విషయం గురించే చెప్పుకుంటున్నారు. సుబ్బు వాళ్ళ పెద్దమ్మ ఇందాక పచారీకొట్టు దగ్గర ఎదురై నానామాటలు అంది అందరూ నిన్ను ఓ పిచ్చోడిలా చూస్తున్నారు. మా అందరికీ ఇది ఎంతో బాధగా వుంది..." గద్గదికంగా అంది భారతి.

పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు త్రినాధ్.

"ఎవరేం అనుకుంటే నాకేంటి? నా గురించి ఏం మాట్లాడినా తట్టుకుంటాను కానీ నా ప్రాణంలో ప్రాణాన్ని ఏవన్నా అంటే వూరుకోను" కోపంగా మొహంపెట్టి అన్నాడు త్రినాధ్.

అందరికీ నిలువుగుడ్లు పడిపోయాయి.

"ఎవర్రా ఆ ప్రాణం..." సావిత్రమ్మ వంటగదినుంచి వచ్చి కోపంగా అడిగింది. మాట్లాడలేదు త్రినాధ్... తనేవన్నా అన్నకొద్దీ దానిమీద ఉపన్యాసం ఇవ్వడానికి అందరూ సిద్ధంగా వుంటారు. అందుకే ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడల్లా సాధ్యమైనంతవరకు తప్పించుకుంటూ వుంటాడు అతను.

"వీడినోసారి స్వామీజీ దగ్గరకి తీసుకెళ్ళాలి..." జనాంతికంగా అంది సావిత్రమ్మ. అంత విసుగులోనూ త్రినాధ్‌కి కొంచెం నవ్వు వచ్చింది.

వీళ్ళంతా తనని పిచ్చోడనుకుంటున్నారు. కానీ తనొక్కడికే తెలుసు... అది ఈ సృష్టిలోని అత్యద్భుతమైన అందంపట్ల వున్న మమకారమని. ఆ అందాన్ని తను స్వయంగా చూడాలి... స్పర్శించాలి... అది తన కోరిక, లక్ష్యం, కలలు, కోరికలు అందరికీ వుంటాయి.

అందుకోవడానికి ప్రయత్నించేవాళ్ళు కొందరే. ప్రయత్నించినా పొందలేని స్థితిలో తన ఆరాధ్య దేవత వుంది. అది తనకి తెలుసు. కానీ తన జీవితం తనకు తెలియకుండానే అంకితం అయిపోయింది.

ఈ విషయం వాళ్ళకి తెలియదు. తను చెప్పలేదు. వాళ్ళకి అర్థంకాదు.

ఔను...

ఒకోసారి తనకి తనే అర్థంకాదు.

ఆమె నింగిలోని చందమామ.

తను నేలమీద సామాన్య మానవుడు.

తన మనసు ఓ పసిది. తన బుద్ధికి తెలుసు ఐశ్వర్యరాయ్ అందరాని చందమామే. కానీ తన హృదయానికి ఆ సంగతి తెలీదు. అది నిరంతరం, తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ఆమెను కలిసే అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటుంది. తన ఊహల్లో వున్న ఆమె సహజ స్వరూపాన్ని ఏ ఆచ్ఛాదన లేకుండా దర్శించాలని, ఆ దివ్యమంగళ సౌందర్యంతో తన కళ్ళు పునీతమవ్వాలని... ఇదే తన తపన.

ఇదే తన జీవితం...

ఇదే తన లక్ష్యం...

❃ ❃ ❃ ❃ ❃ ❃

లోనా వాలా...

అత్యద్భుతమైన ప్రకృతి సహజత్వానికి మారు పేరు. అక్కడ పచ్చని చెట్లతో ఎత్తయిన కొండలు, విశాలమైన లోయలు పచ్చదనాన్ని తెచ్చి అతికించినట్లుగా వుంటాయి.

అది బాలీవుడ్ సినిమా షూటింగ్‌లకి స్వర్గధామం లాంటిది. అక్కడ ఏడాది పొడవునా షూటింగులు జరుగుతూనే వుంటాయి. అందుకు తగిన అన్ని వసతులు అక్కడ వున్నాయి.

ఆ పర్వతశ్రేణుల్లో దేవుడు అందమైన ఇళ్ళను సృష్టించి అక్కడక్కడ విసిరేసినట్లుగా కాటేజీలు వున్నాయి. ఆ కాటేజీల్లో దేశం నలుమూలలనుంచి ప్రశాంతంగా సేద తీరడంకోసం పెద్ద పెద్ద వాళ్ళు వస్తుంటారు.

ప్రతీ కాటేజీకి ఒక కుక్, సర్వెంట్ మెయిడ్, వాచ్‌మేన్ తప్పకుండా వుంటారు. ఓ మనిషి ఎన్ని సంవత్సరాలైనా విసుగు చెందకుండా అందులో వుండేలా సమస్త సదుపాయాలు వున్నాయి.

ప్రస్తుతం అక్కడ ఓ హిందీ సినిమా షూటింగ్ జరుగుతోంది. భారత దేశాన్ని తన లవర్ బాయ్ నటనతో ఉర్రూతలూగించిన సల్మాన్ ఖాన్ అందులో హీరో, హీరోయిన్ ఐశ్వర్యారాయ్.

ఓ అగ్రశేణి నటుడు, ఓ అగ్రశేణి నటి, ఓ ప్రముఖ దర్శకుడు, ఓ ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ – ఈ కాంబినేషన్‌మీద అందరికీ సహజంగా ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడ్డాయి.

హీరో, హీరోయిన్‌ల మధ్య ప్రేమ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు.

వాళ్ళిద్దరూ కలిసి నటించే మొదటి చిత్రం అది. ఐశ్వర్యారాయ్ అతన్ని అంతకుముందు ఒకటి, రెండు పార్టీల్లో చూసింది కానీ, పెద్దగా పరిచయంలేదు.

అతనూ అంతే! అంతకుముందు తన గర్ల్‌ఫ్రెండే లోకంగా బతికినప్పుడు ఆమె తప్ప ఎవరూ కనిపించలేదు. కానీ ఇప్పుడు ఈ అపురూప లావణ్య రాశిని చూస్తుంటే హృదయం చలించిపోతోంది.

"షాట్ రెడీ..." కోడైరెక్టర్ కేకతో ఈ లోకంలోకొచ్చాడు సల్మాన్‌ఖాన్.

"సార్! షాట్ రడీ సార్..." అతను దగ్గరగా వచ్చి వినయంగా అడిగాడు.

హుందాగా తల ఊపాడు సల్మాన్‌ఖాన్. అతని దృష్టంతా తన కుడివైపున కొంత దూరంలో, పెద్ద చెట్టుకింద తాత్కాలికంగా వేయబడిన టెంట్‌లోంచి బయటకి రాబోయే ఐశ్వర్యరాయ్ మీదే వుంది.

ఆ ఒక్కతినేకాదు, ఆ స్పాట్‌లో వున్న ప్రతి ఒక్కరూ ఆమెరాక కోసం ఎదురుచూస్తున్నారు. ఆమెలో ఒక్క సౌందర్యమే కాదు. ఆ సౌందర్యాన్ని అందంగా ప్రదర్శించే నైపుణ్యం కూడా వుంది.

అసభ్యతకి తోవ లేకుండా అందమైన, ఆకర్షణీయమైన దుస్తులలో అందరి హృదయాలనూ కొల్లగొట్టగలదు.

డేరా తెరలు కొద్దిగా కదిలాయి. అందరిలోనూ ఉచ్ఛ్వాశ, నిశ్వాశాల వేగం పెరిగింది. ఓ అందమైన తామర పువ్వులాంటి పాదం ముందు కొచ్చింది.

కాళ్ళకున్న వెండి మువ్వలు గలగలలాడాయి. ఓ సుకుమారమైన చేయి డేరా తెరను కొద్దిగా పైకి లేపింది.

సన్నజాజుల్లా సుకుమారంగా వున్న చేతివేళ్ళకి ఉంగరాలు తళుక్కున మెరిసాయి. డేరా తొలిగింది. మేఘాల మధ్యనుంచి చందమామ తొంగి చూస్తున్నట్లుగా ఆమె ముఖ పద్మం బయట పడింది.

అందరూ అప్రతిభులై చూసారు.

ఆమె నిరుపమాన సౌందర్యం అక్కడున్న ప్రతిఒక్కరిని విశ్చేష్టితులను చేసింది.

నెమలి కంఠం రంగు గాగ్రా ఛోళీమీద, జరీ ఎంబ్రాయిడరీ, దానికి తగిన ఆభరణాలు ధరించిన ఆమె, దేవకన్య ఇంతకన్నా అందంగా వుంటుందా అని అన్పించేలా వుందామె.

వయ్యారంగా నడుస్తూ వచ్చిన ఆమె పురివిప్పిన మయూరిలా కనిపించింది.

ఆమె దగ్గరగా వచ్చి చిన్నగా నవ్వేవరకూ తేరుకోలేకపోయాడు సల్మాన్‌ఖాన్.

"ఐయాంరెడీ" సున్నితంగా అందామె.

దొండపండులాంటి పెదాలమధ్య నుంచి ముత్యాల్లాంటి పలువరుస తళుక్కుమంది.

"మే భీ రెడీ..." తన్మయత్వంగా చూస్తూ అన్నాడు సల్మాన్‌ఖాన్.

డైరెక్టర్ ఇద్దరి దగ్గరికీ వచ్చి సీన్ వివరించాడు. తనని ఎంతగానో ఆరాధిస్తున్న హీరోయిన్ యొక్క ప్రేమని హీరో కొన్ని కారణాల చేత తిరస్కరించాలి. హీరోయిన్ తన ప్రేమను చెప్పడం, హీరో తిరస్కరించడం ఇప్పుడు జరిగేసిన్‌లోని భావం...

నటీనటులిద్దరూ తమ తమ డైలాగ్స్‌ని సరిచూసుకున్నారు.

"ఓ.కె. లైట్స్‌ఆన్, స్టార్ట్‌కెమేరా" దర్శకుడు గట్టిగా చెప్పాడు. కెమేరా రన్ అవుతోంది. ఓ చేత్తో గాగ్రాచోళీని సున్నితంగా ఎత్తి పట్టుకుని సీన్‌లోకి వచ్చింది ఐశ్వర్యరాయ్.

ఆమె కళ్ళు ప్రియుడిపట్ల ప్రేమతో వెలిగిపోతున్నాయి. ఆమె పెదాలమీద మధురోహల ఆనవాళ్ళు దోబూచులాడుతున్నాయి. ఆమె శరీరపు పులకరింపు బుగ్గల్లోకి పాకినట్లుగా అభినయిస్తోంది. కళ్ళు చంచలంగా కదులుతున్నాయి ప్రేమ పారవశ్యంలో మునిగిన యువతిలా ఆమె మైమరపులో వుంది.

అద్భుతమైన ఆమె నటనను అందరూ ముగ్ధులై చూస్తున్నారు. ఆమె సంభాషణ ప్రారంభించింది. సంభాషణంతా హిందీలో సాగుతోంది.

"మిమ్మల్ని చూసిన తొలిక్షణం నుంచీ నా హృదయంలో తెలియని ఏదో సంచలనం... పదే పదే మిమ్మల్ని చూడాలనీ, మీ సమక్షంలోనే వుండాలనీ నా హృదయం పడే ఆరాటం మీకెలా చెప్పను?"

ఐశ్వర్యారాయ్ తన హృదయపు లోతుల్లోంచి వచ్చినట్లుగా చెప్తున్న ఆమె మాటలు వినగానే తన డైలాగ్స్ మరచిపోయాడు సల్మాన్‌ఖాన్.

పరిపూర్ణమైన ఆ నటి ముందు నటుడుగా అతను ఓడిపోయాడు. క్రాఫ్‌ను వ్రేళ్ళతో అస్థిమితంగా నిమురుకుంటూ అయోమయంగా చూస్తూ వుండిపోయాడు.

కెమేరా రన్ అవుతూనే వుంది.

"సల్మాన్... డైలాగ్..." డైరెక్టర్ ఎదురుగా ఉండి అరవడం వినబడటంలేదు.

కళ్ళతో తన హృదయపు లోతుల్ని చీల్చేస్తున్న ఆమె తప్ప మరెవరూ కనిపించటంలేదు.

ఓ నిమిషం నెగిటివ్ వేష్టయింది.

ఐశ్వర్యా మళ్ళీ డైలాగ్‌ని రిపీట్ చేసింది. పిచ్చెక్కిపోయాడు సల్మాన్‌ఖాన్. అతను కోపంగా సీన్‌లోంచి తప్పుకుని వచ్చి తన చెయిర్‌లో కూర్చునిపోయాడు.

అందరూ నిర్ఘాంతపోయారు.

నిర్మాత కంగారుపడ్డాడు. గబగబ హీరో దగ్గరికి పరిగెత్తుకు వచ్చాడు.

"సాబ్... క్యాహూనా..." ఆందోళనగా అవగాడు.

డైరెక్టర్, అసిస్టెంట్స్ అందరూ గుమిగూడారు. ఐశ్వర్య కూడా అర్థంకానట్లుగా చూస్తూ అతని పక్కనున్న కుర్చీలో కూర్చుంది.

ఏం జరిగిందానుకుంటూ అందరూ ఆందోళన పడసాగారు.

"అసలీ సీనేంటీ?" కోపంగా అన్నాడు సల్మాన్‌ఖాన్.

అందరూ కలిసి స్క్రిప్ట్ రైటర్‌ని ముందుకు తోసారు. అతను బిక్కముఖం వేసుకొచ్చి నిలబడ్డాడు.

"సాబ్... ఎనీ మిస్టేక్" చిన్నబోయి అడిగాడు.

"వెరీ బిగ్ మిస్టేక్" సీరియస్‌గా అన్నాడు సల్మాన్. మళ్ళీ ఏం ముంచుకొచ్చిందో. ఇప్పుడు పేకప్ చెప్పేసి హీరో వెళ్ళిపోతే తనకెంత లాస్ వస్తుందో అంచనా వేసుకుంటున్నాడు ప్రొడ్యూసర్.

"చెప్పండి సార్ సరిచేస్తాను..." స్క్రిప్టురైటర్ అన్నాడు.

డైరెక్టర్ నొసలు ముడిపడ్డాయి.

"నువ్వు హీరోయిన్‌ని దృష్టిలో పెట్టుకుని సీన్ రాయాలి. కానీ నీవిప్పుడు ఏం రాసావు? కోపంగా అన్నాడు సల్మాన్‌ఖాన్.

హీరోయిన్ తన ప్రేమను మీతో చెపుతుంది. మీరు మీకున్న బాధ్యతలు దృష్ట్యా ఆ ప్రేమను తిరస్కరిస్తారు" ఆ మాట వినగానే సర్రుమని కుర్చీలోంచి లేచాడు సల్మాన్.

"నాన్సెన్! ఏంటా బాధ్యతలు!" విసురుగా అడిగాడు.

తెల్లబోయాడు రైటర్.

"సాబ్... చెల్లి పెళ్ళి. తమ్ముడు చదువు, తల్లిదండ్రులను పోషించడం, ఇలా చాలా వున్నాయి సార్" నసుగుతూ చెప్పాడు.

"అబ్సర్డ్! ఐశ్వర్యారాయ్‌లాంటి అమ్మాయి ప్రేమిస్తున్నానంటే తిరస్కరించటానికి మీ స్టోరీలో హీరోకి మనసు ఒప్పుతుందేమోగాని... నేనా డైలాగ్స్ చెప్పలేను. స్టోరీ మార్చండి" కోపంగా చెప్పి కూర్చున్నాడు సల్మాన్.

లైట్ బాయ్స్, జూనియర్ ఆర్టిస్ట్స్ షాక్ తిన్నారు ఒక్కసారి.

డైరెక్టర్ చిత్రంగా చూశాడు.

ప్రొడ్యుసర్ అయోమయంగా చూసాడు.

స్క్రిప్ట్ రైటర్ ఆందోళనగా చూశాడు.

ఐశ్వర్య మాత్రం నిర్వికారంగా చూసింది.

"మొత్తం రీ షూట్ చేయాల్సి వుంటుంది సల్మాన్" డైరెక్టర్ అనునయంగా అన్నాడు.

"చెయ్యండి" చురుగ్గా చూసి చెప్పాడు.

"ఓ ఫిఫ్టీలాక్స్ లాసవుతుంది" పొడ్యూసర్ సణిగాడు.

"ఓ.కె. ఐ కెన్ బేర్ ఇట్" అన్నాడు సల్మాన్.

ఇంట్రస్టింగా చూసింది ఐశ్వర్య. అప్పటివరకూ పెదవి విప్పలేదామె.

"ప్రోబ్లం ఏంటసలు?" చురుగ్గా చూస్తూ అడిగింది ఐశ్వర్య.

"క్యారెక్టర్స్ ఛేంజ్ చేయమంటున్నారు మేడం" డైరెక్టర్ అన్నాడు.

"మీరు నాకు స్టోరీ చేప్పేటప్పుడు ఏ క్యారెక్టర్ గురించి చెప్పారో అది నాకు నచ్చి నేను కమిట్ అయ్యాను. ఇప్పుడు వ్యక్తిగత ఇష్టా ఇష్టాలకి అనుగుణంగా క్యారెక్టర్‌ని మారిస్తే, నాకది నచ్చకపోతే మీరు ఇంకో హీరోయిన్‌ని వెతుక్కోవలసి వుంటుంది" అని ఖచ్చితంగా చెప్పేసింది ఐశ్వర్య.

ఆ సమాధానాన్ని అస్సలు వూహించలేదు సల్మాన్. చిన్నబోయి ఆమె వంక చూసాడు.

నిశ్చింతగా ఫీలయ్యాడు డైరెక్టర్. అతనీమధ్య సల్మాను విషయంలో డౌట్ ఫీలయ్యాడు. సల్మాన్ ఐశ్వర్యాని అభిమానిస్తున్నట్లు... ఈ ఇన్సిడెంట్‌తో అది అందరికి తెలిసిపోయింది.

కానీ అతనికి తెల్సు ఐశ్వర్య ఎంత ప్రొఫెషనల్‌గా ఆలోచిస్తోంది.

ఆమె ఎలాంటి ప్రలోభాలకి లొంగలేదు.

క్యారెక్టర్‌ని చేంజ్ చేయడానికి ఆమె ఒప్పుకోదు. ఆమె లేకుండా సినిమాని ప్రస్తుత పరిస్థితిలో సల్మాన్ చెయ్యడు. చివరికిదే నిజం అయింది. కాసేపు మౌనంగా వున్నాడు సల్మాన్.

చివరికి భుజాలు ష్రగ్‌చేసి "ఓ.కే! యాజ్ యూ విష్..." అంటూ లేచాడు. అప్పటికే అతని మొహం చిటపటలాడుతోంది.

అందరూ బితుకు బితుకుమంటూ లేచారు. మళ్ళీ కెమేరా స్టార్ట్ అయింది. ఐశ్వర్య తన డైలాగ్ చెబుతున్నంత సేపు అతను విసుగ్గా నిల్చున్నాడు.

సహజంగా వున్న ఆ చర్య ఆ సీన్‌కి బాగా సూట్ అయింది. ఆమె డైలాగ్ పూర్తి కాగానే అతను తను చెప్పాల్సిన డైలాగ్స్‌ని మహా కసితో పూర్తిచేశాడు.

డైరెక్టర్‌కి నవ్వు వచ్చినా ఆపుకున్నాడు. సీన్ బాగా పండినందుకు నిర్మాత సంతోషించాడు. ఆ రోజుకి షూటింగ్ పేకప్ చెప్పేవరకు సల్మాన్ విసుగ్గాను, ఐశ్వర్య మామూలుగాను గడిపారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

బస్‌స్టాప్ దగ్గర వున్న కిళ్ళీ బడ్డీ దగ్గర నిల్చుని బస్‌కోసం వెయిట్ చేస్తున్నాడు త్రినాథ్. ఆ రోజు టౌన్‌లో పొలానికి అవసరమైన ఎరువులు కొనాల్సిన పనిపడింది.

ఆలోచిస్తుండగానే బస్సు వచ్చింది. అన్యమనస్కంగా బస్సుఎక్కి సీట్లో కూర్చున్నాడు. బస్సు కదిలింది. మధ్య, మధ్యలో ఆగుతున్నది కూడా అతను కనిపెట్టే స్థితిలో లేడు.

బస్సుకేదో అడ్డొచ్చి డ్రైవర్ బ్రేక్ వేసే సరికి అతను సీటులోంచి తుళ్ళిపడి ముందు సీటుకి కొట్టుకున్నాడు.

ఓ సోయగం కిలకిలా నవ్వింది.

ఓ యవ్వనం... ఓర చూపు చూసింది.

ఓ పడుచుదనం చిలిపితనాన్ని విసిరింది.

బిత్తరపోయి చూశాడు త్రినాథ్. తన పక్క సీటులోంచి ఓ రెండు కాటుక కళ్ళు కొంటెగా నవ్వులురువ్వాయి.

సీరియస్‌గా చూసి సీట్లో సర్దుకూర్చున్నాడు త్రినాథ్. ఆ అమ్మాయి కూడా నవ్వుకుంటూ మొహం తిప్పుకుంది.

బస్సులో అందరి కళ్ళు ఆమెమీదే. ఆకుపచ్చరంగు ధర్మవరం పట్టులంగా... అదేరంగు బ్లౌజ్... పాలమీగడలాంటి తెల్లటి ఓణీ... చెవులకి జుమ్కీలు... చేతినిండా గాజులు... అరచేతులకి ఎర్రగా పండిన గోరింటాకు... మెడలో చిన్న ముత్యాల దండ... హృదయానికి హత్తుకున్న పుస్తకాలు... చూడగానే అచ్చమైన ఆంధ్రుల ఆడబడుచులా హొయలు పోతోంది.

ఈ సారి పరాభవం పొందకూడదని ఆలోచనలు వదిలించుకుని ఎటెంటివ్‌గా కూర్చున్నాడు త్రినాథ్.

అరగంటలో టౌన్ చేరుకుంది బస్సు. తాను దిగాల్సిన స్టాప్ రాగానే దిగాడు. అతనికి ఆటోలు, రిక్షాలు ఎక్కే అలవాటు లేదు. తీరిక ఉందనుకుంటే ఎంతదూరమైన ఇట్టే నడిచేస్తాడు. అందుకే అతని శరీరం దృఢంగా తయారైంది.

అతను నడుస్తూ నడుస్తూ ఎందుకో అనుమానం వచ్చి వెనక్కి చూశాడు.

ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి...

తన వెనకాల అడుగులో అడుగువేసుకుంటూ నడిచి వస్తోంది ఓ అమ్మాయి.

ఎవరీ అమ్మాయి???

రోడ్డుమీద నిలబడి నొసలు ముడివేసి మరీ తీవ్రంగా ఆలోచించసాగాడు.

ఎక్కడో చూసినట్లుందే!!!

ఆ అమ్మాయి కూడా అల్లంత దూరాన ఆగిపోయి బెరుదుతున్న కళ్ళతో అతని వంక చూడసాగింది.

లేడికళ్ళలా విశాలంగా ఉన్న ఆమె కళ్ళు చూడగానే అతనికి గుర్తుకు వచ్చింది. బస్సులో తనని చూసి నవ్వింది ఈ అమ్మాయే.

అప్రయత్నంగా బొప్పికట్టిన నుదుటిని తడుముకున్నాడు.

ఆ అమ్మాయి అలాగే చూస్తోంది.

కొంచెం కోపం వచ్చినట్లయింది త్రినాథ్‌కి. బస్సులో నవ్విన నవ్వు సరిపోలేదేమో... యింకా తన వెనకాలే వస్తోంది. అయ్యో!!! ఈ కాలంలో అమ్మాయిలు చాలా ఫాస్ట్‌గా వున్నారు. అమ్మాయిల వెనకాల అబ్బాయిలు పడే రోజులుపోయి, అబ్బాయిల వెనకాల అమ్మాయిలు పడేరోజులు వచ్చాయి. మనసులోనే గుండెలు బాదేసుకుని ఆమెని చేత్తో సైగచేసి పిలిచాడు. అటూ ఇటూ చూసిందామె.

మళ్ళీ దగ్గరికి రమ్మని సైగ చేశాడు. తననే పిలిచాడని నిశ్చయించుకుందా అమ్మాయి.

మొహంలో భయం తాండవిస్తుండగా చీమకూడా నలగనట్లుగా మెల్లిగా నడుచుకుంటూ వచ్చింది.

అంత దగ్గరగా తన జీవితంలో అంత అందమైన అమ్మాయిని చూడలేదతను.

ఎంత బాగుందీ అమ్మాయి!!! ముచ్చటగా అనుకున్నాడు. మరుక్షణం ఆ ఆలోచనకి ఉలిక్కిపడి తన భుజం చరుచుకున్నాడు. ఐశ్వర్యారాయ్ గుర్తొచ్చింది. మనసులోనే చెంపలేసుకున్నాడు.

"ఏంటి నా వెనకాల నడుస్తూ వస్తున్నారు...? మనసులోనే అడిగాడు.

బెదిరిపోయి రెండడుగులు వెనక్కి వేసిందామె. "నేనా!" పుస్తకాలు మరింత దగ్గరకి పొదువుకుంటూ భయంగా అంది.

"మీరే..." నిశ్చయంగా అన్నాడు.

అయోమయంగా చూసిందామె. అతన్ని ఒక్కసారి ఎగాదిగా పరిశీలించింది. "మనిషి నార్మల్‌గానే ఉన్నట్లున్నాడే ఇలా మాట్లాడుతున్నాడేమిటి..." విచిత్రంగా చూస్తూ అనుకుంది.

"అసలు... నేనూ..." ఆమెదో చెప్పబోయింది. అతను వినిపించుకోలేదు.

"ఇందాకటికి ఇందాక బస్సులో నాకు దెబ్బ తగిలితే గొల్లున నవ్వారు. నేనున్నంతసేపు నన్ను చూస్తూనే కూర్చున్నారని నా అనుమానం, ఇప్పటికిప్పుడు నా వెనకాల పడ్డారు. అసలేంటి మీ ఉద్దేశం?"

అతని వాగ్ధోరణి అలా సాగిపోతుంటే ఆమె బుగ్గన చేయివేసుకుని మరీ వింటూ ఆశ్చర్యపోతోంది.

ఓ పదినిముషాలు క్లాస్‌పీకి ఇక ఆ డోస్ సరిపోతుందనుకున్నాక ఆమెని విడిచిపెట్టి విసురుగా ముందుకు నడిచాడు.

ఓ అయిదు నిముషాలు నడక సాగాక మళ్ళీ ఎందుకో అనుమానం వచ్చింది. వెనక్కి తిరిగి చూసాడు. అక్కడ మళ్ళీ ఆ అమ్మాయి.

ఈ సారి ఐశ్వర్యారాయ్ వెంటనే గుర్తుచేసింది. తనే చర - చర నడుస్తూ ఆ అమ్మాయి దగ్గరకి వెళ్ళి "ఇది మంచిపద్ధతి కాదు. ఎన్నిసార్లు చెప్పాలి... మీరు నా వెనక రావద్దని."

గట్టిగా అరుస్తున్న అతని మాటలకి ఆమె మొహం ఎర్రబడి పోయింది గబగబా నాలుగడుగులు ముందుకేసి-

"అదుగో... ఆ కనిపిస్తున్నదే, అది మా కాలేజి బిల్డింగ్" చెప్పి చర - చర నడచి వెళ్ళింది.

బిక్కమొహం వేశాడు త్రినాధ్.

అయ్యో! ఆ అమ్మాయిని ఎంత అనుమానించాడు తను? పాపం ఒక్కమాటైనా అనకుండా వెళ్ళిపోయింది. వెనక నుంచి కనిపిస్తున్న ఆమె జడగంటల లయనిచూసి ముచ్చటపడుతూ అనుకున్నాడు.

ఆమె గేటులో అడుగుపెడుతూ వెనక్కి తిరిగి చూసి మళ్ళీ ఓ కొంటె నవ్వు నవ్వి టాటా చెప్పింది బెదిరిపోతూ అక్కడి నుంచి పరుగుతీసాడు త్రినాథ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

రాత్రి తొమ్మిది గంటలు...

ఆకాశంలో నిండు చందమామ వెన్నెలని కడవలకొద్దీ కుమ్మరిస్తున్నాడు.

చుక్కలు మిల-మిలా మెరుస్తున్నాయి. వాటిని కోసి పువ్వుల్లా తురుముకోవాలనిపించేంత కవ్వింపుగా వున్నాయి. కాలేజీ ముందున్న లాన్‌లో వంటరిగా కూర్చుంది ఐశ్వర్య. ఆమె సెక్రటరీ, అసిస్టెంట్ లోపల వున్నారు. లాన్‌లోని ఛేయిర్‌లోంచి లేచి మెత్తని పచ్చికమీద ఇష్టంగా వాలింది ఐశ్వర్య. గాలి చల్లగా వీస్తోంది.

పనమ్మాయి తొంగిచూసి లోపలికి వెళ్ళి షాలు తెచ్చి కప్పబోయింది.

"ఒద్దు..." రెజెక్ట్ చేసింది ఐశ్వర్య.

"కప్పుకోమ్మా... బాగా చల్లగా వుంది జలుబు చేస్తుంది" మృదువుగా చెప్పిందామె.

"ఒద్దు ఆయా! ఇలాగే బావుంది..." ఇష్టంగా ఆ చల్లదనాన్ని అనుభవిస్తూ అంది ఐశ్వర్య.

ఒక్కోసారి పగలూ, రాత్రి తేడా లేకుండా షూటింగుల్లో ఆ లైట్లు ముందు నిలబడి విసుగు వచ్చేస్తోంది.

అవుట్‌డోర్ షూటింగ్స్ అప్పుడయినా ఇలా అందమైన ప్రదేశాల్లో కాసేపు గడిపినా, మనసు ప్రశాంతంగా మారుతుంది.

పైన చెట్టు మీదనుంచి మంచు బరువుకి తడిసి ఓ పూరేకు సుతారంగా ఆమె పెదవిపై వాలింది.

పూరేకు తాకిడికే పెదాలు చలించాయి. మెల్లగా ఆ రేకును తీసి చేత్తో పరిశీలించింది.

మొహం రాగ రంజితమైంది. మధురోహలతో హృదయం బరువెక్కింది.

ఇంతవరకూ హృదయాన్ని చేరని అపరిచితుని కోసం హృదయపు లోతుల్లోంచి ఏదో అన్వేషణ సాగుతోంది.

ఎవరో తన కలల రాకుమారుడు!

నీ కోసమే నేనున్నానంటూ ఆ నింగినుంచి ఈ నేలకు ఎప్పుడు దిగి వస్తాడో!

"ఓ చందమామా! నీవైనా సాయం చేయవా?" అనుకుంటూ పక్కకి తిరిగి నింగి నేల కలిసే దగ్గర పైకి ఉదయిస్తున్న చందమామ వంక చూసింది.

ఆ క్షణంలోనే చందమామకి అడ్డుగా ఎవరిదో ముఖ పద్మం వేయి రేకులతో విసిరినట్లుగా కనిపించింది.

సమున్నతంగా, దృఢంగా కనిపిస్తున్న ఓ ఆకారం దూరంనుంచి నడుస్తూ ఇటువైపే రావటం కనిపించింది.

రెండు కొండల మధ్యనుంచి చంద్రుడు ఉదయిస్తుండగా అతన్ని తోసి రాజంటూ గంభీరంగా నడిచి వస్తున్న ఈ యువరాజెవరో!

పట్టిపట్టి చూడసాగింది ఐశ్వర్య. కొంచెంసేపటికి పోల్చుకోగలిగింది ఐశ్వర్య.

అతను సల్మాన్...

అతను తన కాటేజీకి వెళ్ళబోయినవాడల్లా గార్డెన్‌లో ఐశ్వర్య పడుకోవటం చూసి కళ్ళు మెరుస్తుండగా ఇటువైపు వచ్చాడు.

మొహమాటంగా లేచి కూర్చుంది ఐశ్వర్య.

"హలో..." నవ్వుతూ విష్ చేశాడు.

"హాయ్..." చిరునవ్వు నవ్వింది ఐశ్వర్య.

"ఆకాశంలోని చందమామను సగం తుంపి ఈ పచ్చికమీద అతికించారెవరో! ఈ వింతని చూద్దామనే వచ్చాను..." పొయిటిక్‌గా చెప్పాడు సల్మాన్!

కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది ఐశ్వర్యారాయ్‌కి. ఇతని గురించి చాలా వింది తను. స్మోక్ చేస్తాడని, డ్రింక్ చేస్తాడని, గర్ల్‌ఫ్రెండ్స్ ఎక్కువని, షూటింగ్స్‌కి టైంకి రాడని ఇలా చాలా విషయాలు తెలిసాయి.

తను ఈ సినిమాకి సైన్ చేసేటప్పుడు చాలామంది ఆలోచించుకోమని చెప్పారు కానీ తను నటనను ఒక వృత్తిగా స్వీకరించింది.

తనకి తన హద్దులేంటో తెలుసు. అలాగే ఇతరులని అదుపులో వుంచటం కూడా తెలుసు.

సినిమా షూటింగ్ ప్రారంభమయిన రోజున మొదటిసారి తామిద్దరు పలకరించుకున్నారు. తనని చూడగానే అతని కళ్ళల్లోని ప్రశంసా భావం గుర్తొచ్చింది. అది తనకి కొత్తకాదు. చాలా సహజమయిన విషయం.

ఎంతోమంది కళ్ళలో ఈ భావాన్ని తను గమనించింది అందుకే తనకది ఆశ్చర్యం అనిపించలేదు. ఆ తరువాత ఓ వారంరోజులు కుటుంబ వాతావరణంలో షూటింగ్ జరిగింది ఉదయాన్నే ఠంచనుగా షూటింగ్‌కు వచ్చేవాడు.

సాయంత్రం ఎంతసేపైనా పేకప్ చెప్పకుండా వుండేవాడు డైరెక్టరూ, తనూ ఇనిషియేట్ తీసుకుని పేకప్ చెబితే అతని కళ్ళు బాధతో విలవిలలాడేవి.

ఎందుకో తనకర్థం కాలేదు. ఈరోజు షూటింగ్‌లో జరిగిన సంఘటనని పరిశీలిస్తే అసలు విషయం కొద్దిగా అర్థం అవుతోంది.

ఆ ఆలోచన రాగానే ఆమె మనసులో కొంచెం సంకోచం కలిగింది.

అరమోడ్పులైన కళ్ళతో ఆమె ఏదో ఆలోచనలకి జారిపోవడాన్ని అతను ఇష్టంగా పరిశీలించాడు.

ఐశ్వర్య లేచి నిలబడింది. ఆమె ఎక్కడ గుడ్‌నైట్ చెప్పేస్తోందన్న భయం కలిగింది సల్మాన్‌కి. అది పైకి కనబడనీయకుండా లాన్‌లో వున్న చెయిర్‌ని చూపిస్తూ...

"కూర్చోవచ్చా...?" చిరునవ్వుతో అడిగాడు.

ఏవనడానికీ తోచక తలూపింది ఐశ్వర్య.

వెన్నెల వెలుగులో పసితనం వదలనట్లున్న అతని మొహం దానికి కాన్ట్రాస్టుగా దృఢమైన అతని శరీరం. ఈ సృష్టిలోని అందమైన మనుషుల్లో ఇతను ఒక్కడు" అని ఐశ్వర్య మనసులోనైనా అనుకునేలాగా చేసాయి. అతని కెదురుగా వున్న కుర్చీలో కూర్చుంది ఐశ్వర్య.

మధ్యాహ్నం షూటింగులో తను ఐశ్వర్యమీద విసుగుచెందిన విషయాన్ని ఆటోమేటిక్‌గా మరచిపోయాడు. ఆమె సమక్షం అతనిలో ఒక విధమైన ఉద్వేగాన్ని కలుగజేస్తోంది.

"ఇంకో టెన్ డేస్ షూటింగ్ ఇక్కడే జరుగుతుంది" మాటకలపడానికన్నట్లుగా అన్నాడు సల్మాన్.

"ఆ! డైరెక్టర్ జి చెప్పారు. ఇంత ప్రశాంతమైన వాతావరణంలో ఇంకో పదిరోజులు వుండచ్చు అనుకుంటే చాలా సంతోషంగా వుంది..." చెప్పింది ఐశ్వర్య.

ఆ మాటకి అతని మొహం వికసించింది. సో! ఆమెకి తన కంపెనీ నచ్చింది. అనుకోగానే ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. ఇంతలో కుక్ వచ్చి డిన్నర్ రెడీ అయ్యిందని చెప్పాడు.

సల్మాన్ మొహమాటంగా లేచి "నేను నా కాటేజీకి వెళతాను" లేవబోయాడు.

"మీరూ నాతోపాటు ఇక్కడే డిన్నర్ చేస్తారా?" మర్యాద కోసం అడిగింది ఐశ్వర్య.

"ష్యూర్ – ష్యూర్!" లేవబోయినవాడల్లా గభాలున కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

ఆ క్షణంలో అతని మొహం మరింత పసిగా మారింది. కొంచెం నవ్వొచ్చింది ఐశ్వర్యకి.

తన అసిస్టెంట్‌ని పిలిచి లాన్‌లోనే డిన్నర్ ఏర్పాటు చేయమని చెప్పింది.

వాచ్‌మెన్, ఆయా కలిసి చిన్న టేబుల్, రెండు ఛెయిర్స్ లాన్‌లో వేసి కేండిల్ లైట్ డిన్నర్‌కు ప్రిపరేషన్ చేశారు.

టేబుల్‌మీద స్టాండ్‌లోంచి రంగు రంగుల కేండిల్స్ కాంతి ఆకాశంలోని నక్షత్రాలను తలపిస్తోంది. ఫ్లవర్‌వాజ్‌లో అప్పుడే కోసిన పూలగుత్తి పరిమళాలు వెదజల్లుతోంది.

ఐశ్వర్య రాత్రిపూట భోజనం చాలా మితంగా చేస్తుంది. ఆమెకు వెజిటబుల్ సలాడ్స్ ఎక్కువ ఇష్టం. ఎన్ని రోజులైనా కాయగూరలు, పళ్ళతో గడిపేయగలదు.

ఆమెకు ఇష్టమైన వాటితోపాటు, సల్మాన్‌కు ఇష్టమైన నాన్‌వెజ్ డిష్‌లు అప్పటికప్పుడు సిద్ధం చేసారు.

రోటి, దాల్ ఇంకా ఆమెకి ఇష్టమైన వెజ్ ఐటమ్స్ రెడీచేసి పెట్టారు.

"రండి..." టేబుల్ దగ్గరకు వెళ్తూ పిలిచిందామె.

ముఖంలో సంతోషం కన్పిస్తుండగా ఆమె వెనకాలే నడిచాడు సల్మాన్.

ఆనందంతో వెలిగిపోతున్న అతని ముఖం ముందు చంద్రుడు చిన్నబోయాడు. ఆమె వెజ్ ఐటమ్స్ తినడం చూసి అతను కూడా అవే తినసాగాడు.

"మీరు నాన్‌వెజ్ తినండి. మీకిష్టమని మొన్న షూటింగ్‌లో ఎవరో అంటే విన్నాను" అంది ఐశ్వర్య మృదువుగా.

"నో! నో! మరీ ఎక్కువ ఇష్టం ఏం కాదు. వెజ్ మంచిదని మా డైటీషన్ చెప్పాడు" అతను కవర్ చేసుకోడానికి అవస్థ పడటం చూసి తనే స్వయంగా నాన్‌వెజ్ డిష్‌నుంచి ఐటమ్ తీసి అతనికి వడ్డించింది ఐశ్వర్య.

ఆమె తీసుకున్న ఆ చనువు అతని కెంతగానో నచ్చింది. "థాంక్యూ..." మురిసిపోతూ చెప్పాడు.

ఓ రెండు నిముషాలు మౌనంగా గడిచాక అతనికి తన మనసులోని మాటను చెప్పాలనిపించింది.

ప్రేమ పూర్వక భావాలను అతను నటనలో అద్భుతంగా పలికించగలడు. అలాంటిది నిజ జీవితంలో తను స్వయంగా అనుభవిస్తున్న ప్రేమని చెప్పడానికి కొంచెం సంకోచిస్తున్నాడతను.

సడెన్‌గా అతని మొహంలో భావాలు మారిపోవటం ఆమె గమనించింది. ఆమె హృదయంలో ఏదో చెప్పరాని అలజడి బయలుదేరింది.

"మీతో ఓ విషయం చెప్పాలి..." ఆమెవంక సూటిగా చూస్తూ అన్నాడు సల్మాన్.

"చెప్పండి" ఆసక్తిగా కళ్ళెత్తి చూస్తూ అంది ఐశ్వర్య.

"మిమ్మల్ని చూసిన తొలిక్షణం నుంచి నా హృదయంలో తెలియని ఏదో సంచలనం... పదే పదే మిమ్మల్ని చూడాలనీ, మీ సమక్షంలో ఉండాలని నా హృదయం పడే ఆరాటం మీకెలా చెప్పను?" అతని స్వరం, మొహంలోని ఎరుపుదనం, ఆ చనువు, చొరవా ఆమె మనసును ఝుల్లుమనిపించింది.

విభ్రాంతిగా అతని మొహం వంక చూస్తూ వుండిపోయింది. మళ్ళీ రిపీట్ చేశాడతను.

"మధ్యాహ్నం నేను చెప్పిన డైలాగది. నేను బాగా చెప్పలేదా?" గొంతు పెగుల్చుకుంటూ అంది ఐశ్వర్య.

అతను ఎంత సన్నితంగా తన హృదయాన్ని తెలియజేస్తున్నాడు?

"నేనాసించింది ఈ సమాధానం కాదు..." సల్మాన్ అన్నాడు.

ఐశ్వర్య మొహం సిగ్గుతో అరుణవర్ణం దాల్చింది. ఏదో అనబోయింది కానీ మాట పెగలలేదు.

ఇంతలో అతని సెల్ మ్రోగింది. ఆ సెల్ రింగ్ అతను స్వయంగా ఇష్టపడి పెట్టించుకున్నాడు. ఓ తీయనైన అమ్మాయి గొంతు "సల్మాన్! సల్మాన్!" అంటూ పిలుస్తున్నట్లుగా వుంటుంది.

విచిత్రంగా చూసింది ఐశ్వర్య.

బిత్తరపోయాడు సల్మాన్.

ఆ సమయంలో ఆ ఫోన్‌కాల్‌ను అస్సలు ఊహించలేదు. విసురుగా సెల్ తీసి ఆఫ్ చేయబోయాడు.

అతన్ని వారిస్తూ "మాట్లాడండి..." ఆదేశిస్తున్నట్లుగా అందామె.

ఏం చేయాలో తోచనట్లు చూస్తుండిపోయాడు. సెల్‌లో అమ్మాయి పిలుస్తూనే వుంది. ఐశ్వర్య అతనివంకే చూస్తోంది.

కుర్చీలోంచి లేవాలంటే బెరుకుగా వుంది కాల్ రిసీవ్ చేసుకోవాలన్నా సంకోచం... కాల్ ఎక్కడ నుంచి వచ్చిందో తెలుసు.

తన గర్ల్ ఫ్రెండ్ సోమి చేసిందది. ఏ వ్యక్తిత్వమూ లేని ఆమె అందం ఈ మధ్య తనని ఏమాత్రం ఆకర్షించడంలేదు.

ఎలాగైనా తనని హోల్డ్ చేయాలని సోమి, ఆమెకి సాధ్యమైనంత దూరమవ్వాలని సల్మాన్ ఈ మధ్య ప్రయత్నిస్తున్నాడు.

"కాల్ ఎటెండ్ చెయ్యండి" చెప్పింది ఐశ్వర్య.

ఇతరుల ఫోన్ మాట్లాడేటప్పుడు ఉద్దేశ పూర్వకంగా వినకూడదని తెలుసు కానీ తనేంటో, తనకి తెలియాలి.

ఈ అందమైన వాతావరణంలో ఐశ్వర్యతో తన హృదయాన్ని విప్పి చెపుతున్న సమయంలో ఈ ఫోన్‌కాల్ రావటం అతనికి విసుగును తెప్పించింది.

ఫోన్‌లో సోమి ఏదో మాట్లాడుతోంది. అతను సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. అదంతా వినోదంగా చూస్తోంది ఐశ్వర్య.

అయిదు నిముషాలకి ఆమె వదిలిపెట్టింది. అంత చల్లగాలిలోనూ నుదుటికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు ఖాన్.

ఆమె మొహంలోని చిన్న నవ్వు అతన్ని కుచించుకుపోయేలా చేసింది.

"మధ్యాహ్నం నేను చెప్పిన డైలాగ్‌ని మళ్ళీ ఓసారి చెప్పండి" ఆమె సరదాగానే అంది గానీ హర్టయ్యాడు సల్మాన్.

అతనికున్న షార్ట్ టెంపర్ దృష్ట్యా అతను లేచి వెళ్ళిపోతాడనుకుంది. కానీ అదేం జరగలేదు.

తల వంచుకుని సలాడ్ తినసాగాడు. ఆ సమయంలో అతని మొహంలోని భావాలకి మనస్సు కొద్దిగా ద్రవించింది. ఎంత గొప్ప హీరో అయినా వ్యక్తిగత జీవితంలో సమస్యలు కుంగతీస్తాయి.

"సోమీతో ఏంటి సమస్య?" అనునయంగా అంది ఐశ్వర్య.

"ఏంలేదు" మొహం చిన్నబోగా అన్నాడు.

"మరీ..." ప్రశ్నార్ధకంగా చూసింది ఐశ్వర్య.

చెయిర్‌లో రిలాక్సింగ్‌గా వెనక్కివాలాడు సల్మాన్.

"తను ఏవో మాడలింగ్ కాంట్రాక్ట్ కోసం ట్రై చేస్తోంది. అక్కడ కెమేరామాన్‌తో ఎఫైర్ స్టార్ట్ చేసింది.

ఇక్కడ నా గర్ల్‌ఫ్రెండ్‌గా చలామణి అవుతోంది. డబుల్‌గేమ్" సీరియస్ అయిపోతూ అన్నాడు. అతని మొహం కందగడ్డలా మారింది. పెదాలు ఆవేశంగా చలించాయి.

"మరి సోమీతో అనుబంధాన్ని తెంచుకోకుండా, నాతో అనుబంధాన్ని మొదలుపెట్టడం డబుల్‌గేమ్ కాదా...?" సూటిగా అడిగింది ఐశ్వర్య.

నోట మాటరానట్లుగా అయిపోయాడు సల్మాన్. ఓ క్షణం తల పంకించి ఏదో ఆలోచనలో మునిగాడు. అదీ రెండు నిముషాలసేపే.

అతను ఇమ్మీడియట్‌గా నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే సోమీకి ఫోన్ చేశాడు.

సల్మాన్ స్ట్రెయిట్‌గా విషయంలోకి వస్తూ "నీకెంత కావాలి...?" అడిగాడు.

వింటున్న ఐశ్వర్య ఆశ్చర్యపోయింది.

అతను చాలాసేపు సోమీని ఒప్పించడానికి ప్రయత్నంచేశాడు. చివరికి యాభై లక్షలకి ఆమె అతనితో ఎఫైర్‌నుంచి డ్రాప్ అవడానికి ఒప్పుకుంది.

అతను తన కాటేజీలో వున్న తన సెక్రటకి కాల్ చేశాడు. అతను వచ్చేలోపు సల్మాన్ ఏదో ఆలోచిస్తూనే వున్నాడు.

సెక్రటరీ రాగానే చెక్‌బుక్ తెప్పించి పదిలక్షలు క్యాష్‌కి చెక్‌రాసి మిగతా నలభైలక్షలకి జుహు బీచ్ ఒడ్డున తను కొనుక్కున అపార్ట్‌మెంట్‌ని సోమి పేరున మార్చమని చెప్పాడు.

నిర్ఘాంతపోయాడు సెక్రటరీ.

"సార్! మీ డెసిషన్ మళ్ళీ ఓసారి..." ఏదో చెప్పబోతుంటే, చెయ్యెత్తి అతన్ని వారించి-

"డూ వాట్ ఐసే..." విసురుగా చెప్పాడు సల్మాన్.

అతను తల వూపి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఐశ్వరం శిలాప్రతిమలా జరిగిందంతా చూసింది.

అతను చిన్నగా ఒళ్ళు విరుచుకుంటూ "నౌ ఐయామ్ ఫ్రీ బర్డ్" చెప్పాడు.

ఐశ్వర్య సాలోచనేగా చూస్తోంది.

"సో అనుబంధాలన్ని ఆర్థిక పరమైనవే..." అంది. చిన్నగా తల వూపాడతను.

"అవును! చాలావరకు అంతే మీరు తప్ప" చెప్పాడు సల్మాన్.

భుజాలు ష్రగ్ చేసింది ఐశ్వర్య.

"ఏమో నటనలో నేను ప్రొఫెషనల్‌ని. నా కుటుంబం, నేనూ మా అనుబంధం ఇదేనా ప్రపంచం. ఇంతకుమించి ఇప్పటివరకు ఏమీ ఆలోచించలేదు" చెప్పిందామె.

"ఇప్పటినుండి ఆలోచించండైతే" చెప్పాడతను.

"దేని గురించి ఆలోచించాలి?" ఆమెకి తెలియకుండానే స్వరంలో కవ్వింపు తొంగిచూసింది.

సల్మాన్ మొహంలోకి నవ్వు పాకి వచ్చింది.

"మధ్యాహ్నం చెప్పిన డైలాగ్ గురించి..." ఆమె మొహంలోకి చూస్తూ అన్నాడు.

పది నిమిషాలు ఐశ్వర్య ఏదో ఆలోచిస్తూ వుండిపోయింది ఆమెను డిస్ట్రర్బ్ చేయలేదు సల్మాన్‌ఖాన్.

ఆ తరువాత గొంతు విప్పింది ఐశ్వర్య.

"నాకు ఒక వయసు వచ్చిన దగ్గర్నుంచి నా పార్టనర్‌పట్ల నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. అతడు మిస్టర్‌వరల్డ్ కానక్కరలేదు. కానీ అతను నిజాయితీపరుడై వుండాలి.

నన్ను ఓ అద్భుతంలా చూడక్కరలేదు. కానీ అతడు పూర్తిగా నాకే అంకితం కావాలి. ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఏ చెడు అలవాటు అతనికుండకూడదు.

ప్రేమంటే నా దృష్టిలో కాలక్షేపంకాదు. అది ఒక కమిట్‌మెంట్" చిన్నగా చెప్పిందామె.

ఆమె స్వరంలో ఖచ్చితత్వం అతన గుర్తించాడు. ఆమె మాటలకి అతని మొహం వెలవెలాపోయింది.

చాలాసేపు స్పూన్‌తో ప్లేట్‌లోని ఐటమ్స్‌ని టచ్ చేస్తున్నాడే తప్ప ఏమీ తినడం లేదు.

ఎంతో అమాయకత్వంగా వున్న అతని మొహాన్ని చూస్తే ఓ పక్క స్త్రీత్వం మేల్కొంటోంది. కానీ చిన్నప్పటి నుంచి సరిహద్దుల్లో పెరిగిన పెంపకం సరయిన వ్యక్తిని తన సహచరుడిగా ఎంచుకోమంటోంది.

"మనం పెళ్ళిచేసుకుందాం ఐశ్వర్య!" అభ్యర్ధనగా అన్నాడు సల్మాన్.

తల అడ్డంగా ఊపింది ఐశ్వర్య.

"ఇప్పుడు నా జీవితంలో ప్రథమ ప్రాధాన్యం నా కెరీయర్‌కే. కెరీయర్‌ని కూడా వదులుకునేంత ఉద్వేగభరితమైన ప్రేమ నాకింతవరకు దొరకలేదు."

ఆమె చెబుతుంటే ఇంద్ర నీలమణుల్లా మెరుస్తోన్న ఆమె కళ్ళనే చూస్తున్నాడు.

హఠాత్తుగా అతనికి జీవితమంతా శూన్యంగా అనిపించింది. ఆమె తిరస్కారం అతను తట్టుకోలేకపోతున్నాడు.

అతని మొహంలోని బాధను గమనించింది ఐశ్వర్య. వాతావరణాన్ని తేలిక చేయటానికి ప్రయత్నిస్తూ.

"మీరు తలచుకొంటే భారతదేశంలోని అందగత్తెల్లో మిమ్మల్ని వరించడానికి సిద్ధపడేవారెందరో" హాస్యంగా అంది.

"మీరుతప్ప..." బలహీనంగా నవ్వాడు.

ఐశ్వర్య సెక్రటరీ బయటకి వచ్చి "మేడమ్! టైం పదకొండు దాటింది. రేపు ఎనిమిది గంటలకే షూటింగ్ వుంది" గుర్తుచేసాడతను.

తల వూపింది.

భారంగా లేచాడు సల్మాన్.

చిరునవ్వు నవ్వుతూ "గుడ్‌నైట్" చెప్పింది ఐశ్వర్య.

తనూ ప్రతిగా "గుడ్‌నైట్' చెప్పి తన కాటేజీవైపు నడిచాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

"బాలీవుడ్ న్యూస్"

భారతదేశంలో చాలామంది ప్రజలు ఇష్టంగా కొని చదివే సినిమా పత్రిక. ఒక ఇంగ్లీషులోనేకాక ప్రాంతీయభాషల్లో కూడా వెలువడుతూ హిందీ సినిమా రంగాన్ని దేశప్రజలందరికీ మరింత చేరువలోకి తెస్తోంది పత్రిక.

ముంబాయిలోని ఎయిర్‌పోర్టుకి దగ్గరలో వున్న ఈ పత్రిక హెడ్డాఫీసు ఈరోజు ఒకింత కలకలాన్ని నింపుకుంది.

దానికి కారణం వాళ్ళు తలపెట్టిన పబ్లిసిటీ కార్యక్రమానికి లోనా వాలాలో వున్న ఐశ్వర్య ఫోన్ ద్వారా తన అమోదాన్ని తెలపడమే.

ఈ పత్రికవారు దేశవ్యాప్తంగా వున్న బాలీవుడ్ న్యూస్ పాఠకులకి ఓ పోటీని పెడుతున్నారు.

"బాలీవుడ్ న్యూస్" సంవత్సర చందాదారులు మాత్రమే పోటీకి అర్హులు. దాని ప్రకారం ఐశ్వర్య అందంమీద తమ అభిప్రాయాలు తెలిపిన వారిలో యాభైమందిని లక్కీడిప్ ద్వారా తమ ఉత్తమ పాఠకులుగా నిర్ణయించి ఓ అమూల్యమైన అవకాశాన్ని వారికందిస్తారు

అది ఐశ్వర్యతో మాట్లాడే అవకాశం.

గంట, రెండు గంటలుకాదు. వారం రోజులు... అది కూడా ఈస్ట్ ఫాస్ట్ క్రూయిజర్‌లో మలేషియా తదితర ప్రాంతాలు చూసే అవకాశాన్ని కల్పిస్తారు. భోజన రవాణా తదితర సదుపాయాలన్నీ బాలీవుడ్ న్యూస్ వారివే.

ఈ వారం రోజులు కొన్ని లిమిట్స్‌కు లోబడి ఐశ్వర్యని ఇంటర్‌వ్యూ చేయవచ్చు, మాట్లాడవచ్చు, డాన్స్ చేయవచ్చు.

ఐశ్వర్య అంగీకారం రాగానే ఆ ఆఫీసులో సందడి నెలకొంది. వాళ్ళకి ఖచ్చితంగా తెలుసు. ఈ దెబ్బతో పత్రిక మరింత ఆర్థిక స్థిరత్వాన్ని పొందడమేకాక సర్క్యులేషన్ కూడా బాగా పెరుగుతుందని.

అయితే వాళ్ళని ఆశ్చర్యపరచిన విషయం మరొకటుంది "బాలీవుడ్ న్యూస్" ఆఫర్ చేసిన అమౌంట్‌ని ఆమె తిరస్కరించి ఆ అమౌంట్‌ని ముంబాయిలోని ఆర్ఫనేజ్‌కి ఇవ్వమని చెప్పటం.

ఆమెలో అందం అభినయమేకాక మానవత్వం అనే మరో కోణాన్ని వాళ్ళు దర్శించగలిగారు.

మరో రెండు నెలల్లో ఆమె ప్రస్తుతం చేస్తున్న సినిమా ఫస్ట్ షెడ్యూల్ ముగుస్తుంది. ఆ గ్యాప్‌లో ఈ పథకాన్ని అమలుచేయడానికి ఒప్పుకుంది ఐశ్వర్య.

❁ ❁ ❁ ❁ ❁ ❁

సాయంత్రం ఆరు గంటలు...

పొలం నుంచి ఇంటికి తిరిగివస్తున్నాడు త్రినాథ్. పొలం గట్టుకి ఆ వైపు పెరిగిన పచ్చని పంటపొలాలు కళ్ళకి ఆహ్లాదాన్నిస్తున్నాయి.

తన పొలం గట్టుదాటి కొంత ముందుకు నడిచాడు. అవన్నీ పెద్ద రెడ్డిగారి పొలాలు. సుబ్బు పొలాన్ని స్వయంగా చేసుకునే ఓపికలేక కౌలుకి ఇచ్చాడు.

అతని డ్యూటీ అంతా సినిమాహాలు దగ్గరే. అతనికి అక్కడే బాగా కాలక్షేపం అవుతుంది. ఎప్పుడయినా బుద్ధిపుడితే అలా ఓసారి పొలంవైపు వస్తాడు.

కను చీకట్లు ముసురుకుంటున్నాయి. గబ-గబా అడుగులు వేస్తున్నాడు త్రినాథ్. కొంచెం దూరంలో మామిడిచెట్టు దగ్గర ఓ ఆకారం తచ్చట్లాడుతూ కనిపించింది. అనుమానంగా అటువైపు చూశాడు త్రినాథ్.

ఆ మసక చీకటిలో ఆకారం సరిగ్గా కనిపించలేదు. తను ఇంకో మామిడిచెట్టు వెనకాలకి వెళ్ళి ఆ ఆకారం ఎటు వెళ్తోందో చూడసాగాడు.

ఐదు నిమిషాలు గడిచేసరికి ఆ వ్యక్తి పక్కనే ఇంకో స్త్రీ ఆకారం ప్రత్యక్షమయింది. ఉత్సుకతతో వారినే వెంబడించసాగాడు త్రినాథ్.

వాళ్ళిద్దరూ పెద్దరెడ్డి పొలాన్ని కూడా దాటుకుని తాటితోపు వైపు వెళ్ళటం గమనించి మరింత వేగం పెంచి, చాటుగా వాళ్ళనే పదడుగుల దూరంలో చూశాడు.

తీరాచూస్తే...

అతను సుబ్బు.

ఆ అమ్మాయి సత్తిగాడి ముఠాలోని కూలమ్మాయి రత్తి. "ఈ పిల్లతో ఈడికేంటి పని??" వదలకుండా వెంటపడ్డాడు.

ఈ వ్యవహారం ఏంటో తేల్చేయాలని మహా పట్టుదలగా వుంది త్రినాథ్‌కి. ఓ పదినిమిషాలు వారిని వెంబడించాడు. చీకటితో చిక్కనైనా చంద్రుడు తనవంతు సాయం చేస్తున్నాడు.

రత్తి కిలకిలలాడుతూ సుబ్బు నడుముచుట్టూ చేయివేసి నడుస్తోంది.

వీడికీ కళ కూడా వుందా అని మనసులోనే ఆశ్చర్యపోతూ వాళ్ళ వెనకాలే నడుస్తున్నాడు త్రినాథ్. వెళ్ళి-వెళ్ళి తాటితోపులో అదృశ్యమయ్యారు ఇద్దరు. ఇక నిశ్చయానికి వచ్చేశాడు త్రినాథ్.

అప్పటికే అతని మనసులో ఓ ఆలోచన తళుక్కుమంది. ఏనుగు ఎక్కినంత సంబరంగా వుంది అతనికి. రేపు ఏం చేయాలో ఆలోచిస్తూ ఇంటిముఖం పట్టాడు.

ఇంటికి వెళ్ళేసరికి వరండాలో ఓ పెద్దాయన కూర్చున్నాడు. ఇంట్లోంచి కోడికూర వాసన ఘుమ-ఘుమలాడుతోంది. అతన్ని ఎప్పుడు చూసిన గుర్తుకూడా లేదు త్రినాథ్‌కి.

"రావోయ్... రా..." ఆ చుట్టాలాయనే త్రినాథ్‌ని పిలిచాడు. ప్రశ్నార్థకంగా తల్లివంక చూస్తూ ఆయనెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"మా రంగారావు అన్నయ్యరా! మా పెద్దమ్మ తోటి కోడలి కొడుకు" చెప్పింది సావిత్రమ్మ.

నమస్కారం చేశాడు త్రినాథ్. "ఇదివరకు ఎప్పుడూ మిమ్మల్ని చూడలేదు" మాట కలుపుతూ అన్నాడు త్రినాథ్.

"ఆ! ఎప్పటిమాట అది... మీ చిన్నప్పుడు మీ అమ్మ మిమ్మల్ని తీసుకొని మా ఇంటికి వచ్చినప్పుడు మిమ్మల్ని ఎత్తుకొని భుజాలమీద మోసానురా!

తర్వాత ఎవరి జీవితాల్లో వాళ్ళుపడి బంధుత్వాలు మరచిపోయి, ఇదిగో ఈమధ్య ఈ ఊరినుంచి వస్తూ మీ ఇంటి పక్కాయన మీ కబుర్లు చెప్పాడు" ఆయన చెబుతుంటే తలూపుతూ విన్నాడు త్రినాథ్.

"మన భారతికి ఏవో సంబంధాలు కూడా పట్టుకొచ్చాడు అన్నయ్య" సంబరంగా చెప్పింది సావిత్రమ్మ.

తలుపు పక్కగా కదులుతున్న పరికిణీ కనిపించింది. పెదాలచాటునే నవ్వు దాచిపెట్టుకున్నాడు త్రినాథ్.

"అందం ఆస్తులతో మాకు సంబంధంలేదండీ! గుణవంతుడు, భార్యాబిడ్డల్ని పోషించుకోగలిగినవాడయితే చాలు" చెప్పాడు త్రినాథ్.

"అదేనయ్యా కావలసింది. అలాంటి సంబంధాలేతెచ్చా" చెప్పాడాయన.

"పంటొచ్చేవరకూ ఆగండి మావయ్యా... ఓ ఎకరం చెల్లి పేరు మీద రాసినా, పంట డబ్బుతో పెళ్ళి ఖర్చులు గడుస్తాయి..." చెప్పాడు త్రినాధ్.

"అలాగే కానీ మరి..."

"సరే అన్నయ్యా, భోజనానికిలే..." ఆయన్ని ఆహ్వానించింది సావిత్రమ్మ.

త్రినాధ్ కూడా లేచి స్నానంచేసి భోజనానికి కూర్చున్నాడు.

రాఘవరావు, తమ్ముడు సారధి కూడా ఆ సమయానికి ఇంటికి చేరుకున్నారు.

భోజనాలయ్యాక వాళ్ళంతా పిచ్చాపాటి కబుర్లలో పడ్డారు.

త్రినాధ్ అక్కడికి కొంచెం దూరంగా నూతిగట్టు పక్కనే నవారు మంచం వేసుకుని పడుకున్నాడు.

కొబ్బరాకులు గలగలలాడుతున్నాయి. కొబ్బరాకుల మధ్య నుంచి చందమామ తొంగిచూస్తోంది. చందమామలో అంతకన్నా అందమైన ఐశ్వర్య కనిపించింది.

పగలంతా అలసిన శరీరానికి ఆమె ఆలోచనలు మత్తుమందులా పని చేస్తున్నాయి. కళ్ళు అరమూతలు పడుతున్నాయి. రాత్రి తొమ్మిదయినా కాకుండానే నిద్రలోకి జారుకున్నాడతను.

తెల్లవారి ఐదు గంటలకి మెలకువ వచ్చింది. లేచి కాసేపు కసరత్తులు చేశాడు.

నూతిలోంచి నీళ్ళు తోడుకుని స్నానాదికాలు ముగించాడు త్రినాధ్.

అతని పని అయ్యేసరికి సావిత్రమ్మ, భారతిలేచి ఇంటి పనుల్లో పడ్డారు. తల్లి పెట్టిన చద్దన్నం తిని బయలుదేరాడు త్రినాధ్.

"అన్నయ్య ఇంత పెందలకాడే బయలుదేరాడే?" ఆశ్చర్యంగా అంది భారతి.

"పనుందిలే" చెప్పాడు త్రినాధ్.

నడుచుకుంటూ పెద్దరెడ్డిగారి గేటుముందు ఆగాడు. పాలేరు అప్పుడే వీధి గుమ్మం ఊడ్చి, కల్లాపి జల్లుతున్నాడు.

"బాబుగారున్నారా?" పాలేరుని అడిగాడు.

"ఆ ఇందాకే లేచారు" చెప్పాడు పాలేరు.

లోపలికి ప్రవేశించాడు త్రినాధ్.

పొన్నచెట్టు నీడలో ఫ్రేము కుర్చీమీద కూర్చుని తెలుగు దిన పత్రిక చదువుతున్నాడు సుబ్బు. అతన్ని చూసీ చూడనట్లుగా మందుకెళ్ళి...

"చెల్లెమా! చెల్లెమ్మా!" గట్టిగా పిలిచాడు త్రినాధ్.

ఆ అరుపులకి ఉలిక్కిపడి పేపరులోంచి తలెత్తి చూశాడు సుబ్బు. అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

ఎవరో పిలిచినట్లు వినిపించి సుబ్బు భార్య ఏడుస్తున్న పిల్లాడ్ని ఎత్తుకుని సముదాయిస్తూ బయటికొచ్చింది.

"ఏయ్! ఎందుకొచ్చావ్?" కుర్చీలోంచి అరిచాడు సుబ్బు.

విన్పించుకోలేదు త్రినాధ్.

సుబ్బు భార్యకి త్రినాధ్ తెలుసు. భారతి ఆమె చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఇంటికొచ్చినప్పుడల్లా త్రినాధ్‌ని "అన్నయ్యా" అని పిలవటం అలవాటు ఆ అమ్మాయికి.

"ఏంటన్నయ్యా ఇంత పొద్దున్నే విశేషం?" అడిగిందామె.

"ఏం లేదు. రత్తి మనింటిలో పనికేమయినా వస్తుందా?" ఓరగా సుబ్బువంక చూస్తూ అడిగాడు.

బాణంలా లేచి నిలబడ్డాడు సుబ్బు.

"ఏ రత్తి?" అర్థంకానట్లు అడిగింది సుబ్బు భార్య.

"అదే ఆ సత్తిగాడి ముఠాలో వుంటుందికదా, ఆ అమ్మాయి..." చెప్పాడు.

"ఆమధ్య మా పని అమ్మాయి మానేస్తే ఓ నెలరోజులు పనిలో పెట్టుకున్నా, ఈమధ్య దాని సోకులు అవి నచ్చక మానిపించేశాను. అయినా అప్పుడప్పుడు వచ్చి పాత చీరలో ఏవో పట్టుకెళుతూ వుంటుంది. ఏమయింది దానికి" అడిగిందామె.

"ఏంలేదూ... నిన్న సాయంత్రం తాటితోపు దగ్గర" అర్థోక్తిలో ఆపి సుబ్బువంక చూశాడు.

అప్పటికే అంత ఉదయపు చల్లదనంలో సుబ్బుకి ఒంటినిండా చెమటలు పట్టాయి.

"త్రినాధ్ ఇలారా...!" చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళబోతూ అన్నాడు.

"ఉండరా" చేయి విదిలించాడు త్రినాధ్.

"ఆ తాటితోపు దగ్గర... ఏమయింది?" కుతూహలంగా అడిగిందామె.

సుబ్బుకి గుండె దడదడ లాడుతోంది. కాళ్ళలో వణుకు వచ్చేస్తోంది.

సుబ్బు భార్య చాలా మంచిది. ఆమెకి పుట్టింటోళ్ళు ఇచ్చిన ఆస్తి కూడా చాలా ఎక్కువ. ఆ అమ్మాయి చదువుకుంది కూడా. అందుకే బయట ఎన్ని వేషాలేసినా ఇంటి దగ్గర జాగ్రత్తపడతాడు సుబ్బు.

"పదరా నీతో పనుంది" గాబరాగా అంటూ మళ్ళీ చేయి పట్టుకున్నాడు సుబ్బు.

"ఉండరా చెల్లెమ్మతో చాలా మాట్లాడాలి" వ్యంగ్యంగా అన్నాడు త్రినాథ్.

భార్య చూడకుండా రెండు చేతులూ జోడించాడు సుబ్బు.

"సినిమాహాలు దగ్గరకి పద, నీతో మాట్లాడాలి" చిన్నగా సుబ్బు చెవిలో చెప్పాడు త్రినాథ్.

తల వూపాడు సుబ్బు.

"ఏంటన్నయ్యా! సగంలో చెప్పేసి ఆపేశావు. పూర్తిగా చెప్పు మరి" వదలకుండా అంది సుబ్బు భార్య.

"ఏంలేదమ్మా... నిన్న సాయంత్రం పొలం నుంచి వస్తుంటే రత్తి తాటితోపు దగ్గర కనిపించింది. ఒక్కతేలేదు, పక్కన ఎవడో వున్నాడు. చీకటిలో గుర్తుపట్టలేదు. అట్టాంటి దాన్ని ఇంటికి రానివ్వద్దు" చెప్పాడు త్రినాథ్.

"నాకా భయం లేదన్నయ్యా! మా ఆయన బంగారంకదూ...!" గర్వంగా అందామె.

ఏడవలేక నవ్వాడు సుబ్బు. మనసులోనే త్రినాథ్ మీద పళ్ళు నూరాడు.

"కాఫీ తాగి వెళ్ళన్నయ్యా" అడిగిందామె.

"లేదమ్మా! ఇప్పుడే చద్దన్నం తిని బయలుదేరాను. మళ్ళా వస్తాలే" చెప్పి ముందుకు నడిచాడు.

సాయంత్రం పొలం నుంచి తొందరగా వచ్చి సినిమాహాలు దగ్గరకి వెళ్ళాడు.

ఎప్పుడూ మిత్రసమేతంగా కళ-కళలాడుతూ యువరాజులా కూర్చునే సుబ్బు ఒక్కడే దిగులుగా కూర్చున్నాడు. సుబ్బుని చూడగానే డైరెక్టుగా విషయంలోకి దిగిపోయాడు త్రినాథ్.

"సినిమా ఎప్పుడు మారుస్తున్నావు?" అడిగాడు.

"నువ్వే చెప్పు" ఒక్కో అక్షరం ఒత్తి పలుకుతూ అన్నాడు సుబ్బు.

జరిగిందాన్ని అతను అంత తొందరగా జీర్ణించుకోలేకపోతున్నాడు. తన బలహీనతను కనిపెట్టి, అతని పంతాన్ని నెగ్గించుకోవటం మింగుడు పడటంలేదు.

"వచ్చేనెల మా ఐశ్వర్య పుట్టినరోజునాడు దేవదాసు సినిమా రిలీజ్ చేయాలి" చెప్పాడు

"సీ క్లాసులకు ఇవ్వరు. ఇచ్చినా ఎంత లాసో తెలుసా?" ఉక్రోషంగా అన్నాడు సుబ్బు.

"సినిమా ఉన్నన్ని రోజులు నీకో టిక్కెట్ గ్యారంటీ... నేను చూస్తాను" నవ్వుతూ అన్నాడు త్రినాథ్.

"ఆ నీ ఒక్క టిక్కెట్టు కోసం నేను నష్టపోవాలా?" విసురుగా అన్నాడు సుబ్బు.

"నీకేం నష్టం రాదులే! ఆ అపురూప సౌందర్యరాశిని చూడటానికి అందరూ వస్తారు" కాన్ఫిడెంటుగా అన్నాడు త్రినాథ్.

ఏవో సణుక్కుంటూ కూర్చున్నాడు సుబ్బు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

సమయం ఉదయం ఎనిమిది గంటలు...

అయిదు నిముషాలు ముందే షూటింగ్ స్పాట్‌కి చేరుకుంది ఐశ్వర్య...

అప్పటికే అందరూ రడీగా వున్నారు...

ఒక్కరు తప్ప...

అందరూ వెయిట్ చేస్తూనే ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

ఐశ్వర్య స్క్రిప్ట్ చదువుకుంటోంది. ఆమె పక్కనే డైరెక్టర్ కూర్చుని అసిస్టెంట్స్‌కి సూచనలిస్తున్నాడు.

ఎనిమిదిన్నర అయింది. డైరెక్టర్ అసహనంగా వాచీ చూసుకుంటున్నాడు. నిర్మాత, డైరెక్టర్ వంక చూస్తున్నాడు.

ఐశ్వర్య నుదుటికి పట్టిన చిరుచెమటని మేకప్ అసిస్టెంట్ సాఫ్ట్‌స్పాంజ్‌తో తుడిచింది.

కాటేజెస్‌కి నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న పూలతోటలో షూటింగ్ జరుగుతోంది.

ఐశ్వర్య లేచి గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న పూలని మునివేళ్ళతో సున్నితంగా స్పృశించి వాసనని ఆఘ్రాణించింది.

ఆ పరిమళానికి ఆమె మోహం వికసించింది. ఆ పూల దగ్గర చాలాసేపు గడిపింది.

టైం పదయింది.

ఆ ఒక్కరూ రానేలేదు.

ఐశ్వర్య విసుగ్గా లేచింది. ఆమె ధరించిన కాటన్ చుడీదార్ అప్పటికే కొంచెం నలిగింది. డ్రస్ ఛేంజ్ చేసుకోడానికి ఆమె లోపలికి వెళ్ళింది. పది నిముషాలు గడిచాక అప్పుడు వచ్చాడతను.

నిమిష నిమిషానికి తనలాస్‌ని లెక్కేసుకుంటున్న ఆ నిర్మాత వూపిరి అప్పటికి నిలిచింది.

డైరెక్టర్ మొహానికి నవ్వు పులుముకుంటూ లేచి అతన్ని ఆహ్వానించాడు.

అతను సల్మాన్...

అప్పుడే మేకప్ డేరాలోంచి బయటకు వచ్చింది ఐశ్వర్య...

"సారీ! రాత్రి నిద్రపట్టలేదు. అందుకే లేటయింది..." డైరెక్టర్‌తో అస్పష్టంగా సంజాయిషీ ఇచ్చాడు సల్మాన్.

అతను తన లేట్ గురించి సంజాయిషీ యివ్వటం చాలా విచిత్రంగా అన్పించిందతనికి.

"ఓ కే... నో ప్రాబ్లం... కమాన్..." అంటూ అతన్ని పరిశీలించాడు.

సల్మాన్ ఆల్రెడీ తన రూంలోనే మేకప్ అయివచ్చాడు. కానీ కళ్ళకిందవున్న చిన్న వుబ్బు అతనిలోని నిద్రలేమిని సూచిస్తుంది.

మనిషి హాంగోవర్‌లో లేడు. అంటే బహుశా రాత్రి అతను డ్రింక్ చేసి వుండకపోవచ్చు.

కానీ మనిషి చాలా అస్థిమితంగా వున్నాడు. ఎర్రని మొహం వాడిన కమలంలా వుంది. కళ్ళు విపరీతంగా చలిస్తున్నాయి.

డైరెక్టర్‌కి ఏదో అర్థమైంది. లైట్ బాయ్‌ని పిలిచి ఏదో చెప్పాడు.

ఐశ్వర్య, యితర ఆర్టిస్టులు రడీగా వున్నారు. సల్మాన్ కూడా రడీ అయి ముందుకు వచ్చాడు.

హీరో తన ప్రేమని తిరస్కరించినా, వదిలిపెట్టకుండా తన అల్లరి పనులతో అతన్ని ఏడిపించే సన్నివేశాలు కొన్ని వున్నాయి. అందులో ఓ సన్నివేశాన్ని యిప్పుడు చిత్రీకరించాలి.

హీరోయిన్ తన ఫ్రెండ్స్‌తో పార్క్‌కి వస్తుంది. హీరో తన బాధ్యతల బరువుతో అలసి సొలసి కాసేపు సేదతీరడానికి పార్క్‌కి వస్తాడు.

సీన్ మొదలయింది.

"స్టార్ట్ కెమేరా... యాక్షన్..." డైరెక్టర్ పిలిచాడు.

ఐశ్వర్య ఫ్రెండ్స్‌తో హుషారుగా పార్క్‌లో తిరగసాగింది.

ఇంతలో బెంచ్‌మీద పడుకుని ఆకాశంవంక నిర్వేదంగా చూస్తున్న సల్మాన్‌ని చూడగానే ఆమెలో ఎక్కడాలేని హుషారూ ప్రారంభమయింది.

ఫ్రెండ్స్‌ని అక్కడే వుండమనిచెప్పి లేడిపిల్లలా ఛెంగున గెంతుతూ అతని దగ్గరికి వచ్చింది.

"హాయ్...!" అతని చెవిపక్కనే అరిచింది ఐశ్వర్య.

తుళ్ళిపడిలేచినట్లు నటించాడు సల్మాన్.

"ఇక్కడ ఏ అమ్మాయికోసం వెయిట్ చేస్తున్నారు?" దబాయింపుగా అడిగింది.

అభావంగా ఆమెవంక చూశాడు. ఆమె మరింత దగ్గరికివచ్చి దబాయిస్తోంది.

అందమైన ఆమె ముఖ పద్మం తన చేరువలో... పద్మంలోని మధువుని ఆస్వాదించే తుమ్మెదలా ఆమె అధరామృతం గ్రోలాలని వుంది.

లాంగ్ షాట్ రన్ అవుతోంది. అతని ఫీలింగ్స్‌ని కెమేరా కాచ్ చెయ్యడం లేదు.

ఐశ్వర్య ఒక్కదానికే అతని మొహంలోని భావాలు అర్థమవుతున్నాయి.

ఆమెకి చాలా సంకోచంగా వుంది. ఎలా...? ఇలా మాటా పలుకూలేని మనిషితో... కళ్ళతో హృదయాన్ని విప్పుతున్న ఇతనితో ఎలా నటించడం...?

"కట్..." డైరెక్టర్ అరిచాడు.

ఆమె డైలాగ్ చెప్పటం... అతను మౌనంగా వుండటం ఆ సీన్ లోని భావం.

"ఓ.కే... రడీ టు నెక్ట్స్ షాట్..." చెప్పాడు డైరెక్టర్.

నెక్ట్స్‌షాట్ గుర్తొచ్చింది ఐశ్వర్యకి.

"నేనంటే నిజంగా యిష్టంలేదా?" అని హీరోని, హీరోయిన్ అడగాలి. దానికి అతనేదో సమాధానం యిస్తాడు.

అది తల్చుకోగానే గుండె గుభేల్‌మంది ఆమెకి.

అప్రయత్నంగా సల్మాన్‌వంక చూసింది. అతను తన కుర్చీలో కూర్చుని, తల వంచుకుని నేలవంక దీక్షగా చూస్తున్నాడు.

మరింత పరిశీలించిందామె. అతను గుప్పెళ్ళు తెరుస్తూ మూస్తూ వున్నాడు. ఆ గేప్‌లో అతని వేళ్ళు వణకడం ఆమెకి కన్పించింది.

"ఏమయింది అతనికి...? అనుమానంగా అటు చూస్తూనే వుంది.

ఇంతలో లైట్‌బాయ్ వచ్చి సిగరెట్ పాకెట్, లైటర్ యిచ్చాడు.

"నో..." రిజెక్ట్ చేశాడు సల్మాన్.

"డైరెక్టర్ సార్ ఇమ్మన్నారండీ..." చెప్పాడతను.

"వద్దన్నానా...?" గట్టిగా అరిచాడు సల్మాన్.

అతను బిత్తరపోయి వెనక్కి పరిగెట్టాడు.

అందరూ తిరిగి అతనివంక చూశారు. సల్మాన్ జుట్టులోకి వేళ్ళుపోనిస్తూ అస్థిమితంగా కదిలాడు.

ఐశ్వర్య నొసలు ముడిపడ్డాయి.

దేనికోసం అతను అంత రెస్ట్‌లెస్‌గా వున్నాడు...? తను తిరస్కరించిందనా...?

అయితే అతని చేతివేళ్ళు వణుకుతున్నాయి ఎందుకు...?

డైరక్టర్, సల్మాన్ దగ్గరికి వచ్చి భుజంమీద తట్టాడు.

సల్మాన్ చివాలునలేచి తన మేకప్‌రూమ్‌కి వెళ్ళిపోయాడు.

వెనకాలే డైరెక్టర్ వెళ్ళాడు.

"ఒక్కసారే అలవాట్లు మానేయ్యాలనుకుంటే ఎలా వీలవుతుంది? నెమ్మదిగా మానాలి-" జనాతికంగా అన్నాడు నిర్మిత.

ఐశ్వర్యకి అర్థమయింది... అతను స్మోక్ చేయడం, డ్రింక్ చేయడం మానుకున్నాడని.

బహుశా నిన్న తన మాటలకి రియాక్టయ్యి... అంటే తనకోసం అతను చెడు అలవాట్లు మానెయ్యాలనుకున్నాడా?

ఆ ఊహకే మనసు ఝల్లుమంది. కానీ తమాయించుకుంది.

తనని ఇంప్రెస్ చేయాలనుకోవడం వేరు... తనని నిజంగా ప్రేమించడం వేరు. ఈ రెండింటి మధ్యావున్న విభజనరేఖ చాలా చిన్నది.

"చూద్దాం ఏం జరుగుతుందో..." మనసులోనే అనుకుని మౌనంగా వుండిపోయింది.

సల్మాన్ తన మేకప్‌రూంలో చల్లని నీళ్ళతో మొహం కడుక్కున్నాడు.

డైరెక్టర్ నాలుగు చాక్లెట్లు తెచ్చి అతనికిచ్చాడు.

మౌనంలో కూడా ఒకరి హృదయాలు మరొకరికి తెలిసిపోతాయి. అందుకే మౌనంగా అతని మేకప్‌ని మరోసారి చెక్‌చేసి బయటకి వచ్చాడు డైరక్టర్.

వెనకాలే వచ్చాడు సల్మాన్.

కొత్త మనిషిని చూసినట్లు చూసింది ఐశ్వర్య.

అతని చూపులు తనమీద మాత్రం లేవు...

మళ్ళీ సీన్ స్టార్టయింది...

ఐశ్వర్య గుండె దడదడలాడుతోంది. అతను పార్క్‌లో బెంచీ మీద కూర్చున్నాడు.

అతనికి దగ్గరగా వెళ్ళి ఇంచుమించు అతనిమీద వాలిపోతున్నట్లుగా కూర్చుని అడగాలి...

దగ్గరగా వెళ్ళింది ఐశ్వర్య... అతని మీద వాలిపోతూ అడగడం చాలా కష్టం అనుకుంది.

కెమేరాకి సైగచేసింది... కెమేరా ఆగింది.

"డైరెక్టర్ జీ!" పిలిచింది.

"ఎస్..." అతనడిగాడు.

"మూమెంట్స్ ఛేంజ్ చెయ్యడం అవ్వదా?" అడిగింది.

సల్మాన్ తలెత్తి చూశాడు.

"మీద వాలిపోవడం అంటే కారెక్టర్‌కి లాస్ అవుతుందేమోనని" నసుగుతూ అంది.

"నథింగ్! మీరు చాలా అల్లరి అమ్మాయి... ఇందులో" నవ్వుతూ చెప్పాడు డైరెక్టర్.

తప్పదా అన్నట్లు చూసింది ఐశ్వర్య.

"అయినా ఇందులో వల్గారిటీ ఏమీ లేదే..." అన్నాడు డైరెక్టర్.

"వల్గారిటీ గురించి కాదు. కొంచెం ఎంబరాసింగ్‌గా వుంది" అంది ఐశ్వర్య.

సల్మాన్ చిన్నగా తనలో తానే నవ్వుకుంటున్నాడు.

ఉక్రోషంగా చూసింది ఐశ్వర్య.

డైరెక్టర్ కొంచెం అవతలికి వెళ్ళాక-

"ఎందుకు నవ్వుతున్నారు?" సూటిగా అడిగింది.

"మీరు ట్రూ ప్రొఫెషనల్ అనుకున్నాను" పెదాలమీద అదే నవ్వు చెదరకుండా అన్నాడు సల్మాన్.

"ఏం, కాదా?" అహం దెబ్బతినగా అంది ఐశ్వర్య.

"నటనలో ఎంబ్రాసింగ్ ఫీలింగ్స్ ఎందుకు? పాత్రలో లీనమైతే అలాంటి ఫీలింగ్స్ రావుకదా..."

"నాకిన్ని చెబుతున్నారు. మరి మీరు నిన్న మధ్యాహ్నం ఎందుచేత ఇన్వాల్వ్ అవ్వలేకపోయారు?" సవాల్ చేస్తున్నట్లుగా అంది ఐశ్వర్య.

మళ్ళీ నవ్వాడు సల్మాన్. ఈసారి అతని మొహంలో ఏదో వింత వెలుగు...

"మీ ముందు నేను నటించలేను. మనసులో వున్న నిజం చెప్పాలనిపిస్తుంది. దీనిని నేను ఒప్పుకుంటున్నాను. నా జీవితంలో నేను మీ దగ్గర నటుడుగా వుండకూడదనుకుంటున్నాను" గూఢార్థంగా లోపలికి ఛివాలున లేచి వెళ్ళిపోయాడు సల్మాన్.

మనసు భారమయింది ఐశ్వర్యకి.

అతను చూసినప్పుడల్లా ఆ చూపులనుంచి ఓ వింత మోహప్రవాహం తనను చుట్టుముడుతున్నట్లుగా వుంది. మనసు తీయగా స్పందిస్తుంది. ఆచూపుల్ని ఇష్టంగా ఎంజాయ్ చెయ్యాలనుంది.

మూడీగా కూర్చుంది ఐశ్వర్య. నెక్స్ట్ షాట్‌కి రడీ అవ్వమని అసిస్టెంట్ వచ్చి చెప్పాడు. ఫైనల్ టచప్ చేసుకుంది ఐశ్వర్య.

యధావిధిగా అతను పార్క్‌లో బెంచీమీద కూర్చున్నాడు.

హుషారుగా గెంతుతూ అతని దగ్గరకి వెళ్ళి వాలిపోతూ అడగాలి. ముందుకు నడిచింది. కానీ అడుగుల్లో చైతన్యం లేదు.

"కట్..." చెప్పాడు డైరెక్టర్.

సల్మాన్ తనదే ఫాల్ట్ అనుకుని యాంగిల్స్ సరిచేసుకోబోయాడు.

"యు ఆర్ ఆల్‌రైట్ సల్మాన్!"

"ఐశ్వర్యాజీ! మీరు కొంచెం హుషారుగా వుండాలి." చెప్పాడు డైరెక్టర్.

"యా... యా.." అప్పటికి తేరుకుంది ఐశ్వర్య. మళ్ళీ చెప్పించుకునే అవకాశం ఇవ్వలేదామె. పూర్తిగా లీనమైపోయింది.

"నేనంటే నిజంగా ఇష్టంలేదా?" అని ఆమె గోముగా అడుగుతుంటే కాచుకోడానికి సల్మాన్ చాలా కష్టపడాల్సి వచ్చింది. అతనికి కూడా చాలా పంతం వచ్చింది. తన నటనేంటో నిరూపించాలి. అందుకే రెచ్చిపోయి మరీ నటించాడు.

అగ్రశ్రేణి నటీ నటులిద్దరూ పోటీపడి నటిస్తుంటే చూసేవాళ్ళకి పండగలా వుంది. నిర్మాత ఆనందం వర్ణనాతీతం.

షాట్ గాప్స్ మధ్యలో ఐశ్వర్య అతడిని పరిశీలిస్తూనే వుంది. అతను ఇబ్బంది పడుతూనే వున్నాడు. మధ్య - మధ్యలో చాక్లెట్స్ తింటున్నాడు.

ఐశ్వర్య ముంబాయిలో వున్న తన డాక్టర్ ఫ్రెండ్‌కి ఫోన్‌చేసి కొన్ని సలహాలు అడిగింది. ఆమె చెప్పినవి విని మనసులో పదిలపరుచుకుంది. ఒక్కో గంట గడిచేకొద్దీ సల్మాన్‌లో తీవ్రమైన మార్పులు కన్పించసాగాయి. ప్రతిదానికీ చిరాకు పడటం, బాయ్స్‌మీద అరవటం చేస్తున్నాడు.

అతనిలో అసహనం అంతకంతకూ పెరిగిపోతోంది. ఉద్రేకంగా అనిపించినప్పుడల్లా ఏదో ఒక మిషమీద ఐశ్వర్య దగ్గరకి వచ్చి ఆమెతో మాట్లాడుతూ తన ఉద్రేకాన్ని తగ్గించుకుంటున్నాడు.

నిర్మాతకి ఒక పక్క సీన్స్ బాగా వస్తున్నాయని సంతోషం, మరో పక్క సల్మాన్ కోపం చూసి జడుపు కలుగుతున్నాయి.

డైరెక్టర్ మధ్యలో వచ్చి "ఒక పఫ్ అయినా పీల్చు" అని చెప్పాడు చిన్నగా.

"నో..." మొండిగా తలాడించాడు సల్మాన్.

డైరెక్టర్ నిట్టూర్చి వెళ్ళిపోయాడు. లంచ్ బ్రేక్‌లో అతను భోజనం కూడా సరిగ్గా తీసుకోలేకపోయాడు. ఐశ్వర్య పని ఇరుకున పడినట్లయింది.

సల్మాన్ తనకోసం అతనికున్న బాడ్ హాబిట్స్‌ని వదులుకోవాలనుకుంటున్నాడు. ఇది వాస్తవం...

కానీ ఈ పరిణామలు ఎక్కడికి దారితీసాయి? సల్మాన్ చెప్పినట్లుగా అతని ప్రేమని అంగీకరిస్తే అమ్మా, నాన్న, అన్నయ్య ఏమంటారో... అసలితను తమ కుటుంబానికి సరిపడే మనిషేనా?

ఆరోజు పేకప్ చెప్పేవరకూ అన్యమనస్కంగానే గడిపింది ఐశ్వర్యారాయ్.

యూనిటంతా సరంజామా సర్దుకుని బయలుదేరింది. కారు హీరో, హీరోయిన్లని గెస్ట్‌హౌస్ వద్ద దింపడానికి రెడీగా వుంది.

ఐశ్వర్య కారులో కూర్చుని వుంది. సల్మాన్ కోసం డ్రైవర్ వెయిట్ చేస్తున్నాడు. కానీ అతను పార్క్‌లో పచ్చికమీద పడుకొని దీర్ఘంగా ఆకాశం వంక చూస్తున్నాడు. డ్రైవర్ వెళ్ళి పిలిచాడు.

"నేను ఈవెనింగ్ వాక్ చెయ్యాలి. నడుచుకుంటూ వస్తాను. మీరెళ్ళండి..." చెప్పి పంపేశాడు సల్మాన్.

ఏదో అనబోయిందల్లా ఐశ్వర్య విరమించుకుని కూర్చుంది. కారు రివ్వున సాగిపోయింది.

కారు కనుమరుగయ్యేంతవరకూ చూస్తూండిపోయాడు సల్మాన్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

సుబ్బాని దిగ్విజయంగా బ్లాక్‌మెయిల్ చేసి తన తోవలోకి తెచ్చుకున్న సంతోషంతో హుషారుగా పొలంలోకి ప్రవేశించాడు త్రినాథ్.

దగ్గరుండి పైరండటికి బోదెల ద్వారా నీరు అందుతుందో లేదో చూశాడు. అక్కడక్కడ కలుపు మొక్కలుంటే పీకి పారేస్తున్నాడు.

సమయం పది గంటలయ్యిందో లేదో సుదూరంగా సీతాకోకచిలుకల గుంపు కనిపించింది. కళ్ళు చిట్లించుకుని చూశాడు. ఆ గుంపు మామిడి చెట్టుకింద ఆగి కాసేపు అటు, ఇటు పరిశీలించి తను వున్నవైపు రావటం కనిపించింది.

"ఎవరీ ఆడంగులు? ఇటువైపు పడ్డారేమిటి?" ఆశ్చర్యంగా అనుకున్నాడు.

వాళ్ళు తన దగ్గరికి వచ్చేవరకూ నోరు ఆవలించి చూస్తూనే వున్నాడు. మొత్తం పదిమంది వరకూ ఆడపిల్లలున్నారు.

అందులో ఓ ఓణీ అమ్మాయి మొహం బాగా చూసినట్లనిపించింది. కానీ ఆ అమ్మాయి ఇంకో ఇద్దరి చాటున దాక్కుంది. త్రినాథ్ తొంగి చూసేకొద్దీ ఆ అమ్మాయి ఒదిగిపోతూనే వుంది.

తొంగిచూసే ప్రయత్నం విరమించుకుని తన ఎదురుగుండా కనిపించేవారి వంక ప్రసన్నంగా చూశాడు.

"మేము టౌన్‌లో వుమెన్స్ కాలేజీలో ఎగ్రికల్చర్ బి.యస్.సి. చదువుతున్నామండీ. ప్రాజెక్ట్ కోసం ఇక్కడికి వచ్చాం. ఓ పది రోజులు ఇక్కడే వుండి ప్రాజెక్ట్ కోసం ఇక్కడికి వచ్చాం. ఓ పది రోజులు ఇక్కడే వుండి ప్రాజెక్ట్ తయారుచేసుకుని వెళతాం స్కూలులో మాకు బస ఏర్పాటు చేశారు. ఇక పొలానికి సంబంధించి ఏ ఇన్ఫర్మేషన్ కావాలన్నా మిమ్మల్నే అడగమని సర్పంచ్‌గారు చెప్పారు..." ఎత్తుగా వున్న ఓ అమ్మాయి ముందుకొచ్చి త్రినాథ్‌కి వివరించింది.

సర్పంచ్ తన పేరే చెప్పినందుకు ఉత్సాహంతో భుజాలు మరింత పొంగాయి త్రినాథ్‌కి.

"అలాగే... మీకే ప్రశ్నలు కావాలన్నా అడగండి. ఈ పదిరోజులలో అసలు మా నాలుగెకరాల పొలం మీదే ప్రాజెక్ట్ చేసుకోవచ్చు..." ఉప్పొంగిపోతూ చెప్పాడు త్రినాథ్.

"చాలా థాంక్సండీ..." కోరస్‌గా చెప్పారందరూ.

"నో మెన్షన్..." చెపుతూనే మళ్ళీ వోణీ అమ్మాయివంక చూశాడు.

"అబ్బే! లాభంలేదు... పరికిణీ మిలమిలలు, ఓణి రెప రెపలుతప్ప మరేం కనిపించడంలేదు. అసలు ఎవరు ఆ అమ్మాయి???

తన దగ్గర ఎందుకు దాక్కుంటుంది??? ఇదేదో మిస్టరీలాగుందే!! "ఏయ్! అమ్మాయి ఓసారి నాకు కనిపించి..." అని ఓసారి అంటే బాగుంటుందా? అని ఓ నిమిషం ఆలోచించాడు. అదేం అంత సబబుగా అనిపించలేదు.

వాళ్ళు పొలమంతా తిరుగుతూ ఏవో ప్రశ్నలు వేస్తున్నారు. అతను తనకు తెలిసిన సమాధానాలు ఇస్తున్నాడు. అందరూ పొలం గట్లమీద నడుస్తున్నారు. త్రినాథ్ ముందు, వాళ్ళంతా క్యూ కట్టినట్లు వెనకాల నడుస్తున్నారు. రంగురంగుల పూలతో కలిపి కట్టిన పూలదండలా వున్నారు.

అలా కొంత దూరం నడిచారో లేదో "దబ్" మన్న చప్పుడు వినిపించింది. అందరూ తుళ్ళిపడి వెనక్కి తిరిగి చూశారు.

అంతే!!!...

ఎవ్వరికీ నవ్వాగలేదు... నవ్వుతూనే వున్నారు. ఓణీ అమ్మాయి గట్టుమీద నడవలేక కాలుజారి పొలంలో పడిపోయింది.

రాత్రీనుంచీ పొలానికి నీరు వదులుతుండటం మూలగా అంతా బురదగా వుంది...

ఆ వరిపైరు మధ్య మాటా పలుకూ లేకుండా శిల్పంలా కూర్చుండిపోయింది ఆ అమ్మాయి... అక్కడక్కడా బురద చిమ్మబడి వుంది. అందరూ నవ్వుతున్నారు గానీ ఎవరూ ఆ అమ్మాయికి చెయ్యందించే సాహసం చెయ్యలేకపోతున్నారు. ఆ బురద తమ బట్టలకి కూడా అంటుకుంటుందేమోనని.

అప్పుడు ఆ అమ్మాయి మొహాన్ని తేరిపార చూశాడు త్రినాథ్. ఈ అమ్మాయే బస్‌లో తనని చూసి నవ్వింది!! ఈ అమ్మాయే తనని అనుసరిస్తోంది. అని అనుమానించి తను, ఈ అమ్మాయి అందాన్ని చూసే మొట్టమొదటిసారి కాస్త విచిలితుడైంది... ఇందాకటి నుంచీ తనకి కనిపించకుండా దాక్కుంది... తను గుర్తుపట్టకూడదని...

కానీ యిపుడు... ఈ స్థితిలో తనకి కనిపిస్తానని ఊహించి వుండదు. ఇంతందమైన అమ్మాయి ఒంటికి యిలా బురద అంటించుకుని కూర్చోవడం బాధగా అన్పించింది.

ఆ అమ్మాయిలను దాటుకుని వెళ్ళి చెయ్యందించాడు. చేసేదిలేక సిగ్గుపడుతూనే అతని చేయి అందుకుని లేచింది ఆ అమ్మాయి.

మిగతా అమ్మాయిలందరూ భయపడిపోయి దూరంగా జరిగారు. వాళ్ళవంక కోపంగా చూసింది. వాళ్ళేమీ లెక్కచెయ్యలేదు.

ఆమె నాలుగడుగులు నడిచి వాళ్ళ దగ్గరకి వచ్చేసరికి బురద తుంపరలు వాళ్ళమీద పడ్డాయి. అందరూ ఒక్కసారిగా భయపడిపోయి వేరే పొలంవైపు వెళుతూ–

"మేమక్కడ పొలాన్ని స్టడీ చేస్తుంటాం... నువ్వు వెళ్ళి బోరు దగ్గర నీటితో స్నానం చేసిరా!... త్రినాధ్‌గారు తోవచూపిస్తారులే...!" అంటూ పారిపోయారు.

బిక్కచచ్చిపోయి అతని వంక చూసింది.

"పదండి..." ముందుకు దారితీశాడు. అతన్ని అనుసరించింది.

"మీ పేరు...?"

"వాసంతి..." కోయిల మీటుతున్నట్లుగా వుంది ఆమె స్వరం.

"ఏ వూరు...?"

"మీకు దగ్గరే!..." అతనికి తన మొహం కనిపించడం లేదు కదా అన్న సంతోషంతో అంది.

వెనక్కి తిరిగి చూశాడు త్రినాధ్.

వెంటనే నవ్వాపేసి "కేసనపల్లి... మీ ఊరికి దగ్గరేగా" బుంగమూతి పెట్టి అంది.

"వూ!..." ముందుకు నడుస్తూ అన్నాడు.

కాసేపు మౌనంగా గడిచింది.

"ఎవరి అమ్మాయివి?" అడిగాడు.

"చౌదరిగారమ్మాయిని" చెప్పింది.

"ఏ చౌదరిగారూ...?" వెనక్కి తిరిగి కుతూహలంగా అడిగాడు.

"వీరయ్య చౌదరిగారు... మా నాన్నగారు" ఆ అమ్మాయి కంఠంలో తండ్రి గురించి చెప్పేపుడు ప్రతి ఆడపిల్లలో తొంగిచూసే కించిత్ గర్వం కన్పించింది.

"నువ్వు మా వీరయ్య మావ కూతురివా?" అన్నాడు.

ఆశ్చర్యపోయింది వాసంతి.

"మీకు తెలుసా?"

"ఊ..." వుత్సాహంగా అన్నాడు.

"ఎలా?"

"అయిదారేళ్ళ నుంచి యిద్దరం కలిసి వెలిగొంది ఎడ్లపందాల్లో పాల్గొంటున్నాం. వీరయ్య మావ ఎడ్లు తెస్తాడు... నేను పందెంలో తోల్తాను. ఇప్పటికి మూడుసార్లు పందెంలో మేమిద్దరమే గెల్చాం" ఉత్సాహంగా అన్నాడు.

"నాకు తెలుసు" అంది వాసంతి.

"తెలుసా!!!..."

"తెలుసంటే ఈ విషయం కాదు."

"మరి?" ప్రశ్నార్ధకంగా అడిగాడు.

"మీరు తెలుసు" మూతి ముచ్చటగా తిప్పి అంది.

"ఎలా తెలుసు?"

"చెప్పను" తల అడ్డంగా ఆడించింది. జుమ్కీలు ఊగాయి.

"ప్లీజ్!..." బతిమలాడాడు.

"ఓసారి ఎడ్లపందానికి మా నాన్నకి చెప్పకుండా వచ్చాను. అప్పుడు జనాల మధ్యనుంచి నేను నడుస్తూ వస్తుంటే మీరేదో హడావిడిగా నన్ను తోసుకుంటూ ముందుకెళ్ళారు. చాలా గట్టిగా డాష్ ఇచ్చారు. చాలా దెబ్బ తగిలింది తెలుసా?" హృదయాన్ని తడుముకుంటూ అంది.

అతని దృష్టి ఆమె హృదయం మీదికి పోయింది. సన్నని నడుం పైన బలంగా ఉబికి కనిపిస్తున్న వక్షద్వయాన్ని చూసి కలవరంగా తల తిప్పుకున్నాడు.

"అమ్మో! ఏంటీ అమ్మాయి యిలా మాట్లాడేస్తోంది?" భయంగా అనుకున్నాడు.

"నిజంగా... అపుడు నా చెయిన్‌కి వున్న లాకెట్ యిక్కడ గీరుకుపోయి మచ్చపడింది తెలుసా?" మెడ దిగువకి కొంచెం ఓణీని తప్పించబోయింది.

"ఆ! ఆ! అర్ధమయింది" గాభరాగా అనేశాడు.

పెదవుల చాటునే నవ్వుని దాచుకుంది వాసంతి.

"అప్పటినుంచీ ప్రతిరోజు స్నాం చేసేటపుడు మీరు గుర్తుకొస్తూనే వున్నారు" సిగ్గుగా అంది.

నిలువుగుడ్లు పడిపోయాయి త్రినాధ్‌కి.

"ఎక్కడ నుంచి ఎక్కడికి దారితీస్తోందీ అమ్మాయి" అనుకుంటూ మరింత వడివడిగా నడవడం మొదలు పెట్టాడు. బోరుదగ్గరకి రాగానే చిన్నపిల్లయిపోయింది వాసంతి. కుండీ నడుములోతుకే వుంది. ఒంటిన వున్న ఓణీ లాగి పారేసింది వాసంతి.

గుండె దడదడలాడింది త్రినాథ్‌కి.

"ఇంత అమాయకంగా తనంటే భయం, భయంగా ఒదిగిన అమ్మాయేనా?" అనుకున్నాడు.

కానీ లిప్తపాటులో కళ్ళముందు కదిలిన ఆమె శరీరం మనసుకి తీరని దాహాన్ని పెంచింది.

అంతలో ఐశ్వర్యారాయ్ గుర్తొచ్చింది.

ఆ వెంటనే అత్యద్భుతమైన ఆమె సౌందర్యం గుర్తొచ్చింది.

ఆమెపట్ల తనకిగల కోరిక గుర్తొచ్చింది.

అప్పటికి కొంచెం శాంతించింది మనసు...

వెనుక నీళ్ళలో తప తప శబ్దాలు విన్పిస్తున్నాయి... దూరంగా వెళ్ళబోయాడు.

"ప్లీజ్! నాకు భయం... ఇక్కడే వుండండి..." అరిచింది వాసంతి.

నొసలు ముడివేసి విసుగ్గా తిట్టుకుంటూ వీపు ఆమె వైపుకి పెట్టి గట్టుమీద కూర్చున్నాడు.

ఆమె నీళ్ళలో తలారా మునిగింది. ఒంటిని అంటుకున్న బురదంతా పోయింది. పట్టి పట్టి శరీరాన్నంతా రుద్దుకుంది. ఏనుగు తొండమంత ధార ఏకధాటిగా పడుతుండడంతో ఎప్పటికప్పుడు నీరు స్వచ్ఛంగా మారుతోంది.

కుండీ నలుమూలలా స్వేచ్ఛగా ఈదుతోంది వాసంతి. క్షణాలు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడు త్రినాథ్. ఇంతలో వెనక నుండి కెవ్వుమన్న కేక వినిపించింది. చివాలున లేచాడు.

నీళ్ళలో చేతులూ కాళ్ళూ తప తప కొట్టుకొంటూ భయంగా కేకలు పెడుతూ వుంది వాసంతి.

పరుగులాంటి నడకతో కుండీ దగ్గరకి చేరుకున్నాడు.

"ఏమైందీ..." మొహంలో ఆందోళన తాండవిస్తుండగా అన్నాడు.

"ఏంటో కుట్టినట్లుగా వుంది?" భయంగా అంది.

"ఎక్కడ?"

లోపల ఏదో కదులుతోంది. తన బ్లౌజ్‌వంక చూపిస్తూ అంది.

"జలగ" ఏమయినా పట్టిందా? అనుకుంటూ అక్కడ చేయివేయబోయినవాడల్లా సంకోచంగా ఆగిపోయాడు.

నీలంరంగు పరికిణీ, అదే రంగు బ్లౌజ్ మధ్య సన్నగా, దృఢంగా నీళ్ళతో తడిసి నున్నగా మెరుస్తున్న నడుం బ్లౌజ్ దాచలేకపోతున్న స్తనాలు పైకి ఉబికి కన్పిస్తున్నాయి.

అక్కడే ఏదో కదులుతోందంటోంది.

ఎలా?

"మీరు చూసుకోండి" వెనక్కితిరిగి మొహమాటంగా అన్నాడు.

"అమ్మో! నాకు భయం" అతని చేతిని పట్టేసుకుంటూ అంది.

"ఎందుకు భయం... చూడండి..." చెయ్యి వదిలించుకోబోయాడు.

వదలలేదామె. మరింత దగ్గరగా వచ్చి చిందులు వేస్తోంది.

ఆమె ఎగిరినప్పుడల్లా వక్షోజాలు అతని మోచేతికి రాసుకుంటూనే వున్నాయి.

అతనికి చాలా ఇబ్బందిగా వుంది. ఆమె చేస్తున్న గల్లంతుకి అయోమయంగా వుంది.

మనసులోనే ఆంజనేయస్వామికి దండాలు సమర్పించుకుని వెనక్కి తిరిగాడు.

ఆమె బ్లౌజ్ హుక్స్ తప్పించాడు.

అతని చేతి మునివేళ్ళ స్పర్శ సోకగానే అన్ని చిందులూ ఏమయిపోయాయో మౌనంగా నిల్చుండిపోయింది.

కళ్ళు అరమోడ్పులయ్యాయి.

పెదాలు తమకంతో జ్వలిస్తున్నాయి.

అతని దృఢమైన శరీరానికి హత్తుకుపోవాలన్న కాంక్ష తీవ్రమైపోతోంది.

మెడకింది నునునుపుదనం, తెల్లదనం, కళ్ళకి షాక్‌ని కలుగజేస్తున్నాయి... వయసులో వున్న స్త్రీని యిలా చూడటం యిదే మొదటిసారి త్రినాథ్‌కి.

ఏదో తెలియని తమకం అణువణువునా ప్రవహిస్తోంది.

ఆమె మొహంలో మారిపోయిన భావాలను, కొత్తగా వచ్చిపడిన ఉద్వేగాన్ని విచిత్రంగా చూశాడు.

బ్లౌజ్‌లో ఇమడలేక ఒరుసుకుపోయి కన్పిస్తున్న స్తనాల మధ్య నిర్జీవంగా మారిన చిన్న చేపపిల్లని తీశాడు.

అతని అరచేతిలో వున్న దాని వంక సిగ్గుగా చూసింది వాసంతి.

దాన్ని విసిరేసి చప్పున వెనక్కి తిరిగి...

"మనుషులు తట్టుకోవడమే కష్టం. ఈ చేపపిల్ల ఓ లెక్కా" గొణుక్కుంటూ నడిచాడు.

అతని మాటలకి, అతని ముఖంలోని ఫీలింగ్స్‌కి నవ్వు, సిగ్గూ రెండూ కలిగాయి వాసంతికి.

తిరిగి వచ్చి గట్టుమీద కూర్చున్నాక ఏదో అపరాధం చేసిన భావన కలిగింది త్రినాథ్‌కి.

"త్వరగా రండి" అరిచి చెప్పాడు.

ఆ తడిబట్టలే చుట్టుకుని వచ్చిందామె. ఈలోపు ఆమె స్నేహితులు కూడా రావడంతో అంతా కలిసి పూరివైపు బయలుదేరారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

రాత్రి పది గంటలు...

ఐశ్వర్య కాటేజీ బయటున్న గార్డెన్‌లో కూర్చుని వుంది. షూటింగ్ నుంచి వచ్చిన తరువాత అరగంటనుంచీ ఆమె అక్కడే కూర్చుని వుంది. మనసంతా వేవరింగ్‌గా వుంది.

సల్మాన్ ఒక్కడే షూటింగ్ స్పాట్‌లో వుండిపోవడం ఆమెకి కలవరాన్ని కలిగిస్తోంది. మామూలు పరిస్థితుల్లో ఐతే ఏమోకానీ, ఉదయం నుంచి అతను అనుభవిస్తున్న బాధను చూశాక ఎంత వదిలించుకున్నా మనసు అతని ఆలోచనల్లోకే వెళుతోంది. తన రిఫ్రెష్ అయ్యివచ్చిన అరగంటకి కూడా అతను కాటేజీకి రాలేదు. ఇంచుమించు మూడుగంటలనుంచి తను ఇక్కడే వుంది. ఆ కాటేజీలోకి అతను వెళ్ళలేదు. అది నిశ్చయంగా తనకి తెలుసు. పక్క కాటేజీ వాచ్‌మేన్‌ని అడిగి కన్ఫాం చేసుకోవాలంటే ఏదో మొహమాటంగా అన్పిస్తోంది.

అందుకే ఇంతసేపు వెయిట్ చేసింది. కానీ పది గంటలైనా అతను రాకపోవడం చూసి ఆమెలో కించిత్ ఆందోళన పొడ చూపింది.

మామూలుగా అయితే అతనెవరో, తనెవరో, ఇప్పుడు పరిస్థితి వేరు. అతను తనకి ప్రపోజ్ చేసున్నాడు. తను తిరస్కరించిందన్న బాధలో వున్నాడు. అందుకే ఈ అదుర్దా...

పక్క కాటేజీవంక చూసింది. వాచ్‌మన్ తోటలో తిరుగుతున్నాడు. చిన్నగా చప్పట్లు చర్చింది ఐశ్వర్య. వాచ్‌మేన్ ఇటువైపు చూశాడు. దగ్గరగా రమ్మని సైగ చేసింది ఐశ్వర్య.

పరుగు పరుగున వచ్చాడతను.

"సాప్ ఆయా హైక్యా...?" అడిగింది ఐశ్వర్య.

"నహి ఆయె మేన్‌సాప్..." చెప్పాడతను.

ప్రొడ్యూసర్ కారు సల్మాన్ కాటేజ్ దగ్గరేఉంది. డ్రైవర్‌ని కారు బయటకు తీయమని చెప్పి, తను డ్రెస్ చేంజ్ చేసుకోవడానికి లోపలికి వెళ్ళింది.

క్యాజువల్ డ్రెస్ వేసుకుని ఆమె బయటకి వస్తుంటే సెక్రెటరీ ప్రశ్నార్థకంగా చూశాడు.

అతను ఆమెకి దూరపు బంధువు. ఈ జరుగుతుందంతా అతనికి చూచాయగా అర్థమవుతూ వుండవచ్చు అతను ఎప్పటికప్పుడు ఈ వార్తలన్నీ తన తల్లిదండ్రులకి చెపుతూ వుంటాడనటంలో ఎలాంటి సందేహం లేదు.

అందుకే తను ఇందాక లాన్‌లో కూర్చున్నప్పుడు మమ్మీ ఫోన్ చేసింది. ఎప్పుడూలేనిది తన సేఫ్టీ గురించి భయపడి ఇక్కడికి వస్తానని గొడవ చేసింది. ఆవిడకి నచ్చచెప్పటానికి చాలా సమయం పట్టింది.

ఇప్పుడు తనిలా బయటికి వెళ్ళడం కూడా అందరి అనుమానాలకి ఆస్కారం కలిగిస్తుందని తెలుసు. కానీ, సల్మాన్ ఎక్కడ తిరుగుతున్నాడోనని మనసంతా ఒకటే ఆరాటంగా వుంది. అతనలా వదిలేసి తనిలా ప్రశాంతంగా వుండటానికి మనస్కరించడంలేదు.

ఏదైతే అదే జరగనీ అనుకుని "ఇప్పుడే వస్తాను..." అని సెక్రెటరీకిచెప్పి అతని సమాధానంకోసం ఎదురుచూడకుండా బయటకు నడిచింది. డ్రైవర్ కారుతెచ్చి ఆమె కాటేజీ ముందాపాడు.

ఆమె డ్రైవింగ్ సీటుదగ్గరకి వచ్చి నిలబడింది. డ్రైవర్ అయోమయంగా చూసి కారు దిగాడు.

కారు స్టార్ట్ చేసింది ఐశ్వర్య డ్రైవర్ వెనక డోర్‌తీసి కూర్చోబోతుంటే...

"నువ్వు అక్కరలేదు... నేను వెళతాను" చెప్పి అతనేదో అనే లోపు కారు ముందుకు దూకించింది.

ఆ కాటేజీలో, ఈ కాటేజీలో చూడాల్సిన వాళ్ళందరూ చూశారు. కారు కనుమరుగవగానే అందరూ లోపలికి వెళ్ళిపోయారు.

ప్రశాంతంగా వున్న రోడ్డుమీద నెమ్మదిగా వెళుతోంది ఐశ్వర్య కారు. చుట్టూ జనవాసాలేమీలేవు.

రెండు కిలోమీటర్ల దూరంలో ఓ ఇరవై ముప్పై ఇల్లు, చిన్న సెంటర్ తగిలాయి. అక్కడికి వెళ్ళి సల్మాన్ గురించి వాకబు చేసింది.

ఆ యస్.టి.డి బూత్ అతను ఐశ్వర్యని గుర్తుపట్టి సంతోషంతో మొహం విప్పారగ ఆమె అడిగిన వాటికి సమాధానాలిచ్చాడు.

దాని ప్రకారం సల్మాన్ అక్కడికి రాలేదు. తనకు తెలిసిన ఆ చుట్టుపక్కన ప్రదేశాలన్నీ తిరిగింది. ఎక్కడా అతను కనిపించలేదు.

నిరుత్సాహం ఆవరించింది ఆమెని. ఏదో గుర్తొచ్చినట్లయి సల్మాన్ సెల్‌కి రింగ్‌చేస్తే, స్విచ్ ఆఫ్ చేయబడి వుంది.

తన కాటేజికి ఫోన్‌చేసి, అతను వచ్చాడో లేదో కనుక్కుంది.

అతనింకా చేరుకోలేదు. వాళ్ళు కంగారుపడుతూ డైరెక్టర్‌కో, ప్రొడ్యూసర్‌కో ఫోన్ చేయడానికి ఉద్యుక్తులవుతుంటే ఓ గంట ఆగి చేయమని, కంగారుపడవద్దని చెప్పింది.

అదీకాక కనిపించటంలేదని కంగారు పడటానికి అతనేమీ చిన్నపిల్లాడుకాదు. కారు బ్యాక్ చేసుకుని బయలుదేరి పోదామనుకుంటుండగా వచ్చింది ఆలోచన ఆమెకి.

ఆ ఆలోచనకి గుండె ఒక్కక్షణం ఆగి కొట్టుకుంది. గబగబా కారు స్టార్ట్‌చేసి ఆ రోజు షూటింగ్ జరిగిన స్పాట్‌కి బయలుదేరింది.

వెళుతున్నంతసేపు ఒకటే టెన్షన్... అతనింకా అక్కడ వుండి వుంటాడా... ఉంటే దేనికోసం ఉన్నట్లు.... పదినిముషాలలో గార్డెన్‌కి చేరుకుంది కారు.

ఆ తోటంతా మెర్క్యురి లైట్ల కాంతితో పట్టపగల్లా మెరిసిపోతోంది. తోటంతా వెతుకుతూ బయలుదేరింది–అది మధ్యాహ్నం షూటింగ్ జరిగిన ప్రదేశం.

అతను కూర్చున్న బెంచీ, అతని మేకప్ కోసం వేసిన దేరాఅంతా వెతికింది ఎక్కడా కనిపించలేదు.

ఇక్కడ కూడా లేడా అనుకోగానే దిగులు ఆవహించింది. చుట్టూ కలయచూసింది. అంతా నిశ్శబ్దం ఆ వంటరి ప్రదేశంలో... ఆ నీరవమేలే ఏకాంతంలో... ఆ వెతుకులాట... ఇంతవరకు అనుభవించిన టెన్షన్ ఆమెని కుంగదీస్తోంది.

అతను మధ్యాహ్నం కూర్చున్న బెంచ్‌మీద కూలబడింది. అతను తన పక్కనే కూర్చుని డైలాగ్ చెపుతున్నట్లుగా వుంది. హృదయం ద్రవించి కళ్ళు కరగబోయాయి. కానీ ఆమె స్వతహాగ ధైర్యవంతురాలు. ఒక దీర్ఘ విశ్వాసంతో టెన్షన్‌ని వదిలించుకునే ప్రయత్నంచేస్తూ కారు వైపు నడిచింది.

కారు ఎక్కబోతూ ఆఖరిసారి అన్నట్లు తోటంతా కలయచూసింది. ఆమెకు కుడివైపు కొంచెం క్రీనీడతో వున్న ప్రదేశంలో అస్పష్టంగా ఏదో  ఆకారం పచ్చికలో పడుకుని కనిపించింది.

గుండె ఒక్కక్షణం ఆగి కొట్టుకుంది.

ఎవరది? ఎవరై వుంటారు? సల్మానేనా?

ఆ ఆలోచనే వచ్చిందే తడవుగా పరుగులాంటి నడకతో అటువైపు వెళ్ళింది. దగ్గరయ్యేకొద్దీ తెలిసింది... అతను సల్మానేనని.

పట్టలేని ఉద్రేకంతో, మొహంలో కోపం తాండవిస్తుండగా అతని కెదురుగా వెళ్ళి నిలబడింది.

అస్థిమితంగా తల రుద్దుకుంటూ నొసలు బాధతో ముడిపడగా, మొహంతా కందిపోయి దీర్ఘకాలంగా ఏదో జబ్బుపడిన వాడిలా నిస్సత్తుగా వున్న అతనిని చూసి చాలా కోపం వచ్చింది ఐశ్వర్యకి. సడెన్‌గా ఏదో వింత పరిమళం తనని చుట్టుముట్టినట్లయింది సల్మాన్‌కి. కళ్ళు తెరవాలనిపించలేదు.

ఆ పరిమళాన్ని ఆస్వాదీస్తూ తన ఉద్రికతను అణుచుకొనే ప్రయత్నం చేశాడు. కాసేపటికి గుర్తువచ్చింది – ఆ ఇంటిమేట్ పరిమళం ఎవరిదో చటుక్కున కళ్ళువిప్పి చూశాడు.

ఎదురుగా ఐశ్వర్య.... మొహంలో ప్రస్ఫుటంగా కోపం తాండవిస్తుండగా నిలబడి వుంది. అతనికి ఒక్కక్షణం ఏమీ అర్ధంకాలేదు. ఇది నిజమా! కలా! అనుకున్నాడు. లేదా తన గురించే ఆలోచించి ఇలాంటి భ్రమ కలుగుతుందా? కళ్ళు విప్పార్చి మరీ చూశాడు.

నిజంగా ఐశ్వర్యే... ఇక్కడికెందు కొచ్చింది? తనకోసమేనా... చివాలున లేచి నిలబడ్డాడు. ఒళ్ళు కొంచెం తూలింది. అతని భుజం ఆమె భుజానికి ఢీకొంది తత్తరపాటులో.

“ఐయాం సారీ...” చెప్పాడు.

అప్పటికి నిర్ధారణ అయ్యిందతనికి ఐశ్వర్య నిజంగా వచ్చిందని.

“పదండి...” ఆ ఒక్కమాటే అని విసవిసా ముందుకి నడిచింది ఐశ్వర్య.

సల్మాన్‌కి ఎంతో పజిల్‌గా వుంది... ఈ టైంలో ఐశ్వర్య తన దగ్గరకి వచ్చి, తనని తీసుకెళ్ళడం తను ఊహించలేని విషయం... అంటే తనమీద ప్రేమ ఉన్నట్లేగా సంతోషంగా అనుకున్నాడు సల్మాన్.

ఆమె వెనకాలే నడిచాడు. ఆమె డ్రైవింగ్‌సీట్‌లో కూర్చోబోవడం చూసి “నేను డ్రైవ్ చేస్తాను...” అన్నాడు సల్మాన్.

“నో...” విసురుగా రిజెక్ట్ చేసిందామె.

ఆమె విసుగును భరించడానికి కూడా ఇష్టంగా వుంది. భుజాలు ష్రగ్‌చేసి, చుట్టూ తిరిగివచ్చి ఆమె పక్కసీటులో కూర్చున్నాడు. కారు రివ్వున దూసుకుపోతోంది.

చాలా గంభీరంగా వుంది ఐశ్వర్య. పలకరించడానికి ధైర్యం చాలటంలేదు. కానీ తన కోసం ఇంత రాత్రిపూట వచ్చిన తన కన్సర్న్‌కి థ్యాంక్స్ అయినా చెప్పాలికదా.

"నేను ఇక్కడ వున్నానని మీకెలా తెలుసు?" అడిగాడు సల్మాన్.

మాట్లాడలేదు ఐశ్వర్య.

"ప్లీజ్..." అభ్యర్ధనగా అన్నాడు సల్మాన్.

ఓసారి కళ్ళెత్తి అతనివైపు చూసింది.

జాతిపచ్చల్లా మెరిసిపోతున్న ఆమె కళ్ళ కాంతికి ముగ్ధుడై చూశాడు అతను తనకి తానే సమాధానం చెప్పుకున్నట్లుగా...

"ఈ రోజు చాలా విసుగ్గా వుంది. ఎక్కడికీ రావాలనిపించలేదు. ఎవరితో మాట్లాడాలనిపించలేదు. అందుకే పార్కులో పడుకునిపోయాను" అన్నాడు.

ఆమె ముఖ భావాలేవి మారలేదు. ఆమె విందో లేదో అతనికి తెలియలేదు.

"ఐశ్వర్య! మాట్లాడు..." అంటూ స్టీరింగ్‌చుట్టూ సన్నజాజుల దండ చుట్టినట్లున్న ఆమె చేతిని స్పృశించబోయాడు.

చప్పున చేతిని వెనక్కిలాక్కుంది.

జీవంలేని నవ్వు నవ్వుతూ "మీరు నాకు ఎప్పటికీ అర్ధంకారు... ఇంతలోనే దగ్గరనిపిస్తారు... అంతలోనే దూరం వెళ్ళిపోతారు. ఎలా అర్ధం చేసుకోను..." మృదువుగా అడిగాడు సల్మాన్.

"ఓ సాటిమనిషిగా స్పందించాను. సాయంత్రంవరకు కలిసిమెలిసి గడిపిన వ్యక్తి కనపడకపోతే ఆ వ్యక్తి ఏమయ్యాడోనని ఆందోళన ఎవరికయినా సహజం. అందుకే నేను వెతుక్కుంటూ వచ్చాను..." బింకంగా అంది ఐశ్వర్య.

ముసిముసిగా నవ్వాడు సల్మాన్.

"ఓ! నా కాటేజీలో ఉన్నవారికి, డైరెక్టర్‌కి, ప్రొడ్యూసర్‌కి వాళ్ళెవరికీలేని ఆందోళన నీకే ఎందుకు కలిగింది?" నవ్వుతూ అడిగాడు.

ఓ క్షణం ఆలోచించిందామె.

"నిజమే! నేనొక్కదానినే ఈరోజు ఆరాట పడ్డాను. మీరు పైన చెప్పిన వాళ్ళందరికీ మీరు బార్స్‌కి, క్లబ్‌కి వెళ్ళటం, లేట్‌నైట్ పార్టీల్లో పార్టిసిపేట్ చేయడం, సమయం సందర్భంలేకుండా ఏ టైంలోపడితే ఆ టైంలో ఇంటికి రావటం మీ లక్షణమైంది.

అని వాళ్ళకి తెలిసి వుండవచ్చు. నాకు తెలీదుకదా... అందుకే ఆందోళన పడ్డాను. మరోసారి ఇలా జరగదు..." హామీ ఇస్తున్నట్లు అంది ఆమె.

చెల్లున కొట్టినట్లయింది అతనికి.

❋ ❋ ❋ ❋ ❋ ❋

హైస్కూలు ఆవరణ...

స్కూల్‌కి శలవులు ప్రకటించడంతో స్కూలు ఆవరణ అంతా నిర్మానుష్యంగా వుంది. అప్పుడే బిలబిలలాడుతూ లోనికి ప్రవేశించారు అమ్మాయిలు. వాళ్ళే వాసంతి వాళ్ళ బేచ్... వాళ్ళకి అక్కడ మకాం ఏర్పాటు చేశాడు సర్పంచ్.

"బిల్డింగ్ చాలా ఓల్డ్‌గా వుందే..." మూతి విరుస్తూ అంది ఓ అమ్మాయి.

"చాల్లే! ఫ్రీగా వచ్చేదానికి ఇంతకన్నా ప్యాలెస్ ఎక్కడ దొరుకుతుంది" సర్దిచెప్తూ అంది ఇంకో అమ్మాయి.

అప్పటికే సర్పంచ్ మనుషులచేత వాళ్ళుండటానికి రెండు తరగతి గదుల్లో బెంచీలను ఖాళీచేయించి జంఖానాలు పరిపించాడు.

ఊళ్ళో వున్న హోటల్ నుంచి వాళ్ళకి మూడుపూట్లా భోజన సదుపాయాలు సమకూర్చమనీ చెప్పాడు.

మధ్యాహ్నం 1 గం॥కు సర్పంచ్ దగ్గరకు వెళ్ళాడు త్రినాధ్. వాసంతి వాళ్ళ విషయం సర్పంచ్ నోటిమీదుగా తెలుసుకోవాలని వెళ్ళాడు.

దూరం నుంచి అతనిని చూచి–

"రావోయ్... రా! నేనే నీకు కబురు చేద్దామనుకుంటున్నాను" చెప్పాడు సర్పంచ్.

"ఏమీటండీ విషయం??" తెలియనట్లే అడిగాడు త్రినాధ్.

"టౌను నుంచి కాలేజీ అమ్మాయిలు వచ్చార్రా! పొలాలకు సంబంధించి ఏవో పరిశోధనలు చేస్తారట. ఈ వ్యవసాయం చేసేవాళ్ళల్లో నువ్వే కాస్త చదువుకున్నవాడివి. అందుకే నిన్ను కలవమని చెప్పా. వెంటనే బయలుదేరు. అమ్మాయిలు నిన్ను కలిశారా?" కుతూహలంగా అడిగాడు సర్పంచ్.

నీళ్ళ కుండీలో వాసంతి చేసిన అల్లరి గుర్తుకొచ్చింది త్రినాధ్‌కి.

"ఆ! కలిసారు" గాభరాగా అన్నాడు త్రినాధ్.

"సరే! సరే! వాళ్ళు అడిగిన వాటికన్నిటికి సాయం చేయి. మన గురించి, మన ఊరి గురించి పత్రికల్లో వేస్తారట" ఆనందంగా అన్నాడు సర్పంచ్.

మౌనంగా తలాడించి బయలుదేరాడు త్రినాథ్.

"ఒరేయ్ త్రినాథ్. ఒక్కవిషయం ఆగరా" పిలిచాడు సర్పంచ్.

ఏంటన్నట్లు వెనక్కి తిరిగి చూశాడు త్రినాథ్.

"వాళ్ళలో మన వీరయ్య చౌదరి కూతురు కూడా వుంది. వాళ్ళు మనకి బాగా కావలసినవాళ్ళు కూడా. ఓసారి బడి దగ్గరికి వెళ్ళి వాళ్ళకేం కావాలో కనుక్కో" చెప్పాడు సర్పంచ్.

తలఊపి సరాసరి బడి దగ్గరికి వెళ్ళాడు. అప్పటికే అక్కడ సుబ్బు బ్యాచ్ అమ్మాయిల సేవలో నిమగ్నమై వున్నారు. వాళ్ళకి భోజనం ప్యాకెట్లు అందించి, స్కూలు బయట ఎండరాకుండా వుండటం కోసం షామియానాలు పరుస్తున్నారు.

ఆ ఏర్పాట్లు చూసి ఆశ్చర్యపడ్డాడు త్రినాథ్. అడుగులో అడుగు వేసుకుంటూ అక్కడికి వెళ్ళాడు.

త్రినాథ్‌ని చూడగానే సుబ్బు ముఖం వెలవెలపోయింది.

"ఏంటి సుబ్బూ ఇక్కడ?" కళ్ళెగరేస్తూ అడిగాడు త్రినాథ్.

"ఏం లేదు సర్పంచ్‌గారు కబురుపెడితేనూ..." నసుగుతూ అన్నాడు సుబ్బు.

"ఏమని కబురు పెట్టారు?" ఆసక్తిగా అడిగాడు త్రినాథ్. సబ్బు స్నేహితులు అతని వంక కొరకొరా చూస్తున్నారు. అమ్మాయిలు ఆసక్తిగా చూస్తున్నారు. త్రినాథ్ తనను క్రాస్ ఎగ్జామిన్ చేస్తుంటే తల కొట్టేసినంత అవమానంగా వుంది సుబ్బుకు.

"నీ కెందుకురా?..." ఆవేశంగా అనబోయాడు సుబ్బు. కానీ మాట పీలగా వచ్చింది.

"చెల్లెమ్మకు చెప్పే వచ్చావా?" ఆర్ధోక్తిగా అడిగాడు త్రినాథ్.

"ఎవరి చెల్లెలు?..." ఒక అమ్మాయి ఆసక్తిగా అడిగింది.

అప్పటి వరకు వాళ్ళ దగ్గర పెళ్ళికానట్లుగా బిల్డప్ ఇస్తున్న సుబ్బుకు గాలి తీసేసినట్లయింది.

"ఇంకెవరికి చెల్లెలు మా చెల్లెలే... సుబ్బు వాళ్ళావిడ" నిజాన్ని కుండబద్దలుకొట్టినట్లు చెప్పాడు త్రినాథ్.

"వాట్ సుబ్బూ... నీకు మ్యారేజ్ అయిందా?" ఇంకో అమ్మాయి ప్రపంచవింతను విన్నట్లుగా అంది. మొఖం కందిపోయింది సుబ్బుకి.

"తన బలహీనతనడ్డు పెట్టుకుని ప్రతి విషయానికీ అడ్డుపడుతూనే వున్నాడు. ఇలా అయితే లాభం లేదు. ఏదో చెయ్యాలి" సాలోచనగా కింది పెదవిని బిగిస్తూ అనుకున్నాడు సుబ్బు.

"టైమ్ ఒంటిగంట దాటింది. చెల్లెమ్మ నీ కోసం భోజనం చేయకుండా కూర్చుంటుంది. ఇంక నువ్వు దయచెయ్యి. ఇక్కద నేనుంటానులే" వెటకారంగా అన్నాడు త్రినాథ్.

ఒకరిద్దరమ్మాయిలు కిసుక్కున నవ్వారు.

అప్పుడక్కడ ఏమనటానికి ఛాన్స్‌లేదు తనకు. పెళ్ళి కాలేదని చెప్పలేదు. మొట్టమొదటిసారిగా ఇంత తొందరగా పెళ్ళి చేసుకున్నందుకు తనను తాను తిట్టుకున్నాడు.

"పదండిరా" స్నేహితులను వెంటేసుకుని త్రినాథ్ వంక క్రోధంగా చూస్తూ వెళ్ళాడు సుబ్బు.

చిన్నగా నవ్వుకుంటూ అమ్మాయిల దగ్గరకు వెళ్ళాడు త్రినాథ్.

"అన్ని సదుపాయాలూ కుదిరాయా? ఇంకా ఏమేం కావాలో చెప్పండి...?" హుషారుగా అడిగాడు త్రినాథ్. అతన్నేడిపించటానికి కంకణం కట్టుకుందో అమ్మాయి, సీరియస్‌గా ముందుకొచ్చి–

"నెయిల్ పాలిష్ కావాలి" అని అడిగింది.

"ఏంటీ?..." తను విన్నది కన్‌ఫామ్ చేసుకోవడానికిన్నట్లు మళ్ళీ అడిగాడు.

"లిప్‌స్టిక్ కావాలి" మళ్ళీ అడిగిందా అమ్మాయి.

ఇందాకడిగిన శబ్దం ఇప్పుడు అడిగిన శబ్దం వేరుగా తోచాయి. కిటికీలోంచి ఓ మధురమైన స్వరం కిలకిలా నవ్వింది. చప్పున కళ్ళెత్తి చూశాడు త్రినాథ్. ఓ రెండు విశాలమైన కాటుక కళ్ళు బెదిరిపోతూ చూశాయి. వీళ్ళు తనను ఆటపట్టిస్తున్నారని అతనికి అర్థమయింది.

"పల్లెటూరి దెబ్బ ఏంటో చూపించాలి." నిశ్చయంగా అనుకున్నాడు త్రినాథ్.

అక్కడే వున్న చెయిర్‌లో కూర్చుని–

"ఏవడిగితే అవి ఇచ్చేస్తాం... కాకపోతే ఓ కండిషన్... అందరూ లైన్లో వచ్చి అడగండి."

ఓరగా కిటికీ వంక చూస్తున్నాడు.

అమ్మాయి లందరికీ యిదేదో ఆటలాగా సరదాగా అనిపించింది.

వరసలో వచ్చి నిలబడ్డారు. వాసంతి ఆఖరులో వచ్చి నిలబడింది.

"మీకు కావలసినవన్నీ ఈ చీటీలలో రాసి మడతపెట్టి నాకివ్వండి" చెప్పాడు త్రినాథ్.

ఆ మాట వినగానే క్యూలో నిలబడ్డ అమ్మాయిల్లో చిలిపినవ్వు చిందులేసింది వరుసగా వెనక్కి తిరిగి ఏవో గుసగుసలాడుకున్నారు. అయిదు నిముషాల్లో చీటీలన్నీ త్రినాథ్ చేతిలోకి వచ్చాయి.

మొదటి చీటి విప్పాడు.

"నాకో ముద్దిస్తావా?" అని రాసుంది, ఒక్కసారి ఉలిక్కిపడి, చీటీని ముక్కలు చేసి పడేశాడు.

రెండోచీటీ ఓపెన్ చేశాడు.

"నువ్వేరా మగాడంటే... నన్ను పెళ్ళి చేసుకుంటావా? అని వుంది.

బిక్కమొహం వేసి వాళ్ళవంక చూశాడు. వాళ్ళలో వాళ్ళే నవ్వుకుంటున్నారు. అతనికి అర్థమైపోయింది. "మిగతా చీటీలు ఎలా వుండివుంటాయో అతనిలో రోషం హెచ్చింది.

లేచి నిలబడి ఒళ్ళు విరుచుకుంటూ వాసంతి వైపు అడుగులేస్తూ-

"నాకేం అభ్యంతరం లేదు. మీరు తట్టుకోగలరా?" కన్ను గీటుతూ అడిగాడు.

కెవ్వుమని కేకవేస్తూ లోపలకి పారిపోయింది వాసంతి.

మిగతా అమ్మాయిలు బింకంగా నిల్చున్నారు. వాళ్ళవైపు చూసి ఒకడుగు వేయగానే వాళ్ళలోనూ ఎక్కడాలేని కంగారు పుట్టుకొచ్చింది. గోలగోలగా అరుస్తూ లోపలికి పారిపోయారు.

అప్పటికి ఊపిరి పీల్చుకున్నాడు త్రినాథ్.

"అమ్మో! ఈ కాలంలో అమ్మాయిలతో చాలా కష్టమే. యిప్పటికి కాస్త ఒడ్డునపడ్డాను" అనుకుంటూ ఇంటివైపు అడుగువేశాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

అర్ధరాత్రి సమయంలో ఐశ్వర్య, సల్మాన్‌లు కారు దిగటం ఇరు కాటేజ్‌ల వాళ్ళూ చూశారు. ఈ విషయం బయటికి పొక్కితే న్యూస్ ఎలా పబ్లిష్ అవుతుందో తెలిసి ఐశ్వర్య సెక్రటరీ కంగారు పడుతున్నాడు.

ఐశ్వర్య మనసంతా తెలియని ఆందోళనతో నిండిపోయింది. భారతదేశంలో ఎంతోమందిని ఊర్రూతలూగించిన హీరో తన కోసం యిలా తపించిపోవటం ఆశ్చర్యంగా వుంది.

యిది ప్రేమేనని, దీనికి లొంగిపొమ్మని మనసు చెపుతోంది. కానీ పెరిగిన వాతావరణం విచక్షణని కోరుతోంది.

ఆ రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు ఐశ్వర్యకి. తెల్లారి లేచి గార్డెన్‌లోకి వచ్చి ఆత్రుతగా పక్క కాటేజ్ వంక చూసింది.

ఆమెకి మతిపోయినట్లయింది. రాత్రి తను అతన్ని దింపగానే గార్డెన్‌లో వున్న చెయిర్‌లో కూర్చున్నాడు. కాసేపు కూర్చుని. వెళ్ళిపోతాడనుకుంది. తను లోపలికి వచ్చేసింది.

యిప్పటికీ అతను అలాగే కూర్చున్నాడు. రాత్రి బట్టలు మార్చుకోలేదుకూడా. చాలా కోపం వచ్చింది ఐశ్వర్యకీ. యితను తనని ఇలా సాధించి పొందాలనుకుంటున్నాడా?... చరచరా నైట్‌డ్రెస్‌తోనే అతని కాటేజ్ గార్డెన్‌లోకి నడిచివచ్చింది.

ఐశ్వర్యని చూడగానే సల్మాన్ మొహం వికసించింది. ఓ అద్భుతాన్ని చూసినట్లు ఆమెని చూసాడు. ఆ కళ్ళు ప్రేమామృతాన్ని వర్షిస్తున్నాయి. ఆ హృదయం తపించడం అణువణువులోనూ తెలుస్తోంది.

తనని చూడగానే అతనిలో కలిగిన రియాక్షన్ గమనించగానే అంత కోపం దుఃఖంగా మారింది.

"ఎందుకు... ఎందుకిలా...?" ఆవేశంగా అడగాలనుకుంది గానీ దుఃఖపు జీర అడ్డుపడింది.

"నీ కోసమే ఐష్... నీ జ్ఞాపకాలు నన్ను స్థిరంగా వుండనివ్వడం లేదు" జాలిగా చెప్పాడు.

"నన్ను ప్రశాంతంగా వుండనివ్వరా?" కోపంగా అడిగింది.

బాణందెబ్బ తగిలిన పావురాయిలా అతని కళ్ళు కువకువలాడాయి.

"సారీ..." అస్పష్టంగా పలుకుతూ వడివడిగా లోపలికి వెళ్ళిపోయాడు.

తొమ్మిది గంటలకల్లా అతను మేకప్ వేసేసుకుని ప్రొడ్యూసర్ కారులో షూటింగ్ స్పాట్‌కి వెళ్ళిపోయాడు.

ఐశ్వర్య వెళ్ళేసరికి అతను సెట్లో రెడీగా వున్నాడు.

అతని మొహం వాడిపోయి, కందిపోయి వుంది. కళ్ళు అస్థిమితంగా కదులుతున్నాయి. విషాదంగా వున్నాడు.

ఆమె బుగ్గల నునుపు, కళ్ళ మెరుపే ఆలంబనగా నటిస్తున్నాడు సల్మాన్.

సాయంత్రం వరకూ సమయం ఎలా గడిచిందో తెలీలేదు.

సాయంత్రం పేకప్ చెప్పగానే నిన్నటిలాగే సల్మాన్ రానన్నాడు. అదికాదు విచిత్రం, ఐశ్వర్య కూడా రానని చెప్పడం...

అందరూ ఆశ్చర్యంగా చూసి చెవులు కొరుక్కుని ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

నిన్న సల్మాన్ ఎక్కడ పడుకున్నాడో, ఎలా పడుకున్నాడో ఐశ్వర్య కూడా అలాగే పడుకుంది.

మెల్లగా నడుచుకుంటూ అక్కడికి వెళ్ళాడు సల్మాన్.

"ఏ దేవతా సౌందర్యమో నేలరాలి ఇలా అష్టకష్టాలు పడుతున్నట్లుగా వుంది..." చెప్పాడు సల్మాన్.

చిన్నగా నిట్టూర్చాడు ఐశ్వర్య.

"నాకో ఫ్రెంచి సామెత గుర్తొస్తోంది" అంది.

"ఏంటది?" ఆసక్తిగా అడిగాడు.

"అందమైన యువతి జీవితం ఆకర్షణలో నడుస్తుంది. సామాన్యమైన యువతే నిజమయిన ప్రేమని అనుభవిస్తుంది..." చెప్పింది.

వినగానే మొహం ఎర్రబడింది సల్మాన్‌కి. ఆ కళ్ళు బాధని వెళ్ళగక్కాయి.

అదిగో ఈ కళ్ళే...

సెలయేటి అడుగున వున్న అందమైన గులకరాళ్ళలా తన హృదయాన్ని కదిలించివేస్తాయి.

ఈ కళ్ళే... తన సంప్రదాయపు పునాదుల్ని కూకటివేళ్ళతో పెకలించి వేస్తున్నాయి.

"నాది ఆకర్షణ కాదు ఐష్..." ఆమె పక్కన కూర్చుంటూ అన్నాడు.

మొహమాటంగా లేచి కూర్చుంది ఐశ్వర్య.

పచ్చికమీద అందంగా పరిచిన విరజాజిమొగ్గలా వున్న ఆ చేతి వేళ్ళను స్పృశిస్తూ "నిజం..." అన్నాడు.

చెయ్యి వెనక్కి తీసుకుంటూ "నేను ఆలోచించుకోవాలి. మమ్మీ, డాడీ, అన్నయ్య..." అస్పష్టంగా ఏదో అనబోయింది.

చిన్నగా నవ్వాడు సల్మాన్.

"ఎందుకు...?" చిరుకోపంగా అంది.

"వాళ్ళు ఒప్పుకుంటే ప్రేమ, లేకపోతే లేదు. అన్నట్లుగా ఉన్నాయి మీ మాటలు. ఈ గ్లామర్ ప్రపంచంలో మీలాంటివాళ్ళు చాలా అరుదు. వజ్రాలెన్నయినా వుండవచ్చు. కానీ కోహినూర్ విలువ కాదనలేనిది. అలాగే మీరూను..." మనస్ఫూర్తిగా చెప్పాడు.

పెదాలపై చిరునవ్వు చిందులేస్తుండగా వింటూ కూర్చుంది. పుష్టిగా వున్న ఆ ఎర్రని పెదాలు ఎలాంటివారినైనా ప్రపోజ్ చేస్తాయి. అందులోనూ ఆమె పెదాలు మామూలు వారికన్నా భిన్నంగా వుంటాయి. రెండు పెదాలూ కలిసి గుండ్రంగా చెర్రీపండులా ఒకదానిమీద ఒకటి నిటబెట్టినట్లుగా వుంటాయి.

ఆ శిరోజాలు జలపాతంలా అలలుగా కిందికి దూకుతుంటాయి. ఆ జుట్టుని సవరించాలని, చెర్రీపళ్ళలా వూరించే ఆ పెదవులని కసిగా జుర్రుకోవాలని అన్పించని మగాడు వుండడు. ఒక్క పెదాలేనా... ఆ కంటిచూపు...

ఓరగా కళ్ళెత్తి ఓ చూపు బాణం సంధించిందంటే వెర్రెత్తిపోని మగాడుంటాడా...?

అతని చూపులు స్త్రీత్వాన్ని మేల్కొలుపుతున్నాయి.

"ఏంటలా చూస్తున్నావు?" సిగ్గుపడుతూ అడిగింది.

"ఐష్! నీ అందం గురించి వర్ణించే సాహసం ఎవరూ చేయరు. ఎందుకంటే నువ్వు వినీ వినీ విసుగెత్తిపోయి వుంటావు. నేను కూడా ఆ పని చెయ్యను" చెప్పాడు.

ఆ మాటలకి ముసిముసిగా నవ్వుకుంది.

"ఎప్పుడు చెపుతారు?" సడన్‌గా అన్నాడు.

"ఏంటీ?" అర్థంకానట్లు అడిగింది. చిరుగాలికి చెదురుతున్న శిరోజాలను సరిచేద్దామన్న కాంక్షని అణిచిపెడుతూ.

"మీ మమ్మీ, డాడీ, అన్నయ్య..." చిన్నగా నవ్వుతూ అర్థోక్తిలో ఆపాడు.

సల్మాన్‌కీ ఇది సరదాగా వుంది. ఇంతవరకూ అతను మనసుపడ్డ అమ్మాయిల్లో ఎవరూ తనని తిరస్కించలేదు. అంతేకాదు. అసలు ఎఫైర్ కూడా వాళ్ళే స్టార్ట్ చేసేవారు

ఐశ్వర్యకి నవ్వొచ్చింది.

"త్వరలో..." కవ్వింపుగా నవ్వుతూ అంది.

"అందాకా గిఫ్ట్ ఏదయినా..." మెరుస్తున్న కళ్ళతో అన్నాడు.

"ఏం గిఫ్ట్?" కళ్ళు పెద్దవిచేసి అడిగింది. సజెస్టివ్‌గా ఆమె పెదాల వంకా, హృదయం వంకా చూస్తూ అడిగాడు.

ఆమె మొహం, చెవులు ఎర్రబడ్డాయి.

"మైగాడ్... అందుకే ప్లేబాయ్ నేమ్ వచ్చింది!" మనసులోనే అనుకుంది. పైకి బింకంగా–

"మీరు అడక్కుండా నేనే ఇష్టపడి ఇచ్చేలా ప్లాన్ చేసుకోండి..." చెప్పి లేచి నిలబడింది.

అతనికి అర్థంకావటానికి ఓ నిమిషం పట్టింది. అర్థంకాగానే హుషారుగా విజిలేస్తూ–

"ఓ.కె. నిజంగా ఇది నాకు పరీక్షే!" ఇష్టంగా సవాల్ని స్వీకరించాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

బాలీవుడ్ న్యూస్ ఎడిటర్ రమేష్‌పవార్ ఈమధ్యే ఛార్జి తీసుకున్నాడు. అతను పాఠకుల నాడిని ఇట్టే పట్టేయగలడు. సినీ పత్రికల్లో ఏది రాస్తే పాఠకులకు బాగా ఎక్కుతుందో తెలిసినవాడు. అతను ఎడిటర్‌గా వచ్చాకే బాలీవుడ్ న్యూస్ పత్రిక దేశంలోని మిగతా సినీ పత్రికలకు ధీటుగా నిలబడగలిగింది.

గాసిప్స్ జోలికి పోకుండా, వాస్తవాలను వెలికితీసే పత్రికగా పేరు పొందింది. తారల వ్యక్తిగత విషయాలను గురించి, మరీ ఎక్కువగా వాళ్ళ వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీయకుండా తమమీద వచ్చిన వార్తలను చూసి తారలే నవ్వుకునేలా, సంతోషించేలా రాస్తుందీ పత్రిక.

ఐశ్వర్యారాయ్ ఐటమ్‌ను ప్రజెంట్ చేయడం వాళ్ళకి కొత్త కాకపోవచ్చు గానీ ఆమె జీవితాన్ని, ఈ పర్యటన ఓ మలుపు తిప్పబోతోందని భారతదేశం యావత్తూ నివ్వెరపడే సంఘటనలు జరగబోతున్నాయని క్షణంలో ఎవరూ ఊహించలేదు.

రమేష్‌పవార్ ఆరోజే థామస్ కుక్ కంపెనీకి వెళ్ళి ఈస్ట్‌పోర్ట్ క్రూయిజర్‌లో తమ పత్రిక తరపున ప్రయాణించబోయే పాఠకుల కోసం, తారల కోసం క్యాబిన్స్ బుక్ చేయడానికి వెళ్ళాడు.

ఎడిటరే స్వయంగా ఆసక్తితో వెళ్ళడానికి కారణం రమేష్‌పవార్, ఐశ్వర్యారాయ్ అభిమాని.

అతను తనకున్న బర్డెన్స్ నన్నిటినీ ప్రక్కనపెట్టి, రెండు నెలలు తరువాత జరిగే ఆ ట్రిప్‌లో తనూ ప్రయాణించడం కోసం ముందునుంచీ ప్లాన్ చేసుకుంటున్నాడు.

ఐశ్వర్యారాయ్‌కి, ఆమెతోపాటు వచ్చే తల్లికిగాని, సోదరుడికి గాని కలిపి రెండు లగ్జరీ క్యాబిన్స్ బుక్‌చేశాడు. ఇంకా తనకోసం, వచ్చే వి.ఐ.పి. ల కోసం మరో నాలుగు లగ్జరీ సూట్స్ బుక్ చేశాడు.

ఐశ్వర్య అసిస్టెంట్స్‌కి, పోటీలో గెలుపొందిన పాఠకులు 50 మందికి సాధారణమైన క్యాబిన్‌లు బుక్ చేశాడు.

ఒకొక్కక్క పాఠకుడు, లేదా పాఠకురాలు తమకు తోడుగా ఇంకొకరిని తెచ్చుకోవచ్చు. ఒక్కొక్క క్యాబిన్‌లో ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలూ వుండవచ్చు. ఇతర సదుపాయాలన్నీ ఆ క్యాబిన్‌లోనే లభిస్తాయి. ఈ ఖర్చే నలభై లక్షలవరకూ వుంటుంది.

కానీ అంతకుమించి బెనిఫిట్ తన పత్రికకు చేకూరబోతోంది. టికెట్స్ బుక్ చేయగానే ప్రయాణపు తేదీని కన్‌ఫమ్ చేస్తూ ఐశ్వర్యారాయ్‌కి ఫోన్ చేశాడు రమేష్ పవార్.

ఐశ్వర్య కూడా తనీ ప్రయాణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని చెప్పింది.

నిజానికి ఐశ్వర్యారాయ్‌కి అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత వుంది. కానీ దేశీయతను ఆమె ఎప్పుడూ విస్మరించదు.

బాలీవుడ్ పత్రికల్లో గాసిప్స్‌జోలికి పోకుండా, సరదాన్ని వినోదాన్ని పంచిపెట్టే బాలీవుడ్ న్యూస్ అంటే ఆమెకి ప్రారంభ సంచికనుంచీ అభిమానమే.

రమేష్ పవార్ వ్యక్తిగతంగా కూడా ఆమెకి తెలుసు. అతనిలో ఓ ఎడిటరేకాదు, క్రియేటర్ కూడా వున్నాడని ఆమెకి తెలుసు.

నైతిక విలువలకు కట్టుబడి వుండే మనుషులంటే ఆమెకు ఎప్పుడూ అభిమానమే. సాధారణంగా కుట్రలకీ, కుతంత్రాలకీ, స్వార్ధానికీ మోసానికీ నిలయమైన ఈ గ్లామర్ ఫీల్డ్‌లో అతనిలాంటి వ్యక్తులు చాలా అరుదు. అందుకే సాధారణంగా అతను ఇంటర్వ్యూలడిగినా ఆమె కాదనలేదు.

ఐశ్వర్య గురించీ, గాసిప్స్ వినబడినప్పుడు ఓ స్నేహితుడిలా ఆమెను హెచ్చరిస్తాడు.

ఆమె హెచ్చరికలు తనలో వున్న తప్పులను సరిదిద్దుకోవడానికి ఆమెకు ఎంతగానో ఉపకరిస్తాయి.

రమేష్ పవార్ థామస్ కుక్ కంపెనీనుంచీ సరాసరి ఓడరేవుకు చేరుకున్నాడు. అతనంతకుముందు ఈస్ట్ ఫాస్ట్ క్రూయిజర్‌ని చూడలేదు. ఈ నెలలో ఈరోజే అది మలేషియా ట్రిప్‌కోసం బయలుదేరబోతోందని థామస్‌కుక్ కంపెనీ వాళ్ళు చెప్పారు. వాళ్ళ పర్మిషన్‌తో క్రూయిజర్ చూడటానికి వెళ్ళాడు రమేష్ పవార్.

అతను వెళ్ళేసరికి చీకటి పడిపోయింది. ఆ చీకట్లో దూరాన సముద్రపు జలాల్లో లైట్లకాంతులతో దగదగ మెరిసిపోతున్న క్రూయిజర్‌ని చూసాడు.

ఆ విశాలవంతమైన నౌకను చూడగానే అతనికి మతిపోయింది అతను నోట్లోంచి ఒకే ఒకమాట వచ్చింది.

"ఐశ్వర్యారాయ్‌లా అందమైన నౌక" అనుకున్నాడు. రమేష్ పవార్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఆరోజు భారతికి పెళ్ళిచూపులు జరుగుతున్నాయి. సావిత్రమ్మ ఒకటే కంగారుపడుతోంది. త్రినాథ్ తను చూసుకుంటానని చెప్తున్నా ఆమెకి వల్లమాలిన గాబరాగా వుంది. ఎందరి అండా దండా వున్నా, ఇంట్లో ఆడపిల్ల గుండెలమీద కుంపటిలా భారంగానే తోస్తుంది.

మొన్న ఇట్లావచ్చి అట్లా వెళ్ళిన రంగారావు అన్నయ్య, మాట తప్పకుండా మూడో నాటికి పెళ్ళివారితో మాట్లాడి మంచిరోజు చూసి పెళ్ళిచూపులకి వెంట పెట్టుకొచ్చేశాడు.

అన్నీ కుదిరితే తాంబూలాలు కూడా మార్చుకుందామనుకుంటున్నారు.

అందుకే ఇవన్నీ సక్రమంగా నెరవేర్చగలమో లేదోనని సావిత్రమ్మకి ఒకటే బేజారుగా వుంది. కూతురు పెళ్ళి అయ్యేవరకూ ఇంటి పట్టున కుదురుగా వుండమని భర్త రాఘవరావుకి ఆర్డర్ వేసింది.

సారధి కూడా ఎక్కడికీ వెళ్ళడం మానేసి చిన్న చిన్న ఇంటిరిపేర్లు వుంటే ఈ మూడురోజులు చేశాడు. త్రినాధ్ ఒకపక్క పొలంపనికి వెళుతూ, టౌనుకువెళ్ళి కావలసిన సామాగ్రి తీసుకువచ్చాడు.

పెళ్ళిచూపులరోజు రానే వచ్చింది. వాళ్ళ భార్య, భారతి, మిగతా స్నేహితురాళ్ళు వచ్చి ఆమెను అలంకరించారు. ఉన్నంతలోనే శుభ్రమైన చీర కట్టుకుని, ఒంటిపేట గొలుసు వేసుకుని, చేతులకు సాదాగాజులతో తయారయింది భారతి.

సుబ్బు వాళ్ళావిడ తన బంగారం అలంకరించబోయినా ఒప్పుకోలేదు. అది చూసిన త్రినాధ్ హృదయం ద్రవించింది.

వెంటనే నిరుత్సాహాన్ని జయించి, పెళ్ళివాళ్ళ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

మగపెళ్ళివారు శుభ్రంగా వున్న ఇంటిని, వినయంగా, పద్ధతిగా మాట్లాడుతున్న ఇంటివాళ్ళ మాటలకు సంతృప్తి చెందారు.

భారతిని తీసుకువచ్చి కూర్చోబెట్టగానే వాళ్ళ వదనాలు మరింత వికసించాయి. మగపెళ్ళివారు కాసేపు ఏమో ప్రశ్నలు వేశారు. భారతి మరీ సిగ్గుపడకుండా వినయంగా సమాధానం యిచ్చింది.

అమ్మాయిని లోపలికి పంపించారు. పిల్ల నచ్చిందని చెప్పారు వాళ్ళు.

తానివ్వగలిగే కట్నం గురించి చెప్పాడు త్రినాధ్. పెళ్ళికొడుకు తల్లిముందు కొంత బేరాలాడినా త్రినాధ్ చెప్పిన కట్నానికి సంబంధం కుదిరింది.

అందరికీ ఆనందంగా వుంది. వాళ్ళ దృష్టిలో ఇది చాలా మంచి సంబంధం. వాళ్ళకి పదిఎకరాల పొలం వుంది. ఒక్కడే కొడుకు. టీచర్‌గా పని చేస్తున్నాడు.

అబ్బాయి ఆకర్షణీయంగా వున్నాడు. బుద్ధిమంతుడు. ఏ ఆడపిల్లయినా ఇంతకన్నా ఏమి కోరుకుంటుంది? మంచి ముహూర్తం కావడంతో వెంటనే తాంబూలాలు పుచ్చేసుకుని, లగ్నపత్రిక వ్రాయించారు. ఇద్దరి జాతకాలనుబట్టి రెణ్నెల్ల తర్వాత ముహూర్తం కుదిరింది.

పెళ్ళి కుదరగానే ఆమె ముఖంలోకి ఎక్కడాలేని కళాప్రాకి వచ్చింది. ప్రతి ఆడపిల్లా ఇంతేనేమో... పుట్టిన వూరిని, కన్నవారిని విడిచి పెట్టాలన్న బాధకన్నా, భర్త తాలూకు మధురోహలే ఆడపిల్లల్లో ఎక్కడాలేని ఉత్తేజాన్ని కల్పిస్తాయి.

సావిత్రమ్మకి ఆనందంగా వుంది. రెణ్నెలల్లోనే పెళ్ళంటే అన్నీ సర్దుకోగలమోలేదోనని కంగారుగానూ వుంది.

మాటి మాటికీ కొడుకు దగ్గరకొచ్చి "ఇంత తొందర్లో పెళ్ళంటే తట్టుకోగలవేరా?" అంటూ అపనమ్మకంగా అడుగుతోంది.

"నీకెందుకమ్మా! అన్నిటికీ నేనున్నానుగా..." అంటూ త్రినాధ్ భరోసా ఇస్తుంటే కాస్తంత నిశ్చింతలో పడ్తోంది.

ఇక రాఘవరావు సంగతి...

ఎప్పుడూ కూతురుకు సంబంధాలు వెతకట్లేదని ఇంటికి వస్తే చాలు భార్య పోరుతూ వుండేది. ఇప్పుడు ఈ సంబంధం కుదరడంతో సావిత్రమ్మ సాధింపులు తప్పాయన్న ఆనందమే అతనిలో ఎక్కువగా వుంది.

సారధి కూడా సంతోషంగా వున్నాడు. చెల్లి పెళ్ళి అన్నది ఎప్పటికయినా బాధ్యతే. అది సమర్ధవంతంగా నెరవేర్చడం అన్నదమ్ములిద్దరికీ సవాల్... ఈ సవాల్‌ని తాము నెరవేరుస్తున్నందుకు సంతోషంగానే వుంది.

❀ ❀ ❀ ❀ ❀ ❀

పచ్చని వరి పైరు...

దేవుడు పరిచిన ఆకుపచ్చని కార్పెట్లా కంటికి ఆహ్లాదాన్నిస్తోంది.

అమ్మాయిలు గట్లమీద కూర్చుండిపోయి ఆ వరిపైరును శతవిధాలా పరీక్షించసాగారు.

త్రినాధ్ పొలంలో దిగి ఓ ప్రక్క కలుపుతీస్తూ, మరోప్రక్క వీళ్ళ పరిశోధనల్ని నవ్వుకుంటూ చూస్తున్నాడు.

వాళ్ళది బుక్ నాలెడ్జి... ఆకులమీద వచ్చిన మచ్చలను పుస్తకాల్లోని పరిభాష ప్రకారం అది ఏ రోగమో ఐడెంటిఫై చేయడానికి ట్రై చేస్తున్నారు.

పుస్తకాల్లో చెప్పిన లక్షణాలు ఒకటి వుంటే మరొకటి సరిపోవడం లేదు. నిమిష నిమిషానికి అతన్ని పిలిచి ఎక్కడాలేని సందేహాలు గుప్పించేస్తున్నారు.

అతను సీరియస్‌గా ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నప్పుడు మాత్రం వాళ్ళు జోకులేయకుండానే వింటారు.

కాని వాసంతి ఆ సమయంలో పెద్ద పెద్ద కళ్ళతో తనవంకే చూస్తూ వుంటే తన మాట తడబడిపోతుంది. "అలా చూడొద్దు ప్లీజ్" అని చెప్పాలనిపిస్తుంది.

అమ్మాయిలందరిలో వాసంతి తనకు ఓ పట్టాన అర్థం కావటం లేదు.

"ఆ అమ్మాయి ఎంత అమాయకమయిందో అంతే అల్లరిది. ఎంత అందమైందో అంత మృదువైన హృదయంకలది. చాలా మంచి అమ్మాయి, మనస్ఫూర్తిగా అనుకున్నాడు త్రినాథ్.

వాళ్ళక్కడ పనిలో వుండగా దాహంవేసి బోర్ షెడ్‌వైపు నడిచాడు. అతనటు వెళ్ళగానే రెండు నిమిషాలకి తనూ లేచి అటువైపు అడుగులు వేసింది వాసంతి. వెనుకనుంచి అమ్మాయిలు.

"ఆల్‌ది బెస్ట్ ప్రొసీడ్" అంటూ హుషారెక్కించి చిలిపి నవ్వులతో వాసంతిని పంపారు.

త్రినాథ్ బోర్‌నుంచి వచ్చే నీటిధార వద్ద చేతులు కడుక్కుని రెండు చేతులూ దగ్గరకి చేర్చి నీళ్ళు తాగడం అపురూపంగా చూసింది వాసంతి.

వెనక్కితిరిగి వాసంతి చూపులను గమనించి "నీళ్ళు తాగుతారా?" అడిగాడు.

తన నిలువుగా వూపింది వాసంతి.

తను తప్పుకొని "రండి..." పిలిచాడు త్రినాథ్.

దగ్గరగా వెళ్ళింది వాసంతి. అంతపెద్ద ధారవద్ద నీరు ఎలా తాగాలో బోధపడలేదు ఆమెకు.

అతడెలా తాగాడో గుర్తుతెచ్చుకుని రెండు చేతులూ ధారకెదురుగా పెట్టింది. ఫోర్స్‌గా వస్తున్న నీరు ఆమె చేతులను తోసేసింది.

చేతులలో చుక్కనీరు నిలవలేదు. బిక్కముఖం వేసి అతని వంక చూసింది.

నవ్వొచ్చిందతనికి.

"అల్లరి చేయడం తెలుసుగాని నీళ్ళు తాగడం తెలీదా?" అంటూ మృదువుగా పలికి ఆమె రెండు చేతులూ పట్టుకుని నీళ్ళెలా తాగాలో చూపించాడు.

ఎక్వేరియంలో చేపపిల్లలా కదులుతున్న ఆమె పెదాలు చిత్రకారుడి మనోహర దృశ్యంలా కన్పించాయి.

అతడి సాన్నిహిత్యం ఆమెలో ఆశలను సజీవం చేసింది. ఆమె ఎంతసేపటికి నీరు త్రాగడం ఆపలేదు. ఆపేస్తే అతని చేతులు వదిలేస్తాడేమోనని భయం.

చూసి చూసి అతనికే విసుగొచ్చింది.

"ఎన్నినీళ్ళు తాగుతారు ఒంటెపిల్లలా" చిన్నగా కసురుతూ అన్నాడు.

అప్పటికి స్పృహలోకొచ్చి చేతులు వదిలేసి వెనక్కివచ్చి నీళ్ళతో బరువెక్కిపోయిన పొట్టమీద చెయ్యేసుకుంది.

"ఈ సృష్టిలోకెల్లా మీకు నచ్చిన సౌందర్యం ఎవరిది?" ఆసక్తిగా అడిగింది వాసంతి. ఆమెకు ఏమూలో నమ్మకం అతను తనపేరే చెపుతాడని.

కానీ అతనేం మాట్లాడలేదు. వాసంతికి ఇగో దెబ్బతింది. ఈ చుట్టుపక్కల ఊళ్ళల్లో తనత్యంత సౌందర్యరాశి అని అందరూ పొగుడుతుంటారు.

సినిమాస్టార్‌లు కూడా తనకుసాటి రారని అందరూ పొగిడేవారు. అందుకే తన సౌందర్యమైనా అతన్ని కదిలించగలదని ఆమె నమ్మకం.

"పోనీ ఏ సౌందర్యాన్ని మీరు ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నారు" సూటిగా అడిగింది.

అతను ఓ క్షణం విచలితుడయినట్లు చూసాడు. అతని చూపులు అనంతాంబరపు నీలి నీడల్ని ప్రదర్శించాయి. గొంతు భారంగా మారింది. చిన్నగా నిట్టూర్చి తలవంచుకుని "ఐశ్వర్యారాయ్" చెప్పాడు.

"ఎవరిని చూడాలనుకుంటున్నారు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నా జీవితలక్ష్యం ఐశ్వర్యారాయ్, నా జీవితంలో వున్న ఏకైక లక్ష్యం అది. ఆమెను చూడటం, మాట్లాడటమేకాదు. ఆమె సంపూర్ణ సౌందర్యాన్ని నా ఈ కళ్ళతో దర్శించి, ఓ అపురూప కళాఖండంలా ఆమెను చిత్రించాలి. అందుకే చిన్నప్పటినుంచి అలవాటైన పెయింటింగ్ హాబీని మర్చిపోలేదు.

నా చేతివేళ్ళకి కుంచెను పట్టుకునే అర్హత ఆమె బొమ్మ వేశాకే వస్తుంది. అంతకన్నా ముఖ్యం ఆమె సౌందర్యాన్ని ఈ కళ్ళతో దర్శించడం" అతను ఏదో లోకంలో వున్నట్లు చెప్పుకుపోతూ వుంటే ఆమె నోరు తెరుచుకుని వింది.

"ఐశ్వర్యారాయ్‌ని మీరెలా కలుస్తారు?" అడిగింది వాసంతి.

"మా చెల్లి, తమ్ముడు బాధ్యతలు తీరిపోగానే నేను సంపాదించే ప్రతీపైసా ఆమెను కలుసుకోడానికే వెచ్చిస్తా. మరింత త్వరగా సంపాదించాలని ఎడ్లపందాల్లో కూడా పాల్గొంటున్నాను" చెప్పాడు.

అతను జోక్ చేయడంలేదని, సీరియస్‌గానే వున్నాడని గ్రహించిన ఆమె విస్తుపోయింది.

"నిజంగా సినిమాయాక్టర్ల మీద ఇంత అభిమానాన్ని పెంచుకునే వాళ్ళుంటారా?" అని ఆశ్చర్యపడింది. ఈ విషయాన్నే పైకి వ్యక్తం చేయగా కొంచెం సీరియస్ అయ్యాడు త్రినాధ్.

"ఐశ్వర్యారాయ్ సినిమా యాక్టర్ అని నేను అభిమానించలేదు. ఆ అపురూప సౌందర్యాన్ని మీరు బాగా పరిశీలించండి. ఆ మేనిలావణ్యం, ఆ చిరునవ్వులో సమ్మోహనత్వం, ఆ ప్రవర్తనలో రాజసం చూస్తే ఓ దేవకన్యలా మీకన్పించడంలేదూ? దేవకన్యను చూడాలనుకోవడం తప్పెలా అవుతుంది?" ఎదురు ప్రశ్నించాడు త్రినాధ్.

ఒక వ్యక్తి తన పనిని సమర్ధించుకోడానికి ఎన్నో వాదాలు బలంగా నిర్మించుకుంటాడు. అవి చాలా దృఢంగా వుంటాయి. వాటిని ఛేధించడం చాలా కష్టం. కానీ నేను ప్రయత్నిస్తాను. బలంగా అనుకుంది వాసంతి.

❋ ❋ ❋ ❋ ❋ ❋

రాత్రి 1 గం. సమయం–

గాఢనిద్రలో ఉంది ఐశ్వర్య మూడురోజుల నుంచి అనుభవించిన టెన్షన్ అంతా పోయేలా సాయంత్రం సల్మాన్‌తో ప్రశాంతంగా గడిచింది. షూటింగ్ పేకప్ చెప్పాక తను అతని దగ్గరే వుండిపోవడం... ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకోని కాటేజ్‌వరకూ జాగింగ్‌చేస్తూ రావడం ఉల్లాసాన్నిచ్చింది.

నైట్ త్వరగా సప్పర్ తీసుకుని 10 గం. కల్లా బెడ్‌మీద వాలిపోయింది. 10 నిమిషాల్లో నిద్రాదేవి ముంచుకొచ్చింది.

ఉన్నట్లుండి నిద్ర మధ్యలో కదిలింది ఐశ్వర్య. తనకి నిద్రా భంగం కలిగించిన అంశం ఏంటోనని కళ్ళువిప్పి పరిశీలించింది ఐశ్వర్య. డోర్‌ని చిన్నగా "నాక్" చేస్తున్నారెవరో – ఎంతో అవసరమయితే తప్ప తననెవరూ డిస్టర్బ్ చేయరు. ఎందుకంటే నిద్ర సరిపోకపోతే మరుసటి రోజు మోహం తాజాదనాన్ని కోల్పోతుంది.

టైం చూసుకుంది. ఒటిగంట దాటింది. డోర్ ఓపెన్ చేసింది. ఎదురుగా ఆయా నిలబడి వుంది.

ఆమె మొహంలో కంగారు.

"ఏమైంది?" అడిగింది ఐశ్వర్య.

మాట్లాడకుండా ఆమె చెయ్యి పట్టుకుని హాల్లోకి మెల్లగా తీసుకొచ్చింది అక్కడ ఐశ్వర్య సెక్రటరీ, సల్మాన్ అసిస్టెంట్ వాదులాడుకుంటున్నారు.

"ఇప్పుడు ఐష్‌ని పంపండం కుదరదు..." సెక్రటరీ తెగేసి చెప్తున్నాడు.

"అక్కడ సాబ్ పొజిషన్ చూసి కూడా మీరిలా అనడం భావ్యం కాదు" అతని స్వరం అభ్యర్ధనగా వుంది.

"ప్రొడ్యుసర్‌కీ, డైరెక్టర్‌కీ ఫోన్‌చేసి చెప్పాను. వాళ్ళొచ్చే టైం అయింది. బేబీని డిస్టర్బ్ చేయద్దు" గట్టిగా చెప్పాడు సెక్రట్రీ.

సల్మాన్ అసిస్టెంట్‌కి కోపం వచ్చింది.

"ఆ మాట మేడమ్‌ని చెప్పమనండి. నేను వెళ్ళిపోతాను..." మొండిగా అక్కడే నిలబడి అన్నాడు.

వింటున్న ఐశ్వర్యకి నిద్రమత్తులో ముందు కాసేపు ఏమీ అర్ధంకాలేదు.

సాబ్ పొజిషన్ అంటున్నాడేమిటి? ఏమైంది సల్మాన్‌కి, అతనికి బాగోలేదా? ఖంగారుగా అన్పించింది ఐశ్వర్యకు.

గబగబా అసిస్టెంట్ ముందుకొచ్చి "ఏమైంది?" ఆరాటంగా అడిగింది.

"మీకు తెలుసుకదమ్మా మూడురోజుల నుంచి ఆయనకు బాగోవడం లేదు. ఇప్పుడే పావుగంట క్రిందట నన్ను నిద్రలేపి ఛాతీలో నొప్పిగా వుందన్నారు. డాక్టరుకు ఫోన్‌చేసి మీకు చెప్పాలని ఇక్కడకొస్తే ఈయన వాదిస్తూ కూర్చున్నాడు" కోపంగా చెప్పాడు.

"అదికాదమ్మా!" సెక్రట్రీ ఏదో చెప్పబోయాడు.

ఐశ్వర్య సూటిగా ఆయనవంక చూసి, చెయ్యెత్తి వారిస్తూ అసిస్టెంట్‌తో ముందుకడుగేసింది.

"ఏమైంది సల్మాన్‌కి హార్ట్ ఎటాక్కా? ఇంత చిన్న వయసులోనా?"

ఆమె మనసు పరిపరివిధాల పోయింది.

వేగంగా నడుస్తూనే "సల్మాన్ సాబ్ ఏజ్ ఎంత?" అడిగింది.

"థర్టీత్రీ..." చెప్పాడతను.

"హార్ట్‌ఎటాక్ అయ్యుండదు" తనకు తనే సమాధాన పర్చుకుంటూ అనుకుంది. కానీ ఈ వృత్తిలో వుండే ఒత్తిళ్ళు ఆమెకు తెలుసు. జీవితంలో ప్రతీక్షణం ఏవో సమస్యలు వృత్తిపరంగానూ, వ్యక్తిగతంగానూ వస్తూ వుంటాయి.

తమ చుట్టూ అంతులేని గ్లామర్... పేరు ప్రఖ్యాతలు, డబ్బు, సాలెగూళ్ళలా అల్లుకొని వుంటాయి. ఆ వలయాన్ని ఛేదించుకుని, నిజమైన అభిమానాన్ని తాము పొందడం ఎంతో కష్టం. అందుకే బయటవాళ్ళు పదిరోజుల్లో నమ్మే వ్యక్తులను తాము నమ్మడానికి నెలరోజులు పడ్తుంది.

ఏది నిజమైన అభిమానమో తెలుసుకోవడం కష్టం. జీవితంలో ప్రతీదాని గురించి పోరాడుతున్నట్లే వుంటుంది. పరుగులాంటి నడకతో వెళ్ళేసరికి సల్మాన్ పరిస్థితి చూడటానికి భయంగొలిపేలా వుంది. అంత ఎ.సిలోనూ ఒళ్ళంతా చెమటలు దిగకారిపోతున్నాయి.

ఊపిరి భారంగా మారింది. ఇంచుమించు ఎగశ్వాస పీలుస్తున్నట్లుగా పక్కటెముకలు ఎగిరెగిరి పడుతున్నాయి. అప్పుడప్పుడూ ఛాతీమీద చేయి వేసి అదుముకుంటున్నాడు.

అతన్ని లేపి దిళ్ళుకానించి కూర్చోబెట్టారు. కించిత్ భయం, మరికొంత బాధ కలిపిన అతని మొహం హృదయాన్ని కరిగించివేస్తోంది.

ఐశ్వర్యని చూడగానే నవ్వడానికి ప్రయత్నించాడు. కానీ అది రేఖా మాత్రంగా మారింది. దగ్గరగా వెళ్ళింది ఐశ్వర్యా. ఆ క్షణంలో ఆమె లోని మానవత్వం మేల్కొంది.

"సల్మాన్! యు ఆర్ ఆల్‌రైట్. నథింగ్ టు వర్రీ... హాస్పటల్‌కు వెళదాం" అతని నుదుటిమీద చెయ్యివేసి జుట్టును వెనక్కి తోస్తూ అంది.

ఆ చల్లని చేతిస్పర్శకి పోతున్న చైతన్యమేదో కాస్త నిలబడినట్లు అయింది.

ఆలోపు లోకల్‌గావున్న డాక్టర్ వచ్చాడు. రావడంతోనే చుట్టూ వున్న జనాలందరినీ గుమిగూడవద్దని చెప్పాడు. ఐశ్వర్య, ఆయా, అతని అసిస్టెంట్స్ ఇద్దరు మాత్రం కొంచెం ఎడంగా నిలబడ్డారు.

డాక్టర్ పరీక్షించాడు.

"ఎడంచేయి లాగుతోందా?" అడిగాడు. లేదన్నట్లు తలూపాడు సల్మాన్. బి.పి. చెక్‌చేసాడు. హై బి.పి. అని ఐడెంటిఫై చేశాడు. పరీక్ష చేస్తూనే ముంబాయ్ తీసుకెళ్ళడానికి ఎరేంజ్‌మెంట్స్ చేసుకోమని చెప్పాడు.

డాక్టర్‌కి కొంచెం కన్ఫ్యూజన్‌గా వుంది. డెసిషన్ ఇచ్చేయడానికి తను ట్రీట్‌చేస్తున్నది సామాన్యుడ్నికాదు. అందుకే వెంటనే ముంబాయి తీసుకెళ్ళమని చెప్పాడు.

ఈలోగా ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఆఘమేఘాల మీద వచ్చారు. రావడంతోనే పరిస్థితులు సమీక్షించుకొని సల్మాన్‌ను మెల్లగా నడిపించుకుంటూ కారు వైపు తీసుకువెళ్ళారు.

అతన్ని బ్యాక్‌సీట్‌లో కూర్చోబెట్టి, ముందు తను కూర్చున్నాడు డైరెక్టర్. డ్రైవర్ కారు తీస్తూండగా గబగబా వచ్చి నిలబడింది ఐశ్వర్య.

డైరెక్టర్ ఆశ్చర్యంగా చూశాడు.

"నేనూ వస్తాను..." అంది ఐశ్వర్య. సెక్రటరీ వారించబోతే...

"ప్లీజ్ అంకుల్ నోమోర్ డిస్కషన్స్..." విసుగ్గా చెప్పి బ్యాక్ డోర్ ఓపెన్‌చేసి లోపల కూర్చొని, సల్మాన్ తలను ఒళ్ళోకి తీసుకుంది.

కారు ముందుకు పోతోంది. కారులో ఎవరూ మాట్లాడుకోకపోయినా అందరి హృదయాల్లోనూ ఉద్విగ్నత.

అంత బాధలోనూ తను ఓ దేవకన్య ఒళ్ళో సేదతీరుతూ వున్నానన్న భావం అతని హృదయాన్ని ఉల్లాసపరిచి పొంగివచ్చే బాధను అణచి పెడుతోంది.

ఐశ్వర్యకీ, డైరెక్టర్‌కీ చూచాయిగా అర్థమైంది ఈ ఎటాక్ ఎందుకొచ్చిందో...

తనమీద పంతంతో తన ప్రేమను పొందాలన్న ఆరాటంతో సల్మాన్ తనకున్న చెడు అలవాట్లన్నిటికి ఒకేసారి దూరమయ్యాడు. ఇటు తన నుంచీ నిరాదరణే ఈ శారీరక, మానసిక ఆందోళనకి అతను తట్టుకోలేకపోయాడు. అది ఈ అనారోగ్య రూపంలో అతనిమీద దాడిచేసింది.

అతని తలను మృదువుగా నిమరసాగింది ఆమె చేయి. పువ్వులా, సుకుమారంగావున్న ఆమె చేతిని తనకు నొప్పిగా అన్పిస్తున్న ఛాతీమీద వేసుకుని అదిమిపెట్టాడు.

ఆ చేతినుంచి ఏదో అద్భుతం తన హృదయానికి చేరాలన్న ఆరాటంగా వున్నాడు. ఈ జరిగిన దానిలో తన పాత్ర ఏంటని సమీక్షించుకొటోంది ఐశ్వర్య.

తన తప్పున్నా లేకపోయినా ఈ జరిగినదానికి పూర్తి బాధ్యత తనదే అనిపిస్తోంది. తనమీద ప్రేమతోనే అతను ఈ అలవాట్లకు దూరమవడానికి ప్రయత్నించాడు, అనుకోగానే హృదయం దుఃఖపూరితమైంది.

"ఎందుకిదంతా...?" మెల్లగా స్వరంతో అడిగింది. ఆమె బాగా కదిలిపోయినట్లు ఆ స్వరమే తెలుపుతోంది. చిన్నగా నవ్వాడు సల్మాన్.

"అనారోగ్యంతోనయినా ఈ అదృష్టం పడుతుందనుకుంటే, ఇందుకోసం ఎప్పుడో ప్రయత్నించేవాడిని" చెప్పాడు.

సుకుమారమైన చేతివేళ్ళతో మాట్లాడుతున్న అతని రెండు పెదాలని మూసింది.

ఇదంతా ఎక్కడికి దారితీస్తోందోనన్న ఆందోళనతో వున్నాడు డైరెక్టర్. అతనికి ఇక కన్‌ఫామ్ అయింది. ఇన్నాళ్ళూ దగ్గరికి వెళితే భగ్గుమని అంటుకుపోతామని అందరూ భయపడిన ఈ సాంప్రదాయ సౌందర్యజ్వాలని సల్మాన్ తన ప్రేమతో వశంలోకి తెచ్చుకున్నాడు.

బాలీవుడ్‌లో ఇదెంత సెన్సేషన్‌ని కల్పించబోతోందో తనూహించలేనిది కాదు.

గంటన్నరలో కారు ముంబయిలోని బీచ్‌కేండీ హాస్పిటల్ ముందు ఆగింది. ఎమర్జెన్సీ సిబ్బంది స్ట్రెక్చర్‌మీద సల్మాన్‌ను లోపలికి తీసుకువెళ్ళారు. వెనక పరుగులాంటి నడకతో ఐశ్వర్య అనుసరిస్తూ వుంటే, హాస్పటల్ సిబ్బంది అంతా ఆశ్చర్యంతో చూడసాగారు.

ఆమెను వారించబోయి ఆగిపోయాడు డైరెక్టర్. అప్పటికే ఆమె ఎవరు చెప్పినా వినే స్టేజ్‌ని దాటిపోయింది.

డాక్టర్స్ క్షణాలమీద అతనిని ఎగ్జామిన్ చేసారు. సుప్రసిద్ధులైన వైద్యులు నిమిషాలమీద అక్కడకు చేరుకున్నారు.

బయట సాధారణ వ్యక్తిలా ఛైర్‌లో కూర్చున్న ఆమెను చూసి హాస్పటల్ చీఫ్ తన రూమ్‌లోకి తీసుకువెళ్ళాడు. మారు మాట్లాడకుండా అతనివెంట నడిచిందామె. ఆమెలో సర్వశక్తులూ నశించిపోయినట్లుగా వున్నాయి.

"వాటీజ్ హిజ్ ప్రాబ్లెమ్ డాక్టర్?" అడిగింది ఐశ్వర్య.

"నథింగ్ టూ వర్రీ మేడం! హార్ట్‌ఎటాక్‌లా అనిపిస్తుంది కానీ అసిమ్‌టమ్స్ ఏమీలేవు." అతన్ని కౌన్సిలింగ్ చేస్తే తెలిసింది – స్మోకింగ్, డ్రింకింగ్‌ని ఆయన సడెన్‌గా ఆపేసారు. అందుచేతనే ఈ ఎటాక్ వచ్చింది. పల్స్‌రేట్ పెరగడం, కళ్ళు తిరగడం, గుండె వేగంగా కొట్టుకోవడం, విపరీతంగా చెమటలు పట్టడం, మెదడు మొద్దుబారిపోవటం ఇవన్నీ ఒకేసారి జరగడంతో ఎవరైనా ఖంగారుపడతారు. దీనికితోడు లైఫ్‌లో వుండే టెన్షన్స్... అతను ఫిజికల్‌గా హెల్దీకాబట్టి దీనికి తట్టుకున్నాడు. బైదవే... ఇక్కడ అతను పదిహేనురోజులు వుండాల్సిరావచ్చు. అతని కేర్‌ఫుల్‌గా చూసుకునే వారు కావాలి. మీరూ..." సందేహంగా ఆగాడు చీఫ్.

కళ్ళు దించుకుంది ఐశ్వర్య. కాని ఆమె నోటినుంచి సమాధానం వెంటనే వచ్చింది.

"నేనిక్కడే వుంటాను డాక్టర్" చెప్పిందామె.

చీఫ్ ఏదో చెప్పబోయి, తటపటాయిస్తుండడం చూసింది ఐశ్వర్య. "చెప్పండి డాక్టర్..." అతని వంక చూస్తూ అడిగింది.

"అతని పేరెంట్స్‌గాని, బాగా దగ్గరి వాళ్ళుగాని వుంటే మంచిదమ్మా..." చెప్పలేక చెప్పాడు.

ఓ క్షణం తలదించుకుంది ఐశ్వర్య. వెంటనే తలెత్తి అతన్ని సూటిగా చూస్తూ–

"నేను కూడా అతనికి బాగా కావలసినదాన్నే డాక్టర్. హి ఈజ్ మై ఉడ్‌బీ" చెప్పింది.

ఆ చెప్పేటప్పుడు తనకో పొదరిల్లులాంటి కుటుంబం వుందని, వారిని సంప్రదించాలని ఆమెకి ఆ క్షణంలో తోచలేదు.

తన కోసం మారాలనుకుంటున్న అతనికి చేయూతనిచ్చి తనవాడిగా చేసుకోవాలన్న తపనే అధికంగా కనబడుతోంది.

"ఇంకో సంగతి కూడా చెప్పాలమ్మా! అతను స్మోక్‌చేసే సిగరెట్లు మామూలువికావు. అందులో డ్రగ్స్ కంటేన్ ఎక్కువగా వుంటుంది. అందుకే ఈ ఎటాక్... అతనికి చేయాల్సిన ట్రిట్‌మెంట్ కూడా చాలా డిఫరెంట్‌గా వుంటుంది" చెప్పాడు డాక్టర్.

"ఈ పదిహేను రోజులూ నా షూటింగ్ ఆతనితోనే. అతను లేనపుడు ఆ షూటింగ్ కూడా రద్దవుతుంది. టైం ఎడ్జెస్ట్ చేసుకొని అతని దగ్గరే ఎక్కువసేపు వుండటానికి ఇంపార్టెన్స్ ఇస్తాను...." చెప్పింది ఐశ్వర్య.

ఆమె హృదయ ఔన్నత్యానికీ, సల్మాన్ అదృష్టానికీ ఆశ్చర్యపడ్డాడు చీఫ్.

ఆ తరువాత వెంటనే సల్మాన్‌కు డ్రగ్స్ ఎవర్షన్ ట్రీట్‌మెంట్‌ను ఇచ్చే విభాగానికి మార్చారు. ఆ విభాగం జుహూ బీచ్ ఒడ్డున ప్రశాంతమైన వాతావరణంలో వుంది.

రాత్రికి రాత్రే అతన్ని అక్కడికి మూడో కంటికి తెలియకుండా మార్చాడు. ఒక్క డైరెక్టర్‌కీ, సల్మాన్ పేరెంట్స్‌కి మాత్రమే ఈ విషయం తెల్సు.

సల్మాన్ విషయం పబ్లిక్‌లోకి వెళ్ళకుండా కావలసిన జాగ్రత్తలన్నీ తీసుకున్నారు. మరుసటిరోజు ఉదయం ప్రొడ్యూసర్ ఆఫీస్‌కు డైరెక్ట్‌గా వెళ్ళింది ఐశ్వర్య.

అతను తన సీట్లో ఒంటరిగా, దిగాలుపడి కూర్చున్నాడు. ఐశ్వర్యను చూడగానే ఎదురు వెళ్ళాడు.

అతని బాధ ఐశ్వర్యకు అర్థమయింది. అందుకే అతన్ని ఇబ్బంది పెట్టకుండా డైరెక్టుగా విషయంలోకి వెళ్ళింది ఐశ్వర్య.

"ఈ పదిహేను రోజులూ కామెడీ, ఇతర అర్టిస్టుల షూటింగ్ కంప్లీట్ చేసుకోండి. నెక్స్ 15 రోజులూ షూటింగ్‌కి తప్పకుండా నేను, సల్మాన్‌జీ అటెండ్ అవుతాం. ఇట్స్ మై ప్రామిస్...." అనునయంగా చెప్పింది ఐశ్వర్య.

"ఇందాక మీ సెక్రటరీజీ అలా అనలేదమ్మా...." బేలగా అన్నాడు.

ఐశ్వర్యకి అసహనం లాంటిది కలిగింది. దాన్ని అణిచిపెట్టుకుని "అంకుల్ సంగతి అనవసరం. నేను కన్‌ఫమ్ చేస్తున్నాను కదా" గట్టిగా చెప్పింది ఐశ్వర్య. దాంతో ధైర్యం చిక్కిందతనికి.

"ఓ.కె. మేడం! మీరు చెప్పినట్లుగానే చేద్దాం" ఆనందంగా ఒప్పుకున్నాడు. తను అప్పటివరకూ అనుభవించిన బాధంతా చేత్తో తీసేసినట్లు పోయిందతనికి.

ఇతరత్రా తను మేనేజ్ చేసుకోవలసిన విషయాలన్నీ సరిచేసుకొనే సరికి మరునాటి మధ్యాహ్నం ఒంటిగంటయింది.

మధ్యలో ఎక్కడా సెక్రటరీ తనకు కాల్ చేయలేదు. అంకుల్‌కి తన వ్యవహార సరళి నచ్చలేదని అర్థమైంది. కానీ తన మనసును అంకుల్ ఎందుకు అర్థంచేసుకోలేకపోయారు.... మదన పడింది ఐశ్వర్య. కాని దాని గురించి ఎక్కువ ఆలోచించలేదామె. లంచ్ టైంకి ఇంటి

దగ్గరకి వెళ్ళింది. అప్పటికే డైనింగ్ టేబుల్ దగ్గర తల్లీ, తండ్రీ, అన్నయ్య కుర్చుని భోజనం చేస్తున్నారు. ఆశ్చర్యంతో కూడిన ఆనందం కలిగిందామెకు.

తాము నలుగురూ కలిసి భోజనం చేసిన సందర్భాలు ఇటీవల చాలా తక్కువైపోయాయి. వాళ్ళను చూసిన ఆనందాన్ని దాచుకొనే ప్రయత్నం చేయకుండా....

"డాడీ! హౌ ఆర్ యూ?" చిన్నపిల్లలా పరుగుతీస్తూ తండ్రి భుజాలచుట్టూ చేతులేసింది. అమ్మ, అన్నయ్యను కూడా పలుకరించింది. ముగ్గురూ ముభావంగా "హలో...." అంటూ సర్దిపెట్టేశారు.

"సమ్‌థింగ్ ఈజ్‌రాంగ్" మొత్తానికేదో న్యూస్ చేరిపోయింది అనుకుంటూ తలతిప్పి చూసింది.

డైనింగ్ రూమ్ సింక్‌వద్ద హేండ్ వాష్ చేసుకుంటూ కనిపించాడు అంకుల్. ఇదన్నమాట విషయం... మనసులో అనుకుంది ఆమె. పైకి ఏ భావాన్నీ వ్యక్తం చేయకుండా తను కూడా లంచ్‌కి కూర్చుంది.

ఎప్పటిలా తల్లి తనకి వడ్డించలేదు. ఆయా వడ్డించింది. మౌనంగా భోజనాలు ముగించారందరూ! అలవాటు ప్రకారం అందరూ హాలులోకి దారితీయగా నిద్ర మంచుకొస్తోంటే తన బెడ్‌రూమ్‌కి వెళ్ళబోయింది ఐశ్వర్య.

"ఐష్! ఫైవ్ మినిట్స్...." అన్నయ్య పిలిచాడు. మౌనంగా దిగివచ్చింది ఐశ్వర్య. అందరికీ ఈ సిట్యువేషన్, ఎంబ్రాసింగ్‌గా వుంది.

ఐశ్వర్యను ఉదాహరణగా చూపించి ఆమెలా బలమైన వ్యక్తిత్వంతో వుండమని అందరికీ చెప్పడమే తప్ప, ఆమెకి చెప్పే స్టేజీ వస్తుందని పేరెంట్స్ ఊహించలేదు.

ఆమె కూడా ఆ స్టేజ్‌ని ఆశించలేదు. ముందుగా ఆమె తల్లి నోరువిప్పింది.

"అంకుల్ చెప్పేది నిజమేనా...." ఆమె స్వరంలో ఒకింత పదును తొంగిచూసింది. ఐశ్వర్య అహం దెబ్బతింది. కాని తల్లి దండ్రుల దగ్గర తనకి అహం ఏమిటి? మనసుని సమాధానపరచుకుని....

"అంకుల్ ఏం చెప్పారమ్మా....?" నవ్వుతూ అడిగింది.

"సల్మాన్ విషయంలో నువ్వు ఎక్కువ ఇంటర్ ఫియర్ అవ్వద్దు అతనెలాంటివాడో లోకానికంతటికీ తెలుసు...." అన్నయ్య కోపంగా అన్నాడు.

అతని ఫ్రెండ్స్ తెల్లారి ఐదింటికే ఫోన్‌చేసి మర్నాడు పేపర్‌లో వచ్చే గాసిప్స్ గురించి చెప్తుంటే గుండె మండిపోయింది. తన చెల్లెలు వ్యక్తిత్వం తనకి తెలుసు. కాని ఆమె చేజేతులా తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటుందేమోనని భయపడ్డాడు.

"సల్మాన్ ఎలాంటివాడైతే నాకెందుకూ, మేమిద్దరం కలిపి ఓ పిక్చర్ చేస్తున్నాం. అవుట్‌డోర్ షూటింగప్పుడు అందరం కలిసి మెలిసి వుంటాం. అందులో తప్పేంటి?" ఎదురు ప్రశ్నించింది ఐశ్వర్య.

"అంతవరకే అయితే ఎవరు తప్పుపడ్తారు ఐష్..." తండ్రి అనునయంగా అన్నాడు.

"కాదని ఎవరైనా చెప్పారా?" సెక్రటరీ వంక కోపంగా చూస్తూ అంది ఐశ్వర్య.

"నీకు సంబంధించిన ప్రతీ విషయం అంకుల్ మాకు చెప్పాలి. అది ఆయన డ్యూటీ. ఆయన పని ఆయన చేశారు. నువ్వు అంకుల్‌మీద కోపగించుకోవలసిన పని లేదు...." తల్లి అంది.

ఆ క్రాస్ ఎగ్జామిన్‌కి ఊపిరి ఆడనట్లుగా వుంది ఐశ్వర్యకి.

"ఇప్పుడేం జరిగిందని?" విసురుగా అంది.

అందరూ మౌనం వహించారు.

ఓ రెండు నిమిషాలు చూసి విసవిసా నడుచుకుంటూ తన గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది ఐశ్వర్య. పడుకున్న మరుక్షణంలో నిద్రాదేవి అవహించింది.

❃ ❃ ❃ ❃ ❃ ❃

పొలంనుంచి అప్పుడే ఇంటికి వచ్చాడు త్రినాథ్. ఆరోజే టౌన్ నుంచి వచ్చిన అమ్మాయిలు తిరిగి పోయేరోజు, పొలంలో వాళ్ళు పెట్టిన అప్పగింతలన్నీ విని, హృదయం భారం కావడంతో మౌనంగా వున్నా డతను. వాళ్ళెంత అల్లరిచేసినా, థీరియాటికల్‌గా ఎంతో ఉపయోగపడ్డాయి త్రినాథ్‌కి.

పది రోజులు పది నిమిషాల్లా గడిచిపోయాయి. భోంచేసి మంచం మీద పడుకొని ఆలోచిస్తుంటే క్రితంరోజు రాత్రి జరిగిన సంఘటన గుర్తొచ్చింది త్రినాథ్‌కి. తన బలవంతంమీద సుబ్బు దేవదాసు సినిమాను తెచ్చి తన టూరింగ్ టాకీస్‌లో ప్రదర్శించాడు.

ఆరోజు రాత్రి ఆటకి బయలుదేరగానే అమ్మాయిల విషయం గుర్తొచ్చి వాళ్ళ దగ్గరకి వెళ్ళాడు.

అప్పుడే సర్పంచ్‌గారు పంపించిన భోజనాలు చేస్తున్నారమ్మాయిలు. త్రినాథ్‌ని చూడగానే దూరం నుంచే కేరింతలు కొట్టారు వాళ్ళు.

"త్వరగా భోజనాలు చెయ్యండి. మన సుబ్బు వాళ్ళ టూరింగ్ టాకీస్‌లో దేవదాసు సినిమా వేస్తున్నారు...." హుషారుగా అన్నాడు త్రినాధ్.

"ఓ షారూఖ్‌ఖాన్...." అంటూ ఉత్సాహంగా అన్నాలు తినేశారు.

అప్పటికే దేవదాసు సినిమా విషయంలో సుబ్బుకీ, త్రినాధ్‌కి అయిన గొడవ వూరంతా తెలుసు ఈ అమ్మాయిలకీ తెలుసు. కాని సుబ్బుని ఈ సినిమా తీసుకురావడానికి ఎలా ఒప్పించాడో వాళ్ళిద్దరికే తప్ప ఎవరికీ తెలియదు.

"ఏదైనా అనుకున్నది సాధిస్తాడీ మనిషి...." మురిపెంగా అన్నది వాసంతి.

సినిమా ప్రారంభానికిముందు సీట్లలో కూర్చునేటప్పుడు అందరూ ఏకగ్రీవంగా త్రినాధ్ ప్రక్క సీటు వాసంతికే వదిలేశారు.

ఆ విషయాన్ని పట్టించుకునే స్టేజ్‌లో లేడు త్రినాధ్. అతని మనస్సంతా కొద్ది క్షణాల్లో ప్రారంభించబోయే సినిమా మీదే లగ్నమైంది.

సీట్లో ముందుకు వంగి కూర్చున్నాడు త్రినాధ్. వాసంతికి ఉక్రోషం లాంటిదేదో కలిగింది. అతని చేతిమీద గట్టిగా కొడుతూ–

"సినిమా చూడ్డం ఇదే మొదటిసారా?" అసహనంగా అడిగింది. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

"ఏంటి...?" పరాగ్గా అన్నాడు.

అతని భుజంమీద చేయివేసి వెనక్కి తోస్తూ–

"సరిగ్గా కూర్చోండి.... ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు...." అంది.

సినిమా ఆధ్యంతం వాసంతి ఏవో కామెంట్స్ చేస్తూనే వుంది. పార్వతి పాత్రలో నిమగ్నమయిపోయిన ఆ అలౌకిక సౌందర్యాన్ని తనివి తీరా ఆస్వాదించే అవకాశం లేకుండా అడ్డుపడింది వాసంతి.

పెద్దగా పట్టించుకోలేదు తను. ఐశ్వర్యారాయ్‌మీద రెండు మూడు సార్లు కామెంట్ చేసినప్పుడు మాత్రం గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు.

బెదిరిపోయి మౌనంగా కూర్చుంది.

తిరిగి వచ్చేటప్పుడు వాసంతికి "సారీ" చెప్పాడు. ఆ మాత్రానికే ఆమె ముఖం వికసించింది.

ఆ మసక వెన్నెల్లో గోపికల మధ్య శ్రీకృష్ణుడులా వెన్నెల ప్రాంతమంతా బృందావనంగా విహరిస్తూ రావడం సంతోషాన్ని కలిగించింది. ఆ పోలికకు నవ్వొచ్చి నవ్వుకుంటుండగా... భారతి గదిలోకి వచ్చింది. ఒక్కడే పడుకుని ముసి ముసిగా నవ్వుకుంటున్న అతన్ని చూసి–

"అన్నయ్యా....! ఏదోజరిగినట్లుందే...." కొంటెగా నవ్వుతూ అంది.

"ఏ విషయంలో" అర్థంకాక అడిగాడు

"ఐశ్వర్యారాయ్ విషయంలో... ఆ ప్లేస్‌లోకి ఇంకెవరో ప్రవేశించినట్లు అన్పిస్తోందే" చిలిపిగా అంది.

మంచంమీద లేచి కూర్చున్నాడు త్రినాధ్.

"ఇంపాజిబుల్... నా హృదయంలో ఎన్నటికీ వాడని గులాబీ ఐశ్వర్య. ఇంకేం కాగితం పూలకూ నా హృదయంలో చోటులేదు" అని ఖండితంగా అన్నాడు.

బయట హాల్లో కూర్చున్న వాసంతి చెవులబడ్డాయా మాటలు. మనసు చివుక్కుమంది.

తను కాగితం పువ్వా... ఒక సినిమా స్టార్ అతనికి గులాబిపువ్వు. అతని కడగంటి చూపుకోసం ఆరాటపడే తను కాగితం పువ్వు.

ఆమె పెదాలమీద విరిగిన పాలలాంటి నవ్వు తొంగి చూసింది.

త్రినాధ్ మాటలు వినగానే గదిలో "ఉష్" అంటూ అతని నోటికి చెయ్యి అడ్డం పెట్టింది భారతి.

చేతిని తీసి ఏంటన్నట్లు చూశాడు.

"వాసంతి వచ్చింది" మెల్లగా చెప్పింది భారతి. త్రినాధ్ పెద్దగా ఫీల్ అవలేదు. తననితాను డిఫెండ్ చేసుకోవడానికి ప్రయత్నించాడు. చాలా సాధారణంగా బయటకు వచ్చాడు.

"హలో" చెప్పింది వాసంతి.

షర్ట్ గుండీలు పెట్టుకుంటూ ఆమె పక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు. లోపల గదిలోనే వుండిపోయింది భారతి. ఆమెకి వాళ్ళ మాటలు విన్పిస్తూనే వున్నాయి.

"నన్ను గుర్తు పెట్టుకుంటారా?" అడిగింది వాసంతి.

"ఊ... మిమ్మల్నెవర్నీ మరచిపోను" చెప్పాడు త్రినాధ్.

లోపల గదిలో వున్న భారతి నుదురు కొట్టుకుంది. వీడికి ఆ అమ్మాయి మనసు అర్థంకావడంలేదు. ఎంతసేపూ ఆ పొలం, పుత్రా, చెల్లి, తమ్ముడు బాధ్యత, ఐశ్వర్యారాయ్ తప్ప ఇంకెవరూ పట్టరు.

అయినా వీడిలో ఏం చూసి ఆ బంగారు బొమ్మలాంటి అమ్మాయి ఇష్టపడిందో! మొట్టమొదటిసారి అన్నయ్యమీద కోపం వచ్చింది భారతికి.

"అందరినీ గుర్తుపెట్టుకున్నట్లే నన్నూ గుర్తుపెట్టుకుంటారా...?" ఆతృతగా అడిగింది.

"ఊహు..." ఏదో ఆలోచిస్తూ అన్నాడు త్రినాథ్.

"మరి..." ఆరాటంగా అడిగింది.

"అందరికన్నా ఎక్కువ ఏడిపించిన అమ్మాయిగా గుర్తుపెట్టుకుంటాను" చెప్పాడు త్రినాథ్.

"అంతేనా?" నిరాశగా వుంది ఆమె స్వరం. మరి కొంచెం సేపు ఆలోచించాడు త్రినాథ్.

"నేను ప్రత్యక్షంగా చూసిన వాళ్ళలో అందమైన అమ్మాయిగా గుర్తుపెట్టుకుంటాను" చెప్పాడు.

ఆమె ముఖం కొంచెం వికసించింది.

"ఈ మాత్రం ఫర్వాలేదులే" మనసులో అనుకుంది భారతి.

వాసంతి హ్యాండ్‌బ్యాగ్‌లోంచి చిన్న పేపర్ కటింగ్ లాంటిది తీసి త్రినాథ్‌కిస్తూ.

"దీనిమీద సంతకం పెట్టండి" చెప్పింది.

"ఏంటిది?"

ఆ కటింగ్‌లో వున్న ఐశ్వర్యారాయ్ బొమ్మవంక తన్మయత్వంగా చూస్తూ అన్నాడు త్రినాథ్.

"ఐశ్వర్యారాయ్‌తో వారంరోజులపాటు కబుర్లు చెప్పే అవకాశం" ఊరిస్తున్నట్లుగా అంది.

"ఏడ్పిస్తున్నారా?" తేలిగ్గా తీసుకుంటూ అన్నాడు త్రినాథ్.

"కాదు నిజమే... ఐశ్వర్య మీద ఓ స్లోగన్‌రాసి పంపిస్తే లక్కీ డీప్ ద్వారా కొంతమందిని ఎంపికచేసి ఐశ్వర్యతోపాటు షిప్‌లో వెళ్ళే అవకాశాన్ని కల్పిస్తారు" ఆమె చెప్పబోతోంటే మధ్యలోనే అడ్డుకున్నాడు త్రినాథ్.

"అదృష్టంమీద నాకు నమ్మకంలేదు. నేను కష్టపడి ఆమెను కల్సుకోవాలనుకుంటున్నాను" చెప్పాడు తను.

"ఓసారి ప్రయత్నించి చూడండి" చెప్పింది వాసంతి.

"నాకా ఛాన్స్ రాదు."

"పోనీ ఓ సంతకం పెట్టడానికి ఏంటి అభ్యంతరం" స్లోగన్ నేను రాస్తానులే" అంది.

అతని చేతిలో పెన్నుంచింది. ఏమాత్రం ఆసక్తి లేనట్లుగానే సంతకం పెట్టాడు.

భారతి గ్లాసులో చల్లని మజ్జిగ తెచ్చి యిచ్చింది. అది తాగేసి వెళతానని లేచింది వాసంతి.

ఆమె చూపులు అతన్ని వదిలి వెళ్ళలేనట్లుగా వున్నాయి.

త్రినాథ్‌కి ఆమె బాధ అర్థంకాలేదు. ఏంటీ ఈ అమ్మాయి యిలా ఫీలవుతోంది? ఈ పల్లెని వదిలిపెట్టాలనిపించడం లేదేమోనని సరిపెట్టుకున్నాడు.

గేటువరకూ వెళ్ళాడు.

"మళ్ళీ ఎప్పుడు?" అడిగింది.

అయోమయంగా చూశాడు.

"మనం కలిసేది?" విడమర్చి అడిగింది.

"ఈ డిక్కీడీప్‌లో నేను గెలిచినప్పుడు" సరదాగా అన్నాడు.

ఆమె కళ్ళు బాధతో రెపరెపలాడాయి.

"భారతి పెళ్ళికి మీ అందరికీ కార్డులిస్తాను" "తప్పకుండా రావాలి" చెప్పాడు.

అలాగేనని తలూపి బయలుదేరింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

రెండోరోజు తెల్లవారిన తర్వాత పది గంటలకి హాస్పిటల్‌కి బయల్దేరింది ఐశ్వర్య.

ఇంట్లో అందరూ చూసి మొహాలు మాడ్చుకున్నారు. ఆమెని వారించే సాహసం చేయలేదెవ్వరూ.

అరగంటలో హాస్పిటల్‌కి చేరుకుంది.

వేళ్ళేసరికి సల్మాన్ సిటౌట్‌లో కూర్చుని టీ త్రాగుతూ పేపర్ చదువుకుంటున్నాడు. ఐశ్వర్యని చూడగానే వికసించిన మొహంతో ఆహ్వానించాడు.

"ఏంటి మీలో మీరే నవ్వుకుంటున్నారు?" చనువుగా పలకరిస్తూ అతనికి ఎదురుగా వున్న చైర్‌లో కూర్చుంది.

సమాధానం చెప్పకుండా పేపర్ అందించాడు. గాసిప్స్‌రాసే సినీపత్రిక అది. దాని మెయిన్‌పేజీ హెడ్డింగ్‌లో.

"లోనావాలాలో సల్మాన్, ఐశ్వర్యల రాసలీలలు" అని రాసుంది.

చిత్రంగా ఆమెకే బాధా కలగలేదు. మేటర్ చదివినప్పుడు మాత్రం మొహం ఎర్రబారింది. అంత అసభ్యంగా వున్నాయి ఆ రాతలు.

కుతూహలంగా ఆమె మొహం చూస్తున్నాడు సల్మాన్.

"ఏమీ జరగనివాటికి కూడా కల్పించి రాయడంలో వీళ్ళు చాలా ఘనులు" చిరుకోపంగా అందామె.

ఇదివరకు గాసిప్స్ విషయంలో చాలా ఫీలయ్యేది తను. ఇప్పుడు బాధేమీలేదు. కెరీర్ ఏమవుతుందోనన్న ఆలోచనలేదు. తమిద్దరిమధ్యా ఎంతోకొంత జరిగింది కాబట్టి వీళ్ళూహించారని సరిపెట్టేసుకుంది.

"మీరు నాకోసం చాలా సాక్రిఫై చేస్తున్నారు" మనస్ఫూర్తిగా చెప్పాడు సల్మాన్

"అదేమీలేదు. ఇక ఇప్పుడు మీ బాధ్యత నాదే" తల వంచుకుని చిన్నగా చెప్పింది.

వినగానే అతను ఎక్సైట్ అయిపోయాడు. చెయిర్‌లోంచి లేచి ఐశ్వర్యకి ఎదురుగా మోకాళ్ళమీద కూలబడి–

"ఈజిట్ ట్రూ....?" అడిగాడు.

తలూపింది ఐశ్వర్య.

చప్పున ఆమె ఒళ్ళో తల దాచుకున్నాడు. ఇంతకుముందు ఎప్పుడూ ఏ స్త్రీ దగ్గరా ఇంత ఆనందాన్ని అతను పొందలేదు.

"ఇది కలా" అన్నట్లు మళ్ళీ తలెత్తి ఆమెవంక బేలగా చూశాడు.

అతని తలమీద చెయ్యేసి జుత్తు సవరించింది ఐశ్వర్య.

"లైఫ్‌లో డ్రగ్ జోలికి పోనని ప్రామిస్ చెయ్యండి...." చెయ్యి చాసింది ఐశ్వర్య.

సల్మాన్ సిగ్గుతో కుంచించుకుపోయాడు. "లైఫ్‌లో చాలా అటు పోట్లు ఎదురయ్యాయి. తట్టుకోలేక అలవాటు పడ్డాను...." చెప్పాడు.

అర్థం చేసుకున్నట్లు తలాడించింది.

"నేను కాదనడంలేదు.... కానీ నా సమక్షంలో ఆ అవసరం రాదు" చెప్పింది.

ఆమె చేతిలో చెయ్యి వేశాడు. వెయ్యేనుగుల బలం వచ్చింది.... ఏ పరిస్థితినైన ఎదుర్కోగలిగిన ధైర్యం సమకూరింది.

చాలాసేపు మౌనంగా గడిపారు. నర్స్‌వచ్చి డోర్ నాక్ చేశాక తేరుకుని మామూలుగా కూర్చున్నారిద్దరూ.

ఆమె బి.పి. చెక్‌చేసి మెడిసిన్ యిచ్చి వెళుతూ....

"గుడ్ ఇంప్రూవ్‌మెంట్ సర్. క్రెడిట్‌మీద కాదులెండి....." ముసి ముసిగా నవ్వుతూ ఐశ్వర్యవంక చూస్తూ వెళ్ళింది.

ఇద్దరికీ నవ్వొచ్చింది.

ఐశ్వర్య కెరీర్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది కాబట్టి ఇంకో నాలుగైదేళ్ళ వరకూ పెళ్ళి విషయం తలపెట్టవద్దని సల్మాన్ చెప్పడం ఆమెకి ఆనందాన్ని కలిగించింది.

"ఇదివరకు నిమిషం ఖాళీగావుంటే పిచ్చెక్కేది. ఇప్పుడు బోర్‌గా లేదు... నువ్వూ నీ ఆలోచనలూ, ఇవే నాకు పెద్దపని....." మెరుస్తున్న కళ్ళతో చెప్పాడు.

చిన్నగా నవ్వే సమాధానంగా యిచ్చింది ఐశ్వర్య.

❋ ❋ ❋ ❋ ❋ ❋

భారతి పెళ్ళి పనులు జోరందుకున్నాయి. సర్పంచి దగ్గర పెళ్ళికి కావలసిన డబ్బుని అప్పుగా తీసుకున్నాడు త్రినాధ్.

పెళ్ళిబట్టలు, నగలు, భోజన సామాగ్రి అన్నీ కొనడానికి తేదీ నిర్ణయించుకున్నారు. పెళ్ళివారు కూడా మర్యాదస్థులు, మంచివారు కావడంతో ప్రతిదీ వాళ్ళతో సంప్రదిస్తూ చేస్తున్నారు.

ఇంట్లో పెళ్ళి సందడి నెలకొంది. ప్రతిరోజూ ఇంట్లో పెళ్ళి సంబారాలని బాగుచేయడం, వచ్చేపోయే అమ్మలక్కలతో ఇంట్లో ఎవరికీ తీరిక వుండటంలేదు.

నెలరోజుల ముందే అందరికీ నచ్చిన డిజైన్‌లో శుభలేఖలు కూడా ప్రింట్ చేయించాడు త్రినాధ్.

ఇరవైరోజులు ముందు శుభలేఖలు పంచాలని నిర్ణయం తీసుకున్నారు.

సల్మాన్ హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. అతని ఆరోగ్యం నిలకడగా వుంది. ఐశ్వర్య తన పక్కనే వుందన్న ఆలోచన అతనిలో విల్‌పవర్‌ని పెంచింది.

అదే అతని బలహీనతగా మారింది. ఆమెని చూడకుండా ఒక్క పూట కూడా వుండలేకపోతున్నాడు.

ఆమె దగ్గరగా వున్నప్పుడు ప్రత్యక్షంగా మాట్లాడటం, దూరంగా వున్నపుడు మొబైల్‌లో పలకరింపు ఐశ్వర్య అనే డ్రగ్‌కి అతను ఎడిక్ట్ అయిపోయాడు.

ఆరోజు షూటింగ్ పేకప్ చెప్పగానే తల్లిని వదిలే చిన్నపిల్లాడిలా ఐశ్వర్యవంక చూశాడు.

ఆ చూపు ఇంటికి వచ్చినా ఆమెని వెన్నాడుతోంది.

మంచంమీద పడుకుని ఆలోచిస్తూ టైం చూసుకుంది ఐశ్వర్య.

ఎనిమిదీ పది అయింది టైమ్.

సల్మాన్ మొబైల్‌కి రింగ్‌చేసింది. అతను ఇంట్లోనే వున్నాడు. చాలా హుషారుగా మాట్లాడాడు ఓ అరగంట మాటలయ్యాక సెల్ ఆఫ్ చేసింది. కాని మనసు గుబులుగా మారింది.

చూసి చూసి లాభం లేదనుకుని డ్రస్ ఛేంజ్ చేసుకుని బయల్దేరింది.

తల్లి హాల్లో ఎదురై....

"ఎక్కడికిఐష్....." నార్మల్‌గానే అడిగింది.

"స్టోరీ సిట్టింగ్ వుంది మమ్మీ....." అబద్దమాడుతూ అంది.

తల్లి నొసలు ముడిపడ్డాయి.

"స్టోరీ సిట్టింగ్ ఎప్పుడూ మనింట్లోనేగా జరిగేది? అయినా ఏ బ్యానర్?...." అడిగిందామె.

తనిష్టం, తన సినిమాలూ, తన స్టోరీ, తన నటన... వాళ్ళెవరు కల్పించుకోవడానికి? ఎదురు తిరగమని మనసు పోరు పెడుతోంది.

"నేను వెళ్ళాలి...." మొండిగా ముందుకు అడుగేసింది.

"అంకుల్‌ని తీసుకువెళ్ళు..." వెనుకనుంచి అందామె.

"ఎవరూ వద్దు.... డ్రైవర్ కూడా రాడు. నేనొక్కదాన్నే వెళతాను" కసిగా అంటూ ముందుకి నడిచింది.

పావుగంటలో సల్మాన్ ఇంటికి చేరుకుంది.

గేటు బయట వాచ్‌మన్ ఆశ్చర్యంగా చూసి తలుపు తెరిచాడు.

కూర్చోలేదు ఐశ్వర్య.

"సాబ్ ఎక్కడున్నారు?" అడిగింది.

"జిమ్‌లో వునానడు....." చేయి చూపిస్తూ చెప్పాడు. అతని ఇంటికి రావడం ఇదే మొదటిసారి ఐశ్వర్యకి.

చాలా పోష్‌గా వుంది ఇల్లు... ఇంట్లోనే జిమ్ వుండటం ఓ స్టేటస్ సింబల్.

లోపలికి వెళ్ళింది. వెళ్ళేసరికి అతను ఇసుకతో నింపిన ప్లాస్టిక్ బస్తాతో బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు.

నల్లని బనియన్... కాజువల్‌పాంట్... చేతులకి బాక్సింగ్ గ్లౌజులు, అతని రెండు భుజాలూ గుండ్రంగా, నున్నగా మజిల్స్ పొంగి కనిపిస్తున్నాయి. అతని చేతులు ఉక్కుకడ్డీల్లా బిగిసి కన్పిస్తున్నాయి.

తలనుంచి కారుతున్న చెమట బిందుమలు తెల్లని అతని భుజాలమీద ముత్యాల్లా మెరుస్తున్నాయి. ఆమె రావటం గమనించలేదు సల్మాన్. గోడకి చేతులానించి నిలబడి, విలాసంగా అతన్నే పరిశీలిస్తున్నాయి ఐష్ కళ్ళు. ఇతను నిజంగా చాలా అందగాడు. అందుకే కాబోలు ప్రతి నిర్మాతా, దర్శకుడు తమ సినిమాల్లో ఒక్కసారైనా ఇతని వంటిమీద చొక్కా తీయించేస్తారు నవ్వుతూ అనుకుంది. ఇటీవల ఓ పత్రిక జరిగిన సర్వేలో తేలింది. భారతదేశంలో వున్న సెక్సీయస్ట్ మగాళ్ళలో ఇతను మూడోస్థానంలో వున్నట్లు. ఆమెలో స్త్రీత్వం, సంప్రదాయపు సంకెళ్ళను ఛేధించుకొని ముందంజ వేస్తోంది. అతని శరీరాన్ని చుట్టుకుపోవాలనిపిస్తోంది.

వయసు చేస్తున్న దాడి శరీరంలోని ప్రతి అణువుపై పెడుతోంది. అప్పుడు చూశాడు సల్మాన్ ఐశ్వర్యని.

శృంగార రసాధిదేవత వీనస్‌లా తనముందు నిల్చుంది ఐశ్వర్య.

ఇది కలా? నిజమా...?

రెపలార్పుతూ చూస్తూ వుండిపోయాడు. చిరునవ్వు నవ్వింది ఆ నవ్వు పెద్దదై జల తరంగిణిలా గదంతా చుట్టుముట్టేసింది. ఆమె విలాసంగా తన దగ్గరకి నడుస్తూ వస్తుంటే రెప్పలార్చడం కూడా మర్చిపోయాడు.

ఆలివ్‌గ్రీన్ కలర్ ఫ్రెడ్ వర్క్‌షిఫాన్ శారీ ఆమె వంటిని నల్ల త్రాచులా చుట్టేసింది. అదే కలర్ బ్లౌజు ఆమె ఎద పొంగుల్ని దాచలేకపోతోంది.

బ్లౌజ్‌కి శారీకీ మధ్య కన్పించే తెల్లని సొగసైన నడుం... అక్కడ ఓసారయినా చెయ్యివేసే అదృష్టంకోసం ప్రాణాలయినా యివ్వొచ్చనిపిస్తోంది. తడి తడిగా మెరిసే పెదవులు, ఆకుపచ్చని కళ్ళలోంచి అందుతున్న ఆహ్వానం... ఆ నడకలో రాజసం, ఆ మేని హొయలు చూస్తుంటే పిచ్చెక్కి పోతోంది.

ఆమె సరాసరి అతని ఎదురుగా వచ్చి ఆగింది.

రొప్పుతూ నిలబడ్డాడు సల్మాన్. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఆమె తనకి మరిత సన్నిహితంగా వస్తుంటే ఆ ఉద్వేగాన్ని అణిచిపెట్టుకోవడం మరింత కష్టంగా వుంది సల్మాన్‌కి.

"నేనే బహుమతి ఇచ్చేలా చేయమన్నానా?" నునుపైన భుజాలవంక చూస్తూ అంది.

అతనికి అర్థమయింది. తనకి ఈరోజు ఏదో అదృష్టం పట్టబోతోందని... ఆమెని కాసేపు ఏడిపించాలనిపించింది. లవర్‌బోయ్‌గా ఎన్నో క్యారెక్టర్స్ చేశాడతను. అమ్మాయిలను వూరించి తన తోవలోకి తెచ్చుకోవడం అతనికి బాగా తెలుసు.

"ఏం మహుమతి...?" అమాయకంగా అడిగాడు. ఆమె వుక్రోషపడలేదు. సమాధానం చెప్పలేదు. అతనికి మరింత సన్నిహితంగా వచ్చింది గుండ్రని ఒత్తైన ఆమె పెదవులవంక తమకంగా చూస్తున్నాడు సల్మాన్.

అతను ఊహించిన విధంగా ఆమె పెదాలు అతని భుజాలమీద ముత్యాల్లా మెరుస్తున్న స్వేదబిందువుల్ని ఒత్తాయి.

మనసు ఝల్లుమంది. శరీరంలో కోరిక గుప్పున ఎగిసింది. కళ్ళు మూసుకుని చివ్వున తలతిప్పాడు.

అతని రియాక్షన్‌కి ఆమెకి కించిత్ గర్వం కలిగింది. ఆమె వెంటనే అక్కడున్న సోఫాలో కూర్చుంటూ అతను తన అందానికి ఫ్లాట్ అయిపోయాడన్న అర్థం వచ్చేలా ఓ చిలిపి సైగ చేసింది.

అప్పటికి తేరుకున్నాడు సల్మాన్. అతనికి పంతం వచ్చింది. తనంతట తాను లొంగకూడదు అనుకున్నాడు.

"ఓ.కే... నేను స్నానం చేసి వస్తాను... డిన్నర్ చేశావా" అడిగాడు.

తల అడ్డంగా ఆడించింది ఐశ్వర్య.

"నువ్వు డైనింగ్ రూం దగ్గర వుండు, టెన్ మినిట్స్‌లో వచ్చేస్తాను" చెప్పాడతను.

తన నిరుత్సాహాని కనబడనీయకుండా లేచింది ఐశ్వర్య. వెనక నుంచి కన్పిస్తున్న అతని దృఢమైన నడుం, విశాలమైన భుజాలు రెచ్చ గొడుతున్నాయి. అదీకాక అతను వెళ్తూ వెళ్తూ చూసిన సొగసైన చూపు మరింత కసిని పెంచుతోంది.

సెక్సీ యస్ట్ విమన్‌కీ. సెక్సీయస్ట్ మాన్‌కీ – యిద్దరికీ పంతం... ఎదుటివాళ్ళే లొంగిపోవాలని... ఏదో ఆలోచిస్తూ కూర్చుంది ఐశ్వర్య.

❋ ❋ ❋ ❋ ❋ ❋

సల్మాన్ స్నానం చేసి ఫ్రెష్ అయివచ్చాడు. క్యాజువల్ డ్రెస్‌లో మరింత ముద్దొస్తున్నాడు. ఎర్రని అతని పెదాల మీద చిరునవ్వు మరింత రెచ్చగొడుతోంది.

డైనింగ్‌రూమ్... చుట్టూ ఎవరూలేరు. అంతా నిశ్శబ్దం... అందరికీ విషయం అర్థమయింది ఎవరికి వారు తప్పుకున్నారు. సల్మాన్, ఐశ్వర్యకి సర్వ్ చేస్తున్నాడు. అతను ఆమె పక్కన కూర్చోవటం మూలంగా వడ్డించేపుడు అతని చెయ్యి ఆమె హృదయానికి తాకుతోంది.

ఆ స్పర్శ ఇద్దరికీ తెలుస్తోంది. ఆమె మొహాన్ని కొంచెం కిందికి దించేసరికి ఆమె పెదాలు అతని దృఢమైన చేతిని తాకాయి. చెంపలు నున్నగా తగిలాయి. ఆ స్పర్శ తెలిసింది ఆమెకి.

అతను అతి కష్టంమీద తట్టుకున్నాడు. ప్రక్కనుండి ప్రొఫైల్‌లో ఆమె సౌందర్యం ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. చిన్నగా మడతపడిన నడుం, అర్ధచంద్రుడిలా కనిపిస్తున్న ఎడమ వక్షోజం... చూపు తిప్పుకోవడం కష్టంగా వుంది.

అతని చూపులు తన శరీరం మీద ఎక్కడెక్కడ తారట్లాడుతున్నాయో తెలిసి సిగ్గుగా వున్నా, కెమేరా ముందు ఆలవాటయిన ప్రొఫెషనలిజాన్ని గుర్తుతెచ్చుకుంటూ బింకంగా వుండటానికి ప్రయత్నిస్తోంది.

తేనెలో ఊరేసిన చెర్రీ పళ్ళలా వున్న పెదాల వంక చూస్తున్నాడు సల్మాన్. ఆమెకి ఊపిరాడనట్లుగా వుంది. అతనికి సెక్స్ కొత్తకాదు. కాని ఐశ్వర్యకి కొత్త. అతను వున్నంత కంట్రోల్‌లో ఆమె వుండలేకపోతోంది.

తనువంతా ఏదో ఆరాటం... శరీరంపై వున్న ఆ పల్చటి చీరే అతి బరువుగా తోస్తోంది. శరీరాన్నంతా పరిపూర్ణంగా ప్రదర్శించాలనిపిస్తోంది. ప్రపంచం మెచ్చిన ఈ సౌందర్యంతో అతనికి విందు చేయాలని వుంది.

మీకు నేను అడ్డురానట్లు కొంగు కిందికి జారింది. లోనెక్‌లోంచి బలంగా, దృఢంగా కనిపిస్తున్న వక్షోజాలు సవాలుచేశాయి.

అతని వూపిరి భారంగా పీల్చి వదిలాడు. అతనేం ప్రొసీడవ్వలేదు. ఐశ్వర్య తట్టుకోలేకపోయింది. రెండు చేతులూ అతని భుజాలమీద వేసింది.

అంతే! తుఫాన్ గాలిలా చుట్టుకుపోయాడు సల్మాన్. యుగాల తరబడి ఎదురుచూస్తున్న స్వాప్నికుడిలా ఆమె హృదయానికి హత్తుకున్నాడు.

మొదటిసారిగా అతనికి తెలిసింది ప్రేమకీ కామానికీ వున్న తేడా. చెలిస్తున్న ఆమె పెదవులని తన పెదవులతో బంధించాడు.

కాలం ఆగిపోయింది. వూపిరి స్తంభించింది. కొద్దిక్షణాలు అలాగే గడిచిపోయాయి. ముందు ఆమే తేరుకుంది.

అతని నుంచి విడివడి గట్టిగా వూపిరి పీల్చుకుంది. తొలిముద్దు తాలూకు మైకం అణువణువునూ కమ్మేసింది.

నెలవంకలాంటి నడుముని చుట్టింది అతని ఎడమచేయి. దగ్గరగా లాక్కుని మళ్ళీ ఆమెని చుంబించాడు.

అతని కుడిచేయి మోమునుంచి కిందకు పాకడం గమనించి అతని హృదయానికి హత్తుకుపోయింది. అమాయకమైన అతని పసికళ్ళు కాంక్షని నింపుకుని కనిపిస్తూంటే, అతని అణువణువునీ కొరుక్కుని తినేయాలనుంది ఆమెకి. ఇంతలో అతని పర్సనల్ సెల్ మ్రోగింది. అతనికి అర్జెంట్ పని ఏదో వచ్చింది.

ఆమె సీరియస్‌గా చూస్తుంటే ఆమె వక్షోజాల మధ్య వున్న చీలికని ముద్దాడుతూ....

"నేను ఫర్ ఫెక్ట్‌గా మారానని నమ్మకం వచ్చాక, మీ పేరెంట్స్ ఇష్టాన్ని కూడా పొంది... అప్పుడు ఫిజికల్ ఎఫైర్ స్టార్టు చేద్దాం. నాకు ప్రేమమీద నమ్మకం వుంది" చెప్పాడు సల్మాన్.

కోరిక... కాంక్ష కసితప్ప తెలీని ఇతనికి ఎంత నమ్మకం? మరెంత నిగ్రహం... ప్రపంచంలోని సౌందర్యాన్నంతా కుప్పగాపోసి అందిస్తున్నా అంగీకరం కోసం ఆగిపోవటం సాధ్యమా? అదీ ఇతనికి.. .ప్లేబాయ్‌లాంటి ఇతనికి...

అదే మంచిదనిపించింది ఐశ్వర్యకు. అతను బయటకి వెళుతూ తన డ్రైవర్‌ని ఐశ్వర్యకి తోడుగా ఇచ్చి పంపించాడు సల్మాన్. అతను చాలా సేపటి వరకు ఆమెకు అర్థం కాలేదు.

అర్థంకానిది ఆడదేకాని... మగాడుకాదు. మరిప్పుడిలా జరిగిందేంటీ? అద్వితీయమైన తన అందాన్ని అనుభవంలోకి తీసుకోనందుకు ఆమె అహం దెబ్బతినలేదు. ఆలోచనలోకి కూరుకుపోయింది.

❀ ❀ ❀ ❀ ❀ ❀

పెళ్ళి వారం రోజుల కొచ్చింది. రాఘవరావు, సావిత్రమ్మ బంధువులకి పెళ్ళి కార్డులు పంచుతున్నారు. త్రినాథ్, సారధి తమ స్నేహితులకి కార్డులు పంచుతున్నారు.

త్రినాథ్ తను ఎవరెవరికి కార్డ్సు ఇవ్వాలోనని ఆలోచిస్తుండగా వీరయ్య చౌదరి గుర్తొచ్చాడు. ఆ వెంటనే వాసంతి గుర్తుకొచ్చింది.

తనెలా మర్చిపోయాడబ్బా! అనుకుంటూ టౌన్‌కి వెళ్ళే పనిపెట్టుకున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకల్లా వీరయ్య మామ ఇంటికి చేరుకున్నాడు.

ఆయనకి పల్లెటూరిలో పొలం, ఇల్లూ వున్న పిల్లల చదువుల కోసం టౌన్‌లో కాపురం పెట్టాడాయన.

త్రినాథ్ వెళ్ళేసరికి వరండాలో పడకకుర్చీలో పడుకొని పేపర్ చదువుకుంటున్నాడు త్రినాథ్‌ని చూడగానే కుర్చీలోంచి లేచి మరీ ఎదురు వచ్చి ఇంట్లోకి తీసుకెళ్ళాడు.

"ఎంటి మామా నువ్వు... పెద్దవాడివి నన్ను చూసి నువ్వు లేవడం ఏమిటి?...." అంటూ చిన్నగా విసుక్కుంటున్నట్లు అన్నాడు త్రినాథ్.

"అల్లుడు వచ్చినపుడు ఈ మాత్రం చేయాలి కదా!...." గూడార్థంగా అన్నాడు వీరయ్య చౌదరి.

ఆ మాటలేం పట్టించుకోలేదు త్రినాథ్. చేతిలో కార్డులను చూసి "ఏంటి... చెల్లె పెళ్ళి చేస్తున్నావా? మా వాసంతి చెప్పిందిలే... మీ ఊరిలో నువ్వంటే అందరికీ హడలని విన్నాను....." భుజం చరిచి పెద్దగా నవ్వుతూ అన్నాడు వీరయ్య చౌదరి.

"ఏదోలే – మామా నీ అంత కాదులే" కౌంటర్ వేస్తూ అన్నాడు త్రినాథ్.

పెళ్ళి కార్డు వీరయ్య. చౌదరి చేతికిచ్చి "తప్పకుండా పెళ్ళికి రావాలి" చెప్పాడు.

అతని చూపులు లోపలి గదివైపు తారట్లాడడం చూసి వీరయ్య చౌదరి పెదాల మాటున గుంభనంగా నవ్వుకున్నాడు.

లోపల గదిలో వున్న వాసంతి హృదయం ఉద్విగ్నంగా వుంది. అతను తన గురించి అడిగితే బయటకు రావాలని కోరిక.... అడగడానికి మొహమాట పడుతున్నాడు త్రినాథ్.

ఎంతసేపటికీ వాసంతి బయటకు రాలేదు. చూసీ చూసీ నిరాశగా లేచి "అందరూ తప్పకుండా పెళ్ళికిరండి....." అని లోపల గదిలో వారికి వినపడేలా గట్టిగా కేకవేసి ముందుకు నడిచాడు. వాసంతి చేతిలో కాగితం నలుగుతోంది. ఆమె హృదయం నిరాశతో నిండిపోయింది.

అతన్ని చూడటానికన్నట్లు గదిబయటకు వచ్చింది. అపుడే గుమ్మం దాటబోతున్న త్రినాథ్ తన అహానిన జయించి ఇంత దూరం వచ్చినా కూడా వాసంతిని చూడకుండా ఎలా వెళ్ళడం అనుకుంటూ వెనక్కి తిరిగి....

"వాసంతి లేదా?" అని అడిగాడు. అప్పటికే గుమ్మంలో ప్రత్యక్షమైంది వాసంతి.

ఇద్దరి చూపులూ ఒకసారి కలుసుకున్నాయి. పరస్పరం పలకరింపులు పూర్తయ్యాయి. ఈలోగా వీధి గుమ్మంలో ఎవరో పిలవడంతో బయటకు వెళ్ళాడు వీరయ్య చౌదరి.

"భారతి పెళ్ళికి నన్ను పిలవకుండానే వెళ్ళిపోతున్నారా?" నిష్టూరంగా అంది వాసంతి.

"మావను పలిలవడం కోసం ఇంటికి వచ్చిన వాళ్ళకి కనిపించకుండా లోపల దాక్కోవడం మర్యాదా?"

"మీరు వెళ్ళిపోయినా మిమ్మల్ని నా దగ్గరికి రప్పించే ఆయుధం నా దగ్గర వుంది....." తలెగరేస్తూ చెప్పింది వాసంతి.

ఆమె మొహంమీద చిటికెలు వేసి "ఈ త్రినాధ్ దగ్గర ఏ ఆయుధాలూ పనిచేయవు" అతను గర్వంగా అంటుంటే అతని మొహం వంకే చూసింది వాసంతి.

"మీరు నన్ను పిలవకుండా వెళ్ళిపోతే జీవితంలో గొప్ప అదృష్టాన్ని కోల్పోయేవారు" చెప్పింది వాసంతి.

"వంద కోట్లు మిస్సయినా నేనేం బాధపడను" తేలిగ్గా తీసుకుంటూ అన్నాడు త్రినాధ్.

వాసంతి లేచి తన దగ్గరగా వచ్చి తన చేతిలోవున్న కాగితాలను చూపిస్తూ....

"మీ అదృష్టం ఇందులోవుంది...." చెప్పింది.

"ఏంటా... కాగితాలు....?" అడిగాడు.

"ఇందులో మీరు ఊహించని ఆనందం, మీ జీవిత లక్ష్యం నెరవేర్చే ఆయుధం వుంది" చెప్పింది వాసంతి.

అనుమానంగా చూసాడు.

అతన్ని ఏడిపించడం ఇష్టంలేక ఆ కాగితాలు అతని చేతికిచ్చింది. అవి చదివి అర్థం చేసుకోవడానికి అతనికి రెండు నిమిషాలు పట్టింది. విషయం అర్థంకాగానే త్రినాధ్ అపనమ్మకంగా కాగితం వంకా, వాసంతి వంకా చూశాడు. చిరునవ్వుతో తలూపింది వాసంతి.

అతని కళ్ళముందు వలయాలు తిరుగుతున్నట్లుగా, చెవుల్లో హోరుమని శబ్దం వస్తున్నట్లుగా, అసలు తనెక్కడున్నాడో అర్థం కానట్లుగా వుంది. కర్తవ్య విమూఢునిగా వున్నాడతను. ఆ కాగితాల్లోని నమ్మలేని నిజం అతన్ని నిశ్చేష్టితుడ్ని చేసింది.

"బాలీవుడ్ న్యూస్" పెట్టిన పోటీలో లక్కీడిప్ ద్వారా గెలుపొందిన వారిలో త్రినాధ్ పేరుకూడా వుంది. ముంబాయి నుంచి వచ్చిన టెలిగ్రాం ఆ వార్తని మోసుకొచ్చింది.

తమ ప్రయాణాన్ని కన్ఫమ్ చేస్తూ వెంటనే ఫోన్ చేయమని ఆ టెలిగ్రామ్ సారాంశం.

"ఇదెలా సంభవం!" కంఠం వణుకుతుండగా అన్నాడు త్రినాధ్.

"మీ తీవ్రమైన కోరికే మీ లక్ష్యానికి సన్నిహితం చేసింది....." చెప్పింది వాసంతి.

అప్పటికి షాక్నుంచి తేరుకున్నాడు త్రినాధ్.

ఆ కాగితాన్ని హృదయానికి హత్తుకున్నాడు.

భూమ్యాకాశాలు బ్రద్దలయ్యేలా అరవాలని, సంతోషంతో ప్రమధ గణ నాయకునిలా నృత్యం చేయాలని, ఎలుగెత్తి పాడాలని, పరుగెడుతూ, పరుగెడుతూ ప్రకృతిలో ఏకమవ్వాలని ఆ ఆనందాన్ని తట్టుకోవడానికి అంబరాన్ని వేదిక చేసుకోవాలని ఒకటేంటీ.... ఎన్నో ఊహలు...

త్రినాధ్లో అప్పుడే ఐశ్వర్యని చూసినంత సంబరం కలిగింది. మనిషి ఏదో లోకంలో వున్నవాడిలా అమృతాన్ని స్వీకరించిన వాడిలా, పెదాలపై చిరునవ్వు పూలు పూయిస్తూ ఈ సృష్టిలో ఎవరూ పొందనంత ఆనందాన్ని పొందినవాడిలా వున్నాడు.

అతనా కాగితాలు పట్టుకుని మాటా పలుకూ లేనివాడిలా బయటకు నడవడం చూసి విస్తుపోయింది వాసంతి. కొంచెం కోపం కూడా వచ్చింది ఆమెకు.

"హలో... త్రినాధ్గారూ!" గట్టిగా పిలిచింది. వెనక్కి తిరిగి చూశాడు.

"మీకు ఇంతటి ఆనందాన్ని కలిగించింది నేను. మరి నాకేం బహుమతి లేదా?" గారాబంగా అడిగింది.

చప్పున వెనక్కి వచ్చి ఆమె చెయ్యి పట్టుకుని ఊపేస్తూ.... "నా జీవితంలో నేనందరికీ సంతోషాన్ని పంచానే తప్ప, నన్నెవరూ ఇంతగా సంతోషపట్టలేదు. నువ్వేమడిగినా చేస్తాను చెప్పు" అన్నాడు.

అతని తీవ్రతకు బిత్తరపోయింది వాసంతి. నునుసిగ్గు బుగ్గలపై జాలువారింది.

"మీరు ముంబాయి వెళ్ళేలోపు అడుగుతాను" చెప్పింది.

"నేను మళ్ళీ కలుస్తా...." అంటూ బయటకి వచ్చాడతను.

అతను వెళ్ళిపోయాక చిరునవ్వు నవ్వుతూ పెళ్ళికార్డు తెరిచింది వాసంతి.

పెళ్ళి ముహూర్తం తేదీ, సమయం చూసి అచేతనురాలై నిలబడిపోయిందామె. అతను క్రూయిజర్లో అడుగుపెట్టాల్సిన సమయం, పెళ్ళి ముహూర్తం, రెండూ కొద్ది నిమిషాల తేడాతోనే అదే రాత్రి 10 గంటలకు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

స్టూడియోలో షూటింగ్ జరుగుతుండగా ఐశ్వర్యను కలిసాడు రమేష్ పవార్. అతన్ని చూసి చిరునవ్వుతో ఇన్వైట్ చేసింది ఐశ్వర్య.

సల్మాన్ దూరంనుంచే చూశాడు గాని మాట్లాడలేదు. అతనికి రమేష్ పవార్కి వ్యక్తిగతంగా చిన్న గొడవలున్నాయి. చూసీ చూడనట్లుగా తన స్క్రిప్ట్ చదువుకుంటూ కూర్చున్నాడు.

లంచ్ టైం కావడంతో ఐశ్వర్య కూడా ఫ్రీగానే వుంది.

"మనం ప్రోగ్రాం న్యూస్ ఏంటండీ...." తనే ముందడిగింది ఐశ్వర్య.

"లక్షలు... లక్షల్లో వచ్చాయి మేడం అప్లికేషన్స్ ఇంత ఫాలోయింగ్ ఇంతకు ముందెప్పుడూ చూడలేదు....." ఉద్వేగంగా అన్నాడు రమేష్ పవార్.

ఆ పొగడ్తని చిన్న చిరునవ్వుతో స్వీకరించింది ఐశ్వర్య.

"లక్కీడీప్ ద్వారా మీరు మొన్న తీసిన విజేతల పేర్లు మా మేగ్జైన్‌లో వేశాం. వాళ్ళందరికీ టెలిగ్రామ్స్ పంపించాం. కన్‌ఫర్‌మేషన్ కాల్స్ కూడా వస్తున్నాయి. ఇంత అదృష్టాన్ని ఎవరు పోగొట్టుకుంటారు? విజేతల లిస్టు మీకొంకటి ఇద్దామని తెచ్చాను...."

అని లిస్టు ఆమెకిచ్చాడు. ఆ లిస్టు తీసుకుని విజేతల బయోడేటాను వాళ్ళు తమమీద వ్రాసిన వాక్యాలను చదువుతూ నవ్వుకుంటోంది సల్మాన్ మనసంతా మెలి త్రిప్పినట్లుగా మారింది.

ఐశ్వర్య తనతోనే ఎక్కువసేపు మాట్లాడాలి. తనవంకే చూడాలి తనను చూసే నవ్వాలి అన్న స్వార్థం రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఆమె రమేష్‌పవార్‌తో అందులోనూ, తనంటే గిట్టని పవార్‌తో అంతసేపు మాట్లాడటం నచ్చడంలేదు.

అలాగని అతనితో మాట్లాడవద్దని ఎలా చెప్తాడు...? ఆల్ రెడీ అతను కండక్ట్ చేస్తున్న ఓ ప్రోగ్రాంలో ఆమె ఇన్‌వాల్వ్ అయింది.

"ఇంకో వారం రోజుల్లో ఐశ్వర్య తనను వదిలి వీళ్ళందరితో మలేషియా వెళ్ళిపోతుంది సముద్ర ప్రయాణం ద్వారా. ఏం చేయాలిప్పుడు...? ఎలా ఈ సమస్యను ఎదుర్కోవడం....?" తీవ్రంగా ఆలోచిస్తున్నాడు సల్మాన్.

అతనికో ఐడియా వచ్చింది. క్షణాలమీద తన షూటింగ్స్ జరుగుతున్న సినిమా నిర్మాతలిద్దరికీ ఫోన్‌చేసి తన కాల్షీట్స్ ఎడ్జెస్టమెంట్ గురించి మాట్లాడాడు. వాళ్ళూ ఒప్పుకున్నారు.

సల్మాన్‌కి చాలా సంతోషంగా అన్పించింది.

రమేష్‌పవార్ ఎప్పుడు వెళ్ళిపోతాడా... అన్నట్లు చూడసాగాడు.

ఐశ్వర్య విజేతల బయోడేటాలు పరిశీలిస్తుంటే రమేష్‌పవార్ ఆమెతో ఓ విషయం చెప్పడం కోసం ఎలా చెప్పాలో తెలియక తటపటాయిస్తున్నాడు. చివరకు ధైర్యంచేసి....

"మేడం! మీతో ఓ పర్సనల్ విషయం మాట్లాడాలి....." అడగలేక అడిగాడు.

కళ్ళెత్తి చూసింది ఐశ్వర్య.

"మీ పర్సనలా...?" అడిగింది ఐశ్వర్య.

"కాదు....." తల అడ్డంగా ఊపాడు.

ఐశ్వర్య కర్థమయింది అతనేం అడగబోతున్నాడో...

దూరంగా కుర్చీలో కూర్చుని ఉక్రోషంగా తననే చూస్తున్న సల్మాన్ కన్పించాడు. నవ్వొచ్చింది.

ఓ విలాసవంతమైన నవ్వు బుగ్గల్ని మరింత ఎర్రబరిచింది.

"అడగండి" మృదువుగా అంది.

"సల్మాన్ విషయంలో మీకూ అతనికీమధ్య ఎఫైర్ నడుస్తోందని గాసిప్స్ వస్తున్నాయి."

అతను చెప్తుండగానే ఆమె కుడి కనుబొమ చిన్నగా పైకి లేచింది చాలా చిన్న కదలిక అది.

కానీ అందులోని భావం అతనికర్థమైపోయింది.

ఆమె నటజీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని అతి సన్నిహితంగా పరిశీలించిన వాళ్ళలో అతనొకడు. తనాప్రశ్న అడగడంతో ఆమెకెంత అయిష్టతను కలిగించిందో పెదాలమీద నవ్వు చెదరనీకుండానే ఒక కనుబొమ కదలిక ద్వారా తెలియజేసింది.

ఐశ్వర్య అద్భుతమైన నటికదా! ఆమె ఇష్టా యిష్టాలు ప్రదర్శించడానికి మాటలే అవసరంలేదు.

చిన్నగా నిట్టూర్చి తల తిప్పుకున్నాడు పవార్. అతనికర్థమయింది నిజంగానే ఏదో జరుగుతోందని.

ఐశ్వర్య అలాగే రాజసంగా కూర్చుంది.

ఆమెకెలాగయినా నచ్చజెప్పాలనుకున్నాడు పవార్. అందుకు ఆమె తనను నిందించినా సరే, మొదటినుంచీ ఆమెకు శ్రేయోభిలాషి తను.

"తను డ్రగ్ ఎడిక్ట్... అది మీకు తెలుసా...?" చిరుకోపంగా అడిగాడు.

చిరునవ్వు మాయలేదామె మొహంలో.

"తెలుసు... ఎవర్షన్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు...." అతి మామూలుగా చెప్పింది.

"మద్యం విపరీతంగా సేవిస్తాడు."

"మానేసాడీ మధ్య."

"చెయిన్ స్మోకర్."

"అదీ మానేసాడు."

విస్తుపోయి చూశాడు పవార్.

"అతనికి మాఫియాతో లింక్స్ వున్నాయని ఇంటిలిజెన్స్." పవర్ మాటల్ని మధ్యలోనే ఆపేసి.

"బాలీవుడ్ న్యూస్‌మీద, ఆ మ్యాగ్‌జైన్ ఎడిటర్ మీద నాకు చాలా గౌవరం. గాసిప్స్‌కు దూరంగా వుంటారని, దయచేసి ఆ గౌరవాన్ని నిలబెట్టుకోండి" చెప్పిందామె మృదువుగానే.

రమేష్ పవార్ మొహం నల్లబడిపోయింది.

"సారీ... మేడం" అస్పష్టంగా చెప్పాడు.

లైట్ బాయ్‌తో సల్మాన్‌ను ఇక్కడకు రమ్మని కబురు చేసింది ఐశ్వర్య.

లేచి వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు పవార్.

"ఒన్ మినిట్. కూర్చోండి." చెప్పిందామె.

సల్మాన్ రాగానే రమేష్ పవార్‌ను చూపిస్తూ "ఈయన మీకు తెలుసా? బాలీవుడ్ న్యూస్ ఎడిటర్ రమేష్ పవార్....." పరిచయం చేసింది.

సల్మాన్ మొహంలో హేళనగా ఓ చిరునవ్వు చూసింది. అది పవార్ దృష్టిని దాటిపోలేదు. ఇద్దరిమధ్యా వున్న గొడవలు గురించి ఐశ్వర్యకు తెలియదు. తన ప్రోగ్రాం గురించి పవార్ సమక్షంలోనే సల్మాన్‌కు చెప్పింది ఐశ్వర్య.

నవ్వుతూ విన్నాడు సల్మాన్.

"ఐష్.. ఇప్పుడు నేను చెప్పే విషయం వింటే నువ్వు చాలా ఆశ్చర్యపోతావు" అన్నాడు సల్మాన్.

"ఏంటది... ఆశ్చర్యంగా అడిగింది ఐశ్వర్య.

"నేను కూడా నెక్స్ వీక్ మలేషియా వెళుతున్నాను. మనం అక్కడ మీటవుదాం చెప్పాడు సల్మాన్.

"ఈజిట్...." ఆశ్చర్యంగా అంది ఐశ్వర్య.

ఒక్కక్షణం ఆలోచించి "మీరు ఫ్లైట్‌లో వెళుతున్నారా?" అడిగింది.

తలూపాడు సల్మాన్.

"మీ టైం పర్మిట్ చేస్తే నాతోపాటు క్రూయిజర్‌లో రావచ్చుగా, సరదాగా సముద్ర ప్రయాణం" అడిగింది.

ఆశ్చర్యపోయాడు పవార్. అతని ఫీలింగ్స్ గమనించాడు సల్మాన్.

"నా అభ్యంతరం లేదుకానీ, బాలీవుడ్‌న్యూస్ వాళ్ళకి ఏమైనా ప్రాబ్లమేమో ఓరగా రమేష్ వంక చూస్తూ అన్నాడు సల్మాన్.

"నన్ను ఒక్కదాన్నే చూడాలని వచ్చే పాఠకులు, సల్మాన్‌ని కూడా చూస్తే, వాళ్ళకి ప్లజర్ ట్రిప్ అవుతుంది. మీరు సల్మాన్‌కేం ఆఫర్ చేయనక్కరలేదు."

రమేష్ పవార్ ఆలోచించడం చూసి అతను ఎమౌంట్‌కోసం ఆలోచిస్తున్నాడని అంది ఐశ్వర్య.

రమేష్ పవార్‌కి అది ఒప్పుకోక తప్పని పరిస్థితి. ఎందుచేతనంటే క్ర్యూయిజర్‌లో టిక్కెట్లన్నీ తనే కొనలేదు. తను కాదంటే విరోధం తెచ్చు కోవటడం తప్ప సాధించేదేంలేదు. అతనా్రెడీ రావటానికి సిద్ధంగా వున్నాడు. తను కాదంటే మామూలు ప్రయాణికుల్లా అయినా వస్తాడు. అతనిలోని విచక్షణ మేల్కొంది.

"వైనాట్ విత్ ప్లెజర్" పెదాలకు నవ్వు పులుముకుంటూ అన్నాడు రమేష్ పవార్.

ఈ వారం రోజులూ అతన్ని వదిలి ఎలా వుండాలా అని బాధపడుతోంది తను. ఇప్పుడు సమస్య పరిష్కారమయింది. సంతోషంగా వున్న పేరెంట్స్‌కు చెప్పాలన్న ఆలోచన కూడా వదిలి వేసింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

వీరయ్య చౌదరి ఇంటినుంచి బయట అడుగుపెట్టగానే ఎదురుగా కన్పించిన ఎస్.టి.డి బూత్‌లోకి వెళ్ళి బాలీవుడ్ న్యూస్ పత్రికకి ఫోన్ చేశాడు. తన ప్రయాణాన్ని వచ్చీరాని హిందీలో కన్‌ఫాంచేసి చెప్పాడు.

అక్కడ్నుంచి ఏంచేయాలో తోచనట్లు టౌన్‌లో వున్న వీధులన్నీ ఆ ఎండలో చెమటలు కక్కుకుంటూ అయోమయంగా తిరిగేశాడు. తరువాత తన ప్రయాణానికి కావలసిన సరంజామా అంతా కొనుక్కున్నాడు.

సాయంత్రమయ్యేసరికి ఇంట్లో అడుగుపెడుతూ చేతిలో వున్న కార్డులవంక చూసుకున్నాడు.

కొద్దిగా మైకం దిగినట్లయింది.

కానీ తననితానే సమాధాన పర్చుకున్నాడు. ఇంట్లోకి వెళ్ళగానే తల్లి ఎదురొచ్చింది.

"ఏంట్రా ఇంతాలస్యం... ఎండనపడి కుక్కలా తిరుగుతున్నావు. భోజనమయినా చేశావా?" మందలింపుగా అందామె. మౌనంగా కుర్చీలో కూర్చున్నాడు త్రినాథ్.

అతని చేతిలో వున్న సూట్‌కేస్ నందుకుంటూ–

"ఏం తెచ్చావురా?" అంటూ విప్పి చూసింది.

అందులో ఏవో కాగితాలు, రంగులూ చిన్న బ్రష్‌లూ ఆమెకేమీ అర్థంకాలేదు.

"కార్డులు పంచమంటే ఇవన్నీ కొనుక్కొచ్చావా? ఏమైందిరా అలా వున్నావ్....? అతని వంక చూస్తూ అడిగింది తల్లి.

ఆమె కంఠంలోని గాభరాని గుర్తించి ఇంట్లో అందరూ హాల్లోకి వచ్చారు. అతను భారతివంక చూశాడు. కొంచెం బాధ కలిగింది. కానీ అది మెలిపెట్టేంతగా లేదు. తల దించుకున్నాడు. తను చెప్పాల్సిన ఒక్కమాట మనసులో పేర్చుకుంటూ.

"చెల్లి పెళ్ళికి నేను ఇంట్లో వుండడం లేదమ్మా" చెప్పాడు.

అతనేమన్నాడో ముందెవరికీ అర్థంకాలేదు. మళ్ళీ రిపీట్ చేశాడతను. అతను జోక్ చేస్తున్నాడనుకుంది భారతి.

"ఉండక...."

కోపంగా అంది సావిత్రమ్మ.

ఎలా చెప్పాలో తెలియడంలేదు త్రినాథ్‌కి.

"నేను మలేషియా సముద్ర ప్రయాణంమీద వెళుతున్నాను....." చెప్పాడు.

భారతికి ఏదో అర్థమైంది. వాసంతి వెళ్ళేముందు త్రినాథ్‌తో మాట్లాడిన విషయం గుర్తొచ్చింది.

అయోమయంగా చూసింది సావిత్రమ్మ.

"మలేషియా ఎందుకురా?" అడిగింది.

చెల్లెలివంక అపరాధిలా చూసి తల దించుకున్నాడు.

"ఓ పత్రికవాళ్ళు పెట్టిన పోటీలో నేను గెలిచాను. నాలాగా ఇంకా కొందరు గెలిచినవాళ్ళున్నారు. మేమంతా కలిసి ఐశ్వర్యారాయ్‌తో ఓ వారం రోజులు పెద్ద షిప్‌లో ప్రయాణించే అవకాశం దొరికింది" ఉద్వేగంగా చెప్పాడు.

బుగ్గన చెయ్యేసుకుని వింది సావిత్రమ్మ. విన్నాక కొడుకు తలమీద ఓ మొట్టికాయ వేసి–

"నీకా పిచ్చి పోలేదేరా....? నేనింకా ఇంకేంటో అనుకుని భయపడ్డాను. చాలు చాల్లే... ఎక్కడికీ వెళ్ళేదీ" అతని మాటల్ని పేలపిండిలా ఎగరగొట్టేసి లోపలకు వెళ్ళబోయింది సావిత్రమ్మ.

"నేను వెళ్ళాలని నిశ్చయించుకున్నాను...." గట్టిగా చెప్పాడు త్రినాథ్.

అందరూ అతనివంక అపనమ్మకంగా చూశారు.

"చెల్లి పెళ్ళి ఎలాగరా?" రాఘవరావు మందలిపుంగా అన్నాడు.

"నువ్వు, తమ్ముడు వున్నారుకదా....." తేలిగ్గా అన్నాడు త్రినాథ్.

"పెళ్ళివారడిగితే ఏం చెప్తాంమురా... ఇక్కడ ఎక్కడి పనులు ఎక్కడ వదిలేసి, నువ్వు వెళ్ళిపోతే మేం ఎలా నెబాయించుకు రావాలి....? ముందు నుంచి భారమంతా నీమీదే వేశాం" తల్లి దుఃఖపూరిత స్వరంతో అంది.

"నేను బయలదేరడానికి మూడు రోజులు సమయం వుంది. ఈ లోపు సాధ్యమైనంతవరకు అన్ని పనులూ చేస్తాను" చెప్పాడు త్రినాథ్.

"నువ్విలా చేశావని తెలిస్తే... వాళ్ళు అసలే సాంప్రదాయం కలవారు. చెల్లికి సంబంధం తప్పిపోతుందేమోరా...?" ఆందోళనగా అంది తల్లి.

"ఇది తప్పిపోతే చెల్లికి ఇంకో సంబంధం చూసి పెళ్ళి నేను చేయగలను. కానీ ఐశ్వర్యరాయ్‌తో యింత సమయం గడిపే అవకాశం పైసా ఖర్చులేకుండా నాకు రాదు నన్నర్థం చేసుకోండి" ఖచ్చితంగా చెప్పాడు.

ఆ మాట వినగానే అందరూ నిర్ఘాంతపోయారు. భారతి ఏడుస్తూ లోపలి గదిలోకి వెళ్ళిపోయింది. అందరికీ అర్థమయిపోయింది. ఇక అతను ఆ నిర్ణయం నుంచి బయటకు రాడని, అందరూ నిరసనగా చూస్తూ లోపలికి వెళ్ళిపోయారు.

అతనకొక్కడే ఒంటరిగా చాలాసేపు కూర్చొని ఆలోచించుకుంటూ వుండిపోయాడు. తర్వాత స్నానంచేసి వంటగదిలోకొచ్చాడు. ఎవరూ అతనికి వడ్డించటానికి రాలేదు తనే అన్నం పెట్టుకుని తిన్నాడు. నూతిగట్టు పక్కన నులకమంచం వేసుకుని దానిమీద దుప్పటి పరుచుకొని కూర్చుని సారధిని పిలిచాడు.

మాటాపలుకూ లేకుండా వచ్చినిలబడ్డాడు సారథి.

"కూర్చో....." తన ప్రక్కన చోటు చూపించాడు త్రినాథ్.

"కూర్చోలేదు సారధి! పరవాలేదు చెప్పు...." విసుగ్గా అన్నాడు. పెళ్ళికవసరమయిన ఖర్చు, ఇంతవరకు తీసుకొన్న లిస్టు, ఇంకా కొనాల్సినవి బీరువాలో వున్న డబ్బూ, నగలూ, బట్టలూ అన్నీ అతనికి వివరించి చెప్పాడు.

ఎవరెవరికి అడ్వాన్స్‌లు ఇచ్చిందీ, ఇంకా ఎంత డబ్బు కట్టాలి.... అన్ని వివరాలతో వున్న పుస్తకాన్ని అతని చేతికిచ్చాడు.

బీరువా తాళాల్ని కూడా సారధికివ్వబోతుంటే అసహాయంగా చూశాడతను.

"ఒకోసారి మనిషి జీవితం అంతే. కోరికలకీ, బాధ్యతలకీ మధ్య నలిగిపోవలసిందే. తీర్చుకోలేమనుకున్న కోరిక తీరే అవకాశం వచ్చినపుడు వదిలిపెడితే జీవితమంతా చింతిస్తూ కూర్చువలసిందే......" చెప్పాడు త్రినాథ్.

మారు మాట్లాడకుండా తాళాలూ, పుస్తకం తీసుకొని లోపలికి నడిచాడు సారధి.

అప్పటికి ప్రశాంతంగా మారింది త్రినాథ్ మనస్సు.

ఆకాశంలో మిలమిలా మెరుస్తున్న నక్షత్రాలవంక చూడసాగాడు, ఆ తారలో ఓ ధృవతార అతని చూపుని కట్టిపడేసింది. తరచి చూడగా అందులో ఐశ్వర్యారాయ్ ముఖమే కనబడసాగింది. అతని అంతరంగమంతా చెప్పలేనంత సంతోషంతో నిండిపోయింది.

ఎక్సైట్‌మెంట్ మనస్సును ఊపేస్తోంది. తను చనిపోయేలోపు ఐశ్వర్యను చూడాలనుకున్నాడు. కానీ ఇంత తొందరగా ఆమెను చూస్తాననుకోలేదు.

అది కూడా వారం రోజులపాటు ఆమెతో కలిసిమెలసి వుండే అవకాశం లభిస్తుందనుకోలేదు. ఇది నిజంగా అదృష్టం. చాలా తక్కువమంది జీవితాల్లో వచ్చే అదృష్టం యిది.

హఠాత్తుగా అతనికో విషయం తట్టింది. తనలోని ఈ ఆనందానికంతటికీ మూలకారణం ఎవరూ? అనుకోగానే వాసంతి గుర్తొచ్చింది ఆమే కదా దీనికంతటికి కారణం.... ఆరోజుతనెంత వ్యతిరేకించినా బలవంతంగా తనతో సంతకం పెట్టించింది. అంతేకాదు, అవకాశం రాగానే ఎలాంటి అసూయా లేకుండా నిష్కల్మషంగా తనకి చూపించింది.

అలాంటి ఆమెకు తనేమివ్వగలదు. ఈ రెండు మూడూ రోజులూ తను చాలా బిజీగా వుంటాడు. తను ముంబాయి వెళ్ళేలోపు ఆమె ఏదో కోరిక కోరతానంది. అదేదో ఇప్పుడే అడిగిస్తేసరి.... అనుకుంటూ ఒక్క ఉదుటున మంచం మీంచిలేచి కాకాహోటల్ దగ్గరవున్న ఎస్.టి.డి. బూత్ వైపు నడిచాడు అప్పుడు రాత్రి తొమ్మిదయింది. అటువైపు వీరయ్య చౌదరి ఫోనెత్తాడు.

"హలో...." తడబడుతూ అన్నాడు త్రినాథ్.

"ఎవరు మాట్లాడుతున్నారు....." వీరయ్యచౌదరి గొంతు ఖంగున మోగింది. మరింత తత్తరపడ్డాడు త్రినాథ్.

"ఎవర్రా మాట్లాడేది? త్రినాధ్‌బాబు గొంతులా వుందే? హలో..." అన్నాడు వీరయ్య.

"ఏంట్రా ఇంతరాత్రిపూట...?"

"మరేంలేదు... మరేంలేదు..." నసిగాడు త్రినాథ్.

"మా వాసంతితో మాట్లాడాలా?" రహస్యంగా అడిగాడు.

"ఊఁ..." అన్నాడు త్రినాథ్.

పెద్దగా నవ్వుతూ వాసంతిని పిలిచి ఫోనిచ్చాడు వీరయ్య. అప్పటికి ఈ ఇద్దరి ఈడూ జోడూమీద ఆయనకి ఒక అభిప్రాయం ఏర్పడింది. స్థాయిలో తనకు సరితూగకపోయినా కూతురు ఇష్టానికి విలువ ఇవ్వాలని అనుకున్నాడాయన.

రిసీవర్ అందుకుంది వాసంతి...

"హలో..." ఓ మధురమైన కంఠధ్వని చెవుల బడగానే ఎలర్ట్ అయ్యాడు త్రినాథ్.

"నేను త్రినాథ్‌ని..." చెప్పాడు.

అతని ఫోన్‌ను అసలు వూహించలేదు వాసంతి. ఓ క్షణం ఆశ్చర్యపడినట్లుగా నిశ్శబ్దం అలుముకుంది.

"చెప్పండి" మృదువుగా అందామె.

వెంటనే ఏం చెప్పాలో తోచలేదు. తర్వాత మెల్లగా నోరువిప్పి-

"ఇందాక పడుకొని ఆలోచిస్తుంటే నా ఆనందానికి మీరే కారణమని అన్పించింది. మీరు నన్నేదో కోరిక కోరతానన్నారు. రెండు మూడు రోజులు నేను చాలా బిజీగా వుంటాను. ఎన్ని పనులున్నా మీకోసం, మీరు చెప్పే పనికోసం నేను సిద్ధంగా వుంటాను" చెప్పాడతను.

ముసిముసిగా నవ్వుకుంది వాసంతి. ఓ క్షణం ఆలోచించి-

"మీరు ముంబాయి వెళ్ళడానికి ట్రయిన్ ఎక్కేముందు ఒకపూట ముందుగా మా ఇంటికి రండి. ఇక్కడ భోంచేసి వెళ్దురుగాని..." చెప్పిందామె.

"అదిసరే! మీరేదో కోరతానన్నారు" ఆతృతగా అడిగాడు. కిలకిలా నవ్విందామె.

"తొందరపడకండి. అప్పుడే అడుగుతాను" చెప్పిందామె.

"సరే! అయితే" అంగీకరించాడు త్రినాథ్. ఆమెకు చెప్పేసి ఫోన్ పెట్టాకా ప్రశాంతంగా అన్పించింది అతనికి. ఇంటికి తిరిగివచ్చి అందమైన కలలు కంటూ నిద్రలో మునిగిపోయాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

అందమైన ప్యాలెస్‌లా వుంది ఆ భవన సముదాయం. ముంబయిలో అతి ఖరీదైన ప్రాంతంలో సంపన్నులు నివసించే ప్రదేశంలో వుందది. అక్కడ వుండే ప్రతి ఇల్లూ అత్యద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో నిర్మించబడుతుంది. అందులో ఒకటి ఐశ్వర్యారాయ్ నివసించే భవనం.

ఆమె ఎలా ప్రపంచ సుందరో... ఆమె నివసించే భవనం కూడా అలాగే రాజసంతో అలలారుతుంటుంది. సాంప్రదాయ, ఆధునికతలు మేళవింపు ఆ భవంతిలో అణువణువునా కన్పిస్తుంది.

ఆ భవన నిర్మాణం కోసం రాజస్థాన్ నుంచి సాంప్రదాయ శిల్పులను, ఫ్రాన్స్ నుంచి ఆధునికులను రప్పించింది ఐశ్వర్య. ఇంటీరియల్ డెకరేషన్ కోసం పలు కంపెనీలు పోటీపడగా ఆచితూచి ఢిల్లీలో ప్రసిద్ధి గాంచిన ఓ ఇంటిరియర్ కంపెనీని సెలక్ట్ చేసుకుందామె. ఆ భవనంలో ప్రతిచోటూ అత్యంత కళాత్మకంగా తీర్చిదిద్దినట్లు కనబడుతుంది.

ఐశ్వర్యకు స్వదేశీ వస్తువులతోపాటు విదేశీవస్తువుల వాడకం వట్లకూడా మక్కువ ఎక్కువ. కేన్స్ ఫిలిమ్ పెస్టివల్లో భారతీయ వస్త్రాధారణ అయిన చీరను ధరించకుండా, పాశ్చాత్య వస్త్రాలను ధరించిందని పత్రికలన్నీ విమర్శించినా ఆమె పెద్దగా ఫీల్ అవలేదు.

ఎందుకంటే, ఆమె దేశీయత కంటే అంతర్జాతీయతకూ, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది.

తాను భారతీయురాలైనందుకు గర్వించినా, ఇతరదేశాలపట్ల ఆమెకు విముఖత లేదు.

ఆమెకు ప్రకృతి సౌందర్యం పట్ల ఆసక్తి ఎక్కువ. అందుకే తన భవనంలోని, అలంకరణను ప్రకృతి సహజత్వానికి దగ్గరగా వుండేలా చూసుకుంది. మనం కళ్ళు తెరవగానే చుట్టూ కన్పించే పచ్చని చెట్టూ, రంగు రంగుల పూలూ, జలపాతాలు ఇవే ఆ భవనం అలంకరణలో ప్రముఖ పాత్ర వహించాయి.

హాల్లో కూర్చుని వుంది ఐశ్వర్య. పొద ఆకారంలో వున్న ఓ సోఫాలో కూర్చుని వుంది. ఆమె రెండు రోజుల నుంచీ తన మలేషియా ట్రిప్ గురించి పేరెంట్స్‌తో చెప్పాలనుకుంటోంది.

ఈ ప్రోగ్రాంను ముందు వాళ్ళ అనుమతితోనే ఐశ్వర్య ఒప్పుకుంది అన్నయ్యగానీ, తల్లిగానీ తోడువస్తారని అప్పుడు ఆమె అభిప్రాయపడింది కానీ తనతో ఇప్పుడు సల్మాన్ వస్తున్నాడు.

తన పేరెంట్స్ కూడా వస్తే, తను సల్మాన్‌తో మాట్లాడితే వాళ్ళు సహించలేరు. పబ్లిక్‌లో పెద్ద రభస అవుతుంది.

కాబట్టి వీళ్ళెవరూ తనతో రాకుండా డ్రాప్ అవమని చెప్పాలి. అదెలాగో అర్థంగావటంలేదు.

మిస్సిండియా కాంపిటీషన్స్ దగ్గర నుంచీ తనకు తోడుగా, నీడగా తన వ్యవహారాలన్నీ తనతల్లే చక్కబెట్టుకుంటూ వస్తోంది. అలాంటి ఆమెతో రావద్దని ఎలా చెప్పాలి....? మొదటిసారిగా ఐశ్వర్య తన పేరెంట్స్ పట్ల విసుగ్గా ఫీలయింది.

తనకీ కొంత ప్రైవసీ కావలసి వుంటుందని వీళ్ళెందుకు ఊహించరు.... తనకా వయసొచ్చింది. తన ఫ్రెండ్‌ను సెలక్ట్ చేసుకునేటప్పుడు తనకి ఒంటరిగా వదిలిపెట్టాలన్న ఆలోచనైనా వీళ్ళకి రావాలి కదా! తనేమీ చిన్నపిల్లకాదు.

ఇప్పటి హీరోయిన్‌లలో చాలామంది పదహారు, పదిహేడేళ్ళకే పదిమంది బాయ్‌ఫ్రెండ్స్‌ను మార్చి అర్థరాత్రి వరకూ డిస్కోలు, పబ్స్ అంటూ తిరుగుతూ జీవితాన్ని రంగుల కలలా గడిపేస్తుంటారు.

కానీ తనలా కోరుకోలేదు. మొదటినుండీ వారు పెట్టిన కట్టుబాట్లలోనే పెరిగింది. దీర్ఘంగా ఆలోచిస్తున్న కూతుర్ని కనిపెడుతూనే వుంది ఐశ్వర్య తల్లి.

ఆమె మనసంతా వేదనమయంగా మారింది. ఇతర హీరోయిన్ల తల్లిదండ్రుల్లా ఆమె గ్లామర్ నడ్డుపెట్టుకుని తాము పైకెదగాలని అనుకోలేదు.

ఆమె ఒక్కోమెట్టు ఎక్కుతుంటే ఆ మెట్లకు తాము పునాదులయ్యారు. ఆమె వున్నత స్థానానికి చేరడానికి తాము అహర్నిశలూ శ్రమిస్తున్నారు. ఆమె ఎవరూ అందుకోలేనంత ఎత్తుకు ఎదగారని ఆరాటపడుతున్నారు. ఇప్పుడిప్పుడే నెంబర్‌వన్ పొజిషన్‌కు చేరుకుంటున్న దశలో సల్మాన్‌తో ఎఫైర్ ఆమెను ఏపరిస్థితుల్లోకి నెట్టివేస్తోందోనని వాళ్ళ భయం... వాళ్ళిద్దరి మధ్యా అనుబంధం ఇంకా చేయిదాటిపోలేదని తల్లినమ్మకం.

ఎందుకంటే, అంత క్రమశిక్షణలో తాము ఐష్‌ను పెంచారు. ఈ వలయంలోంచి ఆమె ఎలాగోలా బయట పడితేచాలు. ఐశ్వర్య తల్లి దేవుడ్ని ప్రార్థించింది.

దిగులుగా కూర్చున్న కూతురు దగ్గరకు వచ్చి జూస్‌గ్లాస్ చేతికి అందించింది అన్యమనస్కంగానే తీసుకుంది ఐశ్వర్య. ఈలోపే బయట పనుల మీద వెళ్ళిన తండ్రీ, అన్నయ్య కూడా వచ్చారు. అందరూ ఏవో కబుర్లలో మునిగిపోయారు.

ఐశ్వర్య ఏదో ఆలోచిస్తూండడం గమనించాడు ఆమె అన్నయ్య. సల్మాన్ విషయంలో డౌట్ వచ్చిన దగ్గర్నుంచీ ఆమెకు సంబంధించిన విషయాలమీద ఓ కన్నేసి వుంచాడు.

ప్రధానంగా అతని నోటీస్‌లో కొచ్చిన రెండు విషయాల్లో ఒకటి : ఐశ్వర్య తన సెక్రటరీని మార్చుకోవటానికి ట్రై చేస్తోందని.

రెండు : ఈస్ట్ పాస్ట్ క్రూయిజర్‌లో సల్మాన్‌కీ అతని అసిస్టెంట్‌కీ క్యాబిన్స్ బుక్ అయిన విషయం....

పరిస్థితి తమ చెయ్యి దాటిపోతున్నట్లుగా అనిపించిందతనికి ఐశ్వర్య ముభావానికీ, తన నోటీస్‌కొచ్చిన విషయాలకీ సంబంధం వుందని నమ్ముతున్నాడతను, అదేదొ ఇప్పుడే తేల్చేయాలనుకుంటున్నాడతను.

"మమ్మీ! నెక్స్ట్‌వీక్ ఐష్‌తో మలేషియా నువ్వు వెళుతున్నావా?... నేను వెళ్ళాలా..." ఐశ్వర్య ఫీలింగ్స్‌ని కనిపెడుతూ తల్లిని అడిగాడు అతను. ఆవిడకు ఈ విషయం తెలియదు.

"వారంరోజులు పైగా క్రూయిజర్‌లు సముద్ర ప్రయాణం నా కంతగా పడదు నువ్వు వెళ్ళు." చెప్పిందావిడ. ఐశ్వర్య బిక్కమొహం వేసుకుని చూసింది.

"ఐష్ నీకు ఓకేనా...?" సూటిగా చూస్తూ అడిగాడు. మాట్లాడకుండా తలదించుకుంది ఐశ్వర్య.

తల్లిదండ్రుల నొసలు వడివడ్డాయి. ఆమె అన్నయ్య పెదవులమీద తన అంచనా నిజమైనందుకు చిన్న నవ్వు కనబడింది.

"ఇంకా ఎవరైనా వస్తున్నారా నీతో" ఆరాగా అడిగాడు.

చివాలున తలెత్తింది ఐశ్వర్య. "ఎస్...." స్థిరంగా చూస్తూ అంది.

"ఎవరు...?" ముగ్గురి నోట్లో నుంచి బుల్లెట్‌లా దూసుకొచ్చిందా ప్రశ్న.

ఆమె వెనక్కి తగ్గదల్చుకోలేదు.

"సల్మాన్... నాతో సల్మాన్ వస్తున్నాడు" చెప్పింది.

ముగ్గుర్నీ కోపం, ఆవేదనా ఒకేసారి చుట్టుముట్టాయి. యింతకాలం గాసిప్స్‌ఏమోనని సరిపెట్టుకున్నారు. తామిద్దరి ఎఫైర్‌ని ఆమే కన్‌ఫాం చేసింది. ఆ ఒక్క మాటతో హతాసులయ్యారు ముగ్గురూ.

"అంకుల్ని తీసివేసి ఇంకెవర్నో సెక్రటరీగా పెట్టుకోవాలనుకుంటున్నావంట. అతనూ సల్మాన్ మనిషేనా?" వ్యంగ్యంగా అడిగాడతను.

ఐశ్వర్యకు రోషం ముంచుకొచ్చింది.

"దిస్ ఈజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్....." ఆమె నోటి నుంచి వచ్చిన ప్రతి అక్షరం తూటాలా పేలింది. నిశ్చేష్టులై కూర్చుండిపోయారు ముగ్గురూ.

ఆమె తల్లి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమె మెల్లగా చిన్న స్వరంతో.... "ఒక వయస్సు వచ్చాక తోడు కోరుకోవడం సహజం అదెవరూ కాదనరు. కెరియర్ వద్దనుకుంటే ఒక మంచి వ్యక్తిని చూసి పెళ్ళి చేసుకోవచ్చు. కేరిర్ ముఖ్యమనుకుంటే ఒక మంచి వ్యక్తితో స్నేహాన్ని కొనసాగిస్తూ వుండవచ్చు. రెండు బంధాల్లోనూ అవతలివారు తన వ్యక్తిత్వానికి సరిపోయినవారు కావడం ముఖ్యం" చెప్పిందామె.

ఏమీ వినాలనుకోలేదు ఐశ్వర్య. తను చెప్పాలనుకుంది చెప్పేసింది. అంతేచాలు. తన బెడ్‌రూంకెళ్ళి పడుకుంది. మనస్సంతా నలిబిలిగా మారిపోయింది.

గత ఎనిమిదేళ్ళనుంచీ జీవితమంతా ఉక్కిరి బిక్కిరిగా, క్షణం తీరికలేనిదిగా ఓ యంత్రంలా గడిపేసింది. అందరూ తనకి దగ్గరవ్వాలని చూసేవాళ్ళేకానీ, తనెవ్వరికీ దగ్గరకాలేకపోయింది.

ఇన్నాళ్ళకు సల్మాన్ తన మొండితనంతో తన హృదయాన్ని గెలుచుకున్నాడు.

తనూ మనిషే...

తనకీ మానవ సహజమైన కోరికలుంటాయి. ఈ విషయాన్ని ఎందుకర్థం చేసుకోరూ....? తనకీ కెరీయర్ ముఖ్యమే కానీ క్షణాల్ని లక్షల్లోకి కనువదించుకుని, కాలం కంటే వేగంగా పరుగుపెడుతున్న ఈ పోటీ ప్రపంచంలో తనకి అండదండగా పేరెంట్స్ నిలబడ్డారు. వాస్తవమే. కానీ....

ఆడదాని జీవితాన్ని వాళ్ళు మాత్రమే పరిపూర్ణం చేయలేదు.

ఉత్తేజాన్నిచ్చే ఓ స్నేహం... అడుగడుగునా ఉల్లాసాన్ని రేకెత్తిందే ఓ ప్రేమహస్తం కావాలని ఆశించడం తప్పవుతుందా...?

అందరూ అన్నట్లు సల్మాన్ మంచివాడు కాకపోవచ్చు. కానీ తను ప్రపంచ సుందరి. తన భువనైక సౌందర్యంతో, అసాధార మేథస్సుతో ఈ ప్రపంచాన్ని తన పాదాక్రాంతం చేసుకుంది. అలాంటిది సల్మాన్‌ని మార్చుకోవడం తనకో లెక్కలోకిరాదు.

అదీకాక అతను తన శారీరక అసౌకర్యానికి కూడా సిద్ధపడి తన బ్యాడ్‌హేబిట్స్‌ని కూడా వదిలేయడానికి సిద్ధపడ్డాడు.

తనకు తెలిసిన డాక్టర్ చెప్పారు. డ్రగ్స్ మానెయ్యడానికి ఎంతో విల్ పవర్ కావాలని. తను సల్మాన్‌కి ఆ విల్ పవర్‌నిచ్చింది. తనమీద ఎంత ప్రేమ లేకపోతే అతను ఈ అలవాటును ఇంత త్వరగా పోగొట్టుకోగలిగాడు?

అతను తనని పిచ్చిగా ఆరాధిస్తున్నాడు. తన కెరీర్‌కి అడ్డుపడే ఉద్దేశం అతనికి లేదు. ఒకరికి ఒకరు తోడూ – నీడలా కష్టసుఖాలు పంచుకొంటూ జీవితంలో ఉన్నతస్థాయిని చేరడానికన్నా కావలసిందేముంది? ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా, తను సల్మాన్‌ను వదులుకోదు. అది వాస్తవం.

తన మనసును తనే సమాధాన పర్చుకుంది ఐశ్వర్య.

❋ ❋ ❋ ❋ ❋ ❋

త్రినాథ్ బయలుదేరే సమయం దగ్గర పడింది. ఇంట్లో ఎవరికీ తిండీతిప్పలూ లేవు, ఏడ్చి, ఏడ్చి భారతి మొహం ఉబ్బిపోయింది.

"ఏ తల్లీ అసమర్ధుడైన కొడుకునైనా భరిస్తుందిగానీ, ఇలా స్వార్ధం కోసం చెల్లెలి పెళ్ళినే కాలదన్ని వెళ్ళిపోయేవాడిని కోరుకోదు" ఆవేశంగా అంది సావిత్రమ్మ.

రెండు రోజుల్లో సారధి అన్ని పనులూ ఆకళింపు చేసుకున్నాడు. పెళ్ళివారడిగితే ఏం చెప్పాలో అని తర్జన బర్జనలు పడ్డారు.

చివరకు తన అన్న త్రినాథ్‌కు మలేషియాలో ఏదో ఉద్యోగ అవకాశం వచ్చిందని, వెళ్ళక తప్పాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పాలని నిర్ణయించుకున్నాడు. ఆ పరిస్థితి త్రినాథ్‌కి ఎంత బాధాకరంగా తోచినా, అంత కన్నా ఘోరమైన పరిస్థితులే వచ్చినా, తను తప్పకుండా వెళ్ళి వుండేవాడే.

రెండ్రోజుల్లో చెల్లిపెళ్ళి వుందనగా ముందురోజు ఉదయం సూట్‌కేస్ సర్దుకుని టౌనుకు ప్రయాణమయ్యాడు త్రినాథ్.

"మధ్యాహ్నంకదా ట్రైన్...." సారధి అడిగాడు.

"టౌనులో పనుంది...." చెప్పాడు త్రినాథ్.

అతని కళ్ళముందు వాసంతి మెదిలింది. ఆమె కోరిక ప్రకారం ఆమెను కలిసి వెళ్ళడం తన బాధ్యతగా భావించాడు త్రినాథ్.

అందరికీచెప్పి బయలుదేరుతుంటే మొహాలు తిప్పుకున్నారంతా. చెల్లి దగ్గరకు వెళ్ళి–

"నన్ను క్షమించు....." ఒకే ఒకమాట అన్నాడు.

ఆ అమ్మాయి పొంగుకొస్తున్న కన్నీళ్ళను ఆపుకొని, "ఆల్ ది బెస్ట్" చిలిపిగా అనబోయింది.

కానీ ఏడుపు ముంచుకొచ్చింది. త్రినాథ్‌కి కూడా కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

అతను బయలుదేరుతుంటే ఎవరూ గుమ్మంవరకు కూడా రాలేదు. తనేం ఘనకార్యం చేస్తున్నాడని తనకు వీడ్కోలు చెప్తారు? సరిపెట్టుకొని ముందుకు నడిచాడు.

ఉదయం పది గంటలకల్లా వీరయ్య చౌదరి యింటికి చేరుకున్నాడు.

వెళ్ళేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

"వీరయ్య మావా....." వరండాలో నిల్చుని పిలిచాడు.

"లోపలికి రండి...." వాసంతి స్వరం వినిపించింది. వరండాలో సూట్‌కేస్ వుంచి లోపలికి వెళ్ళాడు. వాసంతి బైటికి వచ్చింది.

"మావలేడా?" అడిగాడు త్రినాథ్.

"అంతా ఊరెళ్ళారు...." తలుపు నానుకునే చెప్పింది వాసంతి.

"నువ్వొక్కదానివే వున్నావా...? నువ్వెళ్ళలేదా...?" ఆశ్చర్యంగా అడిగాడు.

"కాలేజీలో ప్రాక్టికల్స్ వున్నాయి...." మునివేళ్ళతో నేలనురాస్తూ అంది వాసంతి.

"మరి కాలేజీకి వెళ్ళలేదా?" అడిగాడు.

కళ్ళెత్తి అతనివైపు చూసింది. ఆ చూపుల్లో అతనికి కొత్తభావాలు గోచరించాయి.

మౌనంగా వుండిపోయాడు.

"ఎన్నింటికి ట్రైన్?" వాసంతి అడిగింది.

"మధ్యాహ్నం రెండున్నరకి...." త్రినాథ్ చెప్పాడు.

గ్లాసుతో చల్లని మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

తాగి గ్లాస్ తిరిగి యిచ్చాడు. ఎవరూ లేనప్పుడు తనా ఇంటికి రావడం అతనికి యిబ్బందిగా వుంది. "వీరయ్యమావ ఏమనుకంటాడు?" అన్యమనస్కంగా ఆలోచిస్తున్నాడు.

అతనేదో పరధ్యాన్యంలోకి వెళ్ళిపోవడం చూసి, చిన్నగా దగ్గింది వాసంతి. అప్పటికి తేరుకున్నాడు త్రినాథ్.

"ఇలా వచ్చి కూర్చోండి...." చెప్పాడు.

వచ్చి అతనికి ఎదురుగా కూర్చుంది.

"చెప్పండి మీ కోరిక ఏంటో...." ఆసక్తిగా ఆమె మొహంచూస్తూ అన్నాడు.

"ముందుగా మీరు నన్ను నువ్వు అనండి.." చిరుకోపంగా అంది వాసంతి.

"సరె... సరే...." చిరునవ్వుతో అంగీకారాన్ని తెలిపాడు.

"ఏ కోరికైనా తీరుస్తారా?" అడిగింది.

"నా కంఠంలో ప్రాణమున్నంతవరకూ, నేను చేయగలిగింది ఏదైనా...." చెప్పాడు.

కాసేపు సిగ్గుపడుతూ కూర్చుంది వాసంతి. ఆమె ఏం అడగబోతోందో అతని వూహకి అందడంలేదు.

"మీ ద్వారా మీలాంటి కొడుకుని కనాలి...." అరమోడ్పు కళ్ళతో అంది.

నెత్తిమీద పిడుగులు పడినట్లయింది త్రినాధ్‌కి. కాసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు. ఇంతకాలం ఈ అమ్మాయి అల్లరి చేస్తోందనుకున్నాడే తప్పు... తనని యింతగా కోరుకుంటుందనుకోలేదు. చివరకు" గొంతు పెగల్చుకొని–

"అయినా నాలాంటి వాడితో ఎందుకు – నేను మొరటోడిని... నీ కళ్ళముందే ఇంకో స్త్రీని అభిమానిస్తున్న వాడిని... నీతో ఏ స్థాయిలోనూ సరితూగని వాడిని... నన్ను పెళ్ళి చేసుకుంటే కాకిముక్కుకి దొండపండు అని అందరూ అంటారు..." నచ్చచెబుతున్న ధోరణిలో అన్నాడు.

"ఊహు! నేను మిమ్మల్ని తప్ప ఎవర్నీ పెళ్ళిచేసుకోను. మీకు నన్ను పెళ్ళి చేసుకోవడం యిష్టం లేకపోతే, మీ ద్వారా ఓ బిడ్డనికని మీ జీవితం నుంచి తప్పుకుంటాను...." కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా అంది.

అతను చలించిపోయాడు. ఆమె పెదవులను వేళ్ళతో మూసేస్తూ–

"నాకు నిజంగా ఐశ్వర్యారాయ్ అంటే విపరీతమైన అభిమానం. ఆ అపురూప లావణ్యంకన్నా ఈ ప్రపంచంలో నన్నేదీ కదిలించలేదు...." ఆవేదనగా అన్నాడు.

"కానీ ఆమె ఓ కల... మీకు దక్కదు. మహా అయితే మీరు జీవితమంతా కష్టించి ఆమెను మీరు కోరుకున్న విధంగా చిత్రీకరించగలరేమో! జీవితాంతం ఆమె మీకు తోడుగా మాత్రం వుండదు" ఆమె చెప్పింది.

"అది నిజమే కావచ్చు. కానీ నా మనస్సులో పూర్తిగా ఆమె రూపమే నిండివుండగా అది ఎలా చేరిపేయగలను...?" ఆవేదనగా అన్నాడు.

ఆమె లేచి అతని పక్కన సోఫాలో కూర్చుంది. ఆమె భుజం అతని భుజానికి రాసుకుంటోంది.

"వాసంతీ!" ఆశ్చర్యంగా అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. అతని కళ్ళముందు ఐశ్వర్య అపురూపమైన సౌందర్యం నిలిచింది. అప్పుడతను స్పృహలేనట్లుగా వున్నాడు. కళ్ళముందు నుంచి అతను వివిధ సినిమాల్లో చూసిన ఐశ్వర్య పాత్రలు కదిలిపోతున్నాయి. ఆ వెనుకే రూపాయికి రూపాయి పోగేసుకున్నకొన్న హిందీ సినిమా ఫీల్డ్‌ఫిల్మ్ మ్యాగజైన్స్‌లోని బ్లో ఆప్స్ అతడ్ని తన్మయత్వానికి లోను చేస్తున్నాయి.

ఇప్పుడతని కళ్ళముందు... కలల్లో... మనసులో... ఆవేశంలో.... అంతటా... అన్నిటా... ఆమె నిండుగా నిండిపోయి వుంది.

వాసంతి రెండుచేతులతో అతని చెంపల్ని స్పృశించింది. ఆమెనుంచి ఏదో వింతైన పరిమళం చుట్టుముట్టుంది. కోరికతో అతని ఒళ్ళంతా వేడెక్కిపోయింది. కోరిక వేరు, ప్రేమ వేరు... కానీ అన్నింటినీ తీసివేసి కోరిక పురులు విప్పుతోంది.

ప్రస్తుతం తనపక్కనుంది వాసంతి అనే స్పృహ అతనికిలేదు. ఇప్పుడుతను ఐశ్వర్యనే దర్శిస్తున్నాడు. ఆ ప్రయత్నంగా అతని చేతులు ఆమె నడుంని చుట్టేశాయి. అతని బరువైన, మోటైన చేతులు మధ్య పూలమాలలాంటి వాసంతి నడుం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆ వత్తిడికి ఆమె ఎద మరింత బరువెక్కింది. పమిటకొంగు చాటు పరువాలు వేడితనంకోసం ఆరాటపడుతున్నాయి ఆమెకి తెలీకుండానే.

ఆమె తన మొహాన్ని అతని పెదాలకి దగ్గరగా చేర్చింది. ఆమె ఎర్రని లేతపెదవులు దాడికోసం ఎదురుచూడసాగాయి.

మొదటిసారి స్త్రీ స్పర్శ తెలుస్తోందతనికి, తన పెదాలతో ఆమె పెదాలను రాసాడు. ఒక్కసారి మూలిగింది ఆమె. సుఖాల తీయదనం తనువంతా పులకరింపజేస్తోంది. ఒకసారి ఆ రుచిని అనుభవించాక మరి వదలబుద్ధి కాలేదు. పువ్వులపై దాడిచేసే గండుతుమ్మెదలా అతను ఆ అధరామృతాన్ని ఆస్వాదించసాగాడు.

పమిట కొంగు కిందకి జారింది. గుండ్రని స్తనాలు బయటపడ్డాయి. అతని చూపు అక్కడ పడింది. ఇక అతన్ని ఆపడం ఆమెవల్లకాలేదు. ఆమె సౌందర్యాపు అగ్గిపుల్ల విసిరిన చిన్న అగ్గిరవ్వ అంటుకుని అతను దావాగ్నిలా చెలరేగిపోతున్నాడు.

అవి చూపులు కావు, హృదయాన్ని చీల్చేసే బాకులు... అవి చేతుల కావు, శరీరంలోని అణువణువునూ నలిపేసే యంత్రాలు... అతని ధాటికి తట్టుకోవడం చాలా కష్టంగా వుంది. అసలు వూపిరి పీల్చడమే కష్టంగా వుంది.

ఎక్కడ మొదలుపెడుతున్నాడో, ఎక్కడ ముగిస్తున్నాడో తెలీకుండా, మదించిన పోట్లగిత్తనిపచ్చని పొలంలోకి వదిలిపెట్టినట్లుగా ఆమె శరీరాన్ని నలిబిలి చేస్తున్నాడు.

స్త్రీ సహజమైన భయం కలిగిందామెకి. అతనికి రెండు చేతులూ అడ్డుపెట్టి రెసిస్ట్ చేసిందామె.

"ఏం?" ఉద్వేగాన్ని అణిచిపెట్టుకోలేక గట్టిగా అరిచాడు. ఆమె కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. చప్పున చల్లారిపోయాడు త్రినాధ్.

ఆమె నుంచి విడివడి లేచి కూర్చున్నాడు. చెదిరిపోయిన జుట్టుని సరిచేసుకున్నాడు. “తనెందుకిలా కంట్రోల్ తప్పాడు? కొద్దిలో ఎంత ప్రమాదం తప్పింది” నుదుటికి పట్టిన చెమటని తుడుచుకుంటూ అనుకున్నాడు.

వాసంతి లేచి ఓణీ సరిచేకుంది. ఆమె చెంపలు కెంపులయ్యాయి. ఇక ఇతను తనవాడేనన్న నమ్మకం కుదిరింది. తమని ఎవరూ విడదీయలేరు.

“ఐశ్వర్యారాయ్ ఓ అందరాని చందామామ. అది అతనే స్వయంగా తెలుసుకుని ఓ గుణపాఠం నేర్చుకుని వస్తాడు. కల వేరు, వాస్తవం వేరు. ఆ చేదు నిజాన్ని జీర్ణించుకోని మామూలు లోకంలోకి రావడానికి తను అన్ని విధాలా కృషిచేస్తుంది” నిశ్చయంగా అనుకుంది వాసంతి.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ముంబాయి సెంట్రల్లో ట్రైన్ దిగాడు త్రినాధ్. అంతా జనసందోహం. ఏదో క్రొత్త లోకంలోకి విసిరేసినట్లుగా వుంది. జనాలంతా కాళ్ళకి చక్రాలు కట్టుకున్నట్లుగా, ఎవరూ నడవడంలేదు. పరుగులు పెడుతున్నారు. ‘ఈ ఉరుకులు పరుగులు చూస్తూంటే చాలా గాబరాగా వుంది. ఏంటీ వీళ్ళ కింత హడావిడి... కాస్తంత ఆగి నడవవచ్చుకదా’ అనుకున్నాడు.

కాసేపు అటూ ఇటూ చూస్తూనే నుంచున్నాడు ఒక్క తెలిసున్న మొహమైనా కన్పిస్తుందేమోనని, జనాలంతా కలగా పులగంగా రకరకాల భాషలో మాట్లాడుతూ వెళ్ళిపోతున్నారు.

దిక్కు తోచనట్లు నిలబడిపోయాడు. తరువాత గుర్తొచ్చింది, తను ఆంధ్రుడినని, తన ఆంధ్రతేజం, ఆంధ్రపౌరుషం ముందుకు తోయగా బింకంగా ముందుకు కదిలాడు.

స్టేషన్ బయటకు వచ్చాక కాబ్స్ రెడీగా కన్పించాయి. ముందు తను బాలీవుడ్ న్యూస్కి చేరుకుంటే ప్రోగ్రాం వాళ్ళు చెప్తారు. ఓ కాబ్ను పిలిచి ఎక్కి కూర్చున్నాడు.

పత్రికాఫీసుకు చేరడానికి నలభై నిమిషాలు పట్టింది. అందరినీ వాకబు చేసుకుంటూ పబ్లిసిటీ సెక్షన్లోకి అడుగుపెట్టాడు.

అప్పటికే అక్కడ తనలాంటివాళ్ళు ఓ పదిమిందివరకూ వున్నారు. వాళ్ళ మొహాలన్నీ జాగ్రత్తగా పరిశీలించాడు. అందులో ఓ అడ్డబొట్టు మనిషి ఆంధ్రావాడిలా అన్పించేసరికి దగ్గరకి వెళ్ళి....

“ఏ వూరినుంచి వచ్చారు?” అని అడిగాడు ఆ వ్యక్తి త్రినాధ్ను ఎగాదిగా చూసి చేత్తో ప్రశ్నిస్తూ.

“ఎన్నా పేసరా?” అని అడిగాడు.

“ఏ వూరంటే ఎన్నా పెసరా? పిల్లి పెసరా? అంటాడేమిటి?” ఆశ్చర్యంగా అనుకున్నాడు త్రినాధ్.

కాసేపు దూరంగా నిలబడి ఆ మనిషినే అబ్జర్వ్ చేయసాగాడు. అతను అక్కడే కూర్చున్న క్లర్క్ని తమిళంలో వాయించేస్తున్నాడు.

ఆ క్లర్క్ మరాఠి, హిందీ, ఇంగ్లీష్ మాట్లాడగలడు కానీ ఇతని భాషలు అతనికి రావు. ఆ తమిళవ్యక్తి ఒక్క ముక్క హిందీ పదంకానీ, ఇంగ్లీషు పదంకానీ లేకుండా శుద్ద స్వచ్ఛమైన తమిళాన్నే మాట్లాడుతున్నాడు.

ఇక తనవల్ల కాదని తనే డైరెక్ట్గా క్లర్క్ దగ్గరికి వెళ్ళి తన టెలిగ్రాంను చూపించి ఇంగ్లీషులో పరిచయం చేసుకున్నాడు.

రాత్రి పది గంటల పదిహేను నిమిషాలకు క్రూయిజర్ బయలు దేరుతుందని ఈలోపు ముంబాయి సిటీని చూసుకుని రమ్మని చెప్పాడు క్లర్క్.

బయటకు వచ్చి ఒక హోటల్లో రూమ్ బుక్ చేసుకున్నాడు. రోజుకు ఐదు వందలు అద్దె.

❋ ❋ ❋ ❋ ❋ ❋

రాత్రి పదిన్నరకి త్రినాధ్ క్రూయిజర్ డెక్మీద అడుగుపెట్టాడు. ఆ వూపుని తట్టుకోలేక అతడు పడిపోతుంటే ఓ కోమలహస్తం అతన్ని పట్టుకుంది.

“వెల్కం టు ఈస్ట్ ఫాస్ట్ క్రూయిజర్....” అంది. చివ్వున తలెత్తి చూచి రెప్పవేయడం మర్చిపోయాడు తను. ఎదురుగా ఐశ్వర్యారాయ్. అతిలోక సౌందర్యరాశి. సౌందర్యానికే వన్నెలద్దే మేధాసంవత్తి ఆమె సొంతం.

కేవలం అందంతోనేకాక సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం, మేదస్సు, సంప్రదాయకతలాంటి భారతీయ లక్షణాలని పుణికి పుచ్చుకుని అంతర్జాతీయ వేదికపై ప్రపంచ సుందరి కిరీటాన్ని పొదింన అసామాన్య యువతి.

ప్రపంచ ప్రఖ్యాత టైమ్స్ మేగ్జైన్లో కవర్ పేజీలో వేయబడిన మూడో భారతీయురాలు.

మేడమ్ టు స్సాడ్ మ్యూజియంలో మైనపు ఆకృతిలో సజీవశిల్పంలా కన్పించే రెండో భారతీయ సినీతార... మొదటి తార అమితాబ్ బచ్చన్....

కేన్స్ ఫిలిం ఫెస్టివల్ జ్యూరీ మెంబర్లో అందరి మన్ననలను అందుకున్న అపురూపమైన నటి. ఆమె నటనకు ఎల్లలులేవు. ఆమె సౌందర్యానికి హద్దులు లేవు.

ఆమెవంకే స్వాత్నికుడులా చూడసాగాడు త్రినాథ్. ఆమెకా చూపులు అలవాటే. తను భుజాలను పట్టి ఆపుతున్న ఐశ్వర్య మృదువైన హస్తం వేపు అపనమ్మకంగా చూశాడు త్రినాథ్.

ఐశ్వర్య చిరునవ్వుతో మళ్ళీ 'వెల్‌కం' చెప్పింది.

చుట్టూ వున్నవాళ్ళంతా చప్పట్లుకొట్టి అభినందనలు తెలియజేశారు. సల్మాన్ వచ్చి ఐశ్వర్య ప్రక్కన నిల్చున్నాడు. అప్పటికి తేరుకుని అతని భుజాల మీదనుంచి చెయ్యి తీసింది ఐశ్వర్య.

రమేష్ పవార్ నవ్వుతూ త్రినాథ్ దగ్గరకు వచ్చి, అతని ఉద్వేగాన్ని అర్థం చేసుకుంటున్నట్టుగా భుజం మీద తట్టి మిగతా పాఠకుల దగ్గరకి తీసుకెళ్ళి పరిచయం చేశాడు.

ఐశ్వర్య అందరితో కలుపుకోలుగా మాట్లాడుతోంది. ఎవరికి వాళ్ళు అప్పటికప్పుడే ఆమెతో ఆటోగ్రాఫ్‌ని తీసుకోవడానికి, ఆమెతో ఫోటో సెషన్స్‌కి రెడీ అయిపోతుంటే రమేష్‌పవార్, ఇతర సిబ్బంది వాళ్ళను వారించారు.

రాత్రి పదకొండున్నర వరకు ఈ పరిచయ కార్యక్రమం సాగింది. త్రినాథ్ అందరికన్నా వెనక వుండిపోయాడు. తనను క్రూయిజర్‌లోకి ముందుగా ఆహ్వానించింది ఐశ్వర్యే అని అనుకోగానే ఏదో తెలియని మైకం కమ్ముకుంది.

ఆమె తన భుజం మీద చేయి వేసిన ప్రాంతాన్ని పదేపదే తడుముకుంటున్నాడు.

ఆమె ఎవరిపట్లా ప్రత్యేకమైన అభిమానాన్ని ప్రకటించడం లేదు. అలాగని పొగరుగానూ వ్యవహరించడం లేదు. సల్మాన్ మాత్రం ఐశ్వర్య ప్రక్కనే వుంది కదలడంలేదు.

పాఠకులకు డబుల్ బెనిఫిట్ పొందినట్టుగా వుంది. సల్మాన్‌కి వున్న ఫాలోయింగ్ కూడా తక్కువేమీ కాదు, అతను కూడా విజేతలతో మాట్లాడుతూ మధ్య మధ్య ఐశ్వర్యతో ఎవరెలా బిహేవ్ చేస్తున్నదీ కనిపెడుతూనే వున్నాడు.

పదకొండున్నరకే పరిచయ కార్యక్రమాలన్నీ ముగిస్తున్నటుగా ప్రకటించారు. క్రూయిజర్ సిబ్బంది వచ్చి ఎవరి కాబిన్స్‌కి వాళ్ళని తీసుకుని వెళ్ళారు.

తన క్యాబిన్‌లోకి ప్రవేశించి పరిశీలనగా చూశాడు త్రినాథ్. చిన్నగా వున్నా చాలా పొందికగా వుంది. క్యాబిన్‌కి కుడిచేతివైపు పెద్ద అద్దం లాంటిది బిగించి కనబడుతోంది.

అందులోంచి సుదూరంగా మిణుమిణుకుమంటూ లైట్ హౌస్ తాలూకూ కాంతి కనబడుతోంది. చుట్టూ నల్లటి నిశ్శబ్దం. ఎగసిపడే అలల శబ్దం... ఆ రోజు జరిగిన విషయాలను మననం చేసుకుంటూ నిద్రకుఉపక్రమించాడు త్రినాథ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఈస్ట్‌ఫాస్ట్ క్రూయిజర్ ప్రయాణీకులను తీసుకుని వెళ్ళే అతి విలాసవంతమైన నౌక, మూడంతస్తులతో కదులుతున్న మేరు పర్వతంలా శోభిల్లుతోంది.

ప్రతీ అంతస్తులోనూ స్విమ్మింగ్ పూల్, ప్లేగ్రౌండ్, రెస్టారెంట్, డాన్స్ రూమ్ సెమినార్ హాల్ లాంటి సమస్త సదుపాయాలూ వున్నాయి. అందులో మూడో అంతస్తు బాలీవుడ్ న్యూస్ విజేతలు, తదితరులకి కేటాయించడింది.

అంతెత్తు మీదనుంచి సముద్ర జలాలను చూస్తుంటే చాలా చిత్ర విచిత్రంగా అన్పిస్తోంది.

తెల్లవారి ఆరు గంటలకే, ఆ అంతస్తులో చాలామంది నిద్రలేచి డెక్ మీదకు వచ్చి కేరింతలు కొడుతూ నుంచున్నారు. వాళ్ళల్లో సముద్రాన్ని ఒడ్డునుంచి చూచినవాళ్ళు కొందరైతే అసలు చూడనివారు కొందరున్నారు.

అందరికీ విచిత్రమైన విషయం ఇంత బరువైన ఓడ సముద్రంపైన తేలి వుండడం, కాలకృత్యాలు తీర్చుకొని డెక్ మీదకు వచ్చాడు త్రినాథ్.

అప్పుడే సూర్యోదయం అవుతోంది. ఎర్రటి సూర్యబింబం మెల్లమెల్లగా పైకి లేస్తుంటే ఆ కిరణాలు సముద్ర కెరటాలపై తళతళా మెరుస్తున్నాయి.

ఆ దృశ్యాన్ని ముగ్ధుడై చూశాడు త్రినాథ్. ఇంతలో ఎవరో తన చేయిపట్టి లాగినట్టయింది. తిరిగి చూశాడు, ఓ పదేళ్ళ బాబు. అక్కడ నిలబడి వున్నాడు. పాలుగారుతున్న పసిబుగ్గలు, ఎర్రటి పెదవులు, ఒత్తయిన జుట్టు ఆశ్చర్యంగా, మిసమిసలాడుతూ కన్పించాడు.

"హాయ్ అంకుల్... ఐయాం చైతన్య ఫ్రం ఆంధ్రా..." షేక్ హేండ్ కోసం చేయి చాపాడు చైతన్య.

త్రినాథ్ ముఖంలో ఉత్సాహం ప్రాకి వచ్చింది.

"ఓరోరి తెలుగోడివట్రా, నేనూ తెలుగే...." రెండు చెతులతోనూ పట్టుకొని గాల్లో కెగరేస్తూ అన్నాడు. త్రినాథ్ మాటల్లో కావాలని తెచ్చిపెట్టుకున్న యాసకు కిలకిలా నవ్వుతూ, అతని భుజాల చుట్టూ పడిపోకుండా చేతులేసాడు.

చైతన్య తల్లిదండ్రులు ప్రభాకర్, లలితలను తీసుకొచ్చి పరిచయం చేసాడు. ముచ్చటైన సంసారం వాళ్ళది. భార్యా, భర్త లిద్దరూ చాలా అన్యోన్యంగా వున్నారు. అతను బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కర్నూలులో వుంటారు వాళ్ళు.

"ఇంకా మన ఆంధ్రా నుంచి ఎవరెవరు వచ్చారు? రాత్రి సరిగ్గా గమనించలేదు" కుతూహలంగా అడిగాడు త్రినాథ్.

ఓ మూల కూర్చొని గుసగుసలాడుకుంటున్న ప్రేమికుల జంటను చూపించాడు.

"రాత్రినుంచీ ఇదే వరస. అతనికి ఆమె ఐశ్వర్యారాయ్, ఆమెకు అతను సల్మాన్‌ఖాన్" అన్నాడు చైతన్య.

లలిత ముసిముసిగా నవ్వుతూ–

"ఓరి పిడుగా నీకెందుకురా వాళ్ళ ఊసు...." అంది.

విభిన్న సంస్కృతులు కొలువుతీరినట్లుగా వుంది. అడ్డబొట్టు అరవాయన మడీ, తడీ కోసం స్టీవార్డుని వాయించి పారేస్తున్నాడు. తమిళంలో ఆయన గోడును ప్రభాకర్ అనువదించి చెప్పాడు.

వాళ్ళబ్బాయి ఈ పోటీలో పాల్గొన్నాడంట. నిజానికతను విజేత. కానీ అతనికి ఉద్యోగంలో ఇన్‌స్పెక్షన్ పని వుండటం మూలంగా రాలేక పోయాడు. అనవసరంగా టికెట్ వేస్ట్ అవుతుందని ఫ్రీగా మలేషియా అదీ చూసిరావచ్చుని బయలుదేరాడట.

స్విమ్మింగ్ పూల్ ఒడ్డున ఓ వయసు మళ్ళిన జంట కూర్చుని వున్నారు. చండీఘడ్ నుంచి వచ్చారట వాళ్ళు. నవదీప్‌సింగ్, మన్‌ప్రీత్‌కౌర్. 'అసభ్యతకు తావులేకుండా బాలీవుడ్‌లో నటనలో అందాన్ని కాకుండా, మేథస్సు నుపయోగించే ఐశ్వర్యను చూడాలన్న' అభిప్రాయాన్ని రాసినవాళ్ళు లక్కీడీప్ ద్వారా ఎంపికయ్యారు.

వాళ్ళకి ఏ బాదరబందీలేదు. ఈ మధ్యనే అన్ని బాధ్యతలూ తీర్చుకొని ఇప్పుడిప్పుడే తమ వ్యక్తిగత సుఖాలకోసం వెచ్చిస్తున్నారు.

వాళ్ళు పంజాబీలో మాట్లాడుతుంటే, ఇంగ్లీషులోనూ, హిందీలోనూ అనువదించుకుంటూ వాళ్ళ వివరాలు తెలుసుకున్నాడు త్రినాథ్.

బారెడు ప్రొద్దెక్కగానే డెక్‌మీద కోలాహలం వూపందుకుంది. కొందరు బాల్ బ్యాట్‌మెంటన్ ఆడుతుంటే, మరికొందరు వాలీబాల్ ఆడుతున్నారు. మరికొందరు స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్నారు. సీ, సిక్‌నెస్ రాకుండా అందరికీ ముందే టాబ్‌లెట్స్ ఇవ్వటం మూలంగా ఎవరి హెల్త్ అప్‌సెట్ కాలేదు.

ఎనిమిది గంటలకల్లా ఉల్లాసంగా ట్రాక్‌సూట్‌లో డెక్ మీదకు వచ్చింది ఐశ్వర్య. ఆమెను చూడగానే మళ్ళీ అందరూ గుమిగూడిపోయి 'గుడ్‌మార్నింగ్' చెప్పడం ప్రారంభించారు.

ఆమె చిరునవ్వుతో అందర్నీ తోసుకోవద్దన్నట్లు సైగచేసి, "ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమై వుండాలని, తనే అందరి దగ్గరికీ వచ్చి కలుస్తానని చెప్పింది.

ఇంకా చాలా రోజులు తాము ఐశ్వర్యతో గడపవచ్చు కదా! అన్న ఉద్దేశ్యంతో అందరూ ఎవరి సరదాల్లో వారు నిమగ్నమయ్యారు. ఆమె అందరి దగ్గరకీ వెళుతూ వాళ్ళాడే ఆటల్లో పార్టిసిపేట్ చేస్తూ అందర్నీ ఉత్సాహపరుస్తూ మలయ పవనంలా అందరి హృదయాలనూ సేద దీరుస్తుంది.

ఓ మూల ఛైర్‌లో కూర్చున్నాడు త్రినాథ్. అతని ప్రక్కనే కూర్చున్నాడు చైతన్య. అందరితో పలకరింపుల్లో భాగంగా ఐశ్వర్య, చైతన్య, త్రినాథ్ వున్న దగ్గరికి వచ్చింది. ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"హాలో... స్మార్ట్ కిడ్, వాట్స్ యువర్ స్వీట్ నేమ్?" ముచ్చటపడుతూ చైతన్యని అడిగింది.

"త్రినాథ్!" గంభీరంగా చెప్పాడు త్రినాథ్.

చైతన్య నోటికి చెయ్యి అడ్డంపెట్టుకుని కిలకిలా నవ్వుతున్నాడు.

ఐశ్వర్య నిటారుగా నిలబడి భావరహితమైన మొహంతో చూసి ఇంకో ప్రక్కకు వెళ్ళింది. అప్పటినుంచీ గురు శిష్యులిద్దరూ ఆమె ఎటువెళితే అటు చూడసాగారు.

రెప్పవేస్తే ఆ సౌందర్యం ఎక్కడ కనుమరుగౌతుందో అన్నట్లు ఆర్తిగా చూస్తూండిపోయారు. మధ్యలో ఎందుకో క్యాజువల్‌గా తలతిప్పి చూసిన ఐశ్వర్యకి త్రినాథ్ తనవైపే చూస్తూ కన్పించాడు. కొంచెం ఆశ్చర్యంగా అన్పింపింది.

తనకు అనుమానం వచ్చిమిగతా అందరివంకా చూసింది. అక్కడ వున్నవాళ్ళలో సగంమందికి పైగా తననే చూస్తూ కన్పించారు.

"ఇట్స్ నేచురల్" అనుకుంటూ బ్యాట్‌మెంటన్ ఆడే చోటికి వెళ్ళింది. ఆ ఆటలో త్రినాథ్‌కి చాలా అనుభవం వుంది. ఆ మాట చైతన్యతో అనగానే అతన్ని ఆడమని వత్తిడి చేశాడు. అతను కోర్టు దగ్గరకు వెళ్ళి ఆడుతున్నవారిని ఒక బ్యాట్ రిక్వెస్ట్ చేయగానే అతని చేతికి ఇచ్చారు.

అది అప్పుడే డెక్‌మీదకు వచ్చిన సల్మాన్ దృష్టిలో పడింది. అదీ కాక ఐశ్వర్య అక్కడే వుంది. అతనిలో మరింత ఉత్సాహాన్ని నింపింది. రకరకాల కసరత్తులతో శరీరాన్ని ఉక్కు కడ్డీలా మార్చుకున్న తనకీ, ఎదురుగా అనామకంగా కన్పిస్తున్న ఈ వ్యక్తిని ఆటలో ఓడించడం పెద్ద కష్టమేం కాదు.

హుషారుగా ఎదుటి కోర్టులోకొచ్చి బేట్ అందుకున్నాడు. చుట్టూ వున్నవాళ్ళు ఎవరి పనులు వాళ్ళు వదిలేసి ఈ ఆటను చూడ్డానికి గుమిగూడారు. ఆడేవాళ్ళిద్దరికీ కూడా హుషారొచ్చేసింది.

ఐశ్వర్య చప్పట్లు కొడుతూ ఇద్దర్నీ ఎంకరేజ్ చేస్తోంది. ఆట పోటా పోటీగా సాగుతోంది. మధ్యలో ఐశ్వర్య అక్కడే వుండటం అనే అంశం మూలంగా ఇద్దరిలోనూ ఏకాగ్రత చెదురుతున్నా, ఆమె ముందు ఓడిపోకూడదన్న పట్టుదలతో ఇద్దరూ ఆడుతున్నారు.

క్రమేపీ ఐశ్వర్య కర్ధమైంది త్రినాధ్ ఈ ఆటలో సామాన్యుడు కాదని, ఎంత గొప్ప ఆటగాళ్ళయినా సెలబ్రెటీలతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేటప్పుడు ఎదుటివారి విటయానికే తోడ్పడతారు. కానీ ఇతను సల్మాన్‌కి ఆ అవకాశం ఇవ్వడు, అతను ఓడిపోవటం ఖాయం. నలుగురిలోనూ సల్మాన్ ఓడిపోవటం తనకు నచ్చలేదు. ఆమె ఆట మధ్యలో కలుగజేసుకుని–

“స్టాప్... స్టాప్... ఏంటీ ఇద్దరూ హోరాహోరీగా ఏదో యుద్ధం చేస్తున్నట్లుగా ఆ... నేనూ ఆడతాను” అంటూ సల్మాన్ చేతిలోని బ్యాట్‌ను తీసుకుంది.

అనుభవజ్ఞుల కర్ధమయింది ఆమె చాలా సమయస్ఫూర్తితో వ్యవహరించిందని. సల్మాన్ కోపం గురించి, దురుసుతనం గురించి తెలిసిన వాళ్ళకి ఓ లెసన్ నేర్చుకునే అవకాశం పోయిందని బాధపడ్డారు.

ఐశ్వర్య కోర్టులోకి ఎంటర్ కాగానే కొందరు త్రినాధ్ రియాక్షన్ గురించి ఎదురుచూశారు. అతను తన చేతిలోని బేట్‌ని చైతన్య చేతికిచ్చి ఆడమన్నాడు. అందరూ ఫక్కుమని నవ్వారు.

ఐశ్వర్య ఉక్రోషంతో నెట్ దగ్గరకు వచ్చి–

“ఏంటీ మీ ఉద్దేశం? నేనాడలేననా?” అడిగిందామె.

అందరికీ సరదాగా వుంది ఆ సిట్యుయేషన్. త్రినాధ్ నొచ్చుకున్నాడు. “నాకా ఉద్దేశం లేదు...”

“మరి...” కోపంతో పెద్దవైన కళ్ళను మరింత పెద్దవి చేస్తూ అంది.

అందరూ అతని సమాధానం కోసం ఎదురుచూడసాగారు.

అతను ఐశ్వర్య అందమైన కళ్ళలోకి సూటిగా చూస్తూ–

“మీరు నా ఆరాధ్య దేవత. నా చేతిలో మీరోడిపోవడం నేను తట్టుకోలేను. కానీ నేను ఆంధ్రుడ్ని... నేనోడిపోవడానికి నా మనసు ఒప్పుకోదు.

అంతర్జాతీయ వేదికలమీద ఒక భారతీయురాలిగా మీరెలా గుర్తింపు పొందుతున్నారో, భిన్న సంస్కృతులు కలిగిన ఇక్కడ నేను ఓ ఆంధ్రుడిగా ఓడిపోదలుచుకోలేదు...”

అతని హృదయంలోంచి వచ్చిన ఆ మాటలను ఆమె పెద్దగా పట్టించుకోలేదు. గలగలా నవ్వేసి వూరుకుంది. ఆమె తన హృదయం చుట్టూ ఓ ఉక్కు కవచాన్ని నిర్మించుకుంది.

పొగడ్తలైనా, విమర్శలైనా అక్కడివరకూ వచ్చి రాలి క్రింద పడవలసిందే! ఆమె ఆ కవచాన్ని తొలగించి కొంచెమైనా చోటిచ్చింది ఒక సల్మాన్‌కే. ఈ చర్చంతా సల్మాన్‌కి చాలా విసుగు తెప్పించింది.

సల్మాన్ నవ్వుతున్న ఐశ్వర్యారాయ్ దగ్గరకు వచ్చి ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి రెస్టారెంట్ వైపు తీసుకెళుతూ, వెనక్కి తిరిగి త్రినాధ్‌తో–

“లీవిట్ యార్...” చెప్పి వెళ్ళాడు.

వెళ్ళేప్పుడు అతను చూసిన చూపుకు చైతన్య భయంగా త్రినాధ్ చెయ్యి పట్టుకున్నాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఐశ్వర్య తన క్యాబిన్‌లో స్నానంచేసి డ్రెస్ చేసుకుంటోంది. అసిస్టెంట్ వచ్చి మేకప్ చేయడానికి రెడీ చేస్తోంటే వద్దని వారించింది.

ఐశ్వర్యకి మేకప్ వున్నా ఒకటే, లేకపోయినా ఒకటే. చిత్రకారుడు గీసిన గీతల్లా రసజ్ఞంగా వుంటుంది. ఆమె చర్మం సహజంగానే నునుపు తేలి కాంతిలీనుతూ వుంటుంది.

ఆమె వంగపండు చీరను ధరించి మెడలో చిన్న చిన్న కెంపులతో చేసిన నెక్లెస్‌ని, అవేరంగు హేంగిల్స్‌నీ ధరించింది. కాళ్ళకి హైహీల్స్ వేసుకోకుండా మెత్తని శాండిల్స్ వేసుకుంది. జుట్టుని దువ్వుకుని వదిలేసింది. మరికేం అలంకరణా చేసుకోలేదు.

సహజ లావణ్యంతో మెరిసిపోతోంది పబ్లిక్‌లో సాధ్యమైనంత వరకు సన్నిహితంగా కన్పించకూడదని ముందే నిశ్చయించుకోవడంతో సల్మాన్ క్యాబిన్‌కీ, ఆమె క్యాబికీ చాలాదూరం వుండేలా చూసుకున్నారు.

అందరిలాగానే పబ్లిక్ ప్లేసెప్ లోనూ ఇద్దరూ కలుస్తున్నారు. ఇది కూడా ఇద్దరికీ ఒక ఆటలా వుంది. చిక్కని ఏకాంతం మరింత విరహాన్ని పెంచుతోందికదూ! విరహం కూడా బలమైన ప్రేమకి పునాదిలాంటిది.

రెస్టారెంట్‌లో లంచ్ టైంకి చేరుకున్నారిద్దరూ. ముందుగా వచ్చి కూర్చున్నాడు సల్మాన్.

ఐశ్వర్య కనిపించగానే అలవాటు ప్రకారం అందరి చూపులూ అటువైపూ మళ్ళాయి.

ఆమె సల్మాన్ టేబుల్ దగ్గరకు వెళ్ళి కూర్చుంది. ఆమె రమేష్ పవార్‌కోసం చూసింది కానీ, అతని సిక్స్‌సెన్స్‌తో ఫీల్ అవుతున్నాడు. రూమ్‌కే లంచ్ తెప్పించుకున్నాడని సిబ్బంది చెప్పారు.

హాల్లోకి రాగానే తనను చూసి నవ్విన వాళ్ళ అందరికీ చెయ్యూపి పలకరించి, సల్మాన్‌తో కబుర్లు చెప్పడం ప్రారంభించింది.

త్రినాధ్ ఆమెవంకే చూస్తున్నాడు. కానీ ఐశ్వర్య మాత్రం అతని వైపు చూడట్లేదు. ఆమె కావాలని ఎవాయిడ్ చేయలేదు. జస్ట్ ఆమె దృష్టిలో అతను లేడంతే.

ఫుడ్ ఆర్డరిచ్చింది ఐశ్వర్య, సల్మాన్ కళ్ళలోకి ప్రేమగా చూస్తూ.

"బోర్ కొడుతుంది కదూ..." అడిగిందామె.

"నాటెటాల్! నువ్వు నా ప్రక్కనే వుండగా నాకు బోరేంటి...?" అన్నాడు సల్మాన్.

"నేను ఎప్పుడూ పక్కనుండడంలేదు కదా?" చిలిపిగా నవ్వుతూ అంది ఐశ్వర్య.

ఇంతలో "మేడం..." అనే స్వరం చెవి ప్రక్కగా విన్పించేసరికి ఉలిక్కిపడుతూ ఇటువైపు తిరిగి చూసింది.

ఎదురుగా నవ్వుతున్న త్రినాధ్.

తమ సంభాషణ మధ్యలో అతను కలుగజేసుకున్నందుకు చిరాకు ముంచుకొచ్చింది.

అది పైకి వ్యక్తం చేయకుండా "ఏంటి...?" మామూలుగా అడిగింది.

తన చేతిలో వున్న డిష్‌వైపు చూస్తూ.

"గుత్తివంకాయ కూర మేడం... ఆంధ్రాస్పెషల్. ఈ క్రూయిజర్ చెఫ్‌ని మంచి చేసుకుని నేనూ పక్కనే వుండి మీకోసం స్పెషల్‌గా వండించాను" చెప్పాడతను.

"సారీ! నేను ఆయిల్‌ఫుడ్ తినను..." నిర్మొహమాటంగా చెప్పింది ఐశ్వర్య.

ముసిముసిగా నవ్వాడు సల్మాన్.

మొహం చిన్నబోయినట్లయింది త్రినాధ్‌కి.

"మేడం మీ కోసం స్పెషల్‌గా..." చెప్పబోయాడు.

"నో ప్లీజ్...! గట్టిగా చెప్పేసి, సల్మాన్‌తో మాటల్లో పడిపోయింది.

ఆశాభంగంతో వెనుదిరిగి వస్తుండగా నవదీప్‌సింగ్, మన్‌ప్రీతీకౌర్ అతన్ని పిలిచారు.

"ఏంటని?" అడిగారు. అతను తన చేతిలోది చూపించాడు. సింగ్‌గారు అడిగి మరి వేసుకుని తిని గుత్తివంకాయకూర రుచి ఇచ్చిన ఆనందాన్ని తట్టుకోలేక "ఓ బల్లే బల్లే" డాన్స్ స్టెప్స్‌వేసి త్రినాధ్‌ని ఆనందపర్చాడు. అది చూచి చుట్టుపక్కల వాళ్ళు కూడా ఆ డిష్‌లోది అయిపోయేంతవరకూ వేయించుకు తిన్నారు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

ఆరోజు రాత్రికి భారతి పెళ్ళి. ఆరోజు ఉదయాన్నే భారతిని పెళ్ళి కూతురును చేస్తుండగా రంగారావుని వెంటపెట్టుకుని వచ్చాడు పెళ్ళికొడుకు తండ్రి.

"రండి బావగారూ... మంచి సమయానికి వచ్చారు. మీ కోడలికి అంక్షతలు వేసి ఆశీర్వదించండి" చెప్పాడు రాఘవరావు.

ఏం మాట్లాడలేదతను. చుట్టూ కలియజూస్తూ "మీ పెద్దకొడుకేడయ్యా?" అని అడిగాడు.

సావిత్రమ్మ ముందుకొచ్చింది. "అదీ అన్నయ్యా! మలేషియాలో ఏదో ఉద్యోగానికి, ఏదో లెటర్ వస్తేను కంగారుగా వెళ్ళాడు" చెప్పింది.

"ఏం ఉద్యోగం?" ఆరాతీస్తూ అడిగాడు.

సారధి ఏదో నోటికొచ్చింది చెప్పాడు.

"మరి మా వూళ్ళో ఏదో పుకారొచ్చిందే?" అందరి ముఖాల్లోకి తేరిపారా చూస్తూ అన్నాడు.

అందరి ముఖాల్లోనూ నెత్తురుచుక్క లేకుండా తెల్లబడ్డాయి.

"ఏం పుకారన్నయ్యా? మగపిల్లాడిమీద పుకార్లేంటన్నయ్యా...?" నవ్వుతూ తేల్చేయబోయింది సావిత్రమ్మ.

"భలేదానివమ్మా! మన కుటుంబాల్లో అన్ననుబట్టి చెల్లెలు కాదా? మీవాడు ఎవరో సినిమా స్టార్ వల్లోపడి దేశాలుపట్టి పోయాడని విన్నా?" సూటిగా అడిగాడాయన.

ఆ మాటలకు అందరూ అవాక్కయ్యారు. జరిగింది కొంతైతే, దానికి అవాకులూ, చెవాకులూచేరి విషయం మరింత పెద్దదయింది.

"అదేంలేదన్నయ్యా!" సావిత్రమ్మ సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తోంది.

ఉబ్బిన వాళ్ళ కళ్ళూ, కళ తప్పిన మొహాలు వాళ్ళ అనుమానాన్ని మరింత బలపరిచాయి. ఇంతలో అక్కడ జరుగుతున్న విషయాన్ని సుబ్బుకి ఉప్పందించారెవరో. ఆగమేఘాలమీద పరిగెత్తుకుంటూ వచ్చాడు సుబ్బు. రావడంతోనే గుంపునంతటినీ దూరంగా తీసేస్తూ, సారథి ముందు కొచ్చి–

"ఏరా! మీ అన్నయ్య ఐశ్వర్యారాయ్‌ని చూడడంకోసం భారతి పెళ్ళి విషయాన్ని కూడా కాదని వెళ్ళిపోయాడంటగా...? సినిమావాళ్ళతో ఏంట్రా మీవాడికి...?"

అప్పుడే మగపెళ్ళివారిని చూసినట్లుగా నాలుకొరుక్కుంటూ వెనక్కి తిరిగి గుంపులో కలిసిపోయాడు. అంతా కాసేపు చేష్టలుడిగి నిలబడి పోయారు. పెళ్ళికొడుకు తండ్రి కేకలూ పెడబొబ్బలూ పెట్టలేదు. రంకెలు వేయలేదు.

"మీ సాంప్రదాయానికీ, మా సాంప్రదాయానికీ పొసగదమ్మా... ఒకే ఒక మాట అని ఈ పెళ్ళిని తాము రద్దు చేసుకుంటున్నామని, ఈ ముహూర్తానికే తన కొడుక్కి తమ బంధువుల్లో ఒక పిల్లను చూసి పెళ్ళి చేసేస్తామని చెప్పి వెళ్ళిపోయాడు.

సావిత్రమ్మ నిలువునా నీరై ఆయన కాళ్ళు పట్టుకుంది. భారతి లోపలినుంచి వచ్చి తల్లిని వారించి, ఓదార్చింది.

"అన్నయ్య మూలంగా ఈ పెళ్ళి ఆగిపోయిందని అందరూ అన్నయ్యను తిట్టడం నేను భరించలేను. అన్నయ్య చెడ్డవాడు కాదమ్మా – అన్నయ్యలో వున్న ఆ ఒక్క బలహీనతా ఐశ్వర్యారాయ్. ఇప్పుడా భ్రమలు కూడా తొలగిపోయి ఇంటికి వస్తాడు.

అప్పుడతను మన బాధ్యతలనీ నెరవేరుస్తారు. అన్నయ్యలో అప్పుడు మనకి వెతికినా ఒక్క బలహీనతా కనబడదు. మీకు తెలుసోలేదో? వీరయ్యమామ తన కూతుర్నివ్వటానికి క్కూడా సిద్ధంగా వున్నాడు. నా పెళ్ళి అవలేదని బాధపడవద్దు. అదికూడా అన్నయ్యే నెరవేరుస్తాడు."

మనసులో పొంగుకొస్తున్న దుఃఖాన్ని అణిచి పెట్టుకొని అందరినీ ఓదార్చింది. భారతి ఈ విషయాన్ని ఒక వారం క్రితమే ఊహించింది. అది ఇప్పుడు నిజమైంది. కూతురు మాటలకు కొంత తెప్పరిల్లిన సావిత్రమ్మ బేలగా చూస్తూ–

"నువ్వే అఘాయిత్యమూ చెయ్యనని మాటివ్వు" అంది.

భారతి చిన్నగా నవ్వుతూ "ఇంకా జీవితంమీద ఆశ నశించలేదమ్మా" ధైర్యంగా అంది. దాంతో అందరి హృదయాలూ కొంత తేలిక అయ్యాయి.

❋ ❋ ❋ ❋ ❋ ❋

మధ్యాహ్నం రెండు గంటలు... ఈస్ట్ ఫాస్ట్‌క్రూయిజర్‌లో ప్రయాణీకులు లంచ్ ముగించి రెస్ట్ తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఐశ్వర్య తన కాబిన్ వైపు నడుస్తుండగా వెనకే వచ్చిన సల్మాన్ దిగులుగా చూశాడు.

అతని ఫీలింగ్స్ అర్థమై ముసిముసిగా నవ్వింది ఐశ్వర్య. "నా కేబిన్‌లో ఆయా, అసిస్టెంట్ వున్నారు" చెప్పింది.

"సేమ్ పొజీషన్...." విచారంగా అన్నాడు సల్మాన్.

"అందుకే బుద్ధిమంతుల్లా ఎవరి కేబిన్స్‌లోకి వాళ్ళు వెళ్ళిపోదాం" నవ్వుతూ అంది ఐశ్వర్య.

అతను కాసేపు ఆలోచించి "నేను ఓ సీక్రెట్ ప్లేస్ కనిపెట్టాను" చెప్పాడు.

"ఎక్కడా?" కుతూహలంగా అడిగింది.

"మన డెక్ పైన ఇంకో చిన్న రూఫ్‌లాగా వుంటుంది... సీ వ్యూ చూడటానికి పర్మిషన్ తీసుకుని వెళ్ళొచ్చు. అది విశాలంగా వుంటుంది. మనల్ని కవర్‌చేసే వస్తువులు చాలా వుంటాయి. సో... సరదాగా సీ వ్యూ చూసొద్దాం పద" హుషారుగా అన్నాడు.

"బాగా కనిపెట్టారే సైంటిస్ట్‌లా" అంది.

"ఇంకా ఆలస్యం చెయ్యొద్దు పద... మన జీవితంలో మనకి ప్రైవసీ చాలా తక్కువసార్లు దొరుకుతుంది. దొరికిన అవకాశాల్ని మిస్ చేసుకోకూడదు" చెప్పాడు.

ఇద్దరూ పైకి వెళ్ళారు... మరింత ఎత్తుమీద నుంచి సముద్రాన్ని చూస్తుంటే చాలా విచిత్రంగా వుండి, రెయిలింగ్‌మీద నుంచి తొంగి చూసింది ఐశ్వర్య, కళ్ళు తిరిగినట్లయింది.

నుదురు దగ్గర చిన్నగా వత్తుకుంటూ కళ్ళు మూసుకుంది ఐశ్వర్య.

"ఏమయింది ఐష్...?" ఆమె నుదుటిమీద సున్నితంగా స్పృశిస్తూ అడిగాడు సల్మాన్.

"కొంచెం కళ్ళు తిరుగుతున్నాయి" చెప్పింది.

"అటు చూడకు... నావైపు తిరుగు" అంటూ తను రెయిలింగ్‌ని ఆనుకుని, ఆమెని తనకి సన్నిహితంగా పొదువుకున్నాడు.

ఇద్దరి శరీరాల రాపిడిలో వేడి రాజుకుంటోంది. పైన సూర్యుడు కూడా మబ్బుల చాటుకి తప్పుకున్నాడు.

"చూసావా? ప్రకృతి కూడా మనకి సహకరిస్తోంది...." మత్తుగా అన్నాడు సల్మాన్.

"ఏ విషయానికి సహకరిస్తోంది?" కొంటెంగా అడిగింది.

అతని చేయి ఎవరికీ కనపడని విధంగా ఆమె నడుముని చిన్నగా వత్తింది... తీయగా మూలిగిందామె వయసు.

సల్మాన్‌కి ఐశ్వర్యతో చేసే ఈ చిన్న రొమాన్స్ ఎంతో థ్రిల్లింగ్ కలుగజేస్తోంది...

అంతకుముందు ఎవరిమీద మనసుపడ్డా డైరక్ట్‌గా రొమాన్స్‌లోకి దిగేవాళ్ళు... అడ్డు చెప్పేవాళ్ళు ఎవరూ లేకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడు కలుసుకుంటూ వుండేవారు.

కానీ ఇప్పుడలాకాదు... ఐశ్వర్యతో గడపడం కోసం ప్రతిక్షణం విరహాన్ని అనుభవిస్తూ, ఎదురుచూడాల్సి వస్తోంది. కేరీర్ దృష్ట్యా తామిద్దరూ ఎక్కువసార్లు కలవలేదు... ఇద్దరూ ఇలా క్రూయిజర్‌లో రావడమే చాలా చర్చలకి తావిస్తుందని తెలుసు.

కొంగుని చాటుచేసుకుని, నడుంని చుట్టిన అతని చెయ్యి అక్కడ నుంచి పైకి లేవడానికి ప్రయత్నించినప్పుడల్లా ఐశ్వర్య బుగ్గలు సిగ్గుతో ఎర్రబడుతున్నాయి. చిరుకోపంతో అతన్ని వారిస్తోంది.

అతని చేయి పడినచోటల్లా తీయని స్పందనలు కలుగుతున్నాయి. ఒళ్ళంతా నిలవలేనట్లుగా అతన్ని హత్తుకుని పోవాలన్నట్లుగా వుంది.

అతనికి మరింత దగ్గరగా జరిగింది. అప్పటికి ఆమె పరువం చేతినిండుగా దొరికింది. సుఖాల తన్మయత్వంలో కళ్ళు అరమోడ్పులవుతున్నాయి. గుండ్రని పెదవులు విచ్చుకున్నాయి.

"నువ్విలాగే నన్ను కిల్ చేస్తావు నాకు తెలుసు...." అస్పష్టంగా అందామె.

"అప్పుడే ఏం చూశావు?" గర్వంగా అన్నాడు.

అతని చేతులు ఆమె రెండు పరువాల కొలతల్ని సరిచూశాక ఆమె నాభిలోతుని కొలిచాయి. అక్కడనుంచి కిందకి జారబోతుంటే తట్టుకోలేనట్లు వారించిందామె.

ఇదంతా కొంగుచాటునే.

"ఇలా మేనేజ్ చేస్తారు కాబట్టే ప్లే బాయ్ అన్న పేరొచ్చింది" కవ్విస్తూ అంది ఐశ్వర్య.

"ఇక ఆ పేరు తుడిచిపెట్టుకుపోతుంది. ఐశ్వర్యతో తప్ప ఎవరితోనూ రొమాన్స్‌కి వెళ్ళను ప్రామిస్" చెప్పాడు.

"మీరు వెళతానన్నా నేను వెళ్ళనిస్తానా?" అతని పెదాల్ని తమకంగా చూస్తూ అంది.

"నువ్వుకాదు, నీ అందం వెళ్ళనివ్వదు" మనస్ఫూర్తిగా చెప్పాడు.

కించిత్ గర్వంగా తలాడించింది ఐశ్వర్య.

చిరునవ్వు మెరుపుల్ని మెరిపిస్తున్న ఆ పెదాలవైపు వంగబోయాడు సల్మాన్. స్టెయిర్స్ దగ్గర చప్పుడయింది. చప్పున చెయ్యితీసి మామూలుగా నిల్చున్నారిద్దరూ.

మెట్లెక్కి వస్తున్నారు. త్రినాథ్, చైతన్య ఆశా భంగంతో గాలి తీసిన బెలూన్‌లా అయింది సల్మాన్ మొహం. అది చూసి నవ్వింది ఐశ్వర్య.

ఐశ్వర్యని అక్కడ చూడగానే త్రినాథ్ మొహం వికసించింది.

అక్కడే గుండులా వున్నచోట తిష్టవేసి ఐశ్వర్యనే చూడసాగాడు త్రినాథ్.

పట్టరాని కోపం వచ్చింది సల్మాన్‌కి. సీరియస్‌గా మారిందతని మొహం.

ఇద్దరికీ ఏం చేయాలో తోచలేదు. ఐశ్వర్య సల్మాన్ అవస్థ చూసి నవ్వుకుంటూ కూర్చుంది.

పది నిమిషాలు... పావుగంట... అరగంట గడిచింది. కానీ త్రినాథ్ చూపు తిప్పలేదు. చైతన్య డెక్‌మీదంతా పరుగులు పెడ్తున్నాడు.

"నీకిక్కడ ఏం పని?" అడిగాడు సల్మాన్.

నవ్వాడు త్రినాథ్. "అపురూప సౌందర్యాన్ని వెతుక్కుంటూ బయల్దేరాను. ఇప్పటికి ఇక్కడ కన్పించింది చూస్తూ కూర్చున్నాను...." సముద్రం వంక చూస్తూ, గూడార్థంగా అన్నాడు త్రినాథ్.

ఒళ్ళు మండిపోయింది సల్మాన్‌కి.

"అంత అపురూప సౌందర్యాన్ని నువ్వేం చేసుకుంటావోయ్... మనకి ఓ అర్హత వుండాలిగా" వెటకారంగా అన్నాడు సల్మాన్.

"అర్హతలదేవుందిలెండి కాస్త కష్టపడితే మీలాగ నాకూ వస్తుంది" తనూ అదే రేంజ్‌లో అన్నాడు త్రినాథ్.

సర్రున కోపం వచ్చింది సల్మాన్‌కి.

"హోల్డ్ యువర్‌టంగ్" అన్నాడు.

ఐశ్వర్య సల్మాన్‌ని వారిస్తూ త్రినాథ్‌తో–

"వాట్స్ యువర్ ప్రాబ్లం?" నవ్వుతూ అడిగింది.

"ప్రాబ్లం కాదండీ... నాకోలక్ష్యం వుంది" ఆమెతో తన హృదయాన్ని విప్పిచెప్పే అవకాశం దొరికినందుకు సంతోషిస్తూ అన్నాడు.

"ఏంటి ఐష్ అతనితో మాటలు?" సల్మాన్ విసుగ్గా అన్నాడు.

"వన్‌మినిట్ సల్మాన్... ఏం చెబుతాడో విందాం" అందామె.

"ఏంటి మీ లక్ష్యం?" ఆసక్తిగా అడిగింది.

కొంచెం సిగ్గుపడ్డాడతను.

అయ్యో కళ! మనసులోనే అనుకుంది.

"చెప్పండి" రెట్టించింది.

"మీ బొమ్మ గీయాలని" చెప్పాడు.

"ఈజిట్? ఆర్ యు పెయింటర్. వెరీ ఇంట్రస్టింగ్... బ్యాక్ డ్రాప్ చాలా బాగుంది వెళ్ళి మీ సరంజామా తెచ్చుకోండి... బొమ్మగీద్దురు గాని" చెప్పింది.

"అతను పెయింటర్ కాబట్టి ఐష్‌ని అంత పట్టి పట్టి చూసుంటాడు" అనుకోగానే సల్మాన్ హృదయం శాంతించింది.

"ఇక్కడ కుదరదండి" మొహమాటంగా అన్నాడు త్రినాథ్.

"మరి" ఆశ్చర్యంగా అంది.

ఎవరూలేని ఏకాంతంలో పచ్చని చెట్లు, జలపాతాల మధ్య వాటిలా సహజంగా ఏ ఆచ్ఛాదనాలేని మీ సాటిలేని సౌందర్యాన్ని చిత్రించాలని."

అతనిమాట ఇంకా పూర్తికాలేదు. సల్మాన్ ఉక్కుపిడికిలి త్రినాథ్ గడ్డం కింద గుద్దింది. ఎగిరి అంత దూరంలో పడ్డాడు త్రినాథ్. తల చెక్కకి కొట్టుకుంది. నుదుట నుంచి రక్తం ధారగా కారుతోంది.

చైతన్య మనుషుల్ని పిలవడం కోసం వెళ్ళబోతుంటే వారించాడు త్రినాథ్.

ఐశ్వర్య మొహం కూడా సిగ్గుతో కందిపోయింది.

"ఇదేం లక్ష్యం? అయినా అతనికీ తనకీ ఏం సంబంధం వుందని?"

చేత్తో రక్తాన్ని తుడుచుకుంటూ త్రినాథ్ కంటిన్యూ చేశాడు.

"ఇదీ నా జీవితలక్ష్యం. మిమ్మల్ని సినిమాలో చూసిన దగ్గర్నుంచీ ఈ లక్ష్యమే నన్ను నడిపిస్తోంది. ఈ లక్ష్యం కోసమే నలుగురూ నవ్వినా లెక్క చేయలేదు. ఈ లక్ష్యం కోసమే నా చెల్లి పెళ్ళిని కూడా వదిలి వచ్చేశాను. ఈ లక్ష్యం కోసమే క్రూయిజర్‌లో అడుగుపెట్టాను. ప్లీజ్" ఐశ్వర్యవంక చూస్తూ అన్నాడు.

"ఇంకా ఏంట్రా మాట్లాడుతున్నావు?" సల్మాన్ అతనిమీద కలబడ్డాడు.

త్రినాథ్ రెసిస్ట్‌చేసే ప్రయత్నం ఏమీ చేయలేదు. కొట్టికొట్టి రొప్పుతూ నిలబడ్డాడు సల్మాన్.

ఐశ్వర్యలో స్త్రీ సహజమయిన మానవత్వం తొంగి చూసింది. ఆమె సల్మాన్‌ని వారించింది.

త్రినాథ్‌తో "మీది సహజమైన కోరికకాదు. సినిమా స్టార్స్ అన్నంత మాత్రాన వారికీ మోరల్ వాల్యూస్ వుండవని మీరనుకుంటారు కాబోలు" ఐశ్వర్య అంది.

ఆమె మాటలకి నొచ్చుకున్నాడు త్రినాథ్.

"నా ఉద్దేశంలేదు... మిమ్మల్ని చులకనగా భావించే సమస్యేలేదు. నా హృదయపీఠంలో అధిష్టించిన దేవత మీరు" చెప్పాడు త్రినాథ్.

"దేవతలను వల్గర్‌గా చిత్రీకరిస్తారా?" షర్ట్ కాలర్ పట్టుకుని అడిగాడు.

"వల్గారిటీ కాదండీ... సహజ సౌందర్యంపట్ల ఆరాధన అది...." త్రినాథ్ అన్నాడు.

అతను చెబుతుంటే తల పట్టుకుంది ఐశ్వర్య.

ముగ్గురూ మూడు మూలల్లో నిశ్చేష్టులై నిలబడి వున్నారు.... నాలుగో మూలనుంచి ఓ కాలమేఘం యముడు పంపిన దూతలా వస్తోంది. క్షణాల్లో ఆకాశం నల్లబడింది. క్రూయిజర్‌లో అన్నివైపుల నుంచీ హెచ్చరికలు విన్పిస్తున్నాయి.

సల్మాన్ ఐశ్వర్యని వెంటబెట్టుకుని కిందికి దిగిపోయాడు వెంటనే.

ఉసిరికాయంత చినుకులు చిటపట పడుతుంటే తేరుకుని తన కేబిన్‌కి నడిచాడు త్రినాథ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

క్రూయిజర్ కెప్టెన్ మిగతా వాళ్ళతో చర్చలు జరుపుతున్నాడు. హఠాత్తుగా మారిపోయిన వాతావరణ పరిస్థితే ఆ చర్చలకు కారణం. సముద్రంలో తుఫానులు సహజమే. వాటికి తగినట్లుగానే క్రూయింజర్‌లో రక్షణ ఏర్పాట్లు వుంటాయి.

మధ్యాహ్నం మొదలైన వాన అంతకంతకూ పెరుగుతోంది తప్ప తగ్గడంలేదు. డెక్‌మీద ఎవరినీ ఉండొద్దని ఎవరి క్యాబిన్‌లోకి వాళ్ళు వెళ్ళిపోవాలని స్ట్రిక్ట్ ఆర్డర్స్ మూలంగా అందరూ తమ తమ క్యాబిన్స్‌లోకి చేరిపోయారు.

రాత్రి అయ్యేసరికి మాత్రం అందరికీ బోర్‌కొట్టి రెస్టారెంట్‌కీ, సెమినార్ హాల్‌కి, లైబ్రరీకీ వెళ్ళడంతో అవి జనాలతో కిటకిటలాడాయి.

ఎంజాయ్‌మెంట్ లేకుండా ఈ తుఫాను అడ్డంపడినందుకు అందరికీ నిరుత్సాహంగానే వుంది. తను తమ గదుల్లో దీపాలకాంతులే తప్ప కిటికీ అద్దంలో నుంచి చూస్తే ఏమీ కనపడనంతగా వాన కూరుస్తోంది.

అలలు ఎగసి ఎగసి పడుతున్నాయి. ఈ పరిస్థితి ప్రయాణీకులలో చాలామందికి అలవాటులేకపోవడంతో బితుకు బితుకు మంటూ గడుపుతున్నారు.

సెమినార్ హాల్లోకి వెళ్ళాడు త్రినాథ్. అక్కడ డయాస్ మీద చిన్నపిల్లలు డాన్స్ చేస్తున్నారు. ఐశ్వర్య చప్పట్లు కొడుతూ వాళ్ళని ఎంకరేజ్ చేస్తోంది.

అందరి కోరికమీద ఆమె తాళ్‌లోని పాటకి నృత్యం చేసింది. ఆ పాటలోని సంగీతం, సాహిత్యం, ఆమె అభినయం మూడూ పెనవేసుకొని వందకోట్ల భారతీయులనే కాక ప్రపంచ వ్యాప్తంగా అనేకమందిని అలరించింది.

రాత్రి పది గంటలయింది. హోరుమనే శబ్దం ఏదో అంతకంతకూ పెరిగిపోతోంది. మళ్ళా ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. "ఎవరి క్యాబిన్స్‌కి వాళ్ళు వెళ్ళి తలుపులు వేసుకొని వుండమని" అప్పటికే అందర్లో ఏదో అనుమానం పొడచూపింది.

క్రూయిజర్ సిబ్బంది ప్రతీ క్యాబిన్కీకీ వచ్చి లైఫ్ జాకెట్స్‌ను ఎలా వేసుకోవాలో, విపత్కర పరిస్థితులు వస్తే ఎలా ఎదుర్కోవాలో, ఇండివిడ్యువల్‌గానూ, మాస్‌గానూ డిమాన్‌స్ట్రేషన్ చేసి చూపిస్తున్నారు.

అందరూ భయంతో ప్రశ్నలు సంధిస్తుంటే, ఇవి రొటీన్‌గా తీసుకొనే జాగ్రత్తలేననీ, ప్రమాదం ఏం లేదని ధైర్యం చెప్పసాగారు.

క్రూయిజర్ చిన్న చిన్న కుదుపులకి లోనవుతోంది. అందరు ప్రాణాలు బిగబట్టుకొని కూర్చున్నారు. ఐశ్వర్య తన క్యాబిన్‌లో కూర్చుని పేరెంట్స్‌తో కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నించింది.

వాతావరణం అనుకూలంగా లేదు. డోర్ నాక్‌చేసిన శబ్దం అయితే ఆయా తలుపు తీసింది. సల్మాన్ లోనికి ప్రవేశించాడు. దిగులుగా వున్న ఆమె మొహాన్ని చూసి–

"నథింగ్ టు వర్రీ...." చెప్పాడతను.

బలహీనంగా చిన్న నవ్వు నవ్వింది. టీ.వీ. చూస్తుండగా వాటి ప్రసారాలకు కూడా అంతరాయం వచ్చింది. ఆ కాలక్షేపమూ మిస్సయింది. ఒకరి మొహాలు ఒకరు చూస్తూ కూర్చున్నారు.

ఇంతలో అసిస్టెంట్స్ పిలవడంతో బయటికి వెళ్ళాడు సల్మాన్. ఏం జరుగుతుందో అర్థంకాలేదు త్రినాథ్‌కి.

క్యాబిన్ తలుపు తీసుకుని మెల్లగా బయటకి వచ్చాడు. అటూ, ఇటూ చూశాడు. క్రూయిజర్ సిబ్బంది వాళ్ళ హడావిడిలో వాళ్ళున్నారు. మెల్లగా స్టెయిర్‌కేస్ మీదనుంచి డెక్‌మీదకి వెళ్ళేవైపు నడిచాడు.

ఓ చెక్కపలక బిగించి వుంది కానీ తాళం వేసిలేదు. మెల్లగా తల మాత్రం బయటకి పెట్టి చూశాడు. బాణాల్లా మొహాన్ని తాకాయి వర్షపు చినుకులు. అతని జీవితంలో ఎప్పుడూ అంత ప్రళయాన్ని చూడలేదు.

అలలు విపరీతంగా ఎగిసిపడుతున్నాయి. ఒక్కో అల క్రూయిజర్‌ని చాచి కొడుతున్నప్పుడల్లా క్రూయిజర్‌లో కుదుపులు ఏర్పడుతున్నాయి.

హఠాత్తుగా నౌకలో కరెంటు పాక్షికంగా దెబ్బతింది. లైట్లన్నీ గుడ్డిగా వెలగసాగాయి.

ప్రయాణీకులంతా ఎవరి గదుల్లో వారు హాహాకారాలు చేశారు. త్రినాథ్‌కి కిందికి దిగాలో, పైకి వెళ్ళాలో తెలియనట్లుగా వుంది. తాము రక్షణ పొందాలంటే డెక్ మీదనుంచే లైఫ్ బోట్‌లలోకి దిగాలి. కానీ పరిస్థితి అంత క్షీణించిందో లేదో? తెలియడంలేదు.

అతను మళ్ళీ తన పైకెత్తి డెక్‌మీద నుంచి సముద్రాన్ని చూశాడు. మెరుపుల వెలుగులో అతనికి దూరంనుంచి తెల్లనిదేదో కదులుతూ రావడం కన్పించింది.

దాదాపు ఆకాశాన్ని తాకుతున్నట్లుగా వుందది. అతని కళ్ళు భయంతో పెద్దవయ్యాయి. "ఏంటది... మంచు పర్వతమా....?" కళ్ళు చిట్లించి చూశాడు. మళ్ళీ మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో మూడు తాళ్ళ ఎత్తున నురుగుల నాలుకల్ని చూస్తూ ప్రళయకాలపు యమునిలా ముంచుకొస్తున్న అలలను చూడగానే అతనికి నోరు తడారిపోయింది.

అతను తన జీవితంలో పది పదిహేను అడుగుల ఎత్తు ఎగిసిపడే అలల్ని చూశాడు. కానీ నిశ్చలంగా నమ్ముకున్న నీరే ఇలా ప్రళయమై ముంచెత్తుతుందనుకోలేదు.

త్రినాథ్ డెక్ తలుపు మూసేశాడు. ఎమర్జెన్సీ అలారం అన్ని గదుల్లోనూ మ్రోగింది. అందరూ ఏదో ఒక కదలని వస్తువును బలంగా పట్టుకుని వుండమని హెచ్చరికలు జారీ అయ్యాయి. అందరూ లైఫ్ జాకెట్స్‌ని వేసుకున్నారు.

అందరికీ అర్థమైపోయింది తమకి ఆఖరి క్షణాలు సమీపించబోతున్నాయని. ఏడుపు, కేకలతో క్యాబిన్స్ దద్దరిల్లిపోతున్నాయి. ఓ నిమిషం గడిచిందో లేదో అతి బలమైనదేదో వచ్చి క్రూయిజర్‌ను గుద్దుకుంది.

రాక్షస హస్తమేదో పట్టి ఊపినట్లుగా ఈస్ట్‌ఫాస్ట్ క్రూయిజర్ విపరీతంగా కదిలిపోయింది. ఆ దెబ్బకి మెట్లమీదనుంచి ఎగిరి పదడుగుల దూరంలో పడ్డాడు త్రినాధ్. మోచేయి చెక్కకు గుద్దుకుని కలుక్కుమంది.

పవర్ సప్లయ్ పూర్తిగా ఆగిపోయింది. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి అలుముకొంటోంది. ప్రయాణికులంతా బీతావహులై కెప్టెన్ సూచనలను లక్ష్యపెట్టకుండా పరుగుపెడుతూ గదుల్లో నుంచి బయటకు వచ్చారు.

అంతా గందరగోళంగా మారింది.

సిబ్బంది అంతా ఎలర్ట్ అయ్యారు. టార్చ్‌లైట్స్ సాయంతో ప్రయాణికులకి నచ్చచెప్పటం ప్రారంభించారు. కొన్ని ఇంజన్స్ పని చేయటం మానేసాయి షిప్ ఒక ప్రక్కకి ఒరిగిపోవడం తెలుస్తూనే వుంది. అందరికి భయం అంత కంతకు విచక్షణను చంపేస్తోంది.

కొంతమంది ప్యానిక్ స్టేజ్‌కి వచ్చి ఏడుస్తూ క్రూయిజర్ సిబ్బందిని తిడుతున్నారు. కొంతమంది దేవుడ్ని ప్రార్థిస్తూ కూర్చున్నారు. ఇంతలో ఓ వ్యక్తి వచ్చి పిచ్చిపట్టిన వాళ్ళా అరుస్తూ.

"డెక్ మీదకు వెళ్ళి లైఫ్‌బోట్‌లో వెళ్ళిపోవచ్చుగదా...." అన్నాడు.

సిబ్బంది "అలా కుదరదు...." గట్టిగా అతన్ని వారించారు.

"ఎందుకు కుదరదు...." అంటూ అరుస్తూ అందర్నీ తోసేసుకుని మెట్లమీదనుంచి డెక్ మీదకు వెళ్ళడానికి పరుగు పెట్టాడు.

క్రూయిజర్ సిబ్బందితోపాటు అక్కడ పరిస్థితి తెలిసింది త్రినాధ్ ఒక్కడికే. కంగారుగా అరుస్తూ అతన్ని అడ్డుకోబోయాడు త్రినాధ్. అరుపుల్ని, సిబ్బందినీ కూడా లెక్కచేయలేదతను.

గట్టిగా అరుస్తూ డెక్ మీదకు వెళ్ళిపోయాడు, అతని వెనకే వెళ్ళి తల మాత్రం బయటపెట్టిన త్రినాధ్‌కి కనిపించింది, ఓ భయానక దృశ్యం. చూస్తుండగానే క్రూయిజర్‌ని మించి ఎత్తుకు లేచిన ఓ అల చప్పున అతడ్ని లాగేసుకొని సముద్రగర్భంలో కలపేసుకుంది. త్రినాధ్ బాధగా కళ్ళుమూసుకున్నాడు.

డెక్ పలకలలోంచి నీరు లోపలికి రావడం ప్రారంభమైంది. చప్పున మోసేశాడు త్రినాధ్. సిబ్బంది మొహం బాధాపూరితంగా మారింది. ఏం జరిగిందో మిగతా వాళ్ళకి అర్థంకాక అంతా చేష్టలుడిగి ఎక్కడివాళ్ళక్కడ నిలుచుండిపోయారు.

అప్పుడు వివరించారు సిబ్బంది వాతావరణ పరిస్థితులను. షిప్‌లోంచి అందరూ బయటపడాల్సిందే... ఎందుకంటే... అప్పటికే క్రూయిజర్‌కి కొన్నిచోట్ల లీకై నీరు లోపలకి వస్తోంది. అదిక ప్రయాణించడానికి పనికిరాదు.

క్రూయిజర్ మునిగిపోవటం ప్రారంభమైంది. మరో పదిగంటల్లో సముద్ర గర్భానికి చేరిపోవడం ఖాయం. కాని ఇప్పుడు బయటకు వెళ్ళే పరిస్థితి కూడాలేదు.

అందుకే ఈ తుఫాను శాంతించేవరకు తప్పదు. అలాగని ఇక్కడా పరిస్థితి సురక్షితంగా లేదు. షిప్ ఓ మూలకి క్రమంగా ఒరిగిపోతోంది. పరిస్థితి ఎలా వుందంటే డెక్ మీదకు వెళితే చావు త్వరగాను, షిప్‌లో వుంటే పావుగంట పొడిగించినట్లుగానూ వుంది. ఒక్కోనిముషం జరిగే కొద్దీ పరిస్థితి చేయిదాటిపోతున్నట్లుగా వుంది.

ఇంజనీర్స్‌ని క్రింద అంతస్తులోకి పంపించారు. వాళ్ళు పవర్ సప్లయ్‌ని కొంతవరకు పునరుద్ధరించడంతో అక్కడక్కడా లైట్లు గుడ్డిగా వెలుగుతున్నాయి. ఐశ్వర్య తన క్యాబిన్‌లోకి వెళ్ళి తలుపేసుకుంది.

చావుకి కొద్దిగంటల ముందు అంతరంగం ఇలా వుంటుందా అని ఆశ్చర్యపోతోంది, భయం, ఆందోళనా, జీవితంపట్ల ఆశా, ప్రాణం మీద తీపి అసహాయత అన్నీ తోడై ఆమె అంతరంగం కదిలిపోతోంది.

తనకు ఊహ వచ్చిన దగ్గరనుంచీ తను అనుభవించిన జీవితాన్ని ఓసారి సింహావలోకనం చేసుకుంటోంది. తనీ ప్రమాదంలో మరణిస్తే ప్రజలందరూ ఏమని ఆలోచిస్తారు?

పత్రికలు ఏమని హెడ్డింగ్ పెడతాయో? క్రూయిజర్ ప్రమాదంలో అందాలరాశి ఐశ్వర్య దుర్మరణం అనా? అందాలరాశి చిన్నగా నవ్వు కుంది.

1994లో ప్రపంచ సుందరిగా తను గెలుచుకున్న కీర్తి, పేరు, ప్రతిష్టలు, సంపద, ప్రేమ, వ్యామోహం.

ఇప్పుడు తన ప్రాణాల్ని నిలబెట్టగలవా? చావుకు పక్షపాతం ఉండదు, అంత్య సమయంలో జ్ఞానోదయమయింది ఆమెకు.

ఈ సృష్టిలో అత్యంత విలువైంది మనిషి ప్రాణం ఒక్కటే. మిగతావన్నీ మనం సృష్టించుకున్న భ్రమలే... మరణించాకా... తన గురించి ఎవరేమనుకుంటే తనకేం? ఇన్నాళ్ళుగా అనేక రకాల బంధనాల్లో చిక్కుకుంది. అందంకోసం, స్టేటస్‌కోసం, కీర్తి ప్రతిష్టలకోసం అంతర్జాతీయంగా వచ్చే పేరు ప్రతిష్టలకోసం ఎంత తపనపడింది తను...

ఐశ్వర్య గదిలో ఇలా ఆలోచిస్తుండగా ఆ చీకట్లో, ఆ గుంపులో ఐశ్వర్య కోసం సల్మాన్, త్రినాధ్ ఇద్దరూ వెతుకుతూనే వున్నారు. అక్కడ ప్రేమ బంధమే ఒకరి కోసం ఇంకొకరిని ఆరాటపడేలా చేస్తుంది తప్ప, ఏ శాసనమూ పనిచేయదు.

సల్మాన్ అసిస్టెంట్స్, ఐశ్వర్య అసిస్టెంట్స్, బాలీవుడ్ న్యూస్ సిబ్బంది అంతా ఎవరి సేఫ్టీని వాళ్ళు చూసుకుంటున్నారు తప్ప ఇతరుల ఆలోచన వారికి లేదు.

క్రూయిజర్‌లోకి నీరు మరింత రావడం ఎక్కువైంది. సిబ్బంది తమ వంతు ప్రయత్నాలు తాము చేస్తున్నారు.

పైనుంచి వచ్చే వర్షపు తాకిడికి తట్టుకోవడమే కష్టంగా వుంటే క్రిందనుంచి వచ్చే నీరు మరింతగా లోపలకు ప్రవేశిస్తోంది. క్రింద వుధృతి ఎక్కువైనకొద్దీ క్రింద అంతస్థులోని క్యాబిన్‌లన్నీ ఫెటేల్‌మని పగిలిపోతున్నాయి. అంతా నీరే రాజ్యమేలుతోంది.

రాత్రి ఒంటిగంట అయ్యేసరికి క్రింద అంతస్థు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఓడరేవులతో సంబంధాలన్నీ కట్ అయిపోయాయి. అదీకాక... ఇంత ఉధృతమైన అలలతో ఎగసిపడుతున్న సముద్రంలోకి సహాయక చర్యల నిమిత్తం దేనిని పంపించినా అది ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది.

రెండో అంతస్తు కూడా పూర్తిగా మునిగిపోయింది. అప్పటికి సమయం రాత్రి రెండున్నర గంటలు. సల్మాన్‌కి అంతా అయోమయంగా వుంది.

ఐశ్వర్య జాడ ఎక్కడాలేదు. అతను ఎలుగెత్తి పిలుస్తున్నాడు. కానీ... ఎక్కడా ఆమె కన్పించలేదు. ఆ హోరుమనే శబ్దంలో అతని కేక అతనికే సరిగ్గా వినపడ్డంలేదు. మెల్లగా మూడో అంతస్థులోకి కూడా నీరు రావడం ప్రారంభమైంది.

చివరికి కెప్టెన్‌కి డెసిషన్ తీసుకోక తప్పలేదు.

అదీకాక అలలు మరీ తాడెత్తున లేవడం లేదు. పాతిక మందిని కలిపి ఒక్కోలైఫ్‌బోట్‌లో పంపడానికి నిశ్చయించుకున్నాడు.

అందరూ తోసుకోవడం ప్రారంభమైంది. ఆ పాతికమందిలో యువకులూ, వృద్ధులూ, పిల్లలు సమాననిష్పత్తిలో వుండేలా స్టేర్‌కేస్ ప్రక్కన నిలబడి పంపిస్తున్నాడు కెప్టెన్.

సముద్రంలో లైఫ్‌బోట్‌కి ఆటుపోట్లు వచ్చినపుడు ఈ యువకులు మిగతావారిని రక్షిస్తారని అతని ఉద్దేశం.

త్రినాధ్ వాలంటరీగా పనిచేయటం చూసి కెప్టెన్ అతన్ని డెక్‌పైన లైఫ్‌బోట్‌లను కిందికిదింపే సిబ్బంది దగ్గరికి పంపాడు.

జనాలంతా... కంట్రోల్ చేయడానికి వీలులేనంతగా తోసుకుంటూ ఎక్కుతున్నారు. కెప్టెన్ నిస్సహాయుడయ్యాడు. అప్పటికే మూడో అంతస్తులో నీరు మోకాళ్ళ దగ్గరకొచ్చింది.

ఎవరికి వాళ్ళకి ప్రాణాలమీద తీపే. ప్రభాకర్, లలితలు చైతన్యను పట్టుకొని ముందుకు వెళ్ళడానికి ప్రయత్నించసాగారు.

"మనం త్రినాధ్ అంకుల్‌తో వెళ్దాం డాడీ అతను హీరో! మనల్ని సేవ్ చేస్తాడు...." అని ఏడుస్తూ అంటున్నాడు చైతన్య.

ఆ తొక్కిసలాటలో ముందుకు వెళ్ళలేక వెనకే వుండిపోయారు వాళ్ళు. వాళ్ళతోపాటు నవదీప్‌సింగ్, మన్‌ప్రీత్‌కౌర్ కూడా చేతులు చేతులు కలుపుకుని నిలబడ్డారు.

పైన డెక్‌మీద పరిస్థితి చాలా బీభత్సంగా వుంది. లైఫ్‌బోట్‌ల్ సముద్రజలాల్లోకి దిగంగానే పడుతూలేస్తూ అదృశ్యమవుతున్నాయి.

ఎన్ని తలక్రిందులవుతున్నాయో? ఎన్ని సజావుగా ప్రయాణిస్తున్నాయో ఎవరికీ తెలియదు.

సల్మాన్, ఐశ్వర్యకోసం ఎదురుచూస్తూనే వున్నాడు. ఆమె కూడా ఎక్కడా కనిపించలేదు. ముందెళ్ళిన వాళ్ళలో ఆమె వెళ్ళిపోయి వుండవచ్చని సమాధానపడి తనూ ఓ బ్యాచ్‌తోపాటు డెక్‌మీదకొచ్చాడు.

లైఫ్ బోట్స్ దగ్గర వున్న త్రినాధ్ సల్మాన్‌ని చూశాడు. "మేడం ఏరి?" అడిగాడు.

"ఆమె ముందు వెళ్ళిందనుకుంటున్నాను" చెప్పాడు సల్మాన్.

"నేనిందాకటినుంచీ ఇక్కడే వున్నాను, ఆమె రాలేదు." స్థిరంగా చెప్పాడు త్రినాధ్.

ఓ క్షణం అసహాయంగా చూశాడు సల్మాన్. మిగతావారు తొందర పెట్టడంతో తను లైఫ్ బోట్‌లోకి దిగిపోయాడు.

త్రినాధ్‌కి ఏదో అనుమానం వచ్చింది. తను చేస్తున్న పనిని పక్కవాళ్ళకప్పగించి, అతను క్రిందికి వెళ్ళబోతుంటే అది ప్రమాదమని, వెళ్ళవద్దనీ వారించారు సిబ్బంది.

కానీ అవేమీ లెక్కచేయలేదతను క్రింద కెప్టెన్, ప్రభాకర్, నవదీప్‌సింగ్ అడ్డుపడినా ఆగలేదు. నడుంలోతు నీళ్ళలో ఈదుకుంటూ చేత్తో టార్చ్‌లైట్ పట్టుకుని రెస్టారెంట్, సెమినార్ హాల్‌అంతా వెతికాడు. ఎక్కడా ఆమె కనిపించలేదు.

తిరిగి వస్తోంటే ఒక పదహారేళ్ళ అమ్మాయి లైబ్రరీలో పుస్తకాల రాక్‌మీద పైకెక్కి కూర్చుని భయం భయంగా చూస్తూ కన్పించింది. అతన్ని చూడగానే కేకలేసి పిలిచింది.

ఆశ్చర్యంగా చూశాడు త్రినాధ్.

"నాకు నీళ్ళంటే భయం...." చెప్పిందా అమ్మాయి.

"యూ స్టుపిడ్...." పంటి బిగువున తిట్టాడామెను.

పైనుంచి బలవంతంగా క్రిందకి దింపాడు.

ఆ అమ్మాయి కెవ్వు కెవ్వున అరుస్తున్నా తీసుకొచ్చి కెప్టెన్‌కి అప్పగించాడు. అప్పటికింకా క్రింద పదిహేనుమందే వున్నారు. భుజాల వరకూ నీళ్ళొచ్చాయి.

ఐశ్వర్య కన్పించలేదు. అప్పుడొచ్చిందతనికి సందేహం.

ఐశ్వర్య తన కేబిన్‌లోనే వుండిపోయిందా? ఆలోచన రాగానే వేగంగా ఈదుకుంటూ ఆమె క్యాబిన్‌వైపు వెళ్ళాడు. టార్చ్‌లైట్ వేసి చూశాడు.

అక్కడ కన్పించిందతనికి ఐశ్వర్య.

గది మధ్యలో నిలబడి వుందామె. అంత జీవన్మరణ సమస్యలో కూడా ఆమె అంత నిబ్బరంగా నిలబడి వుండటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆమె మెడవరకూ వచ్చాయి నీళ్ళు. సన్నని పొడుగాటి మెడ తామరతూడులా, ఆమె ముఖం పద్మంలా గోచరించిందతనికి. ఆలోచనలను విదుల్చుకుంటూ...

"హరియప్..." అరిచాడు.

తల అడ్డంగా ఆడించింది ఐశ్వర్య.

"ఏం...?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎలాగూ చావక తప్పదు. అక్కడకొచ్చి పరుగులుపెట్టి చనిపోవడంకన్నా ఇలా ప్రశాంతంగా మరణించడమే మేలు... ఐశ్వర్యకన్నా ఐశ్వర్యంకన్నా, బిల్‌గేట్స్‌కన్నా, హాలీఉడ్‌కన్నా, భగవంతుడు గొప్పవాడు... గడువు విధించేది ఆయన. ఆ గడువుకి లొంగిపోయేది జీవరాశి... భగవంతుడు, ఆ భగవంతుడు సృష్టించిన ఆత్మ శాశ్వితం... మరేది కాదు" చెప్పిందామె.

ఈమెకి మతిగాని చలించిందా ఏమిటి? అనుకున్నాడు.

"టైం దగ్గరపడితే ఎవరైనా చావక తప్పదు. మన చేతిలో అవకాశం వున్నంతవరకూ పోరాడాలి...." అని అనునయంగా చెప్పి నీళ్ళలోనే ఆమె చేతిని అందుకోబోయాడు.

వెనక్కి వెళ్ళిపోయిందామె. ఆమె మూర్ఖత్వానికి కోపం వచ్చింది. మారుమాట్లాడకుండా ఆమెను సమీపించి, రెండు చేతులతోనూ ఎత్తి భుజంమీద వేసుకొని తల పైకెత్తి నడవడం ప్రారంభించాడు.

ఆమె గింజుకుంటూనే వుంది. ఆ క్షణంలోనే ఆఖరి మనిషిని డెక్ మీదికి పంపించి, వాళ్ళిద్దరికోసం చూస్తున్నాడు కెప్టెన్. ఈదుకుంటూ వస్తున్న వాళ్ళను చూడగానే ఆయన ముఖం వికసించింది.

"వెల్‌డన్ మైబోయ్" అని ప్రసంశిస్తూ, వాళ్ళను కూడా పంపించి, ఆఖరిసారిగా ఆ మూడో అంతస్తును కలియజూసి తానూ డెక్‌మీదకు వచ్చాడు.

ఆ ఉరుములూ, మెరుపులూ, ఎగిసిపడుతున్న అలలూ, ఈడ్చికొడుతున్న వానా చూడగానే గుండె ఆగినంత పనయింది ఐశ్వర్యకి. తన చేతిని పట్టుకుని అడుగులేస్తున్న శ్రీనాధ్‌తో....

"ఇలా చంపడానికేనా ఇక్కడికి తీసుకువచ్చావు...." కోపంగా అందామె.

ఆమె చేతిని, తనకు ముందు నడుస్తున్న చైతన్య చేతినీ గట్టిగా పట్టుకుంటూ...

"నా ఒంట్లో ప్రాణం ఉన్నంతవరకూ మిమ్మల్ని రక్షించడానికే వెచ్చిస్తాను" చెప్పాడతను.

ఆఖరుగా మిగిలిన ఇరవైమంది ఒక లైఫ్‌బోట్‌లో, క్రూయిజర్ తాలూకా మిగిలిన సిబ్బంది అంతా మరో లైఫ్‌బోట్‌లో సముద్రంలోకి ప్రవేశించారు.

లైఫ్ బోట్ ఎగిరెగిరి పడుతోంది. ఒక నిర్దుష్ట లక్ష్యం అంటూ లేకుండా అలలు ఎటు విసిరితే అటువైపు వెళ్ళిపోతోంది. ఆ పరిస్థితిలో ఎవరూ చేయగలిగేదేమీ లేదు.

మెరుపుల వెలుగులో క్షణక్షణం మునిగిపోతున్న క్రూయిజర్ వంక భయంభయంగా చూశారు. చిట్టచివరికి క్రూయిజర్ తాలూకా పైభాగం కూడా పూర్తిగా మునిగిపోవడం చూసి వాళ్ళందరి హృదయాలు బరువెక్కాయి.

అలలు తాకిడికి లైఫ్ బోట్ ఎగిరిపడి తలక్రిందులైనా, బోట్‌ను గట్టిగా పట్టుకొని వుండమని, లైఫ్ జాకెట్ సాయంతో మళ్ళీ బోట్‌లోకి చేరమని పదేపదే చెప్తున్నాడు త్రినాధ్.

ఐశ్వర్య అతని చేతిని పట్టుకుని వదలడంలేదు... ఇంకోవైపు చైతన్య...

అలలు ఉధృతి కొనసాగుతూనే వుంది. అందరికీ జీవితంమీద ఆశ నశించింది. ఈ బాధ భరించడంకన్నా చనిపోవడమే మేలనిపిస్తుంది.

ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానిక్కూడా ఖాళీ లేదక్కడ. క్షణ క్షణానికీ ఎగిసిపడుతున్న అలలను భయంతో కళ్ళు విప్పార్చి చూడడం తోనే సరిపోతోంది. అస్పష్టంగా ఐశ్వర్య మాటలు శ్రీనాధ్ చెవులబడింది. ఆమె పెదాలు ప్రక్కన చెవులానించి ఏంటని అడిగాడు.

"జీవితంలో ఎన్నో పోరాటాలు, ఎంతో ధైర్యంతో చేశాను. కానీ ఇది చాలా భయంకరంగా వుంది" చెప్పిందామె.

అతను విని వూరుకున్నాడు. ఆమె మనసులో ఇందాకటినుంచీ మరో ప్రశ్న వేధిస్తోంది. సల్మాన్ ఎక్కడున్నాడని అతను క్షేమంగా వెళ్ళాడా? లేదాని? తను రాకుండానే అతను లైఫ్‌బోట్‌లో దిగిపోయాడా? అయినా త్రినాధ్‌ని అడగలేకపోయింది. లైఫ్ బోట్ ఒకోసారి ప్రచండ వేగంతోను, ఒకోసారి నిదానంగానూ రెండు గంటలపాటు అలా ప్రయాణిస్తూనే వుంది.

ఐశ్వర్యలో ఓపిక నశించింది. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. గమ్యంలేని ప్రయాణం. క్షణానికోసారి ప్రత్యక్షమై బెదిరించే మృత్యువులా అలలు... వీటన్నిటితో పోరాడి అందరూ మానసికంగా అలసిపోయారు.

త్రినాధ్ మొండిగా అరుస్తూ అందర్నీ ఉత్సాహపరిచే ప్రయత్నాన్ని, ఐశ్వర్య తన మనసులో ఉగ్గబట్టుకున్న అనుమానాన్ని ఆపుకోలేక త్రినాధ్‌తో–

"సల్మాన్ నా గురించి వెతకలేదా?" అడిగింది.

సమాధానం చెప్పడానికి నోరు తెరిచాడు త్రినాధ్. తెరిచిన నోరు తెరిచినట్లే వుండిపోయింది.

తాడెత్తున లేచిన అల లైఫ్ బోట్‌ని విసిరికొట్టింది. బోటు గట్టిగా వున్న దేన్నో గుద్దుకొని ముక్కలైంది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

తెల్లవారి ఆరు గంటలకు నిద్రలేచింది వాసంతి. లేవగానే పేపర్ హెడ్‌లైన్స్ చూడటం ఆమె కలవాటు. పేపర్‌లోని మెయిన్ హెడ్డింగ్ చూసి ఆమె నిశ్చేష్టురాలైంది.

గల్లంతయిన ఈస్ట్ ఫాస్ట్ క్రూయిజర్ సముద్రపు తుఫాను బీభత్సం. ప్రయాణీకుల్లో సల్మాన్‌ఖాన్, ఐశ్వర్యారాయ్. వార్త చూడగానే వాసంతికి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. వళ్ళంతా చెమటలు పట్టేశాయి. కళ్ళు తిరుగుతున్నట్లుగా అయింది.

తమాయించుకుంది. న్యూసంతా చదివింది. ప్రయాణీకుల్లో ఈ వార్త రాసే సమయానికి ఒక్కరు కూడా ఒడ్డుకు చేరలేదు.

అప్పుడొచ్చిందామెకు దుఃఖం. తనే చేజేతులా అతన్నక్కడికి పంపించింది. ఆ రోజు అప్లికేషన్‌మీద అతని సంతకం పెట్టించింది. తలచుకొని పెద్ద పెట్టున ఏడవడం ప్రారంభించింది వాసంతి.

ఉలిక్కిపడి నిద్రలేచి వచ్చాడు వీరయ్య చౌదరి. ఇంత ఉదయాన్నే విన్పించిన కూతురి రోదనకు వీరయ్య చౌదరి మనస్సు కీడు శంకించింది. గాబరాగా పరుగెత్తుకొచ్చి...

"ఏమైందమ్మా?" అడిగాడు.

మాట్లాడకుండా పేపర్ చూపించింది. ఓ క్షణం ఆయనకేం అర్థం కాలేదు. ఈ ఓడలోనా త్రినాధ్‌బాబు వెళ్ళింది.

భారతి పెళ్ళి ఆగిపోయిన తరువాత అతనికి ఈ సమాచారం చూచాయగా తెలిసింది. కానీ... అతని ప్రయాణానికి తన కూతురే కారణమని మిన్నకుండిపోయాడతను. ఇప్పుడు ఈ ఉపద్రవం.

ఆందోళనగా కొడుకును లేపి విషయం చెప్పాడతను. మాటలు జరగకపోయినా దాదాపుగా అతని సంబంధం ఖాయమని అనుకుంటున్నారంతా. అందుకే అంత ఆందోళన చెందుతున్నారు.

మనిషి ద్వారా రాఘవరావు కుటుంబానికి వార్త అందించారు. అప్పటికే టి.వి. వార్తలద్వారా ఊరంతా తెలిసిపోయింది.

అందరూ విషాదసాగరంలో మునిగిపోయారు. సుబ్బా కూడా తలచుకుని ఎంతో బాధపడ్డాడు.

అతని జాడ తెలిసిందో? లేదో? వాకబు చేయడం కోసం టౌనుకు ప్రయాణమయ్యారు సుబ్బా, వూళ్ళోని యువకులు. వాసంతి తండ్రి కూడా మరోప్రక్క ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

తెల్లవారుఝాము మూడు గంటలనుంచీ ఐశ్వర్య ఇంట్లో నిర్విరామంగా ఫోను మ్రోగుతూనే వుంది. ఆమె తల్లి, తండ్రి, అన్నా శోక సముద్రంలో మునిగిపోయారు.

తెల్లవారి ఆరు గంటలకల్లా సముద్రంలో తుఫాను కొంచెం శాంతించిందన్న వార్తలు వస్తున్నాయి. ఎవరెవరో అధికారులు ఫోన్ చేస్తున్నారు ధైర్యం చెప్తున్నారు.

భారతదేశపు అత్యున్నత అందాల రాయబారిగా దేవప్రఖ్యాతుల్ని అంతర్జాతీయంగా ఇనుమడింపచేస్తున్న ఐశ్వర్యారాయ్‌కోసం నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాలను రంగంలోకి దింపుతామని వాళ్ళు వాగ్దానం చేస్తున్నారు.

ఈలోగా వాళ్ళకి కబురు చేరింది. 600 మంది ప్రయాణికులున్న క్రూయిజర్‌లో దాదాపుగా 200పైన సురక్షితంగా లైఫ్ బోట్‌లలో వివిధ తీరప్రాంతాలకు చేరుకున్నారని వార్త.

వాళ్ళలో సల్మాన్, రమేష్‌పవార్ తదితరులున్నారు. ఐశ్వర్య పేరు లేదు. వారి దుఃఖం ఈ వార్త వినగానే కొంచెం తగ్గింది. ఇలా ఇంకో ఏవో తీరప్రాంతాలలో వున్న ప్రయాణీకుల్లో ఐశ్వర్య కూడా వుండవచ్చునని వాళ్ళకి కొంత ధైర్యం చిక్కింది.

క్షేమంగా ఒడ్డుకు చేరిన ప్రయాణీకులనుంచి మీడియావారు వివరాలు సేకరిస్తున్నారు. ఆ క్లిప్పింగ్స్ టీవీలో చూపిస్తున్నారు.

ఓ దగ్గర సల్మాన్ బయటకి వస్తుండగా విలేఖరులు అతన్ని చుట్టుముట్టి ప్రశ్నలవర్షం కురిపించడం ప్రారంభించారు.

"క్రూయిజర్ ఏమైంది? ఇందులో ఎవరిదయినా విద్రోహులకుట్ర వుందా?" ఓ విలేఖరి కాస్త ముందుకు వెళ్ళి అడిగాడు.

"ఇది విద్రోహుల కుట్ర అయితే, దేవుడే ఆ విద్రోహి..." చెప్పాడు సల్మాన్.

"ప్రమాదానికి కారణం చెప్పగలరా?" మరో విలేఖరి అడిగాడు.

"సముద్రంలో తీవ్రమైన వాయుగుండం ఏర్పడిందనీ, ఇటువంటి తుఫాను జీవితంలో ఎపుడూ చూడలేదని కెప్టెన్ అనడం నేను విన్నాను" అన్నాడు సల్మాన్.

"సముద్రంలో ఎలాంటి ఆటు పోటులు వచ్చినా తట్టుకునే విధంగా క్రూయిజర్ నిర్మాణం వుంటుంది. కాబట్టేకదా అందరూ అందులో ప్రయాణిస్తున్నారు. మరిలా జరిగితే జీవితాలకు రిస్కేకదా!" అడిగాడు ఇంకో విలేఖరి.

"ఈ ప్రమాదం నుంచి ఇంత మందిమయినా క్షేమంగా బయటపడ్డామంటే ఆ క్రూయిజర్ సిబ్బంది, క్రూయిజర్‌లో వున్న సదుపాయాలే కారణం" ఇంకా వాళ్ళేవో ప్రశ్నలు వేయబోతుంటే–

"ప్లీజ్! నేను చాలా అలసిపోయున్నాను" చెప్పాడతను.

చివరికి బ్రతిమిలాడి ఓ విలేఖరి–

"ఐశ్వర్యారాయ్ జాడ ఇంకా తెలియలేదు. ఆమె విషయం మీరేమయినా చెప్పగలరా?" అడిగాడు.

ఆ మాట వినగానే అతని మొహం కళ తప్పి, విషాదంగా మారింది.

"నేను లైఫ్‌బోట్‌లో ప్రయాణించేవరకూ ఆమె కోసం వెతుకుతూనే వున్నాను. నాకన్నా చాలామంది లైఫ్ బోట్లలో కిందికి దిగిపోయారు. వాళ్ళలో ఆమె కూడా దిగి వుంటుందని, ఏ తీరప్రాంతానికో ఆమె క్షేమంగా చేరి వుంటుందని అనుకుంటున్నాను."

ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అతని మాటల్ని విన్నారు. అందరి కళ్ళలోనూ నీరు చిప్పిల్లాయి. ఆమె క్షేమం కోసం అందరూ దేవుడ్ని ప్రార్థించారు.

సల్మాన్ ముంబాయిలోకి ప్రవేశించగానే సరాసరి ఇంటికి వెళ్ళి స్నానంచేసి, ఫ్రష్‌అప్ అయి ఐశ్వర్య ఇంటికొచ్చాడు. అదే మొదటిసారి అతనక్కడికి రావడం. వెళ్ళేసరికి రమేష్‌పవార్ వచ్చి వున్నాడు.

సల్మాన్‌ను చూడగానే ఐశ్వర్య అన్నయ్య మర్యాదగా లోపలికి ఆహ్వానించాడు. వాళ్ళకిప్పుడు ద్వేషం ఏమీలేదు. ఐశ్వర్య తమకెంతో ప్రియమైన వ్యక్తి. ఆమెకు ప్రియమైన వ్యక్తి ఇతడు.

ఇతనికోసమే ఆమె ఎంతో తపన పడింది. ప్రమాదం జరిగేవరకూ ఇతని పక్కనే వుంది అనుకోగానే ఆటోమాటిక్‌గా అతనిమీద ప్రేమ కలిగింది.

ప్రమాదం జరిగేవరకూ ఐశ్వర్య మాట్లాడిన మాటలు, ప్రమాదం సంభవించినప్పుడు ఆమె ఎక్కడకు వెళ్ళింది? ఏం చేసింది అన్నీ తరచి తరచి అడిగారు. తనకు గుర్తున్నంతవరకూ చెప్పాడు సల్మాన్.

ఆ తరువాత అధికారులతో మాట్లాడి తీరప్రాంతాల్లో గాలింపుకోసం హెలికాప్టర్లు రంగంలోకి దిగాలని, అలాగే ప్రతీ కోస్టల్ ఏరియాకి సూచనలు పంపించాలని, నేవీ అధికారులతో మాట్లాడి ఆ ఏర్పాట్లను సమీక్షించడంలో నిమగ్నమయ్యాడు.

ఆరోజు రాత్రి వరకు అక్కడే గడిపాడు సల్మాన్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

త్రినాధ్ ప్రయాణిస్తున్న ఓడ సముద్ర తుఫాన్ కారణంగా మునిగిపోయిందని, ఒడ్డుకువచ్చిన వాళ్ళలో అతను లేడనే వార్త ఇంట్లో తెలియగానే ఇంటిల్లిపాదీ బావురుమన్నారు.

"ఇందుకేనా చెల్లి పెళ్ళి వదిలేసి మరీ శని తరుముకు వస్తున్నట్లు వెళ్ళిపోయావు" అనుకుంటూ సావిత్రమ్మ శోకాలు పెడుతోంది. ఊరంతా అండగా నిలబడి ఓదారుస్తున్నారు. కుర్రకారు టౌనుకు వెళ్ళి వాళ్ళ ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

సారధి, సుబ్బు, వీరయ్యచౌదరి ముంబాయికి ప్రయాణమయ్యాడు. బంధువుల ఒత్తిడుంటేనైనా అధికారులు గాలింపుచర్య తీవ్రం చేస్తారని ఎవరో చెప్పడంతో బయలుదేరారు ముగ్గురూ. ఊళ్ళో ప్రతి ఒక్కరూ త్రినాధ్‌తో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూ బాధపడేవారే.

త్రినాధ్ క్షేమంకోసం సావిత్రమ్మ మొక్కని మొక్కులేదు. తమ జీవితాలకు ఆలంబన అనుకున్న మనిషి కన్పించకుండాపోవడం, బ్రతికున్నాడో, లేడో తెలియకపోవడం ఎవరికయినా బాధాకరంగానే వుంటుంది. భారతి పెళ్ళాగిపోవడం, ఇప్పుడు త్రినాధ్ కన్పించకుండాపోవడం ఆ కుంటుంబానికి దెబ్బమీద దెబ్బ తగులుతున్నట్లుగా వుంది. విధి తమమీద ఇంతగా పగబట్టినందుకు వాళ్ళ మనసులు ఆక్రోసిస్తున్నాయ్.

❈ ❈ ❈ ❈ ❈ ❈

సూర్యకిరణాలు చుర్రుమని కంట్లోకి ప్రవేశించడంతో మెలుకువ వచ్చింది ఐశ్వర్యకి. కళ్ళువిప్పి చూసిందామె. ఓ క్షణం తనెక్కడుందో అర్థంకాలేదు. కింద కదులుతున్న దూరిలా తెల్ల తెల్లని ఇసుక. ఎదురుగా తన కళ్ళలాగే ఆకుపచ్చని సముద్రం... ఇంకోవైపు దట్టమయిన చెట్లూ, కొండలు.

చివ్వున లేచి కూర్చుంది.

రాత్రి జరిగిందంతా మైండ్‌లో గిర్రున తిరిగింది. అంటే తనింకా బ్రతికే వుందా? చేతినిగిల్లి చూసుకుంది. ఇది కలకాదు నిజమే. సముద్రం వంక చూసింది. ఏమీ ఎరుగని నంగనాచిలా బుల్లి బుల్లి అలలతో ఎంతో ముద్దుగా వుంది.

గాబరాగా తల అటూ ఇటూ తిప్పి చూసింది. ఎవరూ కన్పించలేదు. తనొక్కతే బ్రతికిందా? అందరూ చనిపోయారా? తన ప్రాణాలడ్డువేసి బ్రతికిస్తానన్న అబ్బాయి ఏడీ?

అతనన్నంతపనీ చేసి తనను బ్రతికించాడా? అసలెక్కడుంది తను...? ఇక్కడ నుంచి బయటపడేదెలా...? భయం ముంచుకొచ్చిందామెకు.

"హెల్ప్, హెల్ప్..." అనరుస్తూ చెట్ల లోపలికి పరుగెత్తి సడెన్ బ్రేక్ వేసినట్లుగా ఆగిపోయింది.

ఎదురుగా చెట్టుక్రింద గుంపులా మనుషులు. అందరి మధ్యలో కూర్చుని త్రినాధ్ ఏదో మాట్లాడుతున్నాడు. వాళ్ళను చూడగానే ఎక్కడ లేని సంతోషం వచ్చిందామెకు.

జీవితంలో అంత ఆనందాన్ని ఎప్పుడూ పొందలేదు. తన తలమీద ప్రపంచసుందరి కిరీటం పెట్టినప్పుడు కూడా! లేడిపిల్లలా గెంతుతూ వాళ్ళ దగ్గరకు వెళ్ళింది.

అక్కడున్న వాళ్ళ ముఖాలు నవ్వుతూ విప్పారాయి. "నేను సముద్రంలోంచి ఒడ్డుకు కొట్టుకొచ్చేవరకు ఆగకుండా మీరిక్కడకొచ్చి మీటింగ్‌పెట్టారా?" కోపంగా అడిగింది ఐశ్వర్య.

నవ్వుతూ వచ్చి ఆమె భుజాలమీద చేతులువేసి ఊగాడు చైతన్య.

"లేదాంటీ... ముందు మనమిద్దరమే కొట్టుకొచ్చాం. తరువాత అంకుల్ వచ్చి మిమ్మల్ని చెట్టుకిందకి తీసుకెళ్ళబోతుంటే ఇసుకలోనే బావుందని జారిపోయి పడుకున్నారు మీరు" నవ్వుతూ చెప్పాడు.

"ఈజిట్..." కళ్ళు పెద్దవిచేసి అడిగింది.

అందరూ తలూపారు. ఆమె అక్కడనుంవీచి లేచి చైతన్య చెయ్యి పట్టుకుని పరుగెత్తింది.

ఆ తెల్లని ఇసుకలో కెరటాల్లో తడుస్తూ గవ్వలు ఏరింది... ఓ అరగంట ఆడి, ఆడి అలసి సొలసి త్రినాధ్ దగ్గరకు వచ్చి చెయ్యి చాపి.

"మంచినీళ్ళు కావాలి?" అడిగింది.

అందరూ ఫక్కుమని నవ్వారు.

బిక్కమొహంవేసి చూసింది ఐశ్వర్య.

"ఇక్కడ్నుంచి అన్నీ ప్రశ్నలే. సమాధానాలుండవు. వెతుక్కోవడమే మనపని. ఇక అందరూ ఇక్కడ ప్రశాంతంగా కూర్చుంటే ఎవరెవరు ఏమి చేయాలో చెప్తా" అన్నాడు త్రినాధ్.

అందరూ అతని చుట్టూ గుమిగూడారు. రాత్రి సముద్ర తుఫాను తాకిడినుంచి తప్పించుకునేసరికి వాళ్ళలో చాలా ధైర్యం వచ్చింది.

అందరి మొహాలూ కలయజూశాడు త్రినాధ్. అతని మనసంతా బాధతో నిండిపోయింది. ఈ టీమ్‌లో తను, ప్రభాకర్, ఆంధ్రా నుంచి వచ్చిన ప్రేమికుల జంటలో అబ్బాయి రవి, క్రూయిజర్ సిబ్బంది లోకేష్, తమ నలుగురిమీదా చాలా బాధ్యత వుంది. కానీ రాత్రి లోకేష్‌కి క్రూయిజర్‌లోనే చాలా దెబ్బలు తగిలాయి. ఇప్పుడతను అపస్మారకంగా పడివున్నాడు.

మిగిలిన తమ ముగ్గురిమీదా ఈ పదిహేడుమంది రక్షణ బాధ్యతా వుంది. అందరూ త్రినాధ్ వంకే చూస్తున్నారు.

అప్పుడు ప్రభాకర్ నోరు విప్పాడు.

"ఇక్కడ పరిస్థితి అందరికీ అర్థమయ్యే వుంటుంది.... మనం ఇక్కడనుంచి బయటపడటం చాలా కష్టమైన విషయం. అందరూ ఒక తాటిమీద వుండి నడవాలి. మనకి లీడర్‌గా త్రినాధ్‌ని నేను ప్రపోజ్ చేస్తున్నాను. అందరం కలిసి చర్చించుకుందాం. కానీ త్రినాధ్ నిర్ణయమే ఫైనల్..." చెప్పాడతను.

ఐశ్వర్యారాయ్ ఆశ్చర్యంగా త్రినాధ్ వంక చూసింది.

అందరూ తమ ఆమోదాన్ని తెలియజేశారు. త్రినాధ్‌కి తన బాధ్యత మరింత పెరిగినట్లనిపించింది. త్రినాధ్ తన అభిప్రాయాన్ని చెప్పడం ప్రారంభించాడు.

"రాత్రి మనం అనుభవించిన నరకం... బహుశా జీవితంలో ఎవరూ ఇంతకరకూ పడివుండరు. నేను తెల్లవారిన దగ్గరినుంచీ ఈ చుట్టుప్రక్కల ప్రాంతాన్ని అబ్జర్వ్ చేసిన దానిప్రకారం ఇది పూర్తిగా ఐ సోలేటెడ్ ఏరియా. చుట్టూ సముద్రం. మధ్యలో దీవి... దానిలో మనం... ఈ దీవి ఎక్కడుందో ఎవరికీ తెలీదు. మనకొరకు గాలింపుచర్యలు చేపట్టినవాళ్ళు కూడా అంత తొందరగా ఈ ప్రదేశాన్ని కని పెట్టలేకపోవచ్చు...' ఆగాడతను.

అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

"ఈ విషయానికి ముందుగా మానసికంగా మనం స్థిరం కావాలి" చెప్పాడు.

"మరెలా? ఈ అడవిలో ఇలా తిండీ-తిప్పలు లేకుండా ఇలా కృంగి కృశించిపోవాల్సిందేనా?" ఒకతను ఆవేదనగా అనగానే ఐశ్వర్య కయ్యిమని లేచింది.

"ఈ అడవి గురించి ఏవనకండి. ఈ చెట్లు... పూలు... లోపలికి వెళితే పళ్ళూ దొరకొచ్చు. ఇంకా లోపలికి వెళితే నీరు దొరకొచ్చు. ఆ రెండూ చాలవా మనం బతకడానికి! ఓ పదిరోజులు టూర్ వచ్చామని అనుకుందాం. మీలో ఎంతమంది ఒళ్ళు తగ్గడంకోసం ప్రయత్నించి వుంటారు? సో! ఇది ప్రకృతి ఆశ్రమం అనుకోండి. ఇక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నామనుకోండి..." అనగానే, అంత టెన్షన్‌లోనూ అందరూ నవ్వారు.

వాతావరణం తేలికైంది. ప్రశంసగా చూశాడు త్రినాధ్. ఈమెలో సమయస్ఫూర్తి వుంది. అతి కష్టమయిన విషయాన్ని అందరూ ఎంత సులువుగా జీర్ణించుకునేలా చెప్పింది??

"యస్... మనం ముందుగా ఆలోచించుకోవాల్సిన విషయం ఆహారం గురించి. మనకిచ్చిన లైఫ్‌జాకెట్స్‌లో సీల్ చేసిన బిస్కెట్స్ వున్నాయి. ఒక వాటర్ పాకెట్ ఒక్కొక్కరికీ వుంది. మనకి నీరు దొరికే వరకూ ఆ వాటర్‌ని ఒక్కో చుక్కా పదిలంగా వాడాలి. అలాగే బిస్కెట్స్ కూడా..." చెపుతుంటే ఐశ్వర్య మధ్యలో ఆపి-

"ఇందాక వాటర్ అడిగితే లేవన్నారు?" బుంగమూతి పెట్టి అడిగింది.

"దాహంతో సొమ్మసిల్లి పడిపోయే స్టేజ్‌లోనే ఆ నీరు యివ్వమని లీడర్ ఆర్డర్" చెప్పాడు ఒకతను.

త్రినాధ్ వంక చూసింది ఐశ్వర్య.

అతను ఎవరివైపూ చూడటంలేదు. తీవ్రంగా దేనిగురించో ఆలోచిస్తున్నాడు.

"మనం బ్యాచ్‌లుగా విడిపోయి, నాలుగువైపులకూ వెళ్ళి ముందు పళ్ళు, నీరు జాడ కనిపెట్టాలి. వెళ్ళిన గంటలోగా అందరూ తిరిగి వచ్చేయాలి. ఏవన్నా ప్రమాదం జరిగితే అంచెలమీద విజిల్స్ ద్వారా తెలియజేయాలి" అతను ప్రాక్టీస్ చేసి చూపించాడు.

కాసేపు ఆ ప్రాంతమంతా విజిల్స్ మోతతో హోరెక్కింది.

లోకేష్ దగ్గర మన్ ప్రీత్‌కౌర్‌ని కాపలాగా వుంచి, మిగతా వారందరూ నాలుగు జట్లుగా విడిపోయి నీటి జాడకోసం అన్వేషణ ప్రారంభించారు.

త్రినాధ్ వెనకాలే బయలుదేరారు ఐశ్వర్య, చైతన్యలు.

బయలుదేరేముందు మళ్ళా త్రినాధ్ అందరినీ హెచ్చరించాడు.

"శరీరంలో నీటి నిలవలు తరిగిపోయేలా చెమటలుకక్కుతూ పరిగెత్తవద్దని, చెట్లకి పళ్ళు కన్పించగానే తినొద్దనీ, పురుగు-పుట్రా చూసుకుని నడవమని..."

అంతేకాక వెళ్ళిన తోవ గుర్తుంచుకోవడానికిగానూ నడిచే తోవలో మొక్కల్ని తుంచి పడేయమని చెప్పాడు. ఆ మొక్కల్ని చూసుకుని మళ్ళీ వెనక్కి తిరిగిరావచ్చని చెప్పాడు.

అందరూ బయలుదేరారు.

ఐశ్వర్యకి మనసంతా స్వేచ్ఛావిహంగంలా మారింది. ఆమె లేడిపిల్లలా తుళ్ళుతూ గెంతుతూ నడుస్తుంటే, ఎనర్జీ వేస్ట్ చేసుకోవద్దని హెచ్చరిస్తున్నాడు త్రినాధ్.

ఆమె అతని మాట ఖాతరుచెయ్యడంలేదు.

"మీకు తెలుసా - నేను ఇంతకాలం ఎన్ని బంధనాల్లో యిరుక్కుపోయానో! కడుపారా తినగానికీ, స్వేచ్ఛగా తిరగడానికి... ఆఖరికి ఇష్టం వచ్చినట్లు కాళ్ళూ చేతులూ వూపుతూ నడవడానికి కూడా స్వేచ్ఛలేదు.

ఎలా చూస్తే చూపు అందంగా వుంటుందో, ఎలా తిప్పితే పెదవులు అందంగా కన్పిస్తాయో, జుత్తు మొహంమీదికి వేసుకోవడం, మళ్ళీ స్టయిల్‌గా చేత్తో వెనక్కి తోసుకోవడం, నవ్వు, నడక, మాట, అన్నిటా, అన్ని చోట్లా, అందరి దగ్గరా కృత్రిమత్వమే!

ఇపుడేగా కాస్త స్వేచ్ఛ చిక్కింది. ఇక్కడ నేనెలా ప్రవర్తించినా నన్ను పట్టించుకునేవాళ్ళు లేరు. నాకిలాగే బాగుంది. ఇలాగే ఈ అడవుల్లో జంతువుల్లాగే స్వేచ్ఛగా గడిపి... చివరికి ఇలాగే ఎన్నో ఏళ్ళకి చచ్చిపోతాను. నాకేం భయంలేదు. చాలా హాయిగా వుందిపుడు..." చెప్పి అతనివైపు చూసింది.

త్రినాథ్ విన్నట్లులేదు... చెట్లవైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

అతన్ని డిస్టర్బ్ చెయ్యలేదామె. ఆ అడవి పూలని తెంపి తల్లో పెట్టుకుంటోంది.

చైతన్యతో కలిసి అడవి తీగెలను తెంపి తాడులా తయారుచేసింది. ఆ మూలా ఈ మూలా యిద్దరూ పట్టుకుని నడుస్తున్నారు.

అరగంట గడిచాక కన్పించాయి కొన్ని కొబ్బరిచెట్లు. ఆనందంతో కళ్ళు మెరిశాయి త్రినాథ్‌కి. చైతన్య కూడా రివ్వున పరిగెత్తుకుంటూ కొబ్బరిచెట్ల దగ్గరకి వెళ్ళాడు.

గాలి వాలు చూసుకుని విజిల్ ద్వారా విషయాన్ని మిగతా బాచ్‌లకి తెలియజేశాడు త్రినాథ్.

అతనికి నమ్మకం ఏర్పడింది నీటి జాడ కూడా తెలుస్తుందని. అతని ఊహ నిజం చేస్తూ దూరం నుంచి వచ్చిన విజిల్స్ నీళ్ళు, పళ్ళు దొరికాయన్న విషయాన్ని కన్‌ఫాం చేశాయి.

నీళ్ళు కడుపునిండా తాగా, వాళ్ళ దగ్గరున్న ప్లాస్టిక్ బ్యాగ్స్‌లో నీళ్ళు నింపి, పళ్ళనుకోసి చేత్తో పట్టుకుని రమ్మని చెప్పాడు.

ఐశ్వర్య కొబ్బరిచెట్టు దగ్గర నిలబడి తల పైకెత్తి ఎక్కడో ఆకాశం అంత ఎత్తున చెట్లలో నిక్కి నిక్కి దాగున్న కాయలవంక బిక్కమొహం వేసి చూస్తోంది.

దగ్గరకు వెళ్ళాడు త్రినాథ్. చెట్టువంక చూసి చైతన్యతో-

"రేయ్! ఓసారి ఫాంటు విప్పి యివ్వరా..." చెయ్యి చాపి అడిగాడు.

చైతన్య ఐశ్వర్య వంక చూసి సిగ్గుపడిపోయి, "నో అంకుల్... ఎందుకు?" అడిగాడు.

"అది నడుంకీ, చెట్టుకీ కలిపి రింగ్‌లా కట్టి, దాని సాయంతో పైకి వెళ్ళాలి..." చెప్పాడు త్రినాథ్.

"ఆ ఫాంట్ ఏం సరిపోతుంది? నా చీర తీసి ఇవ్వనా?" చైతన్య వినకుండా అడిగింది ఐశ్వర్య.

ఓ క్షణం ఆశ్చర్యపోయి చూసి...

"అవసంలేదు. చైతూ... ఇవ్వరా!" అడిగాడు.

వాడు ఇవ్వనంటూ పారిపోతుంటే, వెంటపడ్డాడు త్రినాథ్.

చివరికి ఓ చెట్టు చాటున వాడి ఫాంట్ వూడదీసి నవ్వుతూ తీసుకొచ్చాడు.

అతనివంకే చూస్తోంది ఐశ్వర్య.

"ఇప్పుడు ఈ చెట్టు మీరెక్కుతారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఊ..." నడుంకీ, చెట్టుకీ ఫాంట్‌తో లింక్‌వేసి అన్నాడు.

"ఎలా?" అడిగింది.

"ఇలా..." అంటూ అతను వేగంగా చెట్టుమీదకి ఎగబాకుతూ ఎక్కుతుంటే, క్రింద చప్పట్లు కొడుతూ నిల్చుంది ఐశ్వర్య.

చైతన్య తనూ ఈ సీన్ మిస్సవ్వకూడదని... షర్ట్ తీసి అండర్‌వేర్ మీద కట్టుకుని, తనూ చెట్టు దగ్గరకి వెళ్ళిపోయాడు.

గెలని చేత్తో లాగడం ప్రారంభించాడు త్రినాథ్. అంత సులువుగా గెల తెగలేదు. లాగగా లాగగా వూడి తన చేతిలోకొచ్చింది.

ఒంటిచేత్తో గెలని పట్టుకోవడం కష్టంగా వుంది. కిందికి వదులుదామనుకుంటే, కిందనే నిల్చున్నారు ఐశ్వర్యారాయ్, చైతన్య. తప్పుకోమని సైగచేశాడు.

వాళ్ళకి అర్థం కాలేదు. ఏంటని సైగ చేశారు. తప్పుకోమని అరిచాడు. పై గాలికి ఆ మాట ఎటో వెళ్ళిపోయింది. చేతిలో బరువు ఎక్కువైపోతోంది. విసుగొచ్చేసింది అతనికి. శక్తికొద్దీ గెలని వేరే వైపుకి విసిరాడు.

అవి కింద పడుతుంటే అప్పుడు స్పృహలోకి వచ్చి కెవ్వుమని అరుస్తూ పక్కకి తప్పుకున్నారు.

ఒరిపిడికి చెయ్యి మంటపెడుతున్నా లెక్క చెయ్యకుండా నాలుగు గెలలు కింద పడేశాడు. ఒక్కో గెలలో ఇరవై ముప్పయ్ కాయలవరకూ వున్నాయి.

ఆ గెలలలోంచి చెదరి అటూ ఇటూ దొర్లిన కాయల్ని ఒక దగ్గరకి చేర్చడం ప్రారంభించారు ఐశ్వర్య, చైతన్య...

చివరికి పైన గెలలన్నీ కంప్లీటయ్యాక కిందికి దిగి వచ్చాడు త్రినాథ్. యింకా పక్కనేవున్న కొబ్బరి చెట్లకేసి చూస్తూ "నీళ్ళకి కొదవలేదు..." సంతృప్తిగా అన్నాడు.

కొబ్బరికాయల మధ్యనే కూర్చుని మురిసిపోతున్నారు చైతన్య, ఐశ్వర్య...

"దాహంగా వుంది..." జాలిగా అడిగింది ఐశ్వర్య.

అటూ ఇటూ చూసి సూదిగా వున్న ఓ రాయిని వెతికి పట్టుకొచ్చి, కొబ్బరి బొండాల ముందు భాగాన్ని చెక్కి చిన్న కన్నం చేసి తాగడానికి అనువుగా యిచ్చాడు.

చాలా తియ్యగా ఉన్నాయి నీళ్ళు. తనూ ఓ బోండాం తాగాడు. నీరు అయిపోయాక నేలకేసి కొట్టాడు. అవి అడ్డంగా పగాలాయి.

అందులోంచి లేత కొబ్బరి బయటపడింది. ఆనందంగా తిన్నారు ముగ్గురూ.

ఆ గెలల్ని అక్కడే వదిలి యింకోవైపు వెళ్ళసాగాడు త్రినాథ్... అతను కొబ్బరిచెట్టు మీద నుంచి చూసినప్పుడు అతనికి కొంచెం దూరంలో నీరు చిన్నగా ప్రవహిస్తూ కన్పించింది.

"ఎక్కడికీ...?" భయంగా అడిగింది.

"యిక్కడ కొంచెం దూరంలో నీరు వున్నట్లు కనపడింది..." చెప్పగానే ఎగిరి గంతేసింది ఐశ్వర్య... "స్నానం చేస్తా" నంటూ పేచీ పెట్టింది. వారించాడు త్రినాథ్.

"ముందు ఈ కొబ్బరి బొండాలను అక్కడకి చేరిస్తే అందరూ తాగుతారు... కొంత శక్తి వస్తుంది..." అంటూ పాతిక కాయలున్న గెలను భుజాన వేసుకుని వచ్చిన తోవనే నడవడం ప్రారంభించాడు.

విధిలేక అనుసరించారిద్దరూ... వీళ్ళు వెళ్ళేసరికి అందరూ వచ్చేశారు... నీరు పుష్కలంగానే దొరికింది... కానీ వాళ్ళు తెచ్చిన పళ్ళలో అన్నీ తినగలిగేలా లేవు. కంజిరేగి పళ్ళు, సముద్ర తీర ప్రాంతాల్లో దొరికే ఒక రకమైన ఖర్జూరం లాంటివే తినడానికి పనికివచ్చాయి. కొబ్బరి బోండాలను చూడగానే అందరికీ ప్రాణం లేచి వచ్చింది.

తను తీసుకువచ్చిన సూది రాళ్ళను మగవాళ్ళకి యిచ్చాడు... వాళ్ళు బోండాలను కొట్టే పనిలో పడ్డారు.

ఆ ప్రదేశాన్నంతా చదును చేసుకుని రాత్రి పడుకోవడానికి వీలుగా సిద్ధం చేయటం ప్రారంభించారు...

లైఫ్ జాకెట్స్‌లో సేఫ్టీగా వున్న లైటర్స్ చూసి అందరూ క్ర్యూయిజర్ ఎరేంజ్‌మెంట్స్‌ని మెచ్చుకున్నారు. ఎంత ప్రమాదానికి లోనయినా అత్యవసరమయిన విషయాల్లో వాళ్ళు ముందుచూపుతోనే వున్నారు...

రాత్రికి అవసరమవుతాయని ఎండు చితుకుల్ని చేర్చి దగ్గర పెట్టుకున్నారు. రాత్రి వంతులవారిగా మేలుకొని వుండి కాపలా కాయాలని నిశ్చయించుకొన్నారు.

ఐశ్వర్యకి యిందాకటి నుంచీ ఆ ఆడవి లోపల వున్న సెలయేరు మీరే దృష్టి వుంది... మెల్లగా త్రినాథ్ పక్కన చేరి-

"లోపల వున్న సెలయేరు దగ్గరికి వెళదాం నీళ్ళు తెచ్చుకోవచ్చు- స్నానమూ చెయ్యెచ్చు..." చెప్పింది.

సరేనని ఎవరన్నా స్నానానికివస్తారా అని అడిగితే అందరూ ఓపిక లేనట్లుగా చేతులు ఎత్తేశారు.

చైతన్యని అడిగితే యింకో అంకుల్‌తో కలిసి సముద్రపు ఒడ్డున ఉన్న పీతిల్ని పట్టుకోవడంలో మహా ఉత్సాహంగా వున్నాడు. ఇద్దరూ బయల్దేరారు.

ముందు చూసిన కొబ్బరి చెట్లు కూడా దాటుకుని కాస్త ముందుకి వెళ్ళాక ఓ అద్భుత దృశ్యం కన్పించింది... చెట్లమధ్య వున్న రాళ్ళలోంచి ఓ చిన్న కాలువ జలజలా పారుతూ ప్రవహిస్తోంది...

చూడగానే చిన్న పిల్లలా కేరింతలు కొడుతూ వెళ్ళింది ఐశ్వర్య... అందమైన గులకరాళ్ళల్లో కూర్చుండిపోయింది. నీరు ఆమెని తడుముతూ వెళుతోంది.

అతను వెనుదిరిగి వేరే చోటికి వెళ్ళబోయాడు... కెవ్వుమని అరిచింది.

ఏంటన్నట్లు తిరిగి చూశాడు.

"నాకు భయం... ఏ జంతువన్నా వచ్చి మీదపడి తినేస్తే... నా పక్కనే వుండండి..." చెప్పింది.

అలాగేనని అక్కడే వెనక్కి తిరిగి నిలబడ్డాడు. ఐశ్వర్యలో చిలిపిదనం చిందులేస్తోంది. ఆమె ఆల్రెడీ ఓ డెషిషన్‌కి వచ్చేసింది... బతికి నన్నాళ్ళూ ఈ అడివిలో బతకడమే... యిక్కడ నుంచి బయటపడే ఛాన్స్ లేదు... ఇక్కడ ఒక్కో నిమిషాన్నీ ఆనందమయంగా మలుచుకోవాలి...

స్నానం చేస్తూ కూనిరాగం తీస్తూ అనుకుంది ఐశ్వర్య.

చీరంతా మురికిగా వుండడంతో చీర విప్పి పక్కన నీళ్ళలో జాడించి పక్కనే వుంచి పెటీకోట్ బ్లౌజ్‌తో స్నానం చెయ్యసాగింది.

"మనసంతా చాలా ఉల్లాసంగా వుంది... ఈ ప్రకృతి సహజత్వం. పచ్చని చెట్లూ, కొండవాగు ఎంత నిర్మలంగా వుందీ..." ఆమాటే త్రినాధ్‌తో అంది.

ఏదో ఆలోచనల్లోనున్న అతను ఉలిక్కిపడి-

"ఆ...ఆ... నిర్మలమే... కాసేపుంటే పాములూ, పులులూ, ఎలుగుబంట్లు, వచ్చి మనల్ని విష్ చేస్తాయి. మీరు త్వరగా రండీ..." విసుగ్గా అన్నాడు.

కిలకిలా నవ్వి... అతని మీదకు నీరు విసిరింది. అతను మాట్లాడకుండా నీళ్ళు దులుపుకున్నాడు గాని ఇటు తిరగలేదు.

ఇంతలో ఆమె కెవ్వుమని అరిచింది... చటుక్కున వెనక్కి తిరగబోయాడు, కాని పూర్వాశ్రమంలో యింకో అందగత్తె యిలాగే కెవ్వుమని అరవడం, తను చటుక్కున తిరగడం, అడ్డంగా బుక్కయిపోవడం గుర్తొచ్చి వెనక్కి తిరక్కుండానే తాపీగా...

"ఏంటీ?"

ఓ క్షణం ఆశ్చర్యపడి, మళ్ళీ కెవ్వుమని అరిచి "నా చీర... నా చీర ఆ వాగులో కొట్టుకుపోతోంది... అదిగాని పోతే నా పని యింతే, ఇక మీ అందరి ముందూ యిలా ప్రత్యక్ష్యం కావాల్సిందే..." కూర్చున్నదల్లా లేచి నిలబడి అంది.

గబుక్కున తిరిగి చూశాడు... ఎదురుగా అర్ధనగ్నంగా ఐశ్వర్య- ఎర్రటి పెటీకోట్ అదేరంగు బ్లౌజ్... తడిసిన నల్లని కురులు, తెల్లని శరీరం... ఆకుపచ్చని కళ్ళు. గులాబీ బుగ్గలు... ఆమె శరీరమే ఓ ఇంద్రధనస్సులా వుంది.

ఐశ్వర్య స్వతహాగా మంచి పొడవు... యిప్పుడు రాతి బండమీద అలవోకగా నిల్చుని ఓర చూపులు విసురుతుంటే వినీలాకాశం నుంచి ఓ ఉల్క జారిపడుతున్నట్లుగా వుంది.

వెంటనే చూపులు తిప్పుకుని నీళ్ళవైపు చూశాడు. వాగులో కొట్టుకుపోతూ కన్పించింది చీర. వెంటనే పరుగెత్తుకుని వెళ్ళి తెచ్చాడు చీర. ఒడ్డున పెట్టి వచ్చేయబోతుంటే-

"ఇటివ్వండి..." అంది.

వెళ్ళి మొహం దించుకుని వెనకనుంచి ఇవ్వబోయాడు. ఆమె ఎంతకీ తీసుకోకపోయేసరికి తలెత్తి చూశాడు. నడుం మీద చేతులు వేసుకొని సీరియస్‌గా చూస్తోంది ఆమె.

అతని చూపు కలవగానే తన చూపుతో బంధించివేస్తూ "నేనంత అసహ్యంగా వున్నానా?" అంది. అతనేం మాట్లాడలేదు..

"సో... నా ప్రాణాలు రక్షించిన హీరో అన్నమాట తమరు... సినిమాల్లో ఎందరో హీరోలు రక్షించినట్లు నటించారు. మీరు రియల్‌గా రక్షించారన్నమాట... సో! రేపెపుడయినా బతికి బట్టకడితే లోకం మిమ్మల్ని కీర్తిస్తుందిలెండి" కవ్వింపుగా అంది.

చిన్నగా మందహాసం చేశాడతను.

"ఇక్కడే వుండిపోవాలని వుంది. అక్కడంతా ఊపిరాడని బందిఖానా" దిగులుగా అంది.

"అలా అనకండి... ఎంతో కష్టపడి మీరు నిర్మించుకున్న ఎంపైర్ అది" చెప్పాడు.

"అవును... అందుకే దానిని నా అంతట నేను వదిలిపెట్టలేను. అక్కడ ప్రశాంతంగా వుండనూలేను. అందుకే ఛేంజ్‌కోసం దేవుడు ఇలా చేశాడనుకుంటా" అతని భుజం పట్టుకుని నడుస్తూ అంది.

విని వూరుకున్నాడు త్రినాధ్. నడుస్తూ అరగంటలో ఒడ్డుకి చేరుకున్నారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

చీకట్లు ముసురుకుంటున్నాయి. గాలి రివ్వున వీస్తోంది. చీకటి పడేకొద్దీ ప్రతి ఒక్కరిలో భయాందోళనలు ముసురుకుంటున్నాయి. ఇలా ఎంతకాలం గడపాలి? తమను వెతుక్కుంటూ ఎవరయినా వస్తారా? రారా? అన్న అనుమానాలతో సతమతమైపోతున్నారు.

వాళ్ళకున్న ఒకే ఒక్క ఆశ ఐశ్వర్యారాయ్, ఆమె కోసం గాలింపు తీవ్రంగా వుంటుంది.

సామాన్యులను ప్రభుత్వం పట్టించుకోకపోయినా, వి.ఐ.పి.ల విషయంలో చర్యలు పటిష్టంగానే వుంటాయి. అదే వాళ్ళకున్న ఏకైక ధైర్యం.

చీకటి చిక్కనవగానే పోగేసిన చితుకుల్ని లైటర్‌తో అంటించాడు త్రినాధ్.

చుట్టూ ప్రదేశమంతా వెలుగుతో నిండింది. లోకేష్‌కి గాయాల తీవ్రత మూలంగా జ్వరం ఎక్కువయింది. అత్యవసరమైన మందులు లైఫ్ జాకెట్‌లో వున్నాయి.

ఓ మాత్రతీసి అతనికిచ్చాడు త్రినాథ్. అతనిగాయాలచుట్టూ ఉప్పునీరు చేరి మరింత పోటు పెడ్తుంటే సాయంత్రం అతన్ని భుజంమీద వేసుకొని సెలయేరు దగ్గరకి తీసుకెళ్ళి అతని గాయాలన్నిటిని నీటితో శుభ్రంగా కడిగి, అడవిలో పగిలిన పత్తికాయలనుంచి వచ్చిన దూదిని ఏరి ఆ గాయాల్ని తుడిచాడు. అదే సమయంలో త్రినాధ్ నుదుటిమీద తగిలిన గాయాల్ని చూచి లోకేష్ "అదెలా తగిలింది?" అని అడిగాడు.

సల్మాన్ గుర్తొచ్చాడు త్రినాధ్‌కి.

మాట్లాడలేదతను.

"నెగ్లెక్ట్ చెయ్యొద్దు. ఇన్‌ఫెక్షన్ వస్తుంది...." హెచ్చరించాడు లోకేష్.

నవ్వేసి తనూ గాయాన్ని క్లీన్ చేసుకున్నాడు. త్రినాధ్ తమ ఊళ్ళో వున్నపుడు ఆకు పసరుతో ఆయుర్వేద వైద్యం చేసేవాడు.

తనకు తెలిసిన ఆకుల కోసం చుట్టుపక్కల అంతా వెతికితే చాలా మటుకు ఏవో అర్థంకాని చెట్లు, చేమలే. చిట్టచివరికి ఓ రెండురకాల ఆకులు మాత్రం దొరికాయి.

వాటి ఆకుల్నే నలిపి పసరుతీసి లోకేష్ గాయాలకి పూశాడు. భగ్గున మండింది. పంటి బిగువున ఓర్చుకున్నాడతను.

అంతకన్నా చేయగలిగిందేం లేదు. ఆ గాయాల్నలా వదిలేస్తే మరింత పెద్దవై, చీము పడ్తుంది. ఓపెన్‌గా వదిలేసేకన్నా ఇలా ఏవో ఒక పసరులతో కప్పివుంచటమే బెటర్ అనుకున్నాడు లోకేష్.

సెలయేటినుంచి వచ్చిన దగ్గరనుంచి లోకేష్ మైకం కమ్మినవాడిలా పడుకునే వున్నాడు అతనలా మూలుగుతూ పడుకోవటం చూసి అందరి లోనూ దిగులు హెచ్చింది.

ఐశ్వర్య సాధ్యమైనంతవరకు హుషారుగా ఏవో కబుర్లు చెపుతూ నవ్వించసాగింది. కొందరు చితుకుల్ని ఎగదోస్తూ ఎప్పటికప్పుడు మంట ఆరిపోకుండా చూస్తున్నారు.

అందరూ సముద్రంవంక, ఆకాశం వంకా ఆశగా చూస్తున్నారు. అటువైపు ఏ చిన్న శబ్దం అయినా పరిగెత్తుకుంటూ సముద్రపు ఒడ్డుకు వెళ్ళి చూస్తున్నారు.

ఇంతలో నవదీప్‌సింగ్‌కి ఆయాసం, ఒగర్పు ఎక్కువైంది. ఆయనకు అస్తమా, హైబి.సి. రెండూ వున్నాయి. రాత్రినుంచీ నీళ్ళలో తడవడం. ఇప్పుడు ఈ రివ్వున వీస్తున్న చలిగాలికి ఆయన వయస్సు తట్టుకోలేక పోతోంది. ఆయాసంతో ఆయన ఛాతీ ఎగిరెగిరి పడుతుంటే అందరూ భయం భయంగా చూశారు.

మన్ ప్రీత్‌కౌర్ కన్నీళ్ళతో భర్త ఛాతీమీద చెయ్యివేసి నిమురుతూ కూర్చుంది. అందరి దగ్గరనుంచీ సేకరించిన టాబ్‌లెట్స్‌ని ఓ దగ్గర కుప్పలా పోసి చూశాడు త్రినాధ్.

అందులో అస్తమాకు వుపయోగపడేవి లేవు. అందర్నీ దూరంగా వుండమని చెప్పి ఆయన్ని చితుకుల మంటకు కాస్త దగ్గరలో కూర్చోబెట్టి రెండు అరచేతులతో మంటమీద నుంచి వెచ్చదనాన్ని ఆయన కందేలా చూడసాగాడు.

గంటవరకూ అతను తేరుకోలేకపోయాడు. అంతసేపూ అందరూ ప్రాణాలరచేత పెట్టుకొని చూస్తూండిపోయారు. అందరిలోనూ ఒకటే ఆలోచన.

ఇలా సరయిన తిండి తిప్పలూ, మందూ మాకులూ లేకుండా కృశించి కృశించి రోగాలబారిన పడో, అడవిలో పురుగూ పుట్రా, జంతువుల బారిన పడో మెల్లమెల్లగా ఒక్కొక్కరూ ప్రాణాలను వదిలెయ్యాలి కాబోలు. అందరిలో చావు భయం అవహించిది. దిగులుగా చూస్తూ కూర్చున్నారు.

వాతావరణం చూసింది ఐశ్వర్య. వాళ్ళే స్టేజ్‌లో వున్నారో ఆమె కర్థమైంది. జరగబోయే దానిని ఆపలేరు. ఈ ఉన్న సమయాన్నయినా ఆనందంగా గడపవచ్చు కదా!

వాళ్ళ దగ్గరనుంచి లేచి సముద్రంవైపు నడిచింది. ఆమెవెంటే చైతన్య, అతని వెనుక షిప్‌లో త్రినాధ్ రక్షించిన 16 ఏళ్ళ అమ్మాయి రీమా వచ్చారు. వెన్నెల అద్దూ, అదుపూ లేకుండా విరగకాస్తోంది. వెన్నెల కూడా ఇంత కాంతివంతంగా వుండడం వాళ్ళంతకు ముందెప్పుడూ సిటీల్లో చూడలేదు.

చంద్రుడు ఇంత తెల్లగా మెరిసిపోతాడని, కడవలకొద్దీ పాలను పంపుతున్నట్లు, ఇంత తెల్లని వెన్నెలను కుమ్మరిస్తాడని అనుకోలేదు వాళ్ళు.

వెన్నెల వెలుగులో సముద్రం మరింత తెల్లగా నురుగులు గ్రక్కుతూ కన్పిస్తోంది. అంతేకాక సముద్రపు ఒడ్డు ఇంత స్వచ్ఛంగా, కల్మషరహితంగా వుంటుందని వాళ్ళనుకోలేదు.

తామొచ్చిన లైఫ్ బోట్ తాలూకా శిధిలాలు అక్కడక్కడా కన్పిస్తున్నాయి. మిగతాదంతా పరిశుభ్రమైన తెల్లని ఇసుకతో ఆ ప్రదేశమంతా నిండివుంది.

వాళ్ళు ముగ్గురూ కలిసి ఇసుకలో పరుగులు పెట్టుకుంటూ ఆడుకుంటుంటే, నవదీప్ సింగ్‌నీ, లోకేష్‌నీ చూడటానికి భయంవేసే మిగతా వాళ్ళు కూడా ఒడ్డుకు వచ్చి, ఇసుకలో కూర్చున్నారు.

త్రినాధ్ మాత్రం కదల్లేదు. వాళ్ళ దగ్గరే వున్నాడు. ఇంకో గంట గడిచాక అందరికీ ఒక్కో బిస్కెట్, కొన్ని ఖర్జూరపు పండ్లు, ఒక్కో రేగిపండూ సర్వ్ చేయబడ్డాయి. ఆకలి బాగా వేయటంతో కొందరు ఒడ్డున దొరకిన సముద్ర పీతల్ని తీసుకువచ్చి, మంటల్లో పడేసి కాల్చుకుని తింటూ తమలో తామే నవ్వుకున్నారు.

ఇళ్ళవద్ద తల్లో, భార్యో వండిన వంటకి వంద రకాల వంకలు పెడుతూ తినేవారు. అవెంత రుచికరమయినవో వాళ్ళకిపుడు తెలుస్తున్నాయి. వాళ్ళిపుడు తింటున్న ఆహారమంతా ప్రాణాలు నిలబెట్టటానికే. ఇలా ఎంత కాలం, దాంతో ఎంతమంది బ్రతకాలి? అర్థం కావటంలేదు త్రినాధ్‌కి.

అతను వెన్నెల్లో ఆడుతున్న ఐశ్వర్యను చూశాడు. ఆమె మాటలు గుర్తొచ్చాయి. ఆమె కోరిక అసమంజసమేమీ కాదు. తనలోనే చాలా మార్పొచ్చింది.

ఇప్పుడు అందరూ క్షేమంగా ప్రాణాలతో బయటపడాలి. ఇప్పుడు ఇదే తన లక్ష్యం. తనే ఏదో ఒకటి చెయ్యాలి.

మూలుగుతున్న లోకేష్ వంక జాలిగా చూశాడు. ఇపుడు తన ముందున్న ప్రధానమైన సమస్య ఇతడే. అతనికి తగిలిన దెబ్బలు సామాన్యమయినవి కావు. కుడికాలు పాదం దగ్గర నుంచీ బాగా వాచిపోయింది.

అడుగుతీసి అడుగు పెట్టలేడతను. అలాగే పొట్టమీద, భుజాల మీద తగిలిన దెబ్బలు... వాటికీ ట్రీట్‌మెంట్ చేయలేకపోవడం మూలంగా రెండు మూడు రోజుల్లో అతని శరీరాన్ని విషతుల్యం చేస్తాయి.

ఏదో తనకు తెలిసినంతవరకు ఈ ఆకుపసరు వైద్యం చేయడం మూలంగా అతడు ఈ గాయాల బారినుంచి కొంత తప్పించుకున్నాడు. కాని జ్వరం ప్రమాద సూచికను తెలియజేస్తోంది.

చిన్నగా నిట్టూర్చి అక్కడనుంచి లేచి పచార్లు చేయడం ప్రారంభించాడు.

ఎవరూ అలల జోలికి పోవడంలేదు. ఒంటిపై పడిన ఉప్పునీటిని కడుక్కోవడానికి వాళ్ళు అడవిలో వున్న సెలయేటి దగ్గరకి పరుగెత్తాలి. ఈ అడవిలో ఎంత చిమ్మచీకటో... ఎవరూ అంత సాహసం చెయ్యలేరు.

అందకే ఇసుకలోనే వాళ్ళు ఆటలూ, పాటలూ... ఆ ఇసుక ఒడ్డున వుండడమే ఒక రకంగా క్షేమం.. ఎందుకంటే అంత తొందరగా పురుగూ పుట్రా చేరవు.

కాపలాగా వుండాల్సిన వాళ్ళు చితుకులమంట దగ్గర కూర్చోగా, మిగతావాళ్ళు సముద్రం ఒడ్డున ఇసుకలో పడుకున్నారు. జీవితంలో ఇంత హాయిని ఎప్పుడూ పొందలేదు ఐశ్వర్య. అన్ని బంధనాలు తెంచుకుని స్వేచ్ఛగా పక్షిలా వినీలాకాశంలో తేలిపోతున్నట్లుగా వుంది.

ఆమె ఆహారం మూలంగా ఎలాంటి ఇబ్బందినీ ఎదుర్కోవడం లేదు. ఎందుకంటే హీరోయిన్ అయ్యాక డైటింగ్‌లో భాగంగా రోజంతా కేవలం కొబ్బరినీరే తాగుతూ గడిపిన సందర్భాలున్నాయి.

అలాగే కేవలం పళ్ళు తినే గడిపిన సందర్భాలున్నాయి. కాబట్టి ఆమెకు ఏ విధమైన నీరసం, నిస్సత్తువాలేదు. కానీ ఆ చీరతోనే ఇబ్బందిగా వుంది రాత్రిళ్ళు నైట్‌డ్రస్ వేసుకుని పడుకోవటం అలవాటు.

ఇప్పుడు చీర కాళ్ళకడ్డం పడుతూ చిరాగ్గా వుంది. అలాగే ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది ఐశ్వర్య.

భగంతుడు అనుగ్రహిస్తేనేకదా అందాలయినా, ఆనందాలయినా, ఆస్తులైనా, అంతస్తులైనా... విసుగొచ్చి విసిరేస్తే ప్రమాదాలు, అనారోగ్యాలు, ఆకలి, ఆకస్మిక సంఘటనలు... ఈ మాత్రం దానికే దేవుడు జాలిపడేంత మనిషి అరాటాలు.

రాత్రి ఒంటిగంటవరకూ కాపలాకాసిన త్రినాధ్‌కి శరీరం బాగా అలసిపోయినట్లుగా వుంది. వెంటనే నిద్రపోవాలన్పిస్తోంది.

మిగిలిన యువకులకి కాపలాకాసే బాధ్యతనప్పగించి తనూ ఇసుకలో పడుకుండిపోయాడు. వెంటనే ఒళ్ళు తెలియని నిద్రపట్టేసింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

టి.వి.లో క్షణ క్షణానికీ క్రూయిజర్ వార్తలే చెప్తున్నారు. 350 మంది క్షేమంగానో, స్వల్ప గాయాలతోనో ఒడ్డుకు చేరుకున్నారు.

40 మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మిగతావారి జాడ తెలియరాలేదు. ఈ లెక్క ప్రకారం తేలిన వాళ్ళల్లో ఐశ్వర్యలేదు.

ప్రపంచం యావత్తూ ఊపిరి బిగబట్టి ఆమెకోసమే ఎదురుచూస్తోంది. ఐశ్వర్య తల్లిదండ్రులకీ అంతకంతకీ నిరుత్సాహం అలుముకుంటోంది. ఆమె అసలు ప్రాణాలతో వుందా? అనే సందేహం ప్రారంభమైంది.

బ్రతికి వున్నట్లయితే ఏదోక ఒడ్డుకు ఈపాటికి చేరి వుండాల్సిందే. మరణించినవాటిలో అన్ని శాలూ ఒడ్డుకు రావనీ, కొన్ని జలచరాలకి ఆహారమౌతాయనీ ఎవరో చెప్పడం విని వారిలో మరింత దుఃఖం పెల్లుబికింది.

నేవీ అధికారులను గంట గంటకీ సంప్రదిస్తున్నారు. వాళ్ళు కూడా తాము తీసుకుంటున్న చర్యలను వివరిస్తున్నారు.

సల్మాన్ కూడా పెద్ద స్థాయిలో ప్రయత్నాలను మొదలుపెట్టాడు. ప్రధానమంత్రి స్వయంగా ఈ విషయాన్ని గురించి వాకబు చేశాడు.

నేవీ దళాలకు సంబంధించిన యుద్ధనౌకని సెర్చింగ్‌కి పంపించమని సల్మాన్ రిక్వెస్ట్ చేశాడు. ఆ విషయాన్ని మంత్రివర్గంతో మాట్లాడి తెల్లవారేసరికల్లా నిర్ణయించి చెప్తామని హామీ ఇచ్చాడాయన.

శత్రువుల వేటకోసం బయలుదేరే ఆ యుద్ధనౌక అత్యంత అధునాతన సదుపాయాలతో కూడి వుంటుంది.

షిప్ వెళ్ళలేని చోట్లకు ఎగిరివెళ్ళే హెలికాప్టర్ రెండు దానిపైన సిద్ధంగా వుంటాయి. దేశ రక్షణ గురించి విపత్కర పరిస్థితుల ఆ నౌకలు పంపించటం జరుగుతుంది.

ఐశ్వర్య తల్లి దండ్రులు అన్నివైపులనుంచీ మంత్రి వర్గం పైన ఒత్తిడితెచ్చే ప్రయత్నాలు ప్రారంభించారు. అత్యవసర సమావేశంలో మంత్రి వర్గమంతా ఆ నౌకను ప్రయత్నాలు ప్రారంభించారు. అత్యవసర సమావేశంలో మంత్రి వర్గమంతా ఆ నౌకను పంపటానికి అంగీకారాన్ని తెలియచేశారు.

ఆజ్ఞ అందగానే ఆ నౌక సహాయ సామాగ్రితో వెంటనే బయలుదేరింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఆ రోజంతా తిండీ తిప్పలు లేకుండానే పడుంది వాసంతి. టి.వి. ముందునుంచి కదలడంలేదామె. ప్రతిక్షణం ఒడ్డుకు వస్తున్నవాళ్ళ పేర్లు చెపుతుంటే ఆమె ఆశగా చెవులు రిక్కించి వింటోంది. మృతులు తాలూకా పేర్లు. క్లిప్పింగ్స్ చూపించేటప్పుడు ఆమె గుండె దడదడలాడుతోంది... ఎక్కడా అతనిపేరు రాకూడదని శతవిధాలా దేవుడ్ని ప్రార్థిస్తోంది.

మృతులలో ఓ అయిదారు మృతదేహాలు ఆనవాలు పట్టడానికి వీలులేనంతగా ఉబ్బిపోయి వున్నాయి. జలచరాలు కొన్ని తినేశాయి. ఆ దృశ్యం చూడగానే భయంకరంగా వుంది.

ఆ శరీరాలు మార్చురీలో వుంచుతారనీ, కన్పించని వ్యక్తుల తాలూకా బంధువులు ఎవరయినా వచ్చి ఐడెంటిఫై చేసుకోవచ్చని ఎనౌన్స్ చేశారు. హతాశురాలైంది వాసంతి.

తండ్రి ముంబాయి చేరుకొనేసరికి రేపు మధ్యాహ్నం దాటుతుంది. అప్పటివరకూ భయం భయంగా, బెరుగ్గా గడపాల్సిందే! ఆమె చెంపలమీద కన్నీళ్ళు ధార కడుతున్నాయి. హృదయంలో చెప్పలేని ఆవేదన సుడులు తిరుగుతోంది.

అక్కడ త్రినాథ్ ఇంట్లో వాళ్ళ పరిస్థితి... ఇలాగే వుంది. ఎవరూ వచ్చి మంచినీళ్ళు ముట్టలేదు ఏడ్చి ఏడ్చి కన్నీరింకిపోయి, ఏడవడాని క్కూడా ఓపికలేనట్లు అచేతనులై పడుకుని వున్నారు ఊళ్ళో వాళ్ళందరూ వాళ్ళకు తోచిన విధంగా ధైర్యం చెబుతూ ఓదార్చసాగారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

గాఢమయిన నిద్రలోంచి హఠాత్తుగా మెలకువ వచ్చింది త్రినాథ్‌కి. కళ్ళు తెరవబోయాడు. సాధ్యంకాలేదు. ఒళ్ళంతా విరక్కొట్టినట్లు ఒకటే నొప్పులు చెంపలమీదా, కళ్ళమీదా సూదుల్లా ఏవో గుచ్చుకుంటున్నాయి.

తనచుట్టూ ఎవరో గుమిగూడినట్లు కలగాపులగంగా మాట్లాడుకుంటున్నట్లు తోచింది త్రినాథ్‌కి.

కళ్ళు తెరవకుండా ఆ మాటలు ఆలకించసాగాడు.

"ఏయ్ చైతూ! ఇలారా.. ఇక్కడచూడు ఎంతపెద్ద గవ్వో...." ఆశ్చర్యంగా చూస్తూ అంది ఐశ్వర్య.

కిలకిలా నవ్వాడు చైతన్య. తనలా కళ్ళు పెద్దవిచేస్తూ "ఊ... రంగులగవ్వ" అన్నాడు.

"గవ్వలు చొక్కా, ఫ్యాంటూ వేస్కుంటాయా ఎక్కడయినా?" రీమా చేతులూపుతూ అంది.

"గవ్వలు పడుకుని నిద్రపోతాయా ఎక్కడయినా?" చైతన్య అన్నాడు.

అప్పటికి మెలుకువ వచ్చింది త్రినాథ్‌కి. అరచేత్తో కళ్ళు వత్తుకుంటూ, వళ్ళు విరుచుకుంటూ లేచాడు.

"గవ్వ లేచింది... చూడండి వెంట పడుతుందేమో...." అంటూ దూరంగా పరుగెట్టబోతూ అంది ఐశ్వర్య.

చైతన్య నవ్వుతూ త్రినాథ్ భుజాలమీదకి దూకాడు.

"ఏం టాంటీ ఇది చాలా మంచిగవ్వ. నన్నెత్తుకుని మోస్తుంది కూడా" అన్నాడు.

త్రినాథ్, చైతన్యని భుజాలమీదకెక్కించుకొనే లేచాడు. "ఛల్... ఛల్" అంటూ.. గుర్రాన్ని అధిరోహించినట్లుగా గర్వంగా అన్నాడు చైతన్య.

అదిచూసి లలిత నొచ్చుకుంటూ "దిగు బాబూ...." కొడుకును మందలిస్తూ అంది.

చైతన్య అల్లరికి అతనేమన్నా అనుకుంటాడేమోనని ఆమె భయం.

"ఫరవాలేదండీ" అంటూ సరాసరి లోకేష్ దగ్గరికి వెళ్ళాడు.

పైకి చెప్పడంలేదు కానీ లోకేష్ పరిస్థితి చాలా దారుణంగా వుంది. కాలు విపరీతంగా వాచిపోయింది. చెట్టునుంచి ఆకు కాలిపై రాలి పడినా తట్టుకోలేకపోతున్నాడు.

అప్పటిదాకా ఛెంగుఛెంగున గెంతులు వేసిన చైతన్య లోకేష్‌ను చూడగానే బాధతో అతని మొహం నిండిపోయింది. త్రినాథ్ చెయ్యి పట్టుకుని భయంభయంగా అతని కాలువంక చూశాడు.

మామూలప్పుడు త్రినాథ్ క్షణం వదిలి వుండని చైతన్య త్రినాథ్ లోకేష్ దగ్గర కానీ, నవదీప్‌సింగ్ దగ్గర కానీ ఉన్నప్పుడు అతన్నుంచి తప్పించుకుంటున్నాడు. ఈ రోగాలూ, బాధలను ఆ పసిహృదయం తట్టుకోలేకపోయింది.

త్రినాథ్ తన లోకంలో తానున్నాడు. చైతన్యని పట్టించుకునేస్థితిలో లేడు. చైతన్య త్రినాథ్‌ని వదిలేసి చిన్న చిన్న అడుగులతో వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ, కళ తప్పిన మొహంతో ఏదో ఆలోచిస్తూ రావటం చూసి ఐశ్వర్య మనసు ఆర్ద్రమైంది. ఇప్పుడు అతని దృష్టిని మళ్ళించాలి.

"చైతూ…." బిగ్గరగా పిలిచింది. నిరాసక్తంగా ఆమెవైపు చూశాడు చైతన్య.

"రన్నింగ్ రేస్ పెట్టుకుంటున్నాం… వస్తావా?" అడిగింది.

"ఎవరెవరు?" మామూలుగా అడిగాడు.

"నువ్వూ నేనూ రీమా… మన్ ప్రీత్ ఆంటీ" చెప్పిందామె.

ఆ మాట విని అందరూ ముసిముసిగా నవ్వారు. మన్ ప్రీత్ స్థూలకాయురాలు. ఆమె పరుగెత్తలేదని జోక్ చేయడానికన్నట్లు అంది ఐశ్వర్య.

వెంటనే పైకి లేచింది మన్‌ప్రీత్, చున్నీ నడుంచుట్టూ చుట్టి సిద్ధమైంది.

"వెళ్ళొద్దు, మోకాళ్ళు పట్టేస్తాయి" నవదీప్‌సింగ్ లబలబలాడాడు. అయినా లెక్కచేయలేదామె.

ఆమెను చూడగానే ఎక్కడాలేని హుషారొచ్చింది చైతన్యకు. వెంటనే తన మనసుని కలచివేసిన విషయాన్ని మరిచిపోయాడు. పరుగెత్తే వాళ్ళలో కలిసిపోయాడు. అందరూ కలిసి సముద్రపు ఒడ్డున పడుతూ లేస్తూ ఒకరినొకరు తోసుకుంటూ, ఒకరినొకరు వెనక్కి లాక్కొంటూ పరిగెడుతుంటే ఒడ్డున వున్న వాళ్ళంతా సరదాగా చూస్తూ కూర్చున్నారు.

ఆ ఆట ఓ అరగంట సాగింది. మగవాళ్ళంతా కాలకృత్యాలు తీర్చుకొని వచ్చాక ఆడవాళ్ళ వెళ్ళారు.

మళ్ళీ ఐశ్వర్య తనివితీరా స్నానంచేసి వచ్చింది.

మళ్ళీ బేచ్‌లుగా విడిపోయి ఆహారసేకరణకు బయలుదేరారంతా. రూట్ అలవాటవటంతో మరికాస్తంత లోపలికి వెళ్ళారు.

పోనుపోను అడవి చిక్కనౌతుందేకానీ, జనావాసాలున్న సూచన లేదు.

సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి ప్లాస్టిక్ సంచుల్లో నీళ్ళను నింపుకుని, నాలుగైదు రకాల కొత్త పళ్ళను ఏరుకొని త్రినాథ్ మొదటిసారి కొట్టిపడేసిన కొబ్బరిగెలలను మోసుకొని తిరిగి వచ్చాడు.

రాగానే లలిత, రీమా కలిసి అందరికీ ఆహారాన్ని సప్లయ్ చేశారు. ఉన్నంతలో ఆహారాన్ని ఎవరికెంత ఇవ్వాలో నిర్ణయించి సర్వ్‌చేసే బాధ్యతను లలిత, రీమా స్వీకరించారు. పళ్ళు తిని, నీళ్ళు తాగగానే అందరికీ నిద్ర ముంచుకొచ్చింది. కానీ త్రినాథ్ అందర్నీ సమావేశమవ్వమని చెప్పడంచేత అందరూ ఒక దగ్గర కూర్చున్నారు.

ముందుగా నవదీప్‌సింగ్ మొదలుపెట్టాడు. "మనం మిస్సయి దాదాపుగా 36 గంటలు గడిచింది. కానీ మనం ఇక్కడ్నుంచి బయటపడే మార్గాన్ని అన్వేషించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయాం. ఈ సముద్రపు ఒడ్డును చూస్తుంటే ఇంతవరకూ ఇక్కడ మనషులు సంచరించిన జాడలేదు.

నాకు తెలిసి మనం తప్ప ఈ ప్రాంతాన్ని ఎవరూ ఇంతకుముందు చూసి వుండరు. ఇటువంటి చోటుకు మనల్ని వెతుక్కుంటూ ఎవరో వస్తారనుకోవడం అత్యాసే అవుతుంది. కాబట్టి మనం ఇంకో మార్గాన్ని అన్వేషించాలి" చెప్పాడతను.

తలపంకించాడు త్రినాథ్. "ముందు ప్రాణాలు నిలబెట్టుకోడానికే మనం ఇంతగా అవస్థపడాల్సి వస్తోంది. మనం తోవ వెతుక్కుంటూ అడవిలోకి వెళ్ళడం వృధా. ఇక అటువైపు ఏమీలేదు. దట్టమైన అడవులు తప్ప" ప్రభాకర్ అన్నాడు.

కొంతమంది అంగీకారంగా తలాడించారు. మరికొంతమంది నవదీప్ సింగ్‌ని సమర్థించారు. అక్కడ వున్నవాళ్ళంతా రెండుగా చీలిపోయి వాదించుకుంటున్నారు.

కొంతమంది ఇక్కడే వుండిపోయి సమయంకోసం ఎదురుచూడటం ఉత్తమమని అంటుండగా, కొంతమంది ఇలా సోమరిగా కూర్చొని కాలం గడిపేకన్నా మంచో చెడో దోవ వెతుక్కుంటూ వెళ్ళడం మంచిదేమో అనే ఆలోచనలో వున్నారు.

వాళ్ళ ఆలోచనలు వింటూ కూర్చున్నాడు లోకేష్. అతని ప్రక్కనే కూర్చుంది ఐశ్వర్య. అతని బాధని కొంతసేపయినా పోగొట్టాలని ఆమె ఆలోచన.

అతని క్రాఫ్ గురించో, అతని మాటల గురించో కామెంట్ చేస్తూ, వెక్కిరిస్తూ ఏడిపిస్తోంది. అతనూ యువకుడే.

అందర్లానే సినిమా తారలపట్ల అతనికీ ఆకర్షణ ఎక్కువే. మామూలు సమయాల్లో అయితే ఐశ్వర్యారాయ్ తనపట్ల తీసుకుంటున్న చనువు గురించి ఎక్సయిట్‌మెంట్ ఫీలయ్యేవాడు కానీ అతనిప్పుడున్న పరిస్థితి వేరు.

లోకేష్ ఏమీ మాట్లాడకపోవడం చూసి "నువ్వేమంటావు లోకేష్!" ప్రభాకర్ అడిగాడు.

అతని పెదాలమీద అసహాయతతో కూడిన ఓ నవ్వు కదలాడింది.

"మీరు ఏ మార్గం అనుసరించినా నేను చేయగలిగేదేముంది.... నేనిక్కణ్నించి కదల్లేను కదా!" మెల్లగా అన్నాడు.

ఐశ్వర్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బాధ పడవద్దన్నట్లుగా అతని చెంపను మునివేళ్ళతో తట్టింది. త్రినాధ్ అతని భుజంచుట్టూ చేయివేసి మాట్లాడటానికి గొంతు సవరించుకున్నాడు. అందరూ ఆసక్తిగా అతనివైపు చూశారు.

"ఈ ప్రదేశంనుంచీ మనం కదిలివెళ్ళడం అంత శ్రేయస్కరం కాదు. ఇక్కడ జంతువుల తాకిడి కూడా లేదు. కాని అడవిలోకి వెళుతున్న కొద్దీ అలా కాదు, ఈ అడవులు ఎక్కడితో ఎండ్ అవుతాయో మనకి తెలియదు.

చేతిలో ఆయుధాలు లేకుండా మనం వెళ్ళడం వెళ్ళడం ఉత్తమం కాదు. ఇప్పటికిప్పుడు ఈ ప్రదేశాన్ని ఖాళీ చేయడానికి మనకొచ్చిన ఆపద కూడా ఏమీ లేదు. నా ఉద్దేశం ప్రకారం ఇంకో నాలుగైదు రోజులు ఇక్కడే ఎదురుచూడటం ఉత్తమం" చెప్పాడతను.

వాద ప్రతివాదాలయ్యాక... త్రినాధ్ చెప్పిందే అంగీకరించారందరూ. లోకేష్ పరిస్థితి క్షణక్షణానికీ విషమిస్తోంది. టాబ్లెట్ ప్రభావం వున్నంతసేపూ ఒళ్ళు చల్లబడుతోంది. మళ్ళీ వెచ్చనవుతోంది.

అతని ప్రక్కన క్షణం విడవకుండా ఎవరో ఒకరు వుంటూ సపర్యలు చేస్తూనే వున్నారు. ఆ రోజు కూడా యధావిధిగా ఎలాంటి ఆశాలేకుండానే గడిచిపోయింది.

ఐశ్వర్య తన చీరలో కొంత భాగాన్ని చింపి సముద్రపు ఒడ్డున ఇసుకలో రెండు కర్రలకి జెండాలా కట్టింది. హెలికాప్టరు వచ్చినపుడు గుర్తుపట్టడానికి వీలుగా... "హెలికాప్టరు శబ్దం వినబడగానే మనమే పరుగెత్తుకుంటూ వచ్చి చేతులు వూపుతాం ఇంకా ఇవన్నీ ఎందుకు?" అన్నాడు ప్రభాకర్.

మిగతావాళ్ళు రాత్రిపూట దోమలబాధను తట్టుకోలేక ఇసుకలో పాతిన చున్నీలని కప్పుకుంటే, ఐశ్వర్య తన చీర ముక్కని మాత్రం అక్కడే వుంచింది.

మర్నాడు ఉదయం తెల్లగా తెలవారింది. అప్పటికి వాళ్ళీ ద్వీపానికి వచ్చిపడి 59 గంటలు దాటిది.

అందరిలోనూ నీరసం, నిస్సత్తువ అలుముకుంటున్నాయి. అడుగు తీసి అడుగు వేయడానికి కష్టంగా వుంది కొందరికి. అలాగే ఓపిక చేసుకొని నడుస్తున్నారు.

ఉదయం పది గంటలకు ఆడవాళ్ళంతా నడుచుకుంటూ అరగంటలో సెలయేటి దగ్గరికి స్నానానికి వెళ్ళారు. మగవాళ్ళంతా ఇంకోవైపు పళ్ళు, నీళ్ళు తేవడానికి వెళ్ళారు.

లోకేష్‌కి ఆకుపసరు పూస్తూ కూర్చున్నాడు త్రినాధ్. వాతావరణం అంతా ప్రశాంతంగా వుంది. ఆడవాళ్ళంతా ఆ సెలయేటిలో స్నానాలు చేయడం ప్రారంభించారు. చుట్టూ మగవాళ్ళెవారూ లేకపోవడంతో ఎంతో ప్రశాంతంగా వుంది వాళ్ళకి.

ఐశ్వర్యతో ముచ్చటిస్తూ, ఆమెనేవో ప్రశ్నలు అడుగుతూ సరదాగా స్నానం చేస్తున్నారు. ఇంతలో అతి దగ్గరనుంచి సింహం బద్ధకంగా నిద్రలేస్తూ గర్జించిన ధ్వని... కెవ్వున అరిచి బెదిరిపోతూ ఒక దగ్గరికి చేరారు ఆడవాళ్ళంతా.

త్రినాధ్ చెప్పింది గుర్తుతెచ్చుకుని వాళ్ళతో కూడా వచ్చిన చైతన్య అరవొద్దన్నట్లుగా నోటిమీద చెయ్యేసుకుని వారించాడు.

వాళ్ళంతా గుంపుగా మెల్లగా కదులుతూ రాసాగారు. వాళ్ళంతకు ముందు మాట్లాడుకున్న విషయాలు గుర్తొచ్చాయి.

అడవి జంతువులు నీరు వున్న దగ్గర అధికంగా సంచరిస్తాయని, చైతన్యకి ఏం చేయాలో తోచలేదు. సంధించిన బాణంలా పరిగెడుతూ సంకేతాత్మకంగా "విజిల్" వేయసాగాడు.

లోకేష్ దగ్గర కూర్చుని చేతితో పసరు నలుపుతున్న త్రినాధ్‌కి ఆ విజిల్ శబ్దం వినబడింది. క్రూరమృగాలను చూసినప్పుడు వేసే విజిల్ అది.

లోకేష్ కూడా ఆ విజిల్ విన్నాడు. భయంగా అటువైపు చూశాడు. ఆ విజిల్ ఆడవాళ్ళు స్నానానికి వెళ్ళినవైపు నుంచి వస్తోంది. చివ్వున లేచి నిలబడ్డాడు త్రినాధ్.

అటూ ఇటూ చూశాడు. అక్కడ ఎవరూ లేరు. అంతా అడవిలోకే వెళ్ళారు. ఒకే ఒక్కక్షణం లోకేష్ వంక చూసి–

"ఇప్పుడే వస్తా...." అంటూ చెట్ల మధ్యనుంచి దూసుకుపోయాడు.

అతను వెళ్ళినవైపే చూశాడు లోకేష్.

ఇంతలో ఆకాశం ఉరిమినట్లనిపించింది. లోకేష్ అయోమయంగా చూశాడు. అటువైపు మేఘాలేమీ లేవు. ఆ ఉరుమెక్కడినుంచి వస్తోంది?!

అతను చూస్తూనే వున్నాడు. ఇంతలో ఆకాశంలో తూర్పుదిక్కు నుంచి పక్షిలా ఎగురుతూ వస్తోంది ఓ హెలీకాప్టర్.

ఆనందంతో లోకేష్ ముఖం వెలిగిపోయింది. హెలీకాప్టర్ మరింత దగ్గరగా ఆకాశంలో ఎగురుతోంది. అటూ ఇటూ చూశాడు.

ఎవరూ... లేరు.

సముద్రపు ఒడ్డున ఐశ్వర్య కర్రలకు కట్టిన చీరవంక చూశాడు. గాలికి అవెప్పుడో క్రిందపడి ఎగిరిపోయాయి. హెలీకాప్టర్ ఒడ్డునే గిరికీలు కొడుతోంది.

"త్రినాధ్...." గొంతు పగిలేలా అరిచాడు. ఎవరూ స్పందించలేదు. హెలీకాప్టర్ వంక చూశాడు.

తన కాలివంక నిస్సహాయంగా చూసుకున్నాడు లోకేష్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

చెట్లూ, కొమ్మలూ ఒంటికి రాసుకొంటున్నా, అడవితీగలు కాళ్ళకి అడ్డం పడుతున్నా లెక్కచేయలేదు త్రినాధ్, ఆపకుండా పరుగుపెడుతూనే వున్నాడు. పది నిమిషాలు పరుగెత్తాక రొప్పుకుంటూ ఎదురొచ్చాడు చైతన్య.

సింహం గర్జించిన విషయం, ఆడవాళ్ళంతా అక్కడే వున్న విషయం చెప్పాడు.

ఇద్దరూ కలిసి మళ్ళీ పరుగు ప్రారంభించారు. ఇద్దరూ ఐదు నిముషాల్లో అక్కడికి చేరుకున్నారు.

చెట్లకింద గజగజా వణుకుతూ నిలబడ్డారు ఆడవాళ్ళు. తాము ప్రాణరక్షణకోసం సూదిగా చెక్కిపెట్టుకున్న కట్టెను చేతితో పట్టుకుని నడవడం ప్రారంభించారు.

అప్పుడు విన్పించింది ఏదో హోరుమనే శబ్దం. అందరినీ ఆగమని సైగచేసి చెవులు రిక్కించాడు త్రినాధ్.

ఆ శబ్దం ఏంటో అందరికీ అర్ధమైంది. అది హెలికాప్టర్ అందరి మొహాల్లోనూ పట్టరాని ఆనందం....

సింహం గర్జన సంగతి కూడా మర్చిపోయి ఆనందంతో కేరింతలు కొట్టారు. త్రినాధ్ మొహం మాత్రం ఆందోళనతో నిండిపోయింది.

"మైగాడ్... అక్కడ లోకేష్ తప్ప ఎవరూ లేరు...." అతని నోటినుంచి వచ్చిన ఒక్కోమాట ఆశనిపాతంలా తోచింది.

అంతే....

క్షణం ఆలస్యం చెయ్యలేదు వారు. ప్రాణాలకు తెగించి పరుగెత్తసాగారు. ఇంకోవైపు వళ్ళూ, నీళ్ళసంచులను మోసుకొస్తున్న మగవాళ్ళకు కూడా హెలీకాప్టర్ శబ్దం వినిపించింది. చేతిలో వున్న పళ్ళనూ, నీళ్ళను నేలకేసికొట్టి కేరింతలతో ఒడ్డుకి పరుగుతీసుకుంటూ వచ్చారు.

అందరూ ఒకేసారి ఒడ్డుకు వచ్చి నిశ్చేష్టులై నిలబడిపోయారు. సుదూరంగా చిన్న చుక్కలా క్రమంగా అదృశ్యమైంది హెలీకాప్టర్.

నోట మాట రానట్లుగా శిలాప్రతిమల్లా నిలబడిపోయారు. వెంటనే తేరుకొన్నారు త్రినాధ్.

అంతా చెట్టుక్రింద చూశారు. అక్కడ లోకేష్ లేడు. అతను హెలీకాప్టర్‌లో వెళ్ళిపోయాడా...? అయోమయంగా అనుకున్నారందరూ.

"మైగాడ్... అటు చూడండి...." అలలవైపు చూపిస్తూ అంది ఐశ్వర్య.

నీటి ఆలల్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారెవరో.... అందరూ అటుపరుగుతీసారు.

వెంటనే అలల్లోకి దూకి ఆ శరీరాన్ని బయటికి తెచ్చాడు త్రినాధ్.

అతనే లోకేష్. కరెంట్ షాక్ తగిలినట్లయింది అందరికీ. ఏం జరిగిందోనని అందరూ గుమిగూడారు.

అప్పటికే అతను నీళ్ళు తాగేశాడు. శరీరంలో అంతకుముందే పాకిన ఇన్‌ఫెక్షన్. ఈ ప్రమాదం అతన్ని మృత్యుముఖంలోకి నెట్టేస్తోంది.

అతని పొట్టమీద చెయ్యేసి నీళ్ళు కక్కించే ప్రయత్నం చేస్తున్నాడు త్రినాధ్.

ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్నాడు లోకేష్.

"నేను... నా ప్రయత్నం అంతా... చేశాను...." తరువాత మాట పూర్తిచేయలేక పెదవి విరిచాడు లోకేష్.

అతనెంత త్యాగం చేశాడో... చెట్టునుంచి ఒడ్డువరకూ కారిన రక్తమే చెపుతోంది. నుజ్జునుజ్జయిన అతని కాలే చెపుతోంది.

అతని స్థితి చూసి భరించలేక ఇద్దరు ముగ్గురు దూరంగా వెళ్ళి వామిటింగ్ చేసుకున్నారు.

ఆ ఘోరమైన దుస్థితికి ప్రతివారి కళ్ళనుంచీ నీరు ధారగా కారుతోంది.

త్రినాధ్ అంతరంగమంతా నిస్సహాయతతో కదిలిపోతోంది.

"సారీ ఫ్రెండ్... నా మూలంగానే ఇదంతా...." అస్పష్టంగా అన్నాడు త్రినాధ్.

అంత బాధలోనూ తల అడ్డంగా ఆడించాడు లోకేష్.

"మీ తప్పేమీలేదు. అదంతే... అలా జరగాలని వుంది...." అన్నాడు.

అప్పటి కందరికీ విషయం అర్ధమయింది.

హెలీకాప్టర్ తమని లొకేట్ చేయలేదన్న బాధకన్నా. లోకేష్ పరిస్థితి గురించి దిగులుగా వుంది. లోకేష్ పరిస్థితి పూర్తిగా క్షీణించింది. శరీరమంతా నీలంగా మారిపోయింది.

త్రినాధ్ పిచ్చెక్కినవాడిలా ఏదో ఆకుపసర్లు పిండుతూ, అతని ఛాతీమీద కొడుతూ, బ్రతికించటానికి రకరకాల ప్రయత్నాలు చేశాడు.

అవి ఏమాత్రం ఫలించలేదు. చివరికి త్రినాధ్ ఒడిలోనే అతను తుదిశ్వాస వదిలాడు. ఎక్కడి లోకేష్? ఎక్కడ తాము... అతనికి తమకీ ఏంటి సంబంధం? అతని తల్లిదండ్రులెవరో ఏంటో? ఇక్కడ ఇలా... అయినవాళ్ళు లేకుండా... అనాధలా మరణించాడు. అదీ... అందంకోసం త్యాగం చేసి.

ఎవరూ ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఇంతవరకు తమ మధ్యే వున్న లోకేష్ ఇక లేడు అనుకోవడం చాలా కష్టంగా వుంది. ప్రాణాలకు తెగించి అతను చేసిన సాహసం వాళ్ళందరి హృదయాలను పిండేసింది.

హెలికాప్టర్ వెళ్ళిపోవడాన్ని తట్టుకోలేక, కాళ్ళను ఈడ్చుకొంటూ ఒడ్డుకు వచ్చేసి వుంటాడు. హెలికాప్టర్ వెళుతున్న దిక్కే కింద చూసుకోకుండా వెంటపడి వుంటాడు.

నీళ్ళలో కాళ్ళు పట్టుతప్పి పడిపోయి వుంటాడు. అంత భయంకరమైన చావు అతి దగ్గరగా చూసిన అందరూ... ఆ భయం నుంచి తేరుకోలేకపోతున్నారు.

తామరాకు మీద నీటిబొట్టులా వుండగలిగింది ఒక్క ఐశ్వర్య మాత్రమే. ఆమె క్రూయిజర్ క్యాబిన్‌లో వున్నప్పుడే చావుకు చివరి అంచు వరకూ చేరుకుంది.

త్రినాధ్ అడ్డుపడకపోతే ఆమె జీవితం అక్కడితో ముగిసిపోయేది.

ఈ క్షణమో, మరుక్షణమో చనిపోవచ్చున్న మానసిక స్థితిని ఆమె అనుభవించింది కాబట్టే ఒకరకమైన వైరాగ్యభావం చోటుచేసుకుంది.

ఆమె త్రినాధ్ భుజం చుట్టూ చేయివేసి ఓదారుస్తూ "ఇలా ఎక్కువసేపు వుంచడం మంచిది కాదు. చైతూ భయపడుతున్నాడు. తరువాత జరగాల్సినవి చూడండి...." చెప్పిందామె.

త్రినాధ్ కన్నీళ్ళు తుడుచుకుని లేచాడు.

లోకేష్ చేతికున్న వాచీని, ఉంగరాన్ని తీసి, నవదీప్‌సింగ్‌కిచ్చి జాగ్రత్త చేయమన్నాడు. మగాళ్ళలో ఐదారుగురు కలిసి అడవిలో దూరంగా గొయ్యితవ్వి లోకేష్‌ని ఖననం చేశారు.

అతని త్యాగం నిరుపమానమైందైనా అది వృధా అయినందుకు అందరూ చింతించారు. అక్కడినుంచీ రాగానే అంతా సమావేశమై కూర్చున్నారు.

ఎవరికీ ఏమీ తినాలనీ, తాగాలనీ లేదు. లోకేష్ ఎప్పుడూ కూర్చునే చెట్టువైపు చూడాలంటే అందరికీ బాధగా వుంది. అంతా దిగాలుగా ఒకరి ముఖాలొకరు చూస్తూ కూర్చున్నారు.

ఒకసారి హెలికాప్టర్ వచ్చి ఇక్కడెవరూ లేరని నిర్ధారించుకొని వెళ్ళిందంటే ఇంక ఈసారి ఇటువైపుకు రాదు. అందరికీ తాము బయట పడతామన్న ఆశ నశించింది. చీకటి పడ్తున్న కొద్దీ వాళ్ళలో మరింత నిరాశా నిస్పృహలు చోటు చేసుకోసాగాయి.

ఐశ్వర్యా, త్రినాధ్ ఎంత ధైర్యాన్ని నూరిపోస్తున్నా వాళ్ళ మనసులో ఆందోళన ముఖంలో ప్రతిఫలిస్తూనే వుంది.

* * * * * *

గత మూడు రోజులనుంచీ అన్ని పత్రికల్లోనూ, అన్ని ఛానల్స్‌లోనూ క్రూయిజర్ ప్రమాద వివరాలే ఆలంబనగా నడుస్తున్నాయి.

క్రూయిజర్ ప్రమాదం జరిగి మూడు రోజులు దాటింది. దాదాపు 500ల మందివరకు సజీవంగానో, గాయాలతోనో, నిర్జీవంగానో దొరికారు. ఇంకా సుమారు వందమందివరకూ జాడతెలియరాలేదు. ఆ వందమందిలో ఐశ్వర్య కూడా వుండటం దేశవ్యాప్తంగా అందరి ఉత్సుకతకూ కారణమైంది. ఇన్ని రోజులైనా జాడ తెలియనందుకు ఐశ్వర్య తల్లిదండ్రులు, ఆమె అభిమానులు పడుతున్న బాధ వర్ణనాతీతం.

యుద్ధనౌక కూడా సముద్ర జలాల్లోనే వుంది. ఆ నౌకమీద నుంచే హెలికాప్టర్‌లు నిర్విరామంగా ఎగురుతూ తీరప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి. ఆ రోజు ఉదయం పది గంటలప్పుడు అన్ని వార్తలు, న్యూస్ ఛానెల్స్, ఫ్లాష్ న్యూస్‌ని ప్రసారం చేశాయి.

మూడు రోజుల అనంతరం భారతదేశానికి సుదూరంగా ఎక్కడో అటవీప్రాంతానికి దగ్గర వున్న సముద్రతీరంవద్ద హెలికాప్టర్ గాలింపు జరుపుతుండగా ఈస్ట్ ఫాస్ట్ క్రూయిజర్ కెప్టెన్, అతని సిబ్బంది కొందరు కన్పించారని వార్త.

ముంబాయి ఓడరేవులో వాళ్ళు దిగగానే విలేఖరులు వాళ్ళను చుట్టుముట్టారు. ఆయనకి ఐశ్వర్య గురించి గాని, మరెవరి గురించీ తెలియదు. రాగానే విలేఖరులు సంధించిన ప్రశ్నలకు అతను కన్ఫ్యూజయ్యాడు.

"ఐశ్వర్యారాయ్ లైఫ్ బోట్‌లోకి ఎక్కడం మీరు చూశారా? షిప్ కెప్టెన్ అయ్యుండి ప్రయాణీకుల బాధ్యత మీదేకదా?" విలేఖరులు వదలకుండా ప్రశ్నిస్తున్నారు.

వెంటనే రియాక్ట్ అయ్యాడు కెప్టెన్. "నా కళ్ళముందే ఐశ్వర్యని సేవ్‌చేసి తీసుకువచ్చాడు. ఒక ఆంధ్రా అబ్బాయి. హిజ్‌నేమ్....నాధ్... ఐ థింక్ త్రినాధ్ సమ్‌థింగ్. అతను రీమా అనే ఇంకో పాసింజర్‌ని కూడా సేవ్ చేశాడు.

వాళ్ళంతా కలిసి లైఫ్ బోట్‌లో ఎక్కారు. మా ఇద్దరి బేచ్‌ల లైఫ్ బోట్స్ ఎక్కువ తేడా లేకుండానే ప్రయాణించి వుంటాయి. మమ్మల్ని ఐడెంటిఫై చేసినచోటే వాళ్ళనీ వెతికితే ప్రయోజనముండవచ్చు."

వాస్తవానికి దగ్గరగా వచ్చి అన్నాడు కెప్టెన్. నేవీ సిబ్బంది ఒప్పుకోలేదు. ఆ తీర ప్రాంతాన్నంతా క్షుణ్ణంగా గాలించామని చెప్పారు.

ఏ కారణాల చేతనైనా వారు హెలికాప్టర్‌ను మిస్సయి వుండొచ్చని, మళ్ళీ ఓసారి తిరిగితే ప్రయోజనం వుండొచ్చని తన అభిప్రాయంగా చెప్పాడు కెప్టెన్.

నేవీ అధికారులు అతడి మాటల్ని విభేదించారు.

* * * * * *

ఆ రోజు ప్రసారమైన ఫ్లాష్ న్యూస్‌ను చూశాక ఊళ్ళో అందరి మనసులూ కొంత తేలికయ్యాయి. షిప్‌లో ఐశ్వర్యారాయ్‌ని త్రినాధ్ రక్షించాడని తెలియగానే "ఎవరా... త్రినాధ్" అంటూ విలేఖరులు వేట ప్రారంభించారు.

అతని వివరాలు తెలుసుకుని, అతనింటికి వెళ్ళి, ఇంట్లో వాళ్ళ వివరాలు తెలుసుకున్నారు. ఊళ్ళో త్రినాధ్ గురించి, అతనికి ఐశ్వర్యపట్ల వున్న అభిమానం గురించి, చెల్లి పెళ్ళి వదిలేసి వెళ్ళటం గురించి విలేఖరులు వార్తలను సేకరించారు.

"ఎవరీ... వీరాభిమాని? ఐశ్వర్యను రక్షించిన వీరాభిమాని..." అంటూ వివరాలు రాశారు.

నేషనల్ లెవెల్లో ప్రచురించడిన ఆ వార్తను సల్మాన్ కూడా చదివాడు తను లైఫ్‌బోట్, ఎక్కడానికొచ్చినపుడు ఐశ్వర్య గురించడిగి, ఆమె బోట్ ఎక్కలేదని ఖండితంగా చెప్పి, తన కళ్ళముందే క్రిందకు పరిగెత్తిన అతను గుర్తొచ్చాడు.

అంత కష్టంలోనూ అతను ఐశ్వర్య గురించి ఓ కంట కనిపెడతూనే వున్నాడన్నమాట. సల్మాన్ మనసంతా చేదుతు తిన్నట్లుగా మారిపోయింది.

"ఆమెను రక్షించాడని లోకమంతా కీర్తిస్తుంది. ఐశ్వర్యని అతను క్షేమంగా తీసుకువస్తే ఓ లక్షా, రెండు లక్షలు పడేస్తే నమ్మినబంటులా కాళ్ళ క్రింద పడుంటాడు" అనుకున్నాడు సల్మాన్.

ఇంతలోనే అతను ఐశ్వర్యని అడిగిన కోరిక గుర్తొచ్చింది. ఆవేశంతో నరనరం బిగిసింది. ద్వైంధీ భావంతో సతమతమవుతున్నాడు సల్మాన్. ఇదిలా వుండగా ఐశ్వర్య గురించి రోజుకో పుకారు రాజ్యమేలుతోంది.

విదేశాలనుంచి ఆమె క్షేమం కోసం భారతదేశ రాయబార కార్యాలయానికి ఫోన్లు వెల్లువెత్తుతున్నాయి.

ఆమె నటించిన "చోకర్ బాలీ, బ్రైడ్ అండ్ ప్రీజుడీస్, దేవదాస్" చిత్రాల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులను పొందడమే ఈ రెస్పాన్స్‌కి కారణం ఆమె మరణించిందని కొన్నిసార్లు... గాయపడిందని కొన్నిసార్లూ... ఎవరికి తోచిన విధంగా వాళ్ళు పుకార్లను వ్యాపింప చేస్తున్నారు.

అయితే అందరూ నిశ్చయంగా ఓ కమ్మని వార్త చెప్పారు. వాళ్ళ గాలింపుకోసం మళ్ళీ యుద్ధనౌక బయలుదేరుతుందని, ఈసారి కూడా క్షుణ్ణంగా గాలింపు జరుగబోతోందని. ఆ వార్తకు వాళ్ళ మనసుల్లో ఆశలు చిగురించాయి.

* * * * * *

సముద్రం హోరుమని శబ్దం చేస్తోంది. గాలి అడవిపూల సుగంధాలను మోసుకొస్తోంది. అడవిలో వుండుండి రకరకాల పిట్టలు గూళ్ళకి చేరుకుంటున్న సూచనగా కిలకిలారావాలు చేస్తున్నాయి.

కూర్చున్న చెట్టుమీద పిట్టలు విచిత్రంగా కూస్తుంటే తలెత్తి చూసింది ఐశ్వర్య. క్రిందగా వాలి వున్న కొమ్మమీద ఓ పిట్ట కూర్చుంది రంగు రంగుల రెక్కలు... సూదిలాంటి నోరు... ఎప్పుడూ అలాంటి పిట్టను చూడలేదు. లేచి నిలబడి చెయ్యి చాచి అందుకోబోయింది. సముద్రంవైపు ఎగిరిపోయిందా పిట్ట.

దాని వెనకాల పరుగు తీసిందామె. మిగతా అందరూ నిరాస కంగా చూస్తూ కూర్చున్నారు. సముద్రపు ఒడ్డుకీ, అడవిలోకీ పరుగులు తీస్తోనేవుందామె. త్రినాథ్‌కి మనసు ఆర్ద్రమైంది.

ఆమె చేస్తున్న ప్రయత్నం కూడా ఆర్ద్రమైంది తన భయాన్ని పారద్రోలే! ప్రయత్నంలో వుంది ఆమె ఎక్కడి ఐశ్వర్యారాయ్! ఎక్కడి ఈ అడివి?!! ఆమె కనుసైగ చేస్తే చాలు సర్వసంపదలూ కాళ్ళ దగ్గరికి వచ్చి పడతాయి. ఆమె చిరునవ్వు నవ్వితే చాలు అపర కుబేరులందరూ ఆమె ముందు క్యూ కడతారు.

ఆకర్షణకీ, ఆరాధనకీ, బాధ్యతకీ వున్న తేడా తెలిసింది. మనం సృష్టించుకున్న ఇతన బంధాలకన్నా మానవత్వం ఎదుటి వ్యక్తిని ఆపద నుండి కాపాడటం, ఎంత గొప్పవో తెలిసివచ్చింది. అన్నింటిలోకి అందమైనది మానవత్వం... శాశ్వతమైన అందం భగవంతుడిది.

లోకేష్ సంఘటన జరిగిన దగ్గరనుంచీ ఎవరూ ఒకరితో ఒకరు మాట్లాడకుండా నిస్సత్తువగా కూర్చుని వున్నారు.

ప్రభాకర్‌కి అడవిలో తిరిగినప్పుడు కుట్టిన దోమల మూలంగా వళ్ళంతా ఎలర్జీ, వచ్చి పెద్ద పెద్దగా దద్దుర్లు లేచి చూడటానికి భయంకరంగా జ్వరంతో మూలుగుతూ పడుకున్నాడు. ఎలర్జీకి టాబ్‌లెట్స్ లేవు. అతని ఉపశమనం కోసం మెత్తటి ఆకుల్ని అతని శరీరంమీద కప్పివుంచారు.

ప్రేమికుల జంటలోని యువకుడు మానసికంగా కృంగిపోయి వున్నాడు. అతనూ, అతని ప్రియురాలూ, కాలేజీ ఎడ్యుకేషనల్ టూర్ అని చెప్పి ఇలా వచ్చారు.

ఇప్పుడీ సంఘటన మూలంగా తమ గురించి ఆమె పేరెంట్స్‌కి తెలిసిపోతుంది. ఇరువైపుల పేరెంట్స్ రియాక్షన్ ఎలా వుంటుందో వూహించలేకపోతున్నాడు.

అందుకే అతను దిగులుగా, కూర్చున్న దగ్గర్నుంచీ లేవడంలేదు. అందరికీ గాయాలో, జలుబో, జ్వరాలో ఏదో ఒకటి ఎటాక్ చేస్తున్నాయి.

హెలికాప్టర్ వచ్చిన శబ్దం విని, ఏరుకొచ్చిన పండ్లనీ, నీళ్ళ సంచుల్నీ అక్కడే నేలకేసి కొట్టి పరుగుతీయడంతో... ఇప్పుడు తినడానికి, త్రాగడానికి ఏమీలేక అంతా సొమ్మసిలిపోతున్నారు. నాలుగయిదు కొబ్బరి కాయలుంటే వాటిని కొట్టి అందరికీ సర్దుతున్నారు లలిత, రీమా.

తలత్రిప్పి ఐశ్వర్యవంక చూశాడు త్రినాథ్.

ఆమె ఇంకా పరుగులుపెడుతూనే వుంది. నిరంతరం నలుగురి మధ్యా ప్రశంసలను నిర్వహిస్తూ, దేశాధినేతలతో సైతం సంభాషిస్తూ, ఎల్లప్పుడూ తననభిమానించే అభిమానులమధ్య కోలాహలంగా జీవితాన్ని గడిపే ఆమె ఇలా అనామకంగా తిండీ తిప్పలూ లేకుండా....

బ్రతుకుతామో, చనిపోతామో తెలియకుండా ఇలా సాయం కోసం ఎదురుచూస్తూ వుండడం భరించలేనంత కష్టం.

కాని ఈమె ఎవరు – ఐశ్వర్యారాయ్. పరిస్థితులను తనకనుగుణంగా మార్చుకోగలిగిన ధీశాలి. షూటింగ్ సమయాల్లో పలుమార్లు మృత్యుముఖం నుంచి తప్పించుకోగలిగిన ధైర్యవంతురాలు.

అందుకే ఈ విపత్కర పరిస్థితిలోనూ ఆమె తను ఆనందంగా ఉంటూ ఇతరులను సంతోషంగా వుంచటానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

ఆమె జీవితంలో ఈ ఒక్క సంఘటన చాలు, ఆమె సాధించిన పేరు ప్రఖ్యాతులననుభవించడంలో ఆమెకా అర్హత వుందని తెలియజేసేందుకు.

కనుచీకట్లు ముసురుకుంటున్నాయి. ఇంతలో చెట్ల మధ్యనుంచి కెవ్వుమన్న కేక విన్పించింది. ఆ గొంతు ఐశ్వర్యారాయ్‌ది. అందరూ భయవిహ్వలంగా అటువైపు చూసి సముద్రపు ఒడ్డుకి పరుగెత్తారు.

ఐశ్వర్య అరుస్తూనే వుంది. క్షణం ఆలోచించలేదు త్రినాథ్. రివ్వున అటువైపు దూసుకుపోయాడు.

పాదం దగ్గర చేత్తో పట్టుకుని అరుస్తోంది ఐశ్వర్య. ఆమె వేలితో చూపించినవైపు చూశాడు.

జర జరా ప్రాకుతూ పొదల్లోకి అదృశ్యమైంది ఓ పాము. అదేంటో చూసి దానికి తగిన మందు వేసేంత తీరికలేదు.

వెంటనే షర్ట్‌విప్పి ఆమె కాలు పైభాగంలో గట్టిగా కట్టాడు. భయపడితే మరింత ప్రమాదమని ఇద్దరికీ తెలుసు. ఆమె విల్‌పవర్‌ను ఉపయోగించి భయపడకుండా వుండటానికి ప్రయత్నిస్తోంది.

త్రినాథ్ కూడా ఆమెను కంట్రోల్ చేస్తూ భుజంమీద వేసుకుని చెట్లక్రింద నుంచి బయటకి తీసుకువచ్చాడు. చూడగానే అందరూ గుమిగూడారు.

అందర్నీ దూరంగా వుండమని చెప్పి, వాళ్ళని చితుకుల మంట వేయమన్నాడు. ఆ వెలుగులో పాదం దగ్గర వెతికాడు. తామర పువ్వులా సుకుమారంగా వున్న పాదంమీద స్పష్టంగా కన్పించాయి రెండు కాట్లు.

పాము కరిచినచోట భగ్గున మండుతోంది.

ఆ బాధని తట్టుకోవడం చాలా కష్టంగా వుంది. పాదం దగ్గర నుంచి మొదలయిన బాధేదో పైకి తోడేస్తున్నట్లుగా వుంది. నొప్పితో విలవిల్లాడిపోతోంది ఐశ్వర్య.

మరేమాత్రం ఆలస్యం చేయలేదు త్రినాధ్. నీళ్ళతో త్వరత్వరగా ఆ ప్రదేశాన్ని కడిగి, సాహసించి చైతన్య మెడలో వున్న పులిగోరుతో గాటుపెట్టి, ఆ విషాన్ని పీల్చి ఉమ్మేయడానికి అతను ఆమె పాదం మీదకి వంగబోతుండగా చప్పున అతని క్రాఫ్ పట్టుకుని ఆపింది ఐశ్వర్య.

అతని పెదవుల ప్రక్కన వున్న గాయాన్ని చూపించింది. సల్మాన్ కొట్టినపుడు తగిలిన దెబ్బ అది. ఆ విషం అతని గాయంలోకి ప్రవేశిస్తే ఇతని శరీరం కూడా విషపూరితమౌతుంది.

నిస్సహాయంగా అందరివంకా చూశాడతను. అందరూ ఆ సాహసం చేయలేనట్లు తలలు వంచుకున్నారు.

ఇక ఎక్కువ ఆలస్యం చేయలేదు త్రినాధ్.

రీమా చున్నీ తీసుకొని గాయం దగ్గర వత్తిపెట్టి ఇంకోవైపు విషాన్ని పీల్చి ఉమ్మివేయడం ప్రారంభించాడు. పది నిమిషాలలా చేశాక ఆమెలో కొంతవరకు నొప్పి తగ్గింది. కళ్ళు తిరగడం, గుండె దడదడా కొట్టుకోవడం ఆగాయి.

చైతన్య అతనికి నీళ్ళు తెచ్చిచ్చాడు. అతను నోటిని శుభ్రంగా పుక్కిలించి ఊశాడు. అప్పుడు టాబ్లెట్లు అన్నీ వెతికాడు. కొన్ని టాబ్లెట్లు విషం పీల్చేసిన అనంతరం వాడేవి కన్పించాయి.

ఐశ్వర్యకో టాబ్లెట్ ఇచ్చాడు. తనో టాబ్లెట్ వేసుకున్నాడు.

"చీకటిపడ్డాక చెట్ల లోకలికి ఎందుకెళ్ళినట్లు? ఇక్కడ ఎన్నెన్ని ప్రమాదాలు జరుగుతున్నాయో చూస్తూనే వున్నాంకదా!" విసుగ్గా వెనుక నుంచి అన్నారెవరో. చెయ్యెత్తి వారించాడు త్రినాధ్.

అంగీకారంగా తలాడించింది ఐశ్వర్య. తను నడవలేకపోతుంటే చెయ్యిపట్టి ఇసుకలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. అతను మళ్ళీ వెనక్కితిరిగి వస్తుంటే చెయ్యిపట్టి అతన్ని ఆపింది.

"ఎంటన్నట్లు" తిరిగి చూశాడు త్రినాధ్.

"కాసేపు మీతో మాట్లాడాలనిపిస్తోంది...." అంది ఐశ్వర్య.

అతను తలతిప్పి మిగతావాళ్ళవంక చూశాడు. అందరూ తెగిన పూసల దండలోని పూసల్లా అక్కడా ఇక్కడా నిస్సహాయంగా పడున్నారు.

లోకేష్ సంఘటనతో చతించిపోయినవాళ్ళు ఇప్పుడు ఐశ్వర్యారాయ్‌ని పాము కరవడం చూశాకా బెంబేలెత్తిపోయారు.

తమకి నీళ్ళని, వళ్ళనీ ఇస్తున్న అడవి కూడా అంత సురక్షితం కాదన్న చేదు వాస్తవం వాళ్ళని భయకంపితుల్ని చేస్తోంది. ఉదయం నుంచి ఆహారం లేకపోవడంతో రీమా కళ్ళుతిరిగి పడిపోయింది.

ఆమె పల్స్‌రేట్ చాలా డౌన్ అయింది. అంతా ఆకలితో, నిస్సత్తువతో, గాయాలతో, జ్వరాలతో, వాంతులతో ఈ క్షణమో, ఆ క్షణమో అన్నట్లుగా వున్నారు. అందర్నీ చూస్తుంటే పిచ్చెక్కిపోతున్నట్లుంది త్రినాధ్‌కి.

ఎంతో ధైర్యాన్ని నూరిపోస్తున్నా ఎవరూ విల్‌పవర్‌ని ఉపయోగించు కోవడంలేదు. అందరూ మానసికంగా చావుకి సిద్ధమయ్యారు.

అన్నింటికన్నా ప్రధానమైన విషయం ఆకలి.

ఈ ఆకలిని తీర్చుకొనేదెలా?

త్రినాధ్‌లో ఓ దృఢ నిశ్చయం కన్పించింది. తన చెయ్యి పట్టుకుని జాలిగా తనవంక చూస్తున్న ఆమెనుంచి బలవంతాన మనసు మళ్ళించుకొంటూ "మళ్ళీ వస్తాను" చెప్పాడతను.

"ఎక్కడికి?" అనుమానంగా అడిగిందామె.

సమాధానం చెప్పకుండా నిలబడ్డాడతను.

"చెప్పండి... ప్లీజ్...." కంఠాన్ని హెచ్చిస్తూ అందామె.

"అడవిలోకి వెళ్ళాలి...." తప్పదన్నట్లు చెప్పాడు త్రినాధ్.

"ఎందుకు...?" అడిగింది ఐశ్వర్య.

చేత్తో మిగతా వాళ్ళందర్నీ చూపించాడు.

"మనకి ఇలాంటి జీవితం గడపడంలో అనుభవంలేదు కాబట్టి చాలా తప్పులు చేస్తున్నాం. హెలికాప్టర్ వచ్చిందన్న ఆనందంలో వారు నీళ్ళూ, పళ్ళూ నేలకేసికొట్టి వచ్చారు.

లోకేష్ చనిపోయాడన్న బాధతో అడవిలోకి వెళ్ళడం మరచిపోయాం. వాళ్ళందర్నీ చూడండి... కడుపులో ఆహారం పడక హైబీ.పీ.తో వణికిపోతున్న సింగ్‌గార్ని చూడండి. చైతూ ఎలా వేళ్ళాడబడ్డాడో చూడండి. వచ్చిన రోగాల్ని ఎలాగో తట్టుకోలేము. కాని తట్టుకోవడానికి కొంత శక్తి వుంటే మంచిది. "అందుకే లోపలికి వెళ్తాను" చెప్పాడతను.

వద్దన్నట్లు కన్నీళ్ళతో తలాడించింది ఐశ్వర్య.

"అడవిలో పగటిపూట సంచరించడమే ఇంత భయంగా వుంది. ఇక రాత్రి జంతువులు స్వైర విహారం చేస్తాయి. నా మాటవిని వెళ్ళొద్దు. ప్లీజ్" ఐశ్వర్య వారించింది.

"నేను ఈ ప్రయత్నంలో సక్సెస్ అయి ఏవైనా ఆహారం తీసుకు రాగలిగితే మనందరి ప్రాణాలూ నిలబడతాయి. విఫలమైతే నేనొక్కణ్నే కదా!" తేలిగ్గా అన్నాడు.

చప్పున అతని పెదాలపై చెయ్యుంచింది.

ఓ మానవతావాదిగా ఆమె అతనభిప్రాయాలని గౌరవించింది. ఒక్కడి ప్రాణంకన్నా పదిమంది ప్రాణాలూ ముఖ్యమన్న వాదన ఆమెను అంగీకరింపచేసింది.

అతను కావలసిన సరంజామా తీసుకొని అడవిలోకి వెళుతుంటే ఎవరూ వెంటవెళ్ళే సాహసం చేయలేకపోయారు. చూస్తున్న ఐశ్వర్యకు అంతులేని కోపం వచ్చింది.

తను అతనికి తోడుగా వెళ్ళడానికి బయలుదేరింది.

త్రినాధ్ ఒప్పుకోలేదు. ఆమె ప్రాణాలు ఎంత విలువైనవో, ఆమె కేమైనా జరిగితే దేశం యావత్తూ ఎలా దుఃఖసాగరంలో మునిగిపోతుందో ఊహించగలడు.

అదీకాక పాముకాటు మూలంగా ఆమె చాల నిస్సత్తువతో వుంది. వద్దని వారించి తనే బయలుదేరాడు. ఐశ్వర్య ఊపిరి బిగపట్టి చూస్తూ కూర్చుంది.

అతను రెండు విడతలుగా అడవిలోకి వెళ్ళి పళ్ళనీ, నీటినీ తీసుకువచ్చాడు. అడవిదోమలు ముసురుకుంటున్నా లెక్కచేయక, క్రూరమృగాల అరుపులను లక్ష్యపెట్టకుండా గుండెధైర్యంతో మూడవకన్ను తెరిచిన శివునిలా అతను ప్రకృతిని సవాలుచేస్తూ, ఆ అడవిలోకి వెళ్ళి క్షేమంగా బయటపడ్డాడు.

ఊపిరి పీల్చుకుంది ఐశ్వర్య. మూడవసారి కూడా వెళుతుంటే ఐశ్వర్య చెయ్యి పట్టి ఆపి...

అవి ప్రస్తుతానికి సరిపోతాయని, మిగతా వాటికోసం రేపు ఉదయం చూసుకోవచ్చని చెప్పిందామె.

అందరికీ ఆ పళ్ళను పంచిపెట్టగానే ఆతృతగా తిన్నారందరూ మళ్ళీ అందర్నీ ఓసారి పరీక్షించి, వారికి కావలసిన మందుల్ని యిచ్చాడు త్రినాధ్.

కొంచెం కడుపు నిండాక, శక్తివచ్చి మగాళ్ళంతా అతనివైపు చూసి తలలు వంచుకుని "సారీ" చెప్పారతనికి.

వాళ్ళనర్థం చేసుకున్నాడు త్రినాధ్. చిరునవ్వుతో వాళ్ళని వారించాడు.

❈ ❈ ❈ ❈ ❈ ❈

యుద్ధనౌకమీంచి రివ్వున గాల్లోకి ఎగిరింది హెలికాప్టర్, క్రూయిజర్ కెప్టెన్‌ని ట్రేస్‌చేసిన ప్రాంతాల చుట్టుప్రక్కల గాలింపు జరుగుతోంది. సముద్రపు ఒడ్డుకు బాగా దగ్గరగా తాడెత్తిన పెరిగిన చెట్లూ, మరీ దగ్గరగా వున్న పర్వతాల మూలంగా హెలికాప్టర్ తక్కువ ఎత్తులోకి రాలేకపోతోంది. పైనుండి బైనాక్యులర్స్ సాయంతో తీరప్రాంతాల్లోని కదలికల్ని వాళ్ళు కనిపెడుతున్నారు.

❈ ❈ ❈ ❈ ❈ ❈

తెల్లవారి తొమ్మిది గంటలైంది.

అందరూ అప్పుడప్పుడే నిద్రలేచి కూర్చున్నారు. ఇంకా ఆహారం కోసం బయలుదేరడానికి ఓ గంట సమయం వుండడంతో, చుట్టూవున్న ప్రదేశాలన్నీ చూస్తూ, ఆకాశంవంక ఆశగా చూస్తూ కూర్చున్నారు.

మొదటిరోజు ఎంతో ఆహ్లాదంగా కన్పించిన పరిసరాలు ఇప్పుడు చాలా భయపెడుతున్నాయి.

ఇంకా తమ తమ ఊళ్ళనూ, తమ వాళ్ళనూ చూడగలమన్న ఆశ నశించి, అందరూ దిగులుగా చూస్తుండగా ఆకాశంలో ఓ అద్భుత దృశ్యం కన్పించింది.

దూరంగా ఓ హెలికాప్టర్ దేవతలు పంపిన పుష్పక విమానంలా రివ్వున ఎగురుతూ రాసాగింది. అందరూ మొదట నమ్మలేనట్లు కళ్ళు పెద్దవిచేస్తూ చూశారు. ఆ తరువాత ఒకరినొకరు చూసుకున్నారు.

నరనరాన చైతన్యం పెల్లుబికింది. పిచ్చిపట్టిన వాళ్ళలా కేకలు వేస్తూ సముద్రపు ఒడ్డుకి పరుగెత్తారు.

ఐశ్వర్య, త్రినాధ్‌లు అప్రయత్నంగా ఒకరినొకరు షేక్‌హేండ్ ఇచ్చుకున్నారు. ఐశ్వర్య ఆనందాన్ని పట్టలేక, అతని భుజాలచుట్టూ చేతులేసి అతని చెంపల్ని ముద్దాడింది.

ఇద్దరూ చేయీ చేయీ పట్టుకుని ఒడ్డుకు పరిగెత్తారు. అందరూ ఒడ్డున ఒకచోటే వుండగా అల్లిబిల్లి పుగులు పెడుతూ తలలు పైకెత్తి అరవసాగారు.

పైనుంచి చూసేవారికి కదలికల్ని త్వరగా ఐడెంటిఫై చేయడానికి అలా చేయమని త్రినాథ్ చెప్పాడు.

చిన్నా, పెద్దా, ఆడా, మగా తేడా లేకుండా అందరూ కేకలువేస్తూ అల్లిబిల్లిగా తిరుగుతున్నారు.

మగవారు తమ చొక్కాలను తీసి, ఆడవారు చున్నీలను గాలిలో ఎగరవేస్తూ అరవసాగారు.

హెలికాప్టర్ కెప్టెన్‌కంట ఆ దృశ్యం పడింది. అప్పటికే అసిస్టెంట్స్ బైనాక్యులర్ ద్వారా ఆ విషయాన్ని ధృవీకరించారు.

హెలికాప్టర్ తమ తలలమీదుగానే గిరికీలు కొడుతుంటే, వాళ్ళకు పట్టరానంత ఉత్సాహం వచ్చింది.

ఇంతలో హెలికాప్టర్‌లో నుంచి రెండు పెద్ద పెద్ద సంచులు బయటపడ్డాయి. ఆ సంచులనందుకొని కొంతమంది చెట్టు దగ్గరికి చేర్చారు.

ఇంతలో త్రినాథ్‌కి సమీపంలో ఓ నల్లని వస్తువేదో పడింది ముందందరూ భయపడినా తరువాత తేరిపారా చూశారు. ఆదొక వైర్‌లెసెట్ అని తేలింది.

"హలో! దిస్ ఈజ్ ఇండియన్ నేవీ... ఐశ్వర్య ఈజ్ దేర్...?" అటునుంచి వినిపించింది.

వెంటనే రియాక్టయ్యాడు త్రినాథ్.

"ఎస్....షి ఈజ్ హియర్...." చెప్పాడు.

హెలికాప్టర్‌లో వారి ముఖాలు వికసించాయి.

"హూ ఈజ్ స్పీకింగ్...?" అడిగారు వాళ్ళు.

"ఐయామ్ త్రినాథ్...." చెప్పాడతను.

"నైస్ టూ టాక్ విత్‌యు, ఇప్పుడు మీ పేరు ఐశ్వర్యారాయ్‌ని సేవ్ చేసిన మనిషిగా దేశంలో చాలామందికి తెలుసు...." చెప్పారు వాళ్ళు.

త్రినాథ్ థాంక్స్ చెప్పి, తామిద్దరూకాక ఇంకా 17 మంది ఇక్కడున్నారని తెలియచెప్పాడు.

హెలికాప్టర్ ఇక్కడ దిగడానికి అనువైన చోటు లేనందున వీరిని రక్షించడానికి యుద్ధనౌక వస్తుందని, రేపు ఉదయానికల్లా అందరూ ఇక్కడే సిద్ధంగా వుండమని కెప్టెన్ చెప్పాడు.

ఓసారి ఐశ్వరాయ్‌తో కూడా మాట్లాడి, ఆమె సేఫ్టీని కన్‌ఫాంచేసుకుని, ఆమె మాటల్ని రికార్డ్ చేసుకుని వెళ్ళిపోయింది హెలికాప్టర్.

అందరిలో పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్లు అయ్యాయి. ఆనందంతో సముద్రపు ఒడ్డునే నృత్యాలు చేశారు. అలల్లోకి దూకి ఒకళ్ళమీద ఒకళ్ళు నీళ్ళు జల్లుకున్నారు. ఒకరినొకరు కౌగిలించుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

అందరూ త్రినాథ్‌ని చుట్టుముట్టి తమ ప్రాణాలను కాపాడిన దాతగా కీర్తిస్తుంటే, మెరిసే కళ్ళతో చూస్తూ కూర్చుంది ఐశ్వర్య.

అందరూ కలిసి హెలికాప్టర్‌లోనుంచి పడిన పెద్ద పెద్ద సంచులకేసి పరుగుతీశారు.

దానిలో బ్రెడ్, బిస్కెట్స్, చాక్‌లెట్స్, టిన్డ్‌మిల్క్, వాటర్ ప్యాకెట్స్, ప్యాక్ చేసిన రోటీ, కర్రీ, టాబ్‌లెట్స్, కోక్స్, బెడ్‌షీట్స్, వాట్‌నాట్... అవసరమైనవన్నీ వున్నాయి.

దాంతోపాటే రెండు రైఫిల్స్, రెండు చాకులు కూడా వున్నాయ్. ఆయుధాలను పట్టుకొని ఈసారడవిలోకి చాలా ధైర్యంగా వెళ్ళారు వాళ్ళు.

అందరూ సబ్బులతో వళ్ళంతా రుద్దిరుద్దీ ధరించిన దుస్తులను నీళ్ళలో ఉతికి ఆరేసుకొని అవి ఎండాక, అవి కట్టుకుని మళ్ళీ ఒడ్డుకు వచ్చేశారు.

రోటీ, కర్రీ చూస్తుంటే అందరికీ నోరూరిపోతోంది. అదీకాక రేపటి కల్లా షిప్‌లోకి వెళ్ళిపోతామన్న ఆలోచన వాళ్ళ రోగాలను సగం తగ్గించింది.

అందరూ కలిసి ఆపురావురుమంటూ తినడం ప్రారంభించాడు. ఎవరూ ఎక్కువ తినలేకపోయారు. నాలుగురోజుల నుంచీ తక్కువ తినడానికి అలవాటు పడిన కడుపు ఎక్కువ తినడానికి సహకరించలేదు.

భోజనాలు ముగించాక అందరూ సరదాగా నేలమీద చదరంగం గీసి ఆడుకుంటే, మరికొందరు నిద్రకి పడ్డారు.

మరికొందరు గత నాలుగురోజులనుంచీ జరుగుతున్న నాటకీయ పరిణామాలను సమీక్షించుకోసాగారు.

త్రినాథ్‌కి మనస్సిప్పుడు తేలిగ్గా మారింది. రేపటికల్లా అందరూ షిప్‌లోకి చేరుకొంటారు. అక్కడితో తన బాధ్యత ముగిసిపోయినట్లే.

అప్పుడతనికి ఇల్లు గుర్తొచ్చింది. చెల్లిపెళ్ళి గుర్తొచ్చింది. తననిక్కడికి పంపించిన వాసంతి గుర్తొచ్చింది. అందరూ ఎంత బాధ పడుతున్నారో? నిట్టూరుస్తూ అనుకున్నాడు త్రినాథ్.

హెలికాప్టర్ సిబ్బంది ఐశ్వర్యను లొకేట్ చేసి విషయాన్ని యుద్ధనౌకా సిబ్బందికి తెలియజేసి, వాళ్ళే ప్రాంతానికి వెళ్ళాలో తెలియ జెప్పారు.

ఈ న్యూస్ వెంటనే రక్షణ శాఖకు తెలియజేశారు వాళ్ళు. క్షణాల మీద విషయం టీవీలద్వారా, ఇంటర్‌నెట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా తెలిసిపోయింది. అందరూ ఆనందంతో నిట్టూర్చారు.

ఐశ్వర్య ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. క్రూయిజర్ ప్రమాదం నుంచి ఐశ్వర్య క్షేమంగా బయటపడినందుకు అనేకమంది ఇంటికి వచ్చి అభినందనలు తెలియజేస్తున్నారు.

కొంతమంది ఫోన్‌లో, గ్రీటింగ్స్ ద్వారా తెలియజేస్తున్నారు.

సల్మాన్ ఆనందానికి అంతేలేదు. ఇంత ఘోరమైన ప్రమాదం నుంచి తనూ, ఆమె ఇద్దరూ క్షేమంగా బయటపడ్డారు.

తమ ప్రేమబంధాన్ని గట్టిపరుస్తూ ఆఖరికి విధికూడా తమను విడదీయలేదనీ అభిప్రాయపడ్డాడు.

ఇక త్రినాధ్ ఊళ్ళో సంబరానికి అంతేలేదు. వాసంతికి వార్త తెలియగానే త్రినాధ్ వాళ్ళింటికి వచ్చింది.

ఆమె ఆరాటం, ఆతృత చూసి ఈ అమ్మాయి తమ ఇంటి కోడలు కావటం నిజంగా తమ అదృష్టమే అనుకొంది సావిత్రమ్మ.

ఊళ్ళో అందరూ త్రినాధ్ వచ్చే క్షణాలకోసం ఎదురుచూడసాగారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

మధ్యాన్నం రెండు గంటలయింది. అందరూ సరదాల్లో మునిగిపోయి వున్నారు.

త్రినాధ్ ఒక్కడే అందరికీ దూరంగా అలల ఒడ్డున కూర్చున్నాడు. ఎగిసిపడుతున్న అలలను చూస్తుంటే అతనికి తుఫాన్ బీభత్సంలో మూడు తాళ్ళెత్తున లేచివచ్చి క్రూయిజర్‌ని కొట్టేసిన అల గుర్తొచ్చింది.

ఒళ్ళంతా జలదరించింది. ఆ ఆలోచనలను బలవంతాన వదుల్చుకుంటూ చేతితో యిసుకని గుప్పెళ్ళతో ధారగా పోయసాగాడు. ఆ యిసుకలోరకరకాల ఆకారాల్లో కన్పిస్తున్న గవ్వలనీ, ఆల్చిప్పలనీ, శంఖాలనీ పరిశీలిస్తున్నాడు.

ఇంతలో ఏదో చప్పుడయ్యేసరికి చూసాడు.

ఐశ్వర్యారాయ్....

చిన్నగా మందహాసం చేశాడు. పక్కనేవచ్చి కూర్చుందామె. ఇద్దరి భుజాలూ ఆనుకున్నాయి.

"ఇక ఇప్పటితో బాధ్యతలూ, బరువులూ తీరిపోయినట్లేనా...?" సాభిప్రాయంగా అతనివంక చూస్తూ అంది ఐశ్వర్య.

ఆమె మాటల్లోని అర్ధాన్ని వెతుక్కుంటూ "కొంతవరకూ...." అన్నాడు త్రినాధ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఆకాశం తెల్లగా తెల్లవారింది. సూర్యోదయమైంది. సూర్యుడు వస్తూ వస్తూ జీవితాల్లో వెలుగుల్ని మోసుకొస్తున్నట్లుగా సుదూరంగా పర్వతాకారంలో కదిలివస్తున్న ఓడని కూడా తీసుకువచ్చాడు.

అందరూ చేతులూపుతూ ఒడ్డుకువచ్చి నుంచున్నారు. తన ప్రక్కనే ఇసుకలో వెల్లకిలా పడుకుని గాఢంగా నిద్రపోతున్న త్రినాధ్ భుజంమీద ఓ దెబ్బ వేసింది ఐశ్వర్య.

"ఏయ్ మొద్దూ! చూడక్కడ ఏం వస్తుందో...." ఎగ్జయిటింగ్‌గా అంది.

చటుక్కున లేచి కూర్చున్నాడు త్రినాధ్. ఎదురుగా సాగరజలాల్లో తేలియాడుతూ వస్తోంది యుద్ధనౌక.

ఐశ్వర్య వంక చూశాడు. ఆమెలో ఆనందం పొంగిపొరలుతోంది. అందర్లో కూడా ఉత్సాహం ఉరకలు వేస్తోంది.

త్రినాధ్‌కి మామూలుగానే వుంది. నిన్న హెలికాప్టర్ వచ్చినప్పుడు కొంచెం రిలీఫ్‌గా ఫీలయ్యాడంతే. ఇప్పుడదికూడా లేదు. కానీ మనస్సులో మాత్రం గొప్ప సంతృప్తిగా వుండడం అతని కవగతమైంది.

బాధ్యత నెరవేర్చినప్పుడు కలిగే సంతృప్తే అది. తనిప్పుడు ఇంటికి వెళ్ళాక కుటుంబం పట్ల, తనను నమ్ముకున్న వారిపట్ల బాధ్యతగా మెలగాలి అనుకున్నాడు.

యుద్ధనౌక దూరంగా ఆగింది. అందులోంచి రెండు మోటారుబోట్లు ఒడ్డుకు దూసుకుని వచ్చాయి. అందరూ ఒకరినొకరు కౌగిలించు కున్నారు. ఆఖరిసారిగా లోకేష్ కూర్చున్న చోటువైపు చూశారు.

ఆ పరిసరాలన్నిటినీ చిట్టచివరిసారిగా పరిశీలించి బోట్లలోకి ప్రవేశించారు. అవి అతి వేగంగా నీటిలో దూసుకునిపోతూ షిప్‌ను చేరుకుంటుంటే ఆనందంగా కేకలు పెట్టారు.

అరగంటలో అందరూ యుద్ధనౌకను చేరుకున్నారు. అప్పటికే తాము ప్రమాదం నుంచి బయటపడగలిగామన్న ఆనందం ఆవహించింది.

ఆ నౌకలోని సిబ్బంది ఐశ్వర్యకీ, మిగతావారికీ అభినందనలు తెలియజేశారు. సిబ్బందిలోని డాక్టర్ అందర్నీ పరీక్షించి, గాయాలకు డ్రెస్సింగ్ చేసి అందరికీ మెడిసిన్స్ యిచ్చాడు.

అందరూ శుభ్రంగా తలారా స్నానాలుచేసి, ఓడలో సిబ్బంది ఇచ్చిన నైట్ డ్రెస్‌లను వేసుకున్నారు.

ఇద్దరు ముగ్గురికి కలిసి క్యాబిన్‌లను ఎలాట్ చేయబోతే – ప్రభాకర్, మన్‌ప్రీత్‌కౌర్ వారించారు.

ఈ నాలుగురోజులు ప్రాణంలో ప్రాణంలా కలిసి మెలిసి వున్నామని, మళ్ళీ ముంబాయి చేరితే ఎవరికి ఎవరో అనీ...

కాబట్టి అందరూ సెమినార్ హాల్లోనే వుంటామని చెప్పారు. సిబ్బంది కూడా నవ్వేసి అలాగేనని వెళ్ళిపోయారు.

అందరూ కలిసి క్రింద కార్పెట్‌మీదే అడ్డదిడ్డంగా పడుకొని వ్యక్తిగత విషయాలను చర్చించుకోసాగారు. సింగ్‌గారు, సర్దార్ జీ జోక్స్ చేపుతుంటే అందరూ పగలబడి నవ్వుతూ విన్నారు.

ఐశ్వర్య ప్రక్కనే పడుకుని చైతన్య ఆమె మొహం వంకే చూస్తున్నాడు. దూరంగా ఓ కుర్చీలో కూర్చీలో కూర్చుని దిగాలుగా వున్నాడు త్రినాధ్.

అతనికెందుకో చాలా అసహనంగా, ఏమీ తేల్చుకోనట్లుగా వుంది. కళ్ళముందు వాసంతి, ఐశ్వర్య ప్రక్క ప్రక్కనే కదులుతున్నారు.

త్రినాధ్ చైతన్యని పిలిచాడు. ఐశ్వర్య తిరిగి చూసింది చైతన్య కేంటో చెపుతున్నాడు త్రినాధ్. నవ్వుకుని తల తిప్పుకుంది ఐశ్వర్య.

త్రినాధ్‌తో మాట్లాడి మళ్ళీ ఐశ్వర్య ప్రక్కనే పడుకుని, ఆమె బుగ్గలుపట్టి తనవైపు తిప్పుకుంటూ–

"మీరు నన్ను మర్చిపోతారా...?" అడిగాడు చైతన్య.

ఐశ్వర్య త్రినాధ్ వైపు చూసింది. అతని కళ్ళు ఆత్రుతగా ఎదురు చూస్తున్నాయి.

"ఊహు... మర్చిపోను, నీ పెళ్ళికి తప్పకుండా వస్తాను... నువ్వు పిలిస్తే...." త్రినాధ్ వైపు చూస్తూ చైతన్యతో చెప్పింది.

తన అత్యాశకి తనే సిగ్గుపడి నవ్వుకున్నాడు. పంతొమ్మిదిమందీ అడ్రసులు ఇచ్చిపుచ్చుకున్నారు. తమలో తమకి శుభకార్యాలు జరిగినా, కష్టం సంభవించినా ఒకరికి ఒకరు తోడుగా నిలబడాలని వాగ్దానం చేసుకున్నారు.

తనెంత బిజీలో వున్నా తప్పనిసరిగా అందర్నీ కలుస్తానని చెప్పింది ఐశ్వర్య. ఇలా ఆటపాటలతో అరగంట గడిచిందో లేదో.... సెమినార్ హాల్ గుమ్మంలో ప్ర్యక్షమయ్యారెవరో...? అందరూ తలలు త్రిప్పి అటువైపు చూశారు.

"హలో ఎవ్రీబడీ...." అంటూ ప్రత్యక్షమయ్యాడు సల్మాన్‌ఖాన్.

అందరూ నోరావులించి చూస్తూండిపోయారు. అతను ఐశ్వర్య వంక చూసి రెండు చేతులూ చాపాడు. ఐశ్వర్య వెళ్ళి అతని ప్రక్కనే నిల్చుంది.

రాగద్వేషాలకు అతీతంగా వుండడానికి ప్రయత్నిస్తూ మొహం త్రిప్పుకున్నాడు త్రినాధ్.

అందరూ మర్యాదపూర్వకంగా లేచి నిలబడ్డారు. అతను ఐశ్వర్యను కన్‌సోల్ చేస్తూ ఆమె క్షేమసమాచారాన్ని అడిగాడు.

అతనితో వచ్చిన ఆమె అసిస్టెంట్ చేతిలో వున్న డ్రస్‌ని ఆమె చేతికిచ్చి కేబిన్‌లోకి తీసుకువెళ్ళింది.

అరగంటలో సినీతార ఐశ్వర్యారాయ్ అక్కడ ప్రత్యక్షమయింది. ఆమె మళ్ళీ పాత ఐశ్వర్యారాయ్‌లోకి పరకాయప్రవేశం చేసింది.

ప్రయివేట్ హెలీకాప్టర్ ద్వారా అక్కడికి వచ్చిన సల్మాన్ ఆమెని తనతో తీసుకువెళ్ళడానికే వచ్చాడు. అందరిలోనూ దిగులావహించింది. ఎల్లుండికల్లా అందరూ ఎలాగూ ముంబాయి చేరుకుంటారు.

కానీ ఈలోపే సల్మాన్ ఇలా ఐశ్వర్యని తమనుంచి విడగొట్టి తీసుకుపోవడం నచ్చలేదు. కానీ కాలాన్ని త్యాగం చేయడానికి ఆమె తమలా సామాన్యురాలు కాదు.

అందరూ సరిపెట్టుకున్నారు. ఐశ్వర్య పేరు పేరునా అందరి దగ్గరకూ వచ్చి వీడ్కోలు తీసుకొంటోంది.

అందరికన్నా వెనుక నుంచున్నాడు త్రినాధ్. ఐశ్వర్య అతని దగ్గరకు నడుస్తుంటే, విసుగ్గా చూశాడు సల్మాన్. అతని దగ్గరికి వెళ్ళిందామె. తలదించుకునే నుంచున్నాడు త్రినాధ్. తలెత్తి చూస్తే తన కళ్ళలోని భావాలను ఆమె పసిగడ్తుందేమోనని భయం.

"రెండుసార్లు నాకు ప్రాణదానం చేశారు మీరు. నా జీవితంలో మీ ఋణం తీర్చుకోలేను. మీకెప్పుడు ఏ సహాయం అవసరం అయినా నిస్సంకోచంగా నన్ను కలవండి. మీ అడ్రస్ చెప్పండి. మీ పెళ్ళికి తప్పకుండా వస్తాను" అంది.

అప్పటికి తలెత్తాడు త్రినాధ్.

"మీరు ఐశ్వర్యారాయ్... మీరు తలచుకుంటే నేను చెప్పకుండానే నా అడ్రస్ కనుక్కోగలరు. నా పేరు త్రినాధ్. పట్టుదలకు మారుపేరు. ప్రాణాలకు తెగించయినా మీ దగ్గరకు చేరుకోగలను" అని ఒక క్షణం ఆగి అవసరమైతే...." అని చిన్న వాక్యాన్ని చేర్చాడు.

చిన్నగా నవ్వి అతనికి షేక్‌హాండ్ ఇవ్వడం కోసం చేయిని చాపింది.

పువ్వులా సుకుమారంగా వున్న ఆమె చేతిని చిన్నగా షేక్‌చేసి వదిలాడతను. ఆమె వెనుదిరిగి అందరికీ ఆఖరుసారి వీడ్కోలు తెలిపి సల్మాన్‌తో కలిసి ఆ ప్రైవేట్ హెలికాప్టర్‌లో బయలుదేరింది.

ఆ రోజు సాయంత్రానికల్లా ముంబాయి ఎయిర్‌పోర్ట్‌లో దిగిందామె. అప్పటికే విమానాశ్రయం అంతా ఇసుక వేస్తే రాలనంత జనం. ఆమె ప్రపంచసుందరి కిరీటాన్ని కైవశం చేసుకుని తిరిగివచ్చినప్పుడు కూడా ఇంత సందడి లేదు.

విలేఖరులు, అభిమానులు, తల్లిదండ్రులు అందరూ ఒకేసారి చుట్టుముట్టారు.

కెమేరా ఫ్లాష్‌లు టపటపా వెలిగాయి.

టి.వి.ల వాళ్ళు లైవ్ టెలీకాస్ట్ చేస్తున్నారు.

అందరికీ తనమీద కురిపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేసింది.

విలేఖరులు ప్రశ్నలవర్షం కురిపించసాగారు.

"మేడం! క్రూయిజర్‌లో ఏం జరిగింది?"

"లైఫ్‌బోట్‌లోకి ఎలా వెళ్ళారు?"

"మీకు సహాయం అందుతుందన్న ధైర్యం అప్పుడుందా?"

"మొదటిసారి హెలీకాప్టర్ గాలింపుకొచ్చినప్పుడు అదే ప్రదేశంలో ఎవరూ కన్పించలేదేం?"

అన్ని ప్రశ్నలకీ తగు విధంగా ఆమె సమాధానాలిస్తూ వచ్చింది.

"మిమ్మల్ని రక్షించిన త్రినాధ్ ఎక్కడ?" అని ఓ విలేఖరి అడగ్గానే ఆమె మనసు సిగ్గుపడింది.

అతనిని తనతోపాటే హెలీకాప్టర్‌లో తీసుకొచ్చుండాల్సింది. సల్మాన్ తనకు ఏమీ తోచకుండా ఉక్కిరిబిక్కిరి చేశాడు.

విలేఖరి మళ్ళీ రెట్టించగానే తన భావాలను అణిచిపెట్టుకుంటూ.

"వెనుక షిప్‌లో వస్తున్నాడు" ముక్తసరిగా చెప్పిందామె.

ఆమె కోసం ఎయిర్‌పోర్ట్‌లోనే విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.

హెలీకాప్టర్‌లో వస్తున్నప్పుడే సల్మాన్‌ఖాన్ దేశవిదేశాల వాసులు తనకోసం పడిన ఆరాటం తెలియజేశాడు.

వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రమాదంలో తానెదుర్కొన్న అవాస్తవాలను టూకీగా చెప్పింది.

దేశ విదేశాల్లోని అభిమానులు తనకోసం చేసిన ప్రార్ధనంతా తనను క్షేమంగా ఇక్కడకు చేర్చాయని చెప్తుంటే, కళ్ళముందు త్రినాధ్ మెదిలాడు.

తనెంత హిపోక్రెటిక్‌గా మాట్లాడిందో అర్ధమైంది. ప్రస్తుతంగా మనసు ప్రశాంతతను కోరుతోంది. అది గమనించి తల్లిదండ్రులు త్వరగా ఆ సమావేశాన్ని ముగించారు.

ఇంటికి వచ్చి ఫ్రెష్ అయి భోజనంచేసి అతి విలాసవంతమైన తన బెడ్‌రూమ్‌లోని మంచంమీద పడుకోగానే జరిగినదంతా ఓ కలలా అన్పించింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఆ తర్వాత రెండోరోజు ఉదయానికే ముంబాయి షిప్పింగ్ హార్బర్‌లో ఆగింది నౌక.

అందరి బంధువులూ అప్పటికే అక్కడికి చేరి ఒక్కొక్కరూ దిగగానే గట్టిగా కౌగిలించుకుని ఆనందభాష్పాలు రాలుస్తున్నారు.

అందరూ దిగాక ఆఖరున దిగాడు త్రినాధ్. వీరయ్యచౌదరి, సారధి, త్రినాధ్‌ని గట్టిగా కౌగిలించుకుని బయటకు తీసుకువచ్చారు.

త్రినాధ్ వచ్చేది ఇందులోనే అని తెలిసి విలేఖరులు కూడా అతన్ని చుట్టుముట్టారు.

తనొక్కడినే ప్రశ్నిస్తుంటే తమ బేచ్‌నంతటినీ అడగమన్నాడు.

"ఇందులో ప్రతి ఒక్కరూ ఏదొక సాహసంచేసి వచ్చినవాళ్ళే. మేమందరం అక్కడ కలిసిమెలిసి ఒకే మాటమీద నిలబడ్డాం కష్టంలోనూ, సుఖంలోనూ, అందులో ఈ రోజు ప్రాణాలతో బయటపడ్డాం.

ఇందులో నా క్రెడిట్ ఏమీలేదు మా అందరిదీ. ఇకనుంచి జీవితాంతం మేమంతా కుటుంబసభ్యుల్లా మెలుగుతాము."

ప్రభాకర్, నవదీప్‌సింగ్ భుజాలచుట్టూ చేతులు వేసి అన్నాడు త్రినాథ్.

"మరి ఐశ్వర్యాజీ కూడానా?" ఓ విలేఖరి అన్నాడు.

టీ.వీ. లైవ్ ప్రోగ్రాంని చూస్తున్న ఐశ్వర్య ఆశ్చర్యంగా త్రినాథ్‌వైపు చూస్తోంది.

త్రినాథ్ సూటిగా కెమేరావైపు చూశాడు. ఆ చూపు ఐశ్వర్య గుండెల్లో గుచ్చుకుపోయింది.

"ఆ మాట ఆమెనే అడగండి" అన్నాడు త్రినాథ్.

"మీరు ఐశ్వర్యారాయ్ నుంచి ఏమయినా సహాయం ఆశిస్తున్నారా? అందుకే ప్రాణాలకు తెగించి ఆమెను కాపాడారా?" ఓ విలేఖరి కూపీ లాగుతున్నట్లు అడిగాడు.

కోపం ముంచుకొచ్చింది త్రినాథ్‌కి.

అది మనసులోనే అణుచుకుంటూ, చిరునవ్వుతో విలేఖరిని చిన్న స్వరంతో....

"మీ సంవత్సర ఆదాయం ఎంత?" అడిగాడు త్రినాథ్.

సందర్భంలేని ప్రశ్నకు బిత్తరపోయాడు. విలేఖరి "ఎందుకూ...." అన్నాడు.

"చెప్పండి" అన్నాడు త్రినాథ్.

"లక్షన్నర...." చెప్పాడు విలేఖరి బింకంగా.

"సో... మీ లక్షన్నరలో మీరు ఇతరులకు సాయం చేసేంతగా ఏమీ వుండదు. మనం ఇద్దరం ఓ క్రూయిజర్ పట్టుకుని సముద్రంలోకి వెళదాం. అక్కడ తుఫాను వచ్చేవరకూ ఆగుదాం. నేను మిమ్మల్ని రక్షిస్తానో లేదో చుద్దురుగాని" అన్నాడు.

ఆ సెటైర్‌కి అందరూ నవ్వగా, తన ప్రశ్నలోని అసంబద్ధతను గుర్తించి ఆ విలేఖరి కూడా నవ్వేశాడు.

టి.వి. చూస్తున్న ఐశ్వర్య కూడా పడీపడీ నవ్వుతూ "అమ్మో... చాలా గట్టివాడే...." అనుకుంది.

ఆ సీన్ చూస్తున్న వాసంతి ఓ విజిల్ వేసి టి.వి. స్క్రీన్‌మీద కనిపిస్తున్న త్రినాథ్‌ని ముద్దుపెట్టుకుంది.

అంరూ కలిసి పూసగుచ్చినట్లుగా తాము క్రూయిజర్ ఎక్కిన దగ్గర్నుంచీ ఇప్పటివరకూ జరిగిన సంఘటనల్ని వివరించారు.

కొడుకు కోసం షిప్‌లోకి వెళ్ళి మరీ తిరిగివచ్చిన లోకేష్ తల్లి దండ్రులను చూడగానే అదరి హృదయాలూ భారంగా మారాయి.

లోకేష్ తల్లిదండ్రుల ఏడుపు హృదయవిదారకంగా విన్పించిది. తామూవారి బిడ్డలమేనంటూ అందరూ వెళ్ళి ఓదార్చారు.

చూస్తున్న ఐశ్వర్యకు అన్పించింది తాను ఆ పని ఎందుకు చేయలేదా అని. వెంటనే అసిస్టెంట్స్‌ని పిలిచి లోకేష్ పేరెంట్స్ అడ్రస్ తీసుకోమని చెప్పింది.

హడావిడంతా ముగిసాక ఎవరికివారు వీడ్కోలు చెప్పుకున్నారు. ఆంధ్రాకు వెళ్ళేవారు ఆ రోజు మధ్యాహ్నమే ట్రైన్‌లో బయలుదేరారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ మీదకి ట్రైన్ వచ్చి ఆగుతుండగా కిటికీలోంచి చూశాడు త్రినాథ్.

"ఎవరో వి.ఐ.పి. వస్తున్నాడు కాబోలు" సుబ్బూతో జనాతికంగా అన్నాడు. ముసిముసిగా నవ్వారు వాళ్ళు.

క్రిందికి దిగేవరకు తెలియలేదు ఆ వి.ఐ.పి. తానేని. అందరూ పూలదండలతో త్రినాథ్‌ని చుట్టుముట్టారు. అందర్నీ తోసుకుంటూ ఓ గులాబీ దండతో ముందుకొచ్చింది వాసంతి.

అతని మెడలో వరమాల వేస్తున్నంత ఆనందంగా దండ వెయ్యబోతోంటే ప్రక్కనున్న ఆడవాళ్ళు వారించి చేతికిప్పించారు.

అతని చేతి పక్కనే అసిస్టెంట్‌లా నుంచుని అతని పూలదండలూ, బొకేలూ అతను పట్టుకోవడానికి ఇబ్బందిగా వుంటే, తనే తీసి పట్టుకుంటూ అతని పక్కనే నడవసాగింది.

హఠాత్తుగా తనేదో రాజకీయనాయకుడిలా మారిపోయినట్లనిపించింది త్రినాథ్‌కి.

"మన తెలుగువాడి పౌరుషం ఓ ఆడకూతుర్ని రక్షించింది...." ఓ ముసలాయన అన్నాడు.

"మన గుంటూరు మిరపకాయ పవర్ ఆలోవర్ ఇండియా తెలిసిపోయింది" సుబ్బూ ఫ్రెండ్ అన్నాడు.

"ఆలోవర్ ఇండియా కాదెహె, అక్కడెక్కడో సముద్రంలో కూడా తెలిసిపోయింది" అన్నాడు సుబ్బు.

అందరూ పగలబడి నవ్వారు.

కొంతమంది ఆడవారు అతనికి వీరతిలకం దిద్దారు. యువకులు అతన్ని రెండు చేతులమీదా ఎత్తుకుని డాన్స్‌చేస్తూ స్టేషన్‌నుంచి బయటకు తీసుకొచ్చారు.

అక్కడ జీపులూ, మోటార్‌సైకిళ్ళూ, స్కూటర్స్, ఎడ్ల బళ్లూ బారులుతీరి కన్పించాయి. ఆ హంగామా అంతటినీ చూసి ఆశ్చర్యపోయాడు త్రినాథ్.

"మందే... ఎరేంజ్‌మెంట్ బాగుందా?" సుబ్బూ అడిగాడు.

ఏం మాట్లాడలేక సుబ్బూ భుజంచుట్టూ చెయ్యివేసి తట్టాడు త్రినాథ్. అంతా కలిసి వాహనాలెక్కి ప్రయాణం సాగించారు.

మధ్యలో వున్న జీప్ టాప్‌మీద ప్రత్యేకంగా అంకరణ చేశారు. సుబ్బూ, వాసంతి, త్రినాథ్, మరో నలుగురయిదుగురు ఎక్కారు. ఆమె పడిపోతుందేమోనన్న భయంలో ఆమె నడుంచుట్టూ చేయేసి పట్టుకున్నాడు త్రినాథ్.

అతనికీ అలవాటు క్రూయిజర్‌లో అనుభవమైంది. కౌగిలించుకుని శుభాకాంక్షలు చెప్పుకోవడం, బాధలో వున్నప్పుడు భుజాలచుట్టూ చేతులు వేసి ఓదార్చటం... ఎక్కడివయినా వెళ్ళేటపుడు నడుం చుట్టూ చేయివేయటం, చేతులు, చేతులూ కలుపుకోవడం ఆ సంస్కృతిలో అలవాటు.

అందులో చెడు భావాలేవీ వుండవు. అలవాటు ప్రకారం అలా చేసే సరికి వాసంతి ఊహలు ఆకాశం అంచుకు చేరాయి. మెడలో దండతో, నుదుట బొట్టుతో అతను తనను పట్టుకుని కూర్చుంటే అది తనకు ఓ పెళ్ళి మంటపంలా అన్పిస్తోంది వాసంతికి. తలత్రిప్పి అతనివంకే చూడసాగింది.

త్రినాథ్ మాత్రం రోడ్డు కిటూ అటూ బారులుతీరి వున్న తమ పల్లెప్రజలకి అభివాదం చేస్తున్నాడు.. మధ్యలో ఎందుకో తలత్రిప్పి చూసే సరికి తనవంకే... చూస్తున్న వాసంతి కన్పించింది.

"ఏంటన్నట్లు...." కళ్ళెగరేశాడు.

"ఏంలేదు...." సిగ్గుపడుతూ అంది.

"ఇంత అనర్ధానికి నువ్వే కారణం...." మెల్లగా ఆమెతో అన్నాడు.

"నీది మరీ చోద్యం బావా? హాయిగా జీపులో ఊరేగడం అనర్ధమా?"

చేత్తో అతని బుగ్గల్లో పొడుస్తూ సాగదీసింది వాసంతి.

ఆమె కొత్త పిలుపుకి భుజాలెగరేసి ఆశ్చర్యంగా చూశాడు. ఊరేగింపు అతని ఇంటికి చేరుకుంది దిగగానే తల్లి కాళ్ళకి నమస్కరించాడు.

అతను మంబయిలో వుండగానే భారతి పెళ్ళి విషయం తెలిసింది. చెల్లి దగ్గరకి రాగానే కళ్ళతోనే ధైర్యం చెప్పాడు. ఆ రోజు ఊరంతా పండగ వాతావరణం నెలకొంది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

నాలుగురోజుల్లో జరిగిన ప్రమాదం నుంచీ, దాని తీవ్రత నుంచీ కోలుకుంది ఐశ్వర్య. ఆమె హడావిడిగా షూటింగ్స్‌లో పాల్గొనడం మొదలుపెట్టింది.

ఆ ప్రమాదంలో ఆమె కనబడర్చిన నిబ్బరం, ఆ ప్రమాదం జరిగిన తీరు, బాలీవుడ్ దర్శకులకి ఓ మంచి కథను ఇచ్చాయి. ఆమె జీవితంలో జరిగిన ఈ యదార్ధగాథను సినిమాగా తీయడానికి సన్నాహాలు ప్రారంభమౌతున్నాయి.

పలు అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు వ్యాపార ప్రయోజనాల కోసం ఈ సంఘటనను ఉపయోగించుకొని తమ ఉత్పత్తులకు ఆమె ఎంబాసిడర్‌గా కోట్లాది రూపాయల పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నిటితో ఐశ్వర్య క్షణం తీరికలేనట్లుగా తయారయింది.

ఆమె సల్మాన్‌ని కలుసుకునే సమయం కూడా వుండటంలేదు. షూటింగ్‌లో వున్నప్పుడు కూడా ఐశ్వర్య తన షాట్స్‌ను త్వరగా ముగించుకొని వెళ్ళిపోతోంది.

ఇది సల్మాన్‌కి చాలా కినుకుగా వుంది. కాని ఆమె పరిస్థితి అలాంటిది. ఇప్పుడతను బాహాటంగానే ఐశ్వర్య ఇంటికి రాకపోకలు సాగిస్తున్నాడు. ఆమె పేరెంట్స్ కూడా అతన్ని ఫామిలీ ఫ్రెండ్‌గా అంగీకరించారు.

విచిత్రం ఏంటంటే – అతను ఇంటికి వస్తున్నా ఆమె ఇంట్లో వుండే సమయం కూడా బాగా తగ్గిపోయింది. సల్మాన్‌లో ఏదో అనుమానం పొడచూపింది.

ఆమె తనని ఎవాయిడ్ చేస్తుందేమోనని, ఆమె మరింత ఎత్తుకు ఎదిగిపోయి తనకందదేమోనని కొత్తగా భయం పట్టుకుంది. కానీ అదేదీ పైకి ఎక్స్‌ప్రెస్ చేయలేదతను. ఐశ్వర్యతో మామూలుగానే వుంటున్నాడు.

ఆ రోజు రాత్రి 9 గంటలకి హోటల్‌లో ఇద్దరూ కలిసి డిన్నర్ చేయాలని నిశ్చయించుకున్నారు. తొమ్మిదయింది, పదయింది. ఆమె రాలేదు. సల్మాన్‌కి కోపం ముంచుకొచ్చింది. ఆమె సెక్రటరీకి ఫోన్ చేశాడు. ఐశ్వర్య ఇంకా యాడ్ ఫిలిమ్ షూటింగ్‌లోనే వుందని చెప్పాడు.

విసురుగా కారెసుకుని ఆ లొకేషన్‌కి బయలుదేరాడు సల్మాన్. అతను వెళ్ళేసరికి కెమేరా రన్ అవుతోంది. ఐశ్వర్య షాట్‌లో వుంది.

లిప్‌స్టిక్ యాడ్ అది. లిప్‌స్టిక్ వేసుకున్న పెదవులు సంచలిస్తుండగా ప్రియునికోసం ఎదురుచూడాలి.

అతనొచ్చి మైమరిచిపోయి చూడ్డాన్ని చిత్రీకరించాలి. ఎవరి పనిలో వాళ్ళు నిమగ్నమై వుండగా ఫ్రేమ్‌లొకి వచ్చేశాడు సల్మాన్. కెమేరా రన్ అవుతూనే వుంది. రావలసిన ప్రియుడు జుత్తు పీక్కుంటూ నిల్చున్నాడు.

సల్మాన్ ఆమె నడుం చుట్టూ చేతులు చుట్టి కెమెరాకి ఓ రోమాంటిక్‌గా లుక్‌నిస్తూ ఆమె లిప్‌స్టిక్ పెదవులపై ఓ అందమైన ముద్రవేశాడు.

కెమేరామేన్ తన్మయత్వంలో ఆ షాట్‌ని చిత్రీకరించాడు.

దర్శకుడు అసహనంగా కట్ చెప్పాడు. కానీ సెట్లో అందరూ ఆ సీన్ అంత బాగా వచ్చినందుకు ఆనందంతో చప్పట్లు కొట్టారు.

ఐశ్వర్యారాయ్‌కి నవ్వు, కోపం రెండూ వచ్చాయి.

"వాటీజ్‌దిస్?" చిరుకోపంగా అడిగింది ఐశ్వర్య.

"నాతో పద చెబుతాను" అన్నాడు సల్మాన్.

ఇద్దరూ కలిసి బయటకి వెళుతుంటే యూనిట్‌లో అందరూ నవ్వుతూ చూశారు.

డైరెక్టర్ మాత్రం ప్రొడ్యూసర్‌కి ఏం సమాధానం చెప్పాలో తెలియక బిక్కమొహం వేశాడు.

అప్పటికి సమయం రాత్రి 11 గంటలయింది.

సల్మాన్ కారు డ్రైవ్ చేస్తుంటే పక్కనే కూర్చుంది ఐశ్వర్య. కోప్పడాలో, నవ్వుకోవాలా తెలియనట్లుగా వుంది ఐశ్వర్యకి.

"ఇలా మధ్యలో తీసుకొస్తే వాళ్ళేమనుకుంటారు...." ప్రసన్నంగానే అడిగింది.

"ఆ పరిస్థితి తెచ్చింది నువ్వు" అన్నాడు సల్మాన్.

"నేనేం చేయను" అడిగింది ఐశ్వర్య.

"మనం అనుకున్న ప్రకారం కలిస్తే ఈ సమస్య వుండేది కాదు కదా?" అన్నాడు.

"నేను చాలా ప్రయత్నించాను. కానీ త్వరగా అయిపోవల్సిన యాడ్ అది. గంటకి ఐదు లక్షలరూపాలు లాస్" చెప్పిందామె.

"గో టూ హెల్...." సీరియస్‌గా చెప్పాడు సల్మాన్.

బాధనిపించి మౌనంగా వుండిపోయింది ఐశ్వర్య.

తన తప్పు తెలుసుకుని ఆమె భుజాలచుట్టూ చేయివేసి తట్టాడు.

విండోలోంచి చూస్తూ కూర్చుంది. హోటల్ దగ్గరిపడింది.

ఇద్దరూ లోపలికెళ్ళారు. ముంబాయిలో బాగా కాస్ట్‌లీ హోటల్ అది సినిమా తారలూ, బడా వ్యాపారులు అందులో దిగుతుంటారు.

సల్మాన్, ఐశ్వర్య వెళ్ళగానే స్టీవార్డ్ వచ్చి సెల్యూట్ చేశాడు. మెనూ ఆర్డర్ చేశారిద్దరూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూన్న వీళ్ళిద్దర్నీ కార్నర్ టేబుల్ దగ్గర వున్న నాలుగు జతల కళ్ళు పరిశీలించసాగాయి. ఆ కళ్ళలో అణచి పెట్టుకున్న క్రౌర్యం... దాచిన దాగని క్రూరత్వం బైట పెడుతూనే వున్నాయి.

నలుగురూ ఒకరితో ఒకరు గుసగుసలాడుకుంటూనే వునానరు. వాళ్ళ చేతుల్లోని సెల్‌ఫోన్‌లు నిర్విరామంగా పనిచేశాయి.

ఒంటిగంటకల్లా డిన్నర్ ముగించారు.

అలసి సొలసిన మనశ్శరీరాలతో ఇంటికి చేరుకుంది ఐశ్వర్య.

❋ ❋ ❋ ❋ ❋ ❋

వారం రోజుల వరకూ ప్రతిరోజూ సాయంత్రం త్రినాధ్ ఇంటివద్ద సందడిగానే వుంది. ప్రతిరోజూ అందరూ వచ్చి, క్రూయిజర్ ప్రమాదం గురించి, ఐశ్వర్యారాయ్ గురించి, సల్మాన్‌ఖాన్ గురించి అన్ని వివరాలు అడిగారు. ఆ అదృష్టం ఈ ప్రమాదం పుణ్యమా అని భావించే వారు.

ఆమె నిరుపమానమైన సౌందర్యం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. ఫోటోలోనే ఇంత అందంగా వుంటే, నిజజీవితంలో ఇంకెంత అందంగా వుంటుందో అని భావించేవారు.

రోజూ ఉదయాన్నే వీళ్ళనుంచి తప్పించుకోవడానికి పొలానికి వెళ్ళడం, సాయంత్రానికి తిరిగిరావడం, సాయంత్రం ఐశ్వర్య పురాణకాలక్షేపం.

తనెంత మర్చిపోదామన్నా వీళ్ళు మరువనివ్వడంలేదు. పొలాల గట్టపై ఒంటరిగా కూర్చుంటే ఆమె ముగ్ధమనోహర సౌందర్యం తనకు సన్నిహితమవడం గుర్తొచ్చేది.

ఆమె ఆలోచనలు తనను బంధించినంతగా, తన ఆలోచనలు ఆమెను బంధించవు. ఆమె నటనా జీవితంలో తనలాంటి వాళ్ళని ఎంతమందినో చూసుండవచ్చు.

కానీ తనకు నిశ్చయంగా తెలుసు. ఆ సాటిలేని మేటి సొగసులను తనే ముందు సొంతం చేసుకున్నాడని. సినిమాతారలు అందరూ నైతిక విలువల్ని పాటించరన్న మాట అబద్ధమని ఆమె చెప్పింది.

సల్మాన్‌తో ఎఫైర్ మానసికమైంది కావచ్చు. కానీ ఓ అపురూపమైన అనుభవం కోసం తననే ఎంచుకుంది. కానీ ఈ నాగరికత జీవితంలోకి వచ్చిపడ్డాకా... తనెవరో? ఆమె ఎవరో?

ఈ బాధల్ని భరించడం, మర్చిపోవడం రెండూ కష్టమే. బాధ్యత తెలిసిన వాడిగా తనకిది తప్పదు. నిట్టూర్చి మళ్ళీ పనుల్లో పడ్డాడు త్రినాథ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

సమయం ఉదయం 7 గం.లు. రాత్రి నిద్ర సరిగా లేకపోవడం మూలంగా వళ్ళంతా బద్ధకంగా వుంది ఐశ్వర్యకి. మరికొద్ది సేపు పడుకోవాలనిపిస్తుంది. కానీ, 9 గంటలకే షూటింగ్ కార్యక్రమాలు గుర్తొచ్చి బలవంతాన నిద్రలేచింది. బాత్రూమ్‌కి వెళ్ళబోతుంటే ఆమె పర్సనల్ సెల్ రింగయింది.

"హలో...." అటువైపు నుంచి ఓ అపరిచితమైన గొంతు వినబడుతోంది.

"హలో...." నొసలు ముడివేస్తూ పలికింది ఐశ్వర్య.

"హలో! ఐశ్వర్యారాయేనా మాట్లాడేది?" అటువైపునుంచి వచ్చిన కంఠంలో ఒక విధమైన పదును తొంగిచూసింది.

"ఎస్... స్పీకింగ్...." పలికింది ఐశ్వర్య.

అటువైపు నుంచి వచ్చిన మాటల్ని వింటున్న కొద్దీ ఆమె మొహం ఎరుపెక్కిపోయింది.

అంతావిని, "మీ ఇష్టం. ఏం చేస్తారో చేసుకోండి...." అంటూ ఫోన్ పెట్టేసింది.

ఆమెకిలాంటి కాల్స్ అప్పుడప్పుడూ రావడం సాధారణమే కానీ, తన పర్సనల్ నెంబర్ తన కుటుంబ సభ్యులకుకాక ముగ్గురికే తెలుసు. తన సెక్రటరీకి, రమేష్ పవార్‌కి, సల్మాన్‌ఖాన్‌కి, ఆమె ఏదో ఆలోచిస్తూ బాత్రూంలోకి వెళ్ళింది. గంటలో ఫ్రెషయి క్రిందికి వచ్చింది. హాల్లో డైనింగ్‌టేబుల్‌పై కుక్ అన్నీ అమర్చిపెడ్డాడు. ఆమె అన్యమనస్కంగా వుండడం చూసి ఆమె తల్లి....

"వాట్ హేపెండ్ ఐష్?" అనిఅడిగింది.

తనకొచ్చిన కాల్ గురించి చెప్పాలా వద్దా? అనుకుంటూ మళ్ళీ చిన్న విషయానికి ఇబ్బంది పెట్టటం ఎందుకుని ఊరుకుంది.

వాళ్ళు టిఫిన్ చేస్తుండగానే ఆమె మేనేజర్ వచ్చి ప్రక్కన నుంచున్నాడు.

ఏంటన్నట్లు చూసింది ఐశ్వర్య.

"లోకేష్ కుటుంబానికి మీరిచ్చిన టెన్‌లాక్స్ చెక్ బౌన్స్ అయిపోయింది మేడమ్....." అన్నాడు.

ఐశ్వర్య అవమానంతో కృంగిపోయింది. తండ్రివైపు చూసింది.

ఆయన తత్తరపడ్డాడు.

"కొన్ని ప్రాబ్లమ్స్‌చేత ఎకౌంట్స్‌లోని క్యాష్‌తీసి వేరేచోట ఇన్‌వెస్ట్ చేయాల్సి వచ్చింది. అయినా తెలియని వాళ్ళకోసం అంతడబ్బు...." తండ్రి అంటుంటే ఆమె నిలబడింది.

ఐశ్వర్య ప్రశాంతంగా నిలబడి "అతను చేసిన త్యాగం మీకర్థం కాదు. అందరి ప్రాణాలకోసం అతని ప్రాణాలను త్యాగం చేశాడు. అతడు సామాన్యుడు కాబట్టి, అతని ప్రాణం తెలియదు. నాకు నా ప్రాణం విలువ తెలుసు కాబట్టి, అతని త్యాగం విలువా నాకు తెలుసు. అందుకే నేను సాయం చేయాలనుకున్నాను" చెప్పింది.

"కానీ ఇంత పెద్ద ఎమౌంట్స్...." తండ్రి మాటల్ని మధ్యలోనే వారించి....

"డబ్బు విషయంలో మీరేమీ బాధపడవద్దు. నేను సంపాదిస్తున్నాను, ఖర్చుపెట్టుకుంటున్నాను...." సూటిగా చెప్పి విసవిసా వెళ్ళిపోయింది.

తల్లిదండ్రులు అవాక్కయి చూస్తూండిపోయారు.

ఐశ్వర్యకు ఉక్రోషం ముంచుకొచ్చింది. వాళ్ళు తననెందుకు అర్థం చేసుకోలేక పోతున్నారు?

ఆమె కారు రివ్వున దూసుకుపోతోంది. ఆమె సెల్ మళ్ళీ రింగయ్యింది.

అటువైపు నుంచి వస్తున్న మాటలువిని ఆమె మొహం పాలిపోయింది. ఏమీ ఆలోచించకుండా సెల్ ఆఫ్‌చేసి కళ్ళు మూసుకొని సీట్లో వెనక్కివాలి కూర్చుంది.

డ్రైవర్ ఆమెవంక జాలిగా చూశాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

త్రినాధ్ పొలంలో వుండగానే ఇంటికి చుట్టాలొచ్చారు, రమ్మంటూ కబురొచ్చింది.

వెళ్ళచ్చులే అనుకుంటూ ఓ అరగంట గడిపేసేశాడు. ఇంటికివెళితే చాలు ఎవరో ఒకరు ప్రత్యక్షమై ఏదో కబుర్లు అడుగుతారు.

ఐశ్వర్యారాయ్ ఏం మాట్లాడింది? ఎట్లా మాట్లాడింది? క్రూయిజర్‌లో టాయ్‌లెట్స్ వుంటాయా? సముద్రం లోపల అలలుంటాయా? లాంటి అతితెలివైన ప్రశ్నలడుగుతూ ఇబ్బంది పెడుతున్నారు.

అందుకే ఇంటికి వెళ్ళాలంటే భయం వేస్తోంది. వెళ్ళకుండా ధీమాగా కూర్చొనేసరికి, ఇంకో అరగంటకి ఇంకో పిల్లోడు పరిగెత్తుకుంటూ వచ్చి "అర్జెంట్ చుట్టాలు వచ్చారని, త్వరగా నిన్ను రమ్మన్నారు...." అని చెప్పి ఇంకేం మాటా వినిపించుకోకుండా పారిపోయాడు.

"ఎవరా అర్జెంట్ చుట్టాలు?" అనుకుంటూ పోయాడు.

తీరా ఇంటికి వెళ్ళిచూస్తే వీరయ్య చౌదరి కూతురూ, కొడుకూ, ఇంకా నలుగురయిదుగురు చుట్టాలతో దిగాడు.

"ఏంటోయ్ అల్లుడూ! బాగున్నావా?" పలకరించాడు.

అప్పటివరకూ సావిత్రమ్మ ప్రక్కన కూర్చున్నదల్లా వాసంతి లేచి, తలుపు చాటున నుంచున్న భారతి పక్కన దాక్కుంది. త్రినాధ్‌కి కూడా వీరయ్యచౌదరిని చూసేసరికి సంతోషం కలిగింది.

అందర్నీ ఆప్యాయంగా పలుకరించాడు. కుశల ప్రశ్నలయ్యాక వాళ్ళు కూడా ఐశ్వర్యారాయ్ గురించి ఏమైనా అడుగుతారేమోనని భయ పడ్డాడు.

కానీ దేవుడి దయవల్ల అదేమీ లేకుండా వాళ్ళు వేరే కబుర్లలోకి దిగారు. సావిత్రమ్మ ముఖం ఆనందంతో కళకళలాడుతోంది.

భారతి కూడా సిగ్గుపూల చిరునవ్వుల్ని విరజిమ్ముతోంది.

వీరయ్య తాలూకు చుట్టాలతో ఒకాయన మాటల మధ్యలో తామొచ్చిన విషయం బయటపెట్టాడు.

"ఇంక దాపరికం ఎందుకబ్బాయ్.... నీ చెల్లెలు భారతిని వీరయ్యన్నయ్య తన కొడుక్కి చేసుకుంటాడట...." అనగానే త్రినాధ్ ముఖం సంతోషంతో విప్పారింది.

అబ్బాయి బుద్ధిమంతుడూ, ప్రయోజకుడూ. వీరయ్యమామ కుటుంబంలోకి ఆడపిల్లను పంపే అదృష్టం తనకొచ్చిందంటే నమ్మలేకపో తున్నాడు.

ఏం మాట్లాడాలో తోచనట్లు "ఇది మామ గొప్పమనసు..." మనస్ఫూర్తిగా అన్నాడు.

"అలాగే! నువ్వు గొప్పమనసు చేసుకోవాలయ్యా...." అతను ఛలోక్తిగా అన్నాడు.

వాసంతి బుగ్గలు ఎరుపెక్కాయి.

త్రినాధ్‌లో ఏదో అనుమానం పొడచూపింది.

తలెత్తి వారివంక ఆతృతగా చూశాడు.

"వారమ్మాయి వాసంతిని నువ్వు వివాహం చేసుకోవాలని వారి కోరిక...." చెప్పాడాయన.

అందరి మోహాలూ వికసించాయి. త్రినాధ్ ఏదో ఆలోచనలో పడిపోయాడు. అతనేమీ మాట్లాడలేకపోవడం చూసి సిగ్గుపడుతున్నా డనుకున్నారందరూ.

త్రినాధ్ తలెత్తి వాసంతివంక చూశాడు. ఆమె చూపులు కలపలేనట్లు కళ్ళు వాల్చుకుంది. ఆ తరువాత మెల్లని స్వరంతో అన్నాడు త్రినాధ్.

"నా పెళ్లి విషయంలో నేనాలోచించుకోవడానికి కొంత సమయం ఇవ్వు మామా" సూటిగా అడిగేశాడు.

అందరూ నిశ్చేష్టులై వుండిపోయారు. ముందుగా తేరుకున్నది వీరయ్యే. వెంటనే నవ్వేస్తూ-

"దాందేముందల్లుడూ, అలాగే కానీ. ఆ పెళ్ళికీ ఈ పెళ్ళికీ ముడి పెట్టానని నువ్వనుకోవద్దు. నువ్వు వాసంతిని చేసుకున్నా లేకపోయినా, భారతి నా యింటి కోడలవుతుంది" చెప్పాడాయన.

వాసంతి మొహం చిన్నబోయింది. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లగా లోపలికి వెళ్ళిపోయింది.

సావిత్రమ్మ కొడుకును మందలిస్తూ...

"ఇంతకన్నా మంచి అమ్మాయిని నువ్వు ఎంత ప్రయత్నించినా పెళ్ళాంగా తెచ్చుకోలేవురా" అంది.

"ఐశ్వర్యారాయ్ ఏమన్నా పెళ్ళి చేస్కుంటానందేమో అడగండి" లోపలినుంచి వాసంతి ఉక్రోషంగా అంది.

అందరూ గలగలా నవ్వారు. త్రినాధ్‌కి కూడా నవ్వొచ్చింది. అతని మొహంలో వచ్చిన నవ్వుని చూచి అందరి హృదయాలూ తేలికయ్యాయి.

అందరూ ఆ ప్రక్కనే వున్న సావిత్రమ్మ బంధువుల ఇంట్లో భోజనాలు చేశారు. చల్లబడ్డాక టౌన్‌కి తిరుగు ప్రాయాణమై వెళ్ళారు.

వెళ్ళేప్పుడు తనవంక దిగులుగా చూసిన వాసంతిని తలచుకొంటుంటే మనసంతా బాధగా మారిపోయింది త్రినాధ్‌కి. ఆమెను తిరస్కరించ టానికి ఏ కారణం కన్పించటంలేదు.

సాయంత్రం వరకూ అలా ఆలోచిస్తూ గడిపి రాత్రికి అతను ఊళ్ళో వున్న ఎస్.టి.డి. బూత్‌కి వెళ్ళి ముందుగా ప్రభాకర్, కవితలను ఈ సంబంధం విషయంలో సలహాను అడిగాడు. ఇంత మంచి సంబంధం అయినప్పుడు ఒప్పుకోవడమే మంచిదని వాళ్ళు సలహా యిచ్చారు.

పెళ్ళికి రెండురోజులు ముందుగానే వస్తామని వాళ్ళు వాగ్దానం కూడా చేసేశారు.

తరువాత నవదీప్‌సింగ్‌కి చేశాడు. ఆయన కూడా ఆమోదాన్ని తెలిపాడు. మన్‌ప్రీత్‌కౌర్ మాత్రం ఐశ్వర్యని అడిగావా? అతని మనస్సు నర్థంచేసుకున్నట్లు అడిగింది. ఇటువైపునుంచి మౌనమే సమాధానమయింది.

ఆమె అర్థం చేసుకున్నట్లుగా "గాడ్ బ్లెస్‌యూ చైల్డ్" అని పలికింది. తరువాత తమ బ్యాచ్‌లోని మిగతా వాళ్ళకి కూడా ఫోన్లు చేశాడు. అందరూ సంతోషించి ఆ సంబంధాన్ని ఒప్పుకోమని చెప్పారు.

ఇంక మిగిలింది ఐశ్వర్య ఆమెకు చెయ్యాలనీ, వద్దనీ... రెండు విధాలుగా మనస్సు నలిగిపోతోంది. ఎప్పటికయినా, ఎలాగయినా ఆమెకీ విషయం తెలియాలికదా. ఫోన్ చేశాడు.

ఐశ్వర్య ఫాన్స్‌కోసం కేటాయించిన నెంబరది. అది ఆ బేచ్‌లోని అందరికీ ఇచ్చింది. గంటా రెండు గంటలు ట్రైచేశాడు. అది రింగవుతుంది గానీ ఎవరూ ఎత్తట్లేదు. చివరికి రాత్రి 9 గంటలకు ఫోన్ చేసారెవరో.

"ఐశ్వర్యా మేడం వున్నారా?" అని అడిగాడు.

"మీరెవరు?" అని అడిగారు.

"నా పేరు త్రినాధ్" అన్నాడు.

అటువైపు అమ్మాయి లేరని చెప్పబోయిందల్లా ఆ పేరు విని ఒక్కక్షణం ఆలోచించి....

ఇతను మేడంను సేవ్ చేసిన అతనని గుర్తొచ్చి, ఒక్క క్షణం వుండమని మొబైల్‌ను ఐశ్వర్యకివ్వడానికి వెళ్ళిందామె.

అప్పుడే డిన్నర్ ముగించుకుని తన రూమ్‌కి వచ్చింది ఐశ్వర్య. మనసంతా చాలా వేపరింగ్‌గా వుంది. తనకోసం ఎవరూ లేనట్లుగా, అందరూ తనను తన కీర్తిప్రతిష్టలకోసం, సంపాదనకోసం గౌరవిస్తున్నట్లుగా బాధతో, వేదనతో హృదయం కలతతో వుంది.

ఆ సమయంలో అసిస్టెంట్ ఫోన్ తెచ్చిచ్చింది.

"ఎవరు? ఇప్పుడు నాకు ఓపికలేదు" విసుగ్గా అంది ఐశ్వర్య. ఆ మాటలు విన్పించాయి త్రినాధ్‌కి.

"ఎవరో... త్రినాధ్ అంట మేడం" అసిస్టెంట్ అంది.

ఆ మటలు వినగానే నిటారుగా లేచి కూర్చుంది. తియ్యని జ్ఞాపకాలేవో మనస్సుని ఝుల్లుమనిపించాయి.

"ఆ మాట ముందే చెప్పొచ్చుగా...." ప్రసన్నంగా అంటూ ఫోన్ చేతిలోకి తీసుకుంది. నెంబర్ చూసింది ఐశ్వర్య.

అటునుంచి త్రినాధ్ "హలో" అనడం విన్పించింది. వెంటనే సెల్ ఆఫ్ చేసింది ఐశ్వర్య.

అటువైపున్న త్రినాధ్ బిత్తరపోయాడు. ఫోన్‌లోంచి సెల్ ఆఫ్ చేసిన శబ్దం వినగానే మనస్సంతా ఏవో బాధావీచికలు చుట్టుముట్టేశాయి. ఫోన్ క్రెడిల్‌చేసి ఎస్.టి.డి. బూత్‌లో అతనికి బిల్ చెల్లించి వెనుతిరిగాడు త్రినాధ్.

ఫోన్ రింగయ్యింది. ఎస్.టి.డి. బూత్‌లో అతను ఫోన్ లిఫ్ట్‌చేశాడు. అటువైపునుంచి ఓ తియ్యని స్వరం.

"త్రినాధ్ గారున్నారా?" అని అడిగింది. ఆ కుర్రాడు ఉక్కిరి బిక్కిరై....

"మీరెవరూ?" అని అడిగాడు.

అటువైపునుంచి ఓ క్షణం సవ్వడిలేదు. ఆ తరువాత సితార మీటినట్లుగా...

"ఐశ్వర్యారాయ్" అని వినిపించింది.

ఆ కుర్రాడు బిత్తరపోయి ఉక్కిరిబిక్కిరై చేతిలోని రిసీవర్ పడేయబోయి ఆపుకుని, దానివంక నమ్మలేనట్లు చూశాడు.

అటువైపు నుంచి కిలకిలా నవ్వు విన్పించింది.

"ఓసారి పిలుస్తారా?" మళ్ళీ అడిగిందామె.

కలలో వున్న వాడిలా "సరే" అని పలికి...

"అన్నా..." అంటూ గట్టిగా కేకేసాడు.

త్రినాధ్ వెనక్కి చూశాడు. రిసీవర్ చూపిస్తూ... "ఫోన్" అన్నాడు.

"ఎవరూ...?" అంటూ వచ్చాడు త్రినాధ్.

ఆ కుర్రాడు ఆరాధనపూర్వకంగా చూస్తూ....

"విను అన్నా. నువ్వే ఆశ్చర్యపోతావ్...." అంటూ ఫోన్ చేతికిచ్చాడు.

"హలో" ఆతృతగా పలికింది త్రినాధ్ గొంతు. అటువైపు నుంచి చిన్న గులకరాళ్ళ మధ్యనుంచి నీరు ప్రవహిస్తున్నట్లుగా ఓ ఒత్తయిన పెదవినుంచి నవ్వు జాలువారింది. త్రినాధ్ మొహంలోకి చప్పున సంభ్రమం పాకి వచ్చింది.

"హలో!" ఎలా వున్నారు?" ఆత్మీయంగా అడిగాడతను.

"ఓ మై స్వీట్ డ్రీమ్... బాగానే వున్నాను" చెప్పిందామె.

అతనికి గొంతుకేదో అడ్డం పడినట్లుగా వుంది. ఏం మాట్లాడాలో తెలియనట్లుగా వుంది.

"నాతో మాట్లాడడం కోసం ఎంతసేపు ప్రయత్నించారు?" కొంటెగా అడిగిందామె.

"మధ్యాహ్నంనుంచీ ట్రైచేస్తూనే వున్నాను" చెప్పాడు త్రినాధ్.

"అందుకే నా పర్సనల్ ఫోన్ నెంబరు ఇవ్వబోతే వద్దన్నారు. ఇప్పుడు చూడండి మీకెంత టైం వేస్టో" అంది ఐశ్వర్య.

త్రినాధ్ ఏం మాట్లాడలేదు.

"ఏంటి విశేషాలు?" మళ్ళీ తనే అంది ఐశ్వర్య.

త్రినాధ్‌కి తను చెప్పవలసిన విషయం గుర్తొచ్చింది.

"మన వాళ్ళందరికి ఇంతకుముందే ఫోన్స్‌చేసి మాట్లాడాను" చెప్పాడు త్రినాధ్.

"ఓ! ఇట్స్ నైస్. నేను కూడా లోకేష్ వాళ్ళింటికి వెళ్ళాను. మన్‌ప్రీత్ ఆంటీ ఫోన్ చేశారు" చెప్పింది ఐశ్వర్య.

"నా మ్యారేజ్ విషయంలో మీ సజెషన్ తీసుకుందామని ఫోన్ చేశాను" అన్నాడు త్రినాధ్.

అటువైపు క్షణకాలం నిశ్శబ్దం.

"చెప్పండి" అంది ఐశ్వర్య. స్వరం పొడిగా వుంది.

త్రినాధ్ సిగ్గుపడుతూనే వాసంతి విషయం చెప్పాడు. ఆమెకి తన మీదగల ప్రేమ విషయం చెప్పాడు.

అతను చెప్తున్నప్పుడు ఆమె మనసులో ఒక మూలగల జెలసీని అంతర్ముఖురాలై పరిశీలించింది.

తన మనసు ఏమని కోరుకుంటోంది? త్రినాధ్ తనపట్ల పూర్వపు ఆరాధనతోనే తనను కలుసుకొనే అవకాశంలేక, దేవదాసై తన జీవితాన్ని కృశింపజేసుకోవాలని భావిస్తోందా?

నో... తనంత సంకుచితంగా ఆలోచించలేదు. తనకు ప్రాణదానం చేసి, తన వున్నతమైన వ్యక్తిత్వంతో మానవత్వంమీద ఆశలు కల్పించిన అతను పెళ్ళిచేసుకుని సంతోషంగా వుండాలి. అదే తను కోరుకునేది అనుకోగానే ఆమె మనసు తేలికయింది.

అతను చెప్పిందంతా శ్రద్ధగా వింది ఐశ్వర్య. అంతావిని చివరికి ఒకే ఒక ప్రశ్న అడిగింది.

"మీరామెను ప్రేమిస్తున్నారా?" సూటిగా అడిగింది ఐశ్వర్య.

ఆ మాటకి తడబడ్డాడు త్రినాధ్.

"ఆమెని తిరస్కరించడానికి ఏ విధమైన కారణాలూ కన్పించటంలేదు" చెప్పాడు.

"నేను ప్రేమను గురించి అడుగుతున్నాను...." అందామె.

సమాధానం చెప్పలేదతను. ఐశ్వర్యకు అతని హృదయమేదో అర్థమైనట్లుగా వుంది. అతనిమీద ప్రేమ, తన పరిస్థితుల పట్ల బాధ, రెండూ ఆమెని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయ్.

"పెళ్ళయ్యాక వాసంతిని ప్రేమించగలరా...?" అని అడిగింది ఐశ్వర్య.

"ఆమెకేలోటూ రాకుండా చూసుకుంటాను. ఆమె నిరంతరం సంతోషంగా వుండేలా చూస్తాను. ఇదే ప్రేమైతే పెళ్ళయ్యాకా... ఆమెని నేను ప్రేమించగలను...." చెప్పాడు త్రినాధ్.

అతని సంస్కారానికి ఆమె మనస్సులోనే సెల్యూట్ చేసింది.

"మీరు వాసంతిని తప్పక పెళ్ళి చేసుకోండి...." చెప్పింది ఐశ్వర్య.

త్రినాధ్ హృదయం భారంగా మారింది.

కాసేపు మామూలు మాటలు జరిగాక, తనతని పెళ్ళికి తప్పక వస్తానని, తనతో మాట్లాడాలనుకున్నప్పుడు ఫోన్ చేయమని తన పర్సనల్ ఫోన్ నెంబర్ యిచ్చింది.

బాధాతప్త హృదయాలతో ఒకరికి తెలియకుండా మరొకరు బాధపడుతూ వీడ్కోలు తీసుకున్నారు.

ఇంటికి రాగానే మంచంమీద వాలిపోయాడు త్రినాథ్. అతని అంతరంగమంతా వేదనలో కదిలిపోతోంది. ఐశ్వర్య తనని ఏమని సంబోధించింది...?

"స్వీట్ డ్రీమ్" అని. అంటే తను ఆమెకు ఒక తీయని కల! కల జ్ఞాపకం చేసుకోడానికి మాత్రమే. తరువాత కరిగిపోవడమే దాని లక్ష్యం.

వాసంతి గుర్తొచ్చింది త్రినాథ్‌కి. ఆమె మనోహర రూపం మెరిసింది కళ్ళలో తనకు ఐశ్వర్యతో ఇన్ని మధురమైన జ్ఞాపకాలు ఏర్పడడానికికారణం ఆమేనన్న విషయం గుర్తొచ్చింది.

"తను వాసంతిని జీవిత భాగస్వామిగా స్వీకరించాలి. ఆమెను తన భార్యగా గౌరవించి ప్రేమించాలి..." నిశ్చయంగా అనుకున్నాడు త్రినాథ్.

❋ ❋ ❋ ❋ ❋ ❋

పొలంలోకి వెళ్ళాడే కానీ, పనిమీద ధ్యాసలేదు త్రినాథ్‌కి.

తనకి మర్చిపోలేని అనుభూతుల్నిచ్చిన ఐశ్వర్య జ్ఞాపకాలు తననింకా ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, వాసంతిని తన జీవితంలోకి ఆహ్వానించడం అంటే మనసు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం... తన శ్రేయోభిలాషులందరూ ఐశ్వర్యతోసహా వాసంతిని పెళ్ళి చేసుకోమనే చెప్పారు. కానీ ఐశ్వర్య తనని ఏమని అడిగింది...?

"వాసంతిని తను ప్రేమిస్తున్నాడా లేదా?" అని.

తనకేం చెప్పాలో తోచలేదు.

తన గుండె గుడిలో దేవతగా వెలుగొందుతూ నీరాజనాలందుకునే యువతి తనకి ఎంతో దూరంలో వుంది... ఆమె తిరిగిరాదు... తనక్కడికి చేరుకోలేదు. అలాంటప్పుడు తనకి ఇంకెవరైనా ఒకటే... ఈ మాట తను చెబితే అందరికీ బాధకలగచ్చు. కానీ తనేం చేయగలడు...? ఆలోచిస్తూ కూర్చున్నాడు.

దూరంగా పొలం గట్లమీద ఓ పడుచుపిల్ల ఎవరో నడుచుకుంటూ వస్తోంది. కళ్ళు చిట్లించి చూశాడు. ఆమె వాసంతి.

తనకోసం ఆమె ఎవరినీ లెక్కచేయదు. తనంటే ప్రేమ కాబట్టే అందరూ ఏమనుకున్నా లక్ష్యపెట్టకుండా, యిలా తెగించి వస్తోంది. అచ్చం తనలాగే... తను ఐశ్వర్యకోసం తెగించినట్లుగానే. కానీ ఐశ్వర్యకి ఆ అర్హత వుంది కానీ, మరి తనకీ...

ఆమె దగ్గరగా వచ్చి నిలుచుంది.

"కూర్చో...." పక్కన చోటు చూపించాడు. ఆమె కూర్చోలేదు.

"నేను అందంగా లేనా?" ఒయ్యారంగా వూగుతూ అడిగింది. పరువాలు కొద్దిగా చలించాయి. నడుం మెలికపడింది... అతను చూపు తిప్పుకున్నాడు.

"అందం సమస్యే లేదు యిక్కడ...." అన్నాడు త్రినాథ్.

"ఏం...? ఐశ్వర్యారాయ్‌లా వాడిపక్కనా వీడిపక్కనా చిందులేసి, డాన్స్‌లేస్తే నచ్చుతానా?" వద్దనుకున్నా ఆమె కంఠంలో హేళన... ఆ మాట వినగానే అతని నరనరం ఆవేశంతో బిగిసింది.

ఆమె రెండు చెంపలూ చేత్తో బిగించి పట్టుకుని...

"నీకేం తెలుసు తన గురించి? నోరుందికదాని... ఇష్టం వచ్చినట్లు మాట్లాడకు... ఐశ్వర్య గురించి చెడుగా మాట్లాడే వాళ్ళెవరూ నా హృదయానికి దగ్గరకాలేరు...." గట్టిగాచెప్పి చెంపలు వదిలేశాడు.

వాసంతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మోకాళ్ళమీద ముఖం వాల్చుకుంది... కన్నీళ్ళు కిందకి జారాయి.

"ప్రామిస్... ఇంకెప్పుడూ ఇలా మాట్లాడను. క్షమించు...." అతని చెయ్యి పట్టుకుని అంది.

చిరునవ్వు నవ్వి ఆమె తలమీద చేత్తో మొదుతూ...

"ఇప్పటినుంచీ ఐశ్వర్యారాయ్‌ని అభిమానించటం మొదలుపెట్టు" చెప్పాడు.

"ఏం?" అంది వాసంతి.

"భర్త శరీరంలో భార్య అర్ధభాగం కాబట్టి. ఇద్దరి అభిప్రాయాలూ వేరుగా వుండకూడదు" అన్నాడు.

ఆమెకి అర్థం కావడాకి ఓ నిమిషం పట్టింది. అర్థంకాగానే అతని మీదకి ఒరిగిపోయింది. రెండు కఠినమైన బంతులేవో తన గుండెలకు గుచ్చుకున్నట్లు ఫీలయ్యాడు.

తన శరీరానికి రాసుకుంటున్న ఆమె శరీరానికి ఐశ్వర్య గుర్తొచ్చింది. ఆమె తనకిచ్చిన అద్భుత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి.

ఆ తీయని జ్ఞాపకాలతో శరీరం వేడెక్కింది. అది వేరుగా అర్థం చేసుకుంది వాసంతి. మరింత దగ్గరగా హత్తుకుపోయింది.

అతని కఠినమైన బాహువుల్లో తను మైనంలా కరిగిపోవడాన్ని వూహించుకుంటుంటే కళ్ళు అరమోడ్పులయ్యాయి. అతని మనశ్శరీరాలను తను సొంతం చేసుకోబోతున్న ఊహే ఆమెలో పులకింతను కలుగజేస్తోంది.

ఆమె కళ్ళల్లో కన్పిస్తున్న మోహపు వెలుగుల్ని చూశాడు త్రినాథ్. ఆమెని దగ్గరకు తీసుకుని నుదుటిమీద చుంబించి... చీకటి పడుతుండడంతో లేచాడు త్రినాథ్. అతన్ని అనుసరిచింది వాసంతి.

❋ ❋ ❋ ❋ ❋ ❋

గత వారం రోజులనుంచి ఐశ్వర్య ధైర్యాన్ని వీడకుండా మనోనిబ్బరాన్ని ప్రదర్శిస్తోంది. తనెక్కడికి వెళుతుంటే అక్కడికి తన్నెవరో వెన్నాడుతున్నట్లుగా ఓ ఫీలింగ్... చాపక్రింద నీరులా ప్రమాద కదలిక అది.

సల్మాన్‌కి చెబితే అతను కొట్టిపారేశాడు. సినీతారలమీద వ్యామోహంతో పోకిరీవాళ్ళు అలా వెంట పడుతుంటారని, వాళ్ళని లక్ష్యపెట్టన వసరం లేదని చెప్పాడు.

చాలా ఉక్రోషం వచ్చింది ఐశ్వర్యారాయ్‌కి. తనకు వచ్చిన ఫోన్‌కాల్స్ గురించి చెపుతూంటే కొట్టిపారేసి, భయపడవద్దని చెప్తోంటే తనకు బాధేసింది.

సల్మాన్ జాలీటైప్. కష్టాలు, బాధలు అంటే అతనికి నచ్చవు. అతను తన చెడు అలవాట్లను మానేసినా, డిస్కోలకీ, పార్టీలకీ మానుకోలేదు. పదే పదే ఆమెను కూడా రమ్మని వేధించేవాడు.

ఐశ్వర్యాకి అలాంటి వాటిమీద, ముఖ్యంగా లేట్‌నైట్ ఫంక్షన్స్ అంటే పెద్దగా ఇంట్రస్ట్‌లేదు. బాగా ఇంపార్టెన్స్ వున్న ఫంక్షన్స్‌కే ఆమె హాజరవుతూ వుండేది.

ఆమె దిగులుగా వుండడం చూసి ఆమె పేరెంట్స్ గమనించినా, గమనించనట్లు ఊరుకున్నారు.

ఎదుకంటే, ఈ మధ్య ఐశ్వర్య తన ఆర్థిక వ్యవహారాలను తనే డీల్ చేసుకోసాగింది. అంతకుముందు కోట్లాది రూపాయల ఆస్థిని తన తండ్రీ, అన్న డీల్ చేసేవారు.

తను మిస్ వరల్డ్ అయినప్పుడు చేసిన వాగ్దానాల్లో పదోవంతు కూడా నెరవేర్చలేకపోయింది. తండ్రికీ, అన్నకీ ఎంత చెప్పినా ఛారిటీ కార్యక్రమాలమీద ఆసక్తి వుండేదికాదు.

తనెన్ని కోట్లాది రూపాయలు సంపాదించినా, సమాజం కోసం ఖర్చుపెట్టలేకపోవడం ఆమెకు నచ్చలేదు.

అందుకనే ఈ మధ్యన తను సంపాదించిన దానిలో చాలా భాగం రమేష్‌పవార్ ద్వారా, ఇతర అంతర్జాతీయ సంస్థల ద్వారా అణగారిన వర్గాలకోసం వినియోగిస్తోంది. ఈ విషయంలో తల్లిదండ్రులకు, ఆమెకూ బేదాభిప్రాయాలు తలెత్తాయి.

బాహ్య సౌందర్యంకన్నా, అంతః సౌందర్యమే మిన్నగా భావించే ఐశ్వర్యారాయ్, తన సిద్ధాంతం కోసం ఎవరితోనైనా విభేదించడానికి సిద్ధంగా వుంది.

ఈ విషయం సల్మాన్ నోటీస్‌కు వచ్చినా అతను దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే, ఆమె ఆర్థిక వ్యవహారాల్లో తలదూర్చడానికి అతను సిద్ధంగాలేడు.

అతనిక్కావలసిందల్లా ఆమె ప్రేమ, సహచర్యం. ఎవరూ అడ్డు పడకుండా సాఫీగా సాగిపోయే సాహచర్యం. అక్కడే సల్మాన్‌కీ, ఐశ్వర్యకీ భిన్నా భిప్రాయాలు ఏర్పడుతున్నాయి.

ఆమె సమస్యను అర్థం చేసుకోకుండా తనను ప్రేమిస్తూ, తన వెంటే తిరగమని వేధించసాగాడు. అది ఐశ్వర్యలో అసహనాన్ని కలిగిస్తోంది. కాని ఆమె తమ బంధం విచ్ఛిన్నం కాకూడదని ప్రయత్నిస్తోంది.

కానీ సల్మాన్ ఈ మధ్య ఐశ్వర్య మారిపోయిందంటూ నిందవేస్తున్నాడు. ఆమె తనతో ఫిజికల్ రిలేషన్ స్టార్ట్ చేయడంలేదని అతని కంప్లైంట్.

కానీ ఐశ్వర్యారాయ్ రీజన్ ఐశ్వర్యారాయ్‌కే వుంది. ఆమె ప్రస్తుతం శారీరక, మానసిక వత్తిళ్ళతో కృంగిపోతున్నానని, తను ప్రశాంతంగా గడపడానికి కొంత సమయం పడుతుందని చెప్పింది.

అది అతను నమ్మలేదు. నమ్మించే ఓపికా, తీరికా ఆమెకు లేవు. ఈరోజు ఎప్పుడూలాగే తన ఇంటి కాహ్వానించాడు సల్మాన్. అప్పుడామె షూటింగ్‌లో వుంది.

అప్పుడు సమయం రాత్రి 8 గంటలు.

ఈ మధ్యంతా సమయం చాలా వృథా అయిపోవడంతో రాత్రి పది, పదిన్నరదాకా ఐశ్వర్య పని చేస్తోంది. ఫోన్‌లో విసురుగా పేకప్ చేప్పేసి రమ్మన్నాడు సల్మాన్.

చుట్టూ అందరూ వినడంచేత ఆమె మెల్లగా రేపు వస్తానని చెపుతోంది. అతడు వినడంలేదు. ఈలోగా షాట్ రెడీ చెప్పారు. అయినా ఫోన్‌లో సల్మాన్ వదలడంలేదు.

సెల్ ఆఫ్ చేసింది ఐశ్వర్య. అది అతనికి కోపం తెప్పిస్తుందని తెలుసు. కానీ తనకి తన వ్యక్తిగత సరదాలకన్నా తన వృత్తే ముఖ్యం. ఆమె నెక్స్ట్ షాట్ గురించి డైరెక్టర్‌తో డిస్కస్ చేస్తుండగా వచ్చాడు సల్మాన్.

సల్మాన్‌కి సంబంధం లేని వేరే సినిమా షుటింగది. డైరెక్టర్, ప్రొడ్యూసర్ మొహమాటానికి అతన్నాహ్వానించారు. ఆమె కూడా దూరం నుంచే నవ్వి షాట్‌కు వెళ్ళబోతుండగా–

"ఐష్..." అని పిలిచాడతను.

అతనలా మధ్యలో డిస్టర్బ్ చేస్తున్నందుకు చిరాకొచ్చింది. మొహంలో అది కనబడకుండా మామూలుగానే వచ్చిందామె.

అతను గట్టిగా "పేకప్ చెప్పేసిరా...." అన్నాడు.

ఐశ్వర్య ఖంగారుగా దిక్కులు చూసింది. ఆ మాట చాలా మందికి వినిపించింది. ఆమె ప్రక్కన హీరోగా నటిస్తున్న నటుడు కూడా అక్కడున్నప్పుడే వాళ్ళిద్దరి కాంబినేషన్‌లో షాట్స్ కొన్ని తీయాలి.

ఐశ్వర్య ఈ మధ్యంతా షూటింగ్‌కు రాలేకపోవడం మూలంగా నిర్మాతకు నష్టం రాకూడదని, తన పర్సనల్ టైంలో ఇక్కడకొచ్చి నటిస్తున్నాడతను. అలాంటప్పుడు తను పేకప్ చెప్పి వెళ్ళిపోతే ఏం బాగుంటుంది? అదే చెప్పిందతనితో.

విన్పించుకోలేదు సల్మాన్. తల అడ్డంగా వూపాడు. ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమై వున్నా, అందరి దృష్టీ ఇటువైపే వుందని ఐశ్వర్యకు తెలుసు.

ఆమె సల్మాన్‌ను ఐదునిమిషాలు బ్రతిమిలాడినా విన్పించుకోలేదతను. అతను డైరెక్టర్‌తో నిలుచున్న చోటుచూంటే గట్టిగా...

"డైరెక్టర్ జీ – ఐశ్వర్య పేకప్ చెప్పేసింది. ఆమె లేని పెండింగ్ సీన్స్ ఏమైనా వుంటే చూసుకోండి...." చెప్పి ధీమాగా ముందుకు నడిచాడు.

అతని వెనుకే ఆమె వస్తుందని అతని నమ్మకం. ఆ సినీ హీరో ముఖం అవమానంతో ఎర్రబడింది. ఆ హీరో డైరెక్టర్ వంక చూశాడు.

పిల్లికి చెలగాటం, ఎలుకకి ప్రాణసంకటంలాగా అయింది డైరెక్టర్ పని.

ఐశ్వర్య ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా "షాట్ రెడీ చేయండి డైరెక్టర్ జీ.... మనం షాట్ కంటిన్యూ చేద్దాం...." చెప్పిందామె.

వెనక్కి తిరిగి చూశాడు సల్మాన్. అతను అపరరుద్రుడే అయ్యాడు. కోపంగా దగ్గరికొచ్చి–

"నాతోరా...." అన్నాడు.

"నాకు వర్కుంది" నిర్భయంగా చెప్పింది ఐశ్వర్య.

ఆమె పరిస్థితికి ఆ సినీహీరోకే జాలేసి "పోనీ వెళ్ళండి ఐశ్వర్యా" అన్నాడు.

ఆ అందాలరాశి మీద జాలి, కోట్లకు పడగలెత్తిన ఆమె మీద జాలి, దేశవిదేశాల్లో కీర్తిప్రతిష్టలు సంపాదించిన ఆమెపై జాలి...

ఆమె కళ్ళలో ప్రజ్వరిల్లుతున్న కన్నీళ్ళను ఆపుకుంటూ బలవంతాన...

"నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దు. నేను రాను...." గట్టిగా అరిచి చెప్పి ముందుకడుగెయ్యబోయింది.

ఆమె తిరస్కారాన్ని తట్టుకోలేకపోయాడు సల్మాన్. ఆమె చెయ్యిపట్టి ఆపి చెంప ఛెళ్ళుమనిపించాడు.

ఊహించని ఆ సంఘటనకి అందరూ బ్రాన్పడిపోయారు. రెండు నిమిషాలు ఏం జరిగిందో అర్థంకాలేదు ఐశ్వర్యకి.

చెంపమీద చెయ్యి చేర్చి పెద్ద కళ్ళతో ఆశ్చర్యంగా చూసింది. ఆ చూపుల్ని తట్టుకోలేనట్లు అతను వడివడిగా నడుస్తూ వెళ్ళిపోయాడు. ఆమె ఒంటరిగా కుర్చీలో కూలబడిపోయింది.

ఆమెకు జరిగిన ఈ పరాభవం ఎంత అణిచిపెట్టినా బయటకు రాకమానదు. దానిని తట్టుకోవడానికీమెను ఎంత గుండె నిబ్బరం కావాలి... దానితో ఆమె దగ్గరికి వెళ్ళే సాహసం చెయ్యలేకపోయారెవరూ.

చివరికి డైరెక్టర్ ఆమె దగ్గరకెళ్ళి పేకప్ చెప్పబోతుంటే, చివరికి తెప్పరిల్లి....

"నో...నో... కంటిన్యూ చేద్దాం...." అంది.

"రేపు చేద్దాంలేమ్మా...." అన్నాడు డైరెక్టర్.

"ఇలాంటి వాటిని తట్టుకోగలదు ఐశ్వర్య..." నవ్వుతూ అందామె.

ఇంతలో హీరో దగ్గరికి వచ్చి "మీ మనసు తట్టుకున్నా, మీ శరీరం తట్టుకోవాలిగా...." అంటూ పేకప్ చెప్పేసి వెళ్ళిపోయాడు.

యూనిట్ అంతా సర్దుకొంటున్నారు. ఏమీ అర్థంకాలేదామెకి. తనుకూడా బయటకు వచ్చి కారెక్కింది. చెంప ఒకటే మంటపెడుతుంటే మేకప్ కిట్‌లోంచి అద్దం తీసుకుని చూసింది.

చెంప బుసబుసా పొంగింది. దానిమీద చేతివేళ్ళ గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇందుకే కాబోలు పేకప్ చెప్పారు.

ఆమెకు ఎంత వద్దనుకున్నా త్రినాధ్ గుర్తొచ్చాడు. ఆ అడవిలో ఆ సముద్రపు ఒడ్డున తనను ఎంత అపురూపంగా చూశాడో గుర్తొచ్చింది.

అతనికి సల్మాన్‌లా డబ్బు, పలుకుబడి లేకపోవచ్చు. కానీ తనపై అంతులేని ఆరాధనను కనబరిచాడు. తన ప్రాణాలకు తెగించి, తన ఒంట్లోని విషాన్ని తొలగించాడు. అతను తనపట్లేకాదు, అందరిపైనా ప్రేమాభిమానాలను కనబరిచాడు. మదర్‌తెరిస్సాలోని మానవత్వం....

ఎవరైనా చేతులెత్తి నమస్కరించదలిచే మానవత్వం... దైవత్వం తొంగిచూసే మానత్వం... కఠిన శిలలను కూడా కరిగించగల మానవత్వం... అపురూపం... అసామాన్యం... అందులో ఏ కొంత కూడాలేదు సల్మాన్‌లో...

ఆమె మనసు సల్మాన్‌పై పగ – ప్రతీకారాలతో భగభగ మండిపోతోంది. కోపం, ద్వేషం ఆవహించాయి. క్రూయిజర్ ప్రమాదంలో సల్మాన్ తన గురించి మర్చిపోయి, అతని క్షేమం అతను చూసుకున్నా, త్రినాధ్ ఆ విషయాన్ని హైలెట్ చేయలేదు.

తనకిప్రాణదానం చేసిన త్రినాధ్‌పట్ల అనాదరణ చూపించినా పట్టించుకోలేదు. కానీ సల్మాన్ ఈ మధ్యన తరచుగా తన కెరియర్‌కి అడ్డం వస్తున్నాడు.

అతనిలో మరో కోణాన్ని తనిప్పుడిప్పుడే చూడగలుగుతోంది. భార్యనైనా, ప్రియురాలినైనా బానిసగా చూసే మగాళ్ళంటే తనకు అసహ్యం. స్త్రీకి స్వేచ్ఛ, వ్యక్తిత్వం, ఎదుగుదల వుండక్కర్లేదు. తన అభిరుచికి సంఘంలో గౌరవం, తన శారీరక సుఖానికి ఆలంబన దొరికితే చాలనుకునే మగాడు మనిషి కాదు – మృగం. మనుషులు మృగాలతో సహవాసం చేయకూడదని చరిత్ర ఎన్నిసార్లు పాఠం చెప్పినా ముందుగా బుద్ధిరాంది స్త్రీలకే... ఇక అతని గురించి ఇంకా ఆలోచించడానికేమి లేదు అనుకుంది. సల్మాన్ పట్ల ఐశ్వర్య మనసు విరిగిపోయింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

త్రినాధ్, వాసంతిల పెళ్ళికి ముహూర్తాలు కుదిరాయ్. నెలరోజుల్లో ఇద్దరికీ ఒకే ముహూర్తానికి పెళ్ళి... త్రినాధ్, వాసంతి విషయంలో అంగీకారం తెలియజేయగానే అందరూ చాలా సంతోషించారు.

త్రినాధ్ పెళ్ళి ఆ వూళ్ళోనే కాదు, చుట్టుపక్కల పది పన్నెండు ఊళ్ళ వారికి కూడా సంబరంగా మారింది. పెళ్ళి పనులన్నీ జోరుగా సాగుతున్నాయి. చెల్లి పెళ్ళి, తనపెళ్ళి ఒకేసారయ్యేసరికి మరింత బాధ్యత పెరిగింది త్రినాధ్‌కి.

సారథి కూడా దగ్గరుండి పెళ్ళి పనులన్నీ చూసుకుంటున్నాడు వాసంతి చాలా సంతోషంగా వుంది.

తనకి నచ్చినవాడు, తనను మెచ్చి వివాహం ఆడుతున్నాడంటే ఏ ఆడపిల్లకు సంతోషం ఉండదు. రాములవారి గుడి దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో కళ్యాణమంటపం ఏర్పాటు చేయాలనుకున్నారు.

త్రినాధ్ పెళ్ళికి సినిమాతార ఐశ్వర్యారాయ్ వచ్చేఅవకాశం వుండటం చేత ఏర్పాట్లన్నీ ఘనంగా ఉండాలని కుర్రకారంతా నిశ్చయించు కున్నాడు.

ఆమెని చూసేప్పుడు జనాలు తొక్కిసలాడకుండా ఉండటానికి వాళ్ళు వాలంటీర్లుగా ఏర్పడ్డారు. భోజనాల ఖర్చంతా వీరయ్యచౌదరి పెట్టుకుంటానన్నాడు.

తన పెళ్ళికి వచ్చే తన ప్రత్యేకమైన క్రూయిజర్ స్నేహితుల కోసం సుబ్బావాళ్ళ ఇంట్లో విడిది ఏర్పాటుచేశాడు త్రినాధ్.

శుభలేఖలు ప్రింటింగ్ యిచ్చారు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

షూటింగ్ స్పాట్‌లో తనని చెంపదెబ్బ కొట్టి అవమానించిన తర్వాత ఆ మరునాడు ఐశ్వర్య దగ్గరకొచ్చాడు సల్మాన్.

ఆమె ఉదయం నిద్ర లేవకముందే ఆమె గదిలోకి ప్రవేశించాడు. తనే నిద్ర లేపాడు. ఐశ్వర్య పట్టించుకోకుండా తన పనులు తానే చేసుకోసాగింది. చాలాసేపు క్షమంచమని అడిగాడు. ఐశ్వర్య వినిపించుకోలేదు.

చివరికి ఆమె పాదాలమీద చెయ్యేసి మరింకెప్పుడూ ఇలా చేయనని చెప్పాడు.

మరింత విరక్తి కలిగింది ఐశ్వర్యకు.

"మనిద్దరికీ కుదరదు...." అని క్రిందకువచ్చి కారెక్కి షూటింగ్‌కి వెళ్ళిపోయింది.

తరువాత ఆమెను ఎన్నో విధాలుగా బ్రతిమిలాడాడు. క్షమించమని వేడుకున్నాడు, కోప్పడ్డాడు. ఎన్ని విధాలుగా చెప్పినా ఆమె మెత్తబడలేదు.

తను అతనికోసం, అతని ప్రేమకోసం ఎన్నో విధాలుగా ప్రయత్నించింది. కానీ అతనుదాన్ని నిలబెట్టుకోలేకపోయాడు తననదుపు చేసి, కంట్రోల్‌లో వుంచడమే ప్రేమనుకున్నాడు.

ఆమె ఇంకా తనకంటే ఎత్తులోకి వెళ్ళిపోతుందేమోనన్న ఇన్ఫిరియారిటీ చాలా అధికం.

తనతన్ని మార్చుకోగలనని నమ్మింది. అతన్ని మార్చుకోవలసింది యాభైశాతం అయితే తను మార్చుకోగలదు. కానీ అది వందశాతం అని తేలింది. నూటికి నూరుశాతం ఏ మనిషీ మారలేడు.

ఇటువంటి మానవత్వం లేని మనిషితో సహచర్యాన్ని ఊహించలేదు. తనకీ అతనికీ ఇక ఎలాంటి సంబంధంలేదు.

ఇలా ఆమె నిశ్చయించుకున్న ఇరవై రోజులకి సల్మాన్ ఓ పార్టీలో కొత్తగా పైకెదుగుతున్న ఓ మోడల్ నడుంచుట్టూ చెయ్యేసి, ఆమెతో కబుర్లు చెప్పడం ప్రత్యక్షంగా చూసింది. ప్రేమికురాల్ని వదిలేయటం, కొత్త ప్రియురాల్ని చేరదీయటం, చొక్కా వేసుకున్నంత తేలిగ్గా తీసుకునే మనుషులున్న సమాజం ఇది.

అది చూసిన ఐశ్వర్యకు మానవ సంబంధాల పట్ల విముఖత కలిగింది.

నెల రోజులనుంచి తనకి భయాన్ని కలిగిస్తున్న ఫోన్‌కాల్స్ గురించి ఆమె స్వయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, ప్రెస్‌కు రిలీజ్ చెయ్యొద్దనీ, కాన్ఫిడెన్షియల్‌గా వుంచమని వేడుకుందామె కమీషనర్ హామీ ఇచ్చాక స్టేషన్‌నుంచి కారులో తిరిగి వస్తోంది. మాఫియాకి, సృజనాత్మకతకి సంబంధం ఏమిటి...?

ఆమె అంతరంగమంతా భయంతో నిండిపోయింది. తను ధైర్యంగా ఎదుర్కోవటానికి తన ముందున్న శత్రువు సామాన్యుడు కాదు. తన ప్రాణాలకే ముప్పు రావచ్చు...

వెనుకనుంచి అదే పనిగా హారన్ విన్పించటంతో విసుగ్గా వెనక్కి చూసింది. ఓ హెవీవెహికల్ వస్తోంది. ఎదురుగా ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. ఐశ్వర్య డ్రైవర్ని రైట్‌సైడ్‌కు పోనిచ్చి త్రోవ యివ్వమని చెప్పింది.

డ్రైవర్ ఆమె చెప్పినట్లుగానే చేశాడు. కానీ, ఆ వాహనం ఆమె కారును దాటుకుని వెళ్ళలేదు. కారుకతి సమీపంగా హారన్ మోగిస్తూ వస్తోంది.

చూసేవాళ్ళకి తమ కారు డ్రైవర్, త్రోవ యివ్వనట్లుగా క్రియేట్ చేస్తోంది ఆ సీన్. ఐశ్వర్య మనస్సులో ఏదో అనుమానం పొడచూపింది. ఈ క్షణమో... ఆ క్షణమో లారీ కార్‌ని డాష్ ఇచ్చేలా వుంది.

ఐశ్వర్య వెంటనే డ్రైవర్‌కి రైట్ టర్న్ తీసుకుని చిన్న చిన్న సందుల్లోకి కారు పోనిమ్మని చెప్పింది. ఆ హెవీవెహికల్ కొంతదూరం వెంబడించింది. యింక వెళ్ళడానికి ఛాన్స్‌లేక ఆగిపోయింది.

ఐశ్వర్య అక్కడ కారు దిగేసి, సందులు, గొందులు తిరిగి ఓ కార్ ఆపి ఎక్కుతుంటే చుట్టుప్రక్కల అందరూ విచిత్రంగా చూశారు.

దడదడలాడే గుండెతో ఇంటికొచ్చింది ఐశ్వర్య. ఆమె పేరెంట్స్ ఇంట్లో లేరు. వాళ్ళు ఆస్ట్రేలియా టూర్‌కి వెళ్ళారు. ఇంటికి రాగానే తను ఇంటికి వెళ్ళిన సంగతి పోలీస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి తనకెదురైన అనుభవాన్ని, ఆ వెహికల్ నంబర్‌నీ చెప్పింది.

ఆ కమీషనర్ కూడా నసుగుతూ "వాళ్ళతో పెట్టుకోవడం ఎందుకమ్మా... ఆ డిమాండ్స్‌ని ఒప్పుకుంటే సరిపోతుంది కదా..." అన్నాడు.

వెర్రికోపం వచ్చింది ఆమెకి. వాళ్ళ డిమాండ్స్ ఏమిటో తను సిగ్గు విడిచి చెప్పింది. అయినా ఆ కమీషనర్ కూడా ఒప్పుకోమంటున్నాడు.

మారు మాట్లాడకుండా ఫోన్ పెట్టేసింది. ఆమెకు సల్మాన్ గుర్తొచ్చాడు. అతనేమైనా సహాయం చేస్తాడేమోనని ఆశ పడింది ఆమె మనసు. వాళ్ళ డిమాండ్స్ ఒప్పుకొనేకన్నా సల్మాన్‌తో రాజీ పడటమే బెటర్ అనుకుని అతనికి ఫోన్ చేసింది.

ఆమె వాయిస్ వినగానే అతను వండర్ ఫీల్ అయ్యాడు. ఆమె తనంత తాను ఫోన్ చేయడం అతనికి ఎనలేని సంతోషాన్నిచ్చింది.

ఐశ్వర్య తన సమస్యను చెప్పింది. తన జీవితాన్ని పంచుకోబోయే వాడిగా అతనావేశపడతాడనుకుంది. విషయం చెప్పగానే అటువైపు కాసేపు నిశ్శబ్దం. తరువాత సల్మాన్ కూల్‌గా...

"మనమేం చేయలేం ఐష్... ఇవన్నీ చాలా కామన్... మనం కెరియర్‌లో పైకి వెళుతున్నప్పుడు ఇలాంటివి వస్తుంటాయి. మనం వాటికి లొంగిపోయి వుంటేనే లైఫ్. లేకపోతే ఎదురుపడి నిలబడి పోరాడాలంటే, నా కెరీర్‌కి ఇక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే..." అన్నాడు సల్మాన్.

నివ్వెరపోయింది ఐశ్వర్య. అతను కాస్తయినా పౌరుషాన్ని చూపిస్తాడనుకుంది. కానీ అలాంటి సలహా ఇస్తాడనుకోలేదు. ఏమీ మాట్లాడకుండా ఫోన్ పెట్టేసింది ఐశ్వర్య.

ఆమె తన ప్రయత్నాలు తాను చెయ్యాలనుకుంది. ప్రయివేట్ సెక్యూరిటీస్‌కి ఫోన్‌చేసి రప్పించి, తన సమస్యను వాళ్ళతో క్షుణ్ణంగా చర్చించింది. మర్నాడుదయం యథావిధిగా షూటింగ్‌కి వెళ్ళింది.

షూటింగ్ నుంచి వస్తూ కారెక్కబోతుంటే ఎవరో ఇద్దరు అగంతకులు మోటార్ బైక్‌పై వచ్చి ఆమెపై యాసిడ్ బాటిల్‌ను విసిరారు.

అది నిర్మానుష్యంగావున్న ప్రదేశం కావడంతో, ఆ బైక్‌శబ్దాన్ని, అందులోని వేగాన్ని గుర్తించి పక్కకు తప్పుకుంది.

ఆ బాటిల్ కారు అద్దాలకు తగిలి అవి భళ్ళున పగిలిపోయాయి. చూస్తూండగానే యాసిడ్ బుసబుసా పొంగి కారు సీట్లన్నీ కాల్చివేసింది. కొన్ని చుక్కలు ఆమె చేతులమీద పడి కాల్చేశాయి. బాధగా అరిచింది ఐశ్వర్య.

డ్రైవర్ కంగారుగా అరుచుకుంటూ స్టూడియోలోకి పరిగెత్తుతుంటే ఆపి, ఈ విషయం ఎవరితో చెప్పొద్దని వారించి, కారును షెడ్‌లో పెట్టమని చెప్పి, తను వెళ్ళి స్టూడియోలో ప్రొడ్యూసర్ కారు తీసుకుని, డాక్టర్ ఫ్రెండ్ వద్దకు వెళ్ళి ట్రీట్‌మెంట్ తీసుకుని ఇంటికి వచ్చింది.

అప్పటికీ ప్రైవేట్ డిటెక్టివ్‌లు ఇచ్చిన కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ ఆమెను హతాశురాలను చేశాయి.

ఆ రిపోర్ట్‌ని సాంతం చదివింది. మనిషి జీవితంలో ఒక్కోమెట్టు అధిరోహిస్తున్నకొద్దీ సమస్యలు కూడా అదే స్థాయిలో పెరిగిపోతుంటాయి. జీవితంలో అటుపోట్లను తట్టుకుని ఎదురు నిలబడిగలిగిన వారే విజేతలు.

తను ఎలాగయినా నమ్మిన సిద్ధాంతాలని విడిచి పెట్టకుండా, ఏ బలహీనతకి లొంగకుండా సాధ్యమైనంతవరకూ గడపాలి. తన జీవితం సాధ్యమయినంత ఎక్కువమందికి ఆదర్శం కావాలి. ఆమెకి తన మార్గమేదో ఇప్పుడు బోధపడింది.

వ్యక్తుల అసలు స్వరూపాలు తెలిసాయి. ఓ నిశ్చయానికొచ్చాక ఆమె రిలాక్సవడం కోసం కాసేపు యోగా సాధన చేసింది. తమ ఆర్థిక వ్యవహారాలు చూసే ఆడిటర్‌ని, ఇతర ఆర్థిక సలహాదారుని పిలిపించింది.

మొదటిసారిగా ఆమె తన ఆస్తుల వివరాలు అడిగింది. ఆడిటర్, మేనేజర్ చెప్పిన వివరాలు ఆమెని అయోమయంలో పడేశాయి. వాళ్ళు చెప్పిన ప్రకారం తను సంపాదించినదానిలో పదవ వంతుకూడా తన పేరు మీద లేదు.

తాను స్థాపించిన కంపెనీలలో అధికశాతం వాటా తండ్రి, అన్నయ్యల పేరుమీదే వుంది. తనకంటూ మిగిలింది చాలా తక్కువ.

నమ్మిన కాళ్ళకింద భూమి తొలగిపోతున్నట్లుగా, కంచే చేను మేసినట్లుగా, తన కుటుంబసభ్యులే తనను మోసం చేస్తారని ఆమె వూహించలేదు.

"మీకు టాక్స్ ప్రొబ్లం రాకుండా ఇలా చెయ్యాల్సి వచ్చిందని" ఆడిటర్ చెబుతుంటే ఆమె పెదాలమీద విరిగిన పాలలాంటి నవ్వు... ప్రభుత్వ నిబంధనలకి మించిన సంపాదన తనకు వచ్చుంటే దానిని ప్రభుత్వానికి యివ్వడమే ఉత్తమమైన పని.

కానీ ఇలా అక్రమంగా డబ్బును నిలువ చేసుకోవడం ఆమెను బాధించింది. ఆమె తన పేరున వున్న స్థిర, చరాస్థులన్నీటినీ రెండు రోజుల్లోగా క్యాష్ రూపంలోకి మార్చాలనీ, తను ఓ నెలరోజులు అమెరికా వెళుతున్నానని చెప్పిందామె.

"మమ్మీ, డాడీతో చెప్పి..." ఆడిటర్ అనబోతుంటే అతని మాటలను మధ్యలోనే వారించిందామె.

"దు వాట్ ఐసే..." ఆమె కంఠంలో పదును తొంగి చూసింది. తన ప్రొడ్యూసర్స్ అందరికీ ఫోన్ చేసింది.

తన కాల్‌షీట్స్ అన్నీ కాన్సిల్ చేయించుకుంది. ఎప్పటికయినా విషయం అందరికీ తెలుస్తుంది. కానీ అది ముందే తెలిస్తే తనతోపాటు చాలామంది ప్రాణాలను అపాయంలో పడేస్తుంది.

ఆ రోజంతా ఊపిరి సలపని ఏర్పాట్లలోనూ, నిరంతరం వస్తున్న ఫోన్‌కాల్స్‌ను ఎదుర్కోవడంలోనూ గడిచిపోయింది. అర్జెంటుగా చేయాల్సిన యాడ్ ఫిలిమ్స్ మరుసటిరోజు కంప్లీట్ చేసుకోమని చెప్పింది.

అమెరికా వెళ్ళటానికి తనకీ తన అసిస్టెంట్‌కి ఫ్లయిట్ టికెట్స్ బుక్ చేయించుకుంది. రమేష్‌పవార్‌ని పిలిచి తన ప్రోగ్రాం చెప్పి, అతని సలహా అడిగింది.

ఆమె మనోనిబ్బరానికి అతను అభినందనలు తెలియజేసి...

"ప్రపంచ సుందరి కిరీటానికి మీరు నిజంగా అర్హులు... సౌందర్యమంటే కేవలం శరీర కొలతలే కాదని, అసాధారణ మేధస్సు... గుండె నిబ్బరం, ఆత్మవిశ్వాసం, మానవత్వం అని మీరు లోకానికి చాటి చెపుతున్నారు.

మీ ప్రయత్నం సఫలమై మరింత ఉన్నతంగా ఎదిగిన ఐశ్వర్యారాయ్‌ని మేం చూడగలమని ఆశిస్తున్నాం" చెప్పాడు రమేష్‌పవార్.

చిరునవ్వు నవ్వుతూ అతని అభినందనలను స్వీకరించింది ఐశ్వర్యారాయ్.

* * * * * *

చెరువు ఒడ్డున వున్న రామాలయం... సాయం సమయం కావడంతో గాలి చల్లగా వీస్తోంది. గాలికి ధ్వజస్థంభపు గంటలు చిరుశబ్దం చేస్తున్నాయి. గుడి ముందర నాలుగుప్రక్కలా మెట్లున్న కోనేరు... దానిలో అరవిరిసిన తామరలూ కనువిందు చేస్తున్నాయి.

చేత్తో పూలబుట్ట పట్టుకుని గుళ్ళో కొచ్చింది వాసంతి. ఒకరిద్దరు ఎదురై ఆపాయ్యంగా పలుకరించారు. చిరునవ్వుతో సమాధానం చెప్పిదేవుడి ముందర నిలబడి, ప్రశాంతంగా చేతులు జోడించింది.

దేవుడు చిరునవ్వుతో తనను ఆశీర్వదిస్తున్నట్లుగా తోచింది. పొంగి పొరలే దుఃఖాన్ని స్త్రీ సహజమైన ఓర్పుతో అణిచిపెట్టింది.

రాముడి వంకే తదేకంగా చూస్తూ నిలుచుండిపోయింది.

పూజారి వచ్చి గోత్రనామాలు చదివి, అభిషేకం చేశాడు.

పూజ ముగిసాక కోనేరు మెట్లవద్ద ఒంటరిగా కాసేపు కూర్చుంది. ధైర్యాన్ని కూడగట్టుకోవడానికి కాసేపు నీళ్ళలో వున్న పూలవంకే చూస్తూ కూర్చుంది.

కనుచీకట్లు ముసురుకుంటున్నాయి. అవి తన హృదయంలోకి వ్యాపించకుండా వుండడానికి ఆమె శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఆమె ఆలోచనలన్నీ ఒకదానివెంట మరొకటి తరుముకుంటూ వచ్చి మనస్సుని అల్లకల్లోల పర్చాయి. చివరికి అవన్నీ దాటుకునిపోయి, ధైర్యంగా నిలబడింది.

ఆమె లేచి మెల్లగా ఇంటిమొహం పట్టింది. పెళ్ళి పదిరోజుల్లోకి రావడంతో ఇంట్లో అంతా హడావిడి, ఒక్కరి పెళ్ళికాదు మరి, ఇద్దరి పెళ్ళిళ్ళు.

వాసంతి గుడినుంచి వచ్చేసరికి టౌన్‌నుంచి చేయించి తెచ్చిన నగలను చూస్తున్నారంతా వాసంతిని కూడా పిలిచి నగలు చూపించి– "నచ్చాయో, లేదో?" అడిగారు.

"ఇప్పుడు నాకెందుకు నగలు?" నిరాసక్తంగా అందామె.

అందరూ ఆశ్చర్యపోయారు.

"ఏం కావాలనుకున్నా అన్నీ ఇప్పుడే కొనుక్కో. రేపు మా వదిన వచ్చి తాళాలు బిగిస్తే కష్టం..." అని వాసంతి అత్తయ్య హాస్యంగా అంది.

అది విన్న వీరయ్య కొడుకు ముసి ముసిగా నవ్వుతూ– "నా చెల్లి తర్వాతే ఎవరైనా..." బింకంగా అన్నాడు.

అందరూ నవ్వుకుంటుంటే వాసంతి మొహం చిన్నబోయింది. మాటల్లో వుండగానే శుభలేఖలు ప్రూఫ్ తీసుకుని వచ్చాడు షాపతను... అందరూ కార్డుల డిజైన్ చూసి బాగున్నాయన్నారు. ఇద్దరి పెళ్ళివార్తలూ ఒకే కార్డులో వున్నాయి.

వాసంతికి చూపించారు.

కార్డులు ఆమె తీసుకుని తదేకంగా పరిశీలిస్తూ తన ఫోటో, త్రినాధ్ ఫోటోలమీద పెన్నుతో "ఇంటూ మార్క్" పెట్టింది.

అందరూ నిశ్చేష్టులయ్యారు.

"వాసంతీ... ఏంటే ఈ పని...?" వీరయ్యచౌదరి కోపంగా అన్నాడు.

ఆమె కార్డు పక్కన పడేసింది.

"నాకీ పెళ్ళి యిష్టంలేదు నాన్నా..." లేచి నిలబడి తల దించుకుని అంది.

మిన్ను విరిగి మీద పడినట్లయింది.

ఆమె ఏం మాట్లాడిందో ఎవరికీ ఏం అర్థంకాలేదు.

"జోక్స్ వేయడానికి ఇది సమయంకాదు..." ఆమె అన్న మందలింపుగా అన్నాడు.

"నేను నిజమే చెప్తున్నాను" వాసంతి స్థిరంగా అంది.

నమ్మలేనట్లు చూశారంతా.

ఆమె మేనత్త నవ్వుతూ తేల్చేయబోయింది.

"నేను త్రినాధ్‌ని చేసుకోను" మళ్ళీ గట్టిగా చెప్పింది.

అందరి మొహాలూ కత్తివేటుకు నెత్తురుచుక్కలేనట్లుగా మాడిపోయాయి.

"నువ్విష్టపడితేనే కదమ్మా అతన్ని చేయాలనుకున్నాం" వీరయ్య చౌదరి గొంతు పెగల్చుకుని అడిగాడు.

మాట్లాడలేదామె.

"సమాధానం చెప్పు..." అడిగాడు ఆమె అన్నయ్య.

"నన్నేమీ అడగొద్దు... భారతితో అన్నయ్య పెళ్ళి జరిపించండి. కానీ నేనతన్ని పెళ్ళిచేసుకోను" ఖండితంగా చెప్పింది.

"మీరిద్దరూ గొడవపడ్డారా?" అడిగారెవరో.

"పెళ్ళనుకున్న దగ్గరనుంచీ ఇద్దరూ కలిసిందేలేదు..." అన్నాడు వీరయ్యచౌదరి.

"ఈ కాలం పిల్లలకి ఫోన్లున్నాయికదా! ఫోన్‌లో మాటా మాటా అనుకున్నారేమో!" వీరయ్యచౌదరి తమ్ముడు అన్నాడు.

రాత్రి తొమ్మిది గంటలవరకూ అందరూ కారణం చెప్పమని అడుగుతూనే వున్నారు.

కానీ వాసంతి సరయిన సమాధానం ఎవరికీ చెప్పలేదు. త్రినాధ్ అంటే తనకిష్టంలేదని మాత్రమే చెప్తోంది.

ఇంకోటేదయినా కారణం అయితే నచ్చచెప్పొచ్చు. కానీ అసలు పెళ్ళికొడుకే ఇష్టంలేదని చెప్తుంటే ఎలా నచ్చచెప్పాలో ఎవరికీ తెలియడం లేదు.

అదీకాక ఆమె అతన్నెంతగా ప్రేమించిందో అందరికీ తెలుసు. అలాంటిది ఇప్పుడిలా మాట్లాడటం అందరూ విడ్డూరంగా విన్నారు.

"శుభలేఖలవరకూ వచ్చిన పెళ్ళి ఇప్పుడు ఆగిపోయిందంటే ఎంత అవమానం" అదే మాట అంటే "ఇంకా కార్డులు పంచలేదుగా" మొండిగా అంది వాసంతి.

చేసేదేం లేక ఇద్దరూ గొడవపడి వుంటారని నిశ్చయానికి వచ్చి, వియ్యాలవారిని అర్జంటుగా రమ్మని కబురుచేశాడు వీరయ్యచౌదరి.

అంత రాత్రిపూట కబురు వచ్చేసరికి, భారతి తప్ప మిగతా నలుగురూ ఆదరా బాదరాగా వచ్చారు.

రాగానే విషయం విని షాకయ్యారు వియ్యాలవారు. త్రినాథ్ ఆశ్చర్యంగా వాసంతివైపు చూశాడు. ఆమె తనవైపు కాకుండా ఎటో నిర్లక్ష్యంగా చూస్తూ కన్పించింది.

సావిత్రమ్మకి తీవ్రమైన ఆశాభంగం కలిగింది. తన కొడుకే ఏదో చేసి వుంటాడని అనుమానంగా అతనివైపు చూసింది.

"ఇద్దరూ ఏమైనా మాటామాటా అనుకున్నారా? ఈ కాలంలో పిల్లలకి పంతాలు ఎక్కువ" నవ్వుతూ అంది సావిత్రమ్మ.

త్రినాథ్ అయోమయంగా చూశాడు.

"ఎంగేజ్‌మెంట్ అయ్యాక వాసంతిని చూడలేదు, మాట్లాడలేదు. ఇంకా పోట్లాడుకునే ప్రసక్తి ఏముంది?" అని అందరివైపూ చూశాడు.

అంతా వాసంతివైపు చూశారు.

"నాకీ పెళ్ళి ఇష్టంలేదు. అంతే... నన్నిక ఎవరూ బలవంతం చెయ్యొద్దు" గట్టిగా అరచి చెప్పింది వాసంతి.

క్షణాలమీద త్రినాథ్ మొహం ఎర్రబడిపోయింది. అందరూ త్రినాథ్ వంక భయంగా చూశారు. వీరయ్య చౌదరి ముఖం అవమానంతో దహించుకుపోతోంది.

ఆయన చెయ్యెత్తి కూతుర్ని కొట్టడానికి లేచాడు. రాఘవరావు, సారథి అతన్ని వారించి కూర్చోబెట్టారు.

"నిన్ను తప్ప ఎవర్నీ చేసుకోనని అంటేనే కదా ఈ పెళ్ళి కుదిర్చాను" వీరయ్యచౌదరి దిగులుగా త్రినాథ్‌తో అన్నాడు.

తలపంకించాడు త్రినాథ్. "నేను ఓసారి వాసంతితో మాట్లాడాలి" అన్నాడు.

అందరూ మౌనంగా అవతలికి తప్పుకున్నారు, వాసంతి కూడా వెళ్ళిపోబోతుంటే...

"ప్లీజ్" అన్నాడు. ఆగింది వాసంతి.

"పెళ్ళి ఎందుకొద్దంటున్నావు వాసంతీ" మృదువుగా అడిగాడు త్రినాథ్.

"పెళ్ళి వద్దనడంలేదు. మీరు పెళ్ళికొడుకుగా వద్దంటున్నాను..." చెప్పిందామె.

దెబ్బ తగిలినవాడిలా చూశాడు. వెంటనే తమాయించుకుని చిరునవ్వు నవ్వుతూ...

"నేనెందుకు వద్దో చెప్పు పోనీ" అన్నాడు.

వాసంతి సూటిగా త్రినాథ్‌వైపు చూసింది. "నేను ఈ పెళ్ళి వద్దన్నా వెంటనే మీ మనస్సులో కలిగిన భావం ఏంటో ఒక్కసారి తరచి చూసుకోండి" అందామె.

తనకి ఛెళ్ళున కొట్టినట్లయింది. తనలోంచి తాను తరచి చూసుకున్నాడు.

"నిజమే... హృదయాన్ని మెలితిప్పేంతగా తనలో బాధేమీ కలగడంలేదే? ఆమెను ఒప్పించడం కూడా ఏదో పనిలా వుంది తప్ప తనలో తీవ్రమైన కాంక్ష ఏమీలేదే" అతనాలోచిస్తుండగా ఆమె మరో ప్రశ్న సంధించింది.

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా?" అంది.

ఈ ప్రశ్న బాణంలా దూసుకొచ్చి తన హృదయం చుట్టూ వున్న అడ్డుగోడల్ని చీల్చేసింది. తన హృదయం ఇప్పుడు తనకి స్పష్టంగా కన్పిస్తుంది.

"నేను మిమ్మల్ని ప్రేమించానుగానీ మీరు నన్ను ప్రేమించలేదు. మీరు నన్ను నిజంగా ప్రేమించివుంటే నేను తిరస్కరించినప్పుడు నన్ను చెంపదెబ్బ కొట్టి మనిద్దర్నీ విడదీసే అధికారం నీకు లేదని చెప్పుండేవారు..."

ఆమె మాట్లాడిన ఒక్కో మాట సమ్మెటపోటులా సంధిస్తుంటే ఏమీ మాట్లాడలేక చూస్తుండిపోయాడు, ఆమె మాట్లాడిన ప్రశ్నకీ తనవద్ద సమాధానంలేదు. అతను తలవంచుకుని కూర్చున్నాడు.

"అందుకే మీరెవరికీ ఏమీ సమాధానం చెప్పక్కర్లేదు. నా నిర్ణయం నేను తీసుకున్నాను" అందామె.

"జీవితంలో అందరూ ప్రేమించే పెళ్ళిచేసుకోవాలని లేదు. పెళ్ళిచేసుకున్నాక కూడా ప్రేమని మొదలుపెట్టొచ్చు" చెప్పాడు త్రినాథ్.

నవ్వింది వాసంతి. "మీరు జీవితంలో ఓ అత్యుత్తమమైన వరాన్ని పొందారు. మామూలు ప్రేమలు మిమ్మల్ని కదిలించలేవు" గూడార్థంగా అని లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె మాటల్లో అర్థాన్ని అన్వేషిస్తుండగా అందరూ లోపలికొచ్చి, అతనివంక ఆతృతగా చూశారు.

తలవంచుకున్నాడు త్రినాధ్. అప్పటివరకూ రెపరెపలాడుతున్న ఆశ కూడా నశించింది. అందరి హృదయాలు భారమైనాయి.

భారతి పెళ్ళి విషయంలో కూడా వాగ్దానం చేశారు. అతని కొడుకు కూడా వాగ్దానం చేశారు. పెళ్ళిలోపైనా ఆమె మనసు మారుతుందేమోనని ఆశగా ఎదురుచూడసాగారందరూ.

❋ ❋ ❋ ❋ ❋ ❋

వాసంతి త్రినాధ్‌తో పెళ్ళి వద్దని తిరస్కరించాక ఇంట్లో అందరూ ఆమెకి పెళ్ళి చెయ్యకుండా ఆమె అన్నకి చెయ్యడానికి సందేహించారు. కానీ వాసంతి ఇంకెవర్ని కూడా పెళ్ళిచేసుకోనని భీష్మించుకుని కూర్చోవడంతో ఇంట్లో అందరికీ ఏంచేయాలో తోచలేదు.

ఏవో మనస్పర్థలు వచ్చి పెళ్ళి వద్దంటోందని, కాలమే క్రమంగా ఆమె మనస్సును మార్చి త్రినాధ్‌కి దగ్గర చేస్తుందని ఆశతో వున్నారంతా.

అనుకున్న ముహూర్తానికి భారతికి, వీరయ్య చౌదరి కొడుకుతో వివాహం జరిగిపోయింది.

వాసంతి, త్రినాధ్‌ల పెళ్ళి ఆగిపోయిందన్న విషయం బయటకి రాకుండా అంతా జాగ్రత్తపడ్డారు.

చుట్టాలందరికీ ఇద్దరి జాతకాలను బట్టి ఇంకా ముహూర్తం కుదరలేదని చెప్పసాగారు.

పెళ్ళి వున్నంతలో బాగానే చేయించాడు త్రినాధ్. ఐశ్వర్యారాయ్ ప్రోగ్రాం కేన్సిల్ అయింది.

త్రినాధ్ పెళ్ళి జరుగకపోవడంతో ఆమె రాదని తెలిసి వూళ్ళో వాళ్ళంతా నిరుత్సాహానికి లోనయ్యారు.

క్రూయిజర్ ఫ్రెండ్స్ మాత్రం అందరూ వచ్చారు.

మళ్ళీ అందరూ కలవగలిగినందుకు ఎంతగానో సంతోషించారు. ఎవరెంత సమస్యల్లో వున్నా తరచుగా కలుసుకుంటూ వుండాలని, ఈ స్నేహితుల తరువాతే మిగతా ఆత్మీయులని అందరూ అనుకున్నారు.

పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. పెళ్ళికి వచ్చి చుట్టాలంతా క్రమంగా సర్దుకుంటున్నారు.

పెళ్ళిపనుల్లో అలసిపోయిన త్రినాధ్, మర్నాడంతా నిద్దర్లోనే మునిగిపోయాడు.

పెళ్ళి మరుసటిరోజు వీరయ్య చౌదరి ఇంట్లో సత్యన్నారాయణ వ్రతం చేసుకున్నారు.

ఆ మరుసటి మూడు రోజులు జరిగే కార్యక్రమం కోసం భారతిని, అల్లుడిని ఇంటికి తీసుకువచ్చారు. ఆడపడుచు హోదాలో వాసంతి కూడా వచ్చింది.

ఆమెవంక చూడాలంటే ఏదోగా వుంటోంది త్రినాధ్‌కి. తనెప్పుడూ చూడటానికి భయపడే తన అంతరాంతరాల్లోకి వెళ్ళి దాన్నంతా చదివేసిన వాసంతికి ఎదురుపడడమే ఇబ్బందిగా వుంది.

తప్పనిసరయి ఎదురుపడాల్సి వచ్చినపుడు ఆమె చూపుల ధాటికి తట్టుకోలేక తలవాల్చి వెళ్ళిపోవాల్సి వస్తోంది.

ఆ రోజు ఉదయం పది గంటలయింది. కూతురు, అల్లుడు ఇంటి వద్దే వున్నారు.

ఈ మధ్య పెళ్ళి హడావిడిలో పడి పొలం వెళ్ళడం కుదరలేదనుకుని, పొలం వెళ్ళడంకోసం స్నానంచేసి, టిఫిన్ చేసి బయలుదేరుతున్నాడు త్రినాధ్.

ఇంట్లో ఇంకా చుట్టాలు కొంతమంది వున్నారు. వాసంతి కూడా ఇక్కడే వుంది.

అందర్నీ తప్పించుకొని పొలంలో ప్రశాంతమైన వాతావరణంలో కొంత సేదదీరుదామని బయలుదేరుతున్నాడు.

ఇంతలో–

బయట ఎవరివో క్రొత్తవారి మాటలు, తల్లి సావిత్రమ్మ మాటలు వినబడ్డాయి.

ఇలా బయటకు వచ్చి నిలబడ్డాడోలేదో ఎదురుగా నల్లటి బురఖా వేసుకుని, అప్పటివరకూ సావిత్రమ్మతో మాట్లాడుతున్న ఓ ఆకారం...

"మేరా... పతీ..." అనుకుంటూ గాల్లో తేలుతున్న దాన్లా బురఖా తీయకుండా వచ్చి అతన్ని చుట్టుకుపోయింది.

సావిత్రమ్మ నోరావులించి చూసింది.

రోడ్డుమీద పోతున్న పదిమందీ ఆగారు.

ఈ అలికిడికి లోపల్నుంచీ చుట్టాలు మొహాలు తొంగిచూశాయి.

ఊహించని సంఘటనకి గాబరాపడ్డాడు త్రినాధ్.

"ఏయ్... ఎవరూ... ఏంటిది...? వదలూ..." అంటూ విదిలించుకున్నాడు.

ఆ బురఖా ఆకారం క్రింద పడబోయి ఆపుకుంది.

"అమ్మో... షాదీ చేసుకున్న పెండామే... ఎవరూ? అంటారా?" గుండెలమీద చెయ్యేసుకుంటూ అంది.

బిత్తరపోయాడు త్రినాధ్.

"ఎవర్రా ఈ అమ్మాయి? ఏంటిదంతా?" అనుమానంగా అంటోంది సావిత్రమ్మ.

"నాకు తెలీదమ్మా!" బిక్కమొహం వేసి అన్నాడు త్రినాధ్.

ఆ మాట వినగానే బురఖా అమ్మాయి లబలబలాడుతూ–

"అంత పెద్ద ఓడలో నన్ను నిఖా చేసుకుని ఇపుడు కాదంటారా?" అతని కాళ్ళ దగ్గర వాలిపోయి అడిగింది.

కంగారుగా నాలుగు అడుగులు వెనక్కి వేశాడు. ఇంట్లో వాళ్ళంతా బయటకి వచ్చేశారు.

వాసంతి త్రినాధ్‌వంక వ్యంగ్యంగా చూస్తోంది.

మరింత అయోమయం అయిపోయాడు త్రినాధ్. ఊళ్ళోకి ఈ వార్త చిలువలు, వలువలుగా చేరిపోవడంతో, అందరూ ఎక్కడి పనులక్కడ కట్టిపెట్టి ఇక్కడ కొచ్చేస్తున్నారు.

ఆ అమ్మాయి బోరు బోరునా ఏడుస్తూ, తమ ఇద్దరి పెళ్ళి జరిగిన వైనాన్ని, అతడు తనతో గడిపినరోజులనీ, ఆమె ఆపకుండా ఏకరువుపెడుతోంటే... బెంబేలెత్తిపోయాడు త్రినాధ్.

తన పాదాలమీద పడిన ఆమె చేతుల్ని విదిలించేస్తుండగా ఆ అరచేతులమీద వున్న నల్లటి మచ్చలు కంపరాన్ని కలిగించాయి. తల తిప్పేసుకున్నాడు.

అందరికీ టిక్కెట్టులేని సినిమా చూస్తున్నాట్టుగా వుంది. వాసంతి, త్రినాధ్‌ల పెళ్ళి ఆగిపోయినప్పుడు నలుగురూ... నాలుగు విధాలుగా ఊహించారు.

రెండు పెళ్ళిళ్ళూ ఆగిపోతాయని భావించారు. కానీ భారతి పెళ్ళి యధావిధిగా సాగిపోయింది. వాసంతి వుండగానే మరోపాత్ర తనే పెళ్ళానంటూ ముందుకు వచ్చింది.

అదీ ఓ ఇతర మతస్థురాలు... కథ ఇంత రసవత్తరంగా మలుపులు తిరుగుతుంటూ వాళ్ళల్లో ఏం జరుగుతోందనన్న ఉత్సుకత క్షణక్షణానికీ పెరిగిపోతోంది. అందరూ తనని సస్పెక్ట్ చేస్తున్నట్లు చూడడాన్ని తట్టుకోలేక త్రినాధ్ ఆమెతో...

"ఎవర్నువ్వు... ఏంటీ డ్రామాలు...?" కఠినంగా అన్నాడు.

మళ్ళీ ఘొల్లుమందా అమ్మాయి. అందరివంకా కంగారుగా చూసి, తర్వాత ఆమెవైపు తిరిగి–

"అసలు నువ్వెవరు? మనిద్దరికీ పెళ్ళి జరిగినట్లు సాక్ష్యం ఏమిటి? ఇలా మోసంచేస్తే నాలుగు డబ్బులొస్తాయని ప్లాన్ చేశావా...? కోపంగా అన్నాడు త్రినాధ్.

"డబ్బా వద్దూ... ఏమీ వద్దు... మీ పాదాలదగ్గర ఇంత చోటివ్వండి..."

అంటూ ఆమె మళ్ళీ పాదాలమీద పడబోతుంటే, వేగంగా వెనక్కి జరిగాడు.

కోపంగా చూస్తున్న తల్లిని చూసి–

"ఒట్టమ్మా! నాకీ అమ్మాయి ఎవరో అసలు తెలీదు..." దీనంగా అన్నాడు.

ఛీత్కారంగా చూసిందామె.

"ఇలాంటిదేదో వుందని తెలిసే కాబోలు వాసంతి పెళ్ళి చేసుకోనంది..." రాఘవరావు అన్నాడు.

ఆ బురఖా అమ్మాయి దగ్గరకెళ్ళి–

"ముందు నీ మొహం చూపించు. నువ్వెవరో తెలియనుకూడా తెలియడంలేదు. మనిద్దరికీ పెళ్ళయివుంటే సాక్ష్యాలు చూపించు..." అన్నాడు.

"మన షాదీకి అల్లాయే సాక్షి అన్నారు కదండీ" ఆ అమ్మాయి బేలగా అంది.

హతాశుడైనట్లు చూశాడు త్రినాధ్.

"నేనెప్పుడన్నాను?" ఆశ్చర్యంగా అన్నాడు.

సిగ్గుపడుతూ తల వంచుకుని "మన నిఖా సమయంలోనే..." అంది ఆ అమ్మాయి.

త్రినాధ్ ఇక కోపాన్ని ఆపుకోలేకపోయాడు.

"అసలు నువ్వెవరో తెలియాలి..." అంటూ ఆమె బురఖా పట్టుకుని మొహంమీద నుంచి ముసుగు తొలగించబోతుండగా–

ఆమె వెనక్కి దూకి అతన్ని వారిస్తూ–

"మాలో పెళ్ళాం తన మొగుడికి తప్ప ఎవరికీ ముఖాన్ని చూపించదు."

"అందుకే... నేనే మొగుడ్ని అంటున్నావుగా. చూస్తాను" అన్నాడు త్రినాధ్.

"ఇంతమందిలో బురఖాతీస్తే నా పరువు పోయినట్లే..." కోపంగా అందామె.

"మరి..." విసుగ్గా అన్నాడు త్రినాధ్.

"లోపల గదిలో ఒంటరిగా చూద్దురుగాని రండి..." అంటూ ముందుకు దారి తీస్తోంటే అందరూ కదిలి దోవ యిచ్చారు.

అసహాయంగా ఆమె వెనకే నడిచాడు.

ఆమె సరాసరి లోపలికి వెళ్ళి అటూ ఇటూ చూసింది.

లోపల పడకగది కన్పించగానే అక్కడికి నడిచింది.

ఆమె వెనకాలే హిప్నటైజ్ చెయ్యబడిన వాడిలా వెళ్ళాడు త్రినాధ్.

గదిలోకి వెళ్ళగానే తలుపు గడియపెట్టి కిటికీలు మూస్తుంటే, భయంగా చూస్తూ...

"ఇప్పుడు ఇవెందుకు?" అన్నాడు.

నవ్వింది ఆ అమ్మాయి. ఏమీ మాట్లాడకుండా వచ్చి అతన్ని కౌగిలించుకుంది.

"ఏయ్... ఛీ! వదులు" గట్టిగా అన్నాడు.

పకపకా నవ్వింది ఆ అమ్మాయి.

ఆమె మొహం మీదున్న వస్త్రం తొలగించింది.

ఓ చందమామ బయటపడింది.

నోట మాట రానట్లు చూస్తూండిపోయాడు త్రినాధ్.

ఆమె తన బురఖా తీసివేసింది. ఆ సమయంలో చీరకొంగు తొలిగింది.

ఇంకో రెండు నిండు చందమామలు బయటికి వచ్చాయి. ఆమె విలాసంగా దగ్గరికి నడిచివచ్చి–

"నేనిలా కన్పిస్తున్నా నన్ను కౌగిలించుకోవడం లేదంటే ఏమిటి అర్థం?" కినుకగా అంది.

మతిపోయిన వాడిలా చూశాడు.

ఆమె చెప్పిన పని చేయడమే తన లక్ష్యం అన్నట్లు గట్టిగా కౌగిలించుకున్నాడు.

అతని చేతిని నడుంచుట్టూ వేసుకుందామె.

నున్నని నడుం వొంపు పాత జ్ఞాపకాలను తడిమింది.

చటుక్కున మోకాళ్ళమీద కూర్చుని గుండ్రని లోతైన ఆమె నాభిచుట్టూ నాలుకతో రాసాడు.

ఆమె అతని తలని మరింత దగ్గరికి అదుముకుంది.

అతని పెదవులు మరింత పైకి పాకాయి.

అక్కడి ఆచ్ఛాదనలు మేమెందుకు అడ్డు అన్నట్లు పారిపోయాయి. పూర్ణ కుంభాలను గర్వంతో ఛాతీమీద దాచుకున్న ఆమె, కొంచెం వంగగానే పిచ్చెక్కిపోయాడు త్రినాధ్.

రెండు చేతులతో వాటి గర్వాన్ని అణిచే ప్రయత్నం చేస్తున్నాడతను.

తీయని బాధనుంచి తేరుకునే ప్రయత్నంచేస్తూ, అతని క్రాఫ్‌లోకి వేళ్ళు పోనిచ్చి అతన్ని వారిస్తూ– "బయట అందరూ వున్నారు" గోముగా అంది.

వెంటనే తేరుకున్నాడతను.

ఆమెను మనసారా కౌగిలించుకుని పెదాలపై గట్టిగా తన పెదవులతో వత్తుతూ–

"ఏంటిదంతా?" అడిగాడు.

"భర్త దగ్గరకి భార్య ఎప్పుడయినా రావాల్సిందేగా?" అంది.

బిగించిన అతని చేతులు వదులయ్యాయి.

తను సరిగ్గా విన్నాడా అన్న సందేహం వచ్చిందతనికి.

కిలకిలా నవ్విందామె.

"మీరు విన్నది కరక్టే. నేనిక ఇక్కడే వుంటాను. మీరు నా భర్త" బట్టలు సర్దుకుంటూ చెప్పిందామె.

"జోక్స్ వద్దు. ఇప్పటికే చాలా సమస్యల్లో వున్నాను..." కోపంగా అన్నాడు.

"ఏం? మా వాసంతి నిన్ను పెళ్ళి చేసుకోనందా?" నవ్వింది.

మొహం గంటు పెట్టుకున్నాడు త్రినాధ్.

ఆ సమయంలోనే ఆమె చేతులమీద మచ్చలు కన్పించాయి.

బాధతో ఒళ్ళు జలదరించింది.

గభాల్న చేతుల్ని పట్టుకుని–

"ఏంటది...?" అడిగాడు.

"షూటింగ్స్‌లో కెమికల్స్ ఏవో పడ్డాయి..." చెప్పింది.

బాధతో అతను నిమురుతూ కూర్చుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాటిని బయటపడనీయకుండా...

"కొన్నాళ్ళపాటు నేనిక్కడే వుండాలి. బహుశా జీవితాంతం... మీరు ఈ వూరు వదిలిరారు గాబట్టి నేనే యిక్కడ వుంటాను.

మీకు నచ్చితే సినిమాలు చేస్తాను. లేకపోతే లేదు. కాకపోతే... కొంతకాలం నేనిక్కడ వున్నట్లు మీకూ నాకూ తప్ప ఎవరికీ తెలియకూడదు. ప్రామిస్..." చెయ్యి చాపింది.

"ఎనీ ప్రాబ్లమ్?" నొసలు ముడివేసి అడిగాడు త్రినాధ్.

"ఊహు... కొన్ని పర్సనల్ ప్రాబ్లమ్స్. తర్వాత అవే సర్దుకుంటాయి. సమయం వచ్చినప్పుడు చెపుతాను" అంది.

"నాకేం అర్ధంకావడంలేదు..." అయోమయంగా అన్నాడు.

అతని పెదాలను గట్టిగా కొరికింది.

"నువ్వే నా మొగుడివి అన్న విషయం అర్థమైతే చాలు. ఇంకేం అర్థంకానక్కరలేదు" అంది ఐశ్వర్య.

"అదొక్కటే అర్ధంకావటంలేదు" విచారంగా అన్నాడు.

గలగలా నవ్వింది.

ఆప్యాయంగా అతనికి దగ్గరగా వచ్చి, అతని తలను తన హృదయానికి హత్తుకుని, అతని జుత్తుమీద ముద్దు పెట్టి–

"నమ్మకం కుదిరిందా?" అని అడిగింది.

తలెత్తి చూసి నవ్వాడు.

❋ ❋ ❋ ❋ ❋ ❋

ఐదు నిమిషాలు గడిచాయి.

పావుగంట అయింది.

ఆ అమ్మాయి, త్రినాధ్ బయటకి రాలేదు.

రోడ్డుమీద నుండి చూస్తున్న వాళ్ళంతా సీన్ పూర్తవ్వకుండా వెళ్ళిపోవడం ఇష్టంలేక అక్కడక్కడా సర్దుకుని కూర్చున్నారు.

అరగంటయ్యాక ఇద్దరూ బయటకు వచ్చారు.

బురఖా అమ్మాయి పొగరుగా తలెగరేసుకుని వస్తోంటే, త్రినాధ్ తల దించుకుని వచ్చాడు!

అతను తల ఎత్తి అందర్నీ చూడలేకపోయాడు.

ముఖ్యంగా వాసంతిని!

"ఈ అమ్మాయి ప్రస్తుతానికి మన దగ్గరుంటుంది..." తల్లి దగ్గర గొణుగుతున్నట్లుగా అన్నాడు.

చుట్టుప్రక్కల నలుగురైదుగురికి విన్పించిందా మాట.

ఆ వార్త రెండే రెండు నిమిషాల్లో చిలువలు పలువలుగా మారి వూరంతా పాకింది.

సావిత్రమ్మ నమ్మలేనట్లుగా త్రినాధ్ వంక చూసింది.

ఆ తర్వాత–

"నా కొడుక్కేమయిందిరా దేవుడా..." అంటూ శోకాలు ప్రారంభించింది.

త్రినాధ్ గొణుక్కుంటూ, జనాలందర్నీ తప్పించుకుంటూ పొలం వైపు వెళ్ళిపోయాడు.

ఆమె తన బ్యాగ్‌ను తీసుకుని లోపలికి వచ్చి, "నా గదెక్కడ?" అని అడిగింది.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళున్నారండీ. ఉన్న ఒక్క బెడ్‌రూమ్ వాళ్ళకే యిచ్చారు" వాసంతి నిరసనగా అంది.

ఆమె భుజాలెగరేసి తన బ్యాగ్ హాల్లో ఓ మూలపెట్టి దానిమీదే తల పెట్టుకుని ఒళ్ళెరక్కుండా నిద్రపోయింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

పొలంలో ఉన్నాడన్న మాటేగానీ త్రినాధ్ ధ్యాసంతా ఐశ్వర్యమీదే వుంది.

అతనికి భరించలేనంత సంతోషం... ఐశ్వర్య ఇక్కడికెందుకొచ్చిందోనన్న ఆతృతా అతన్ని నిలువనీయటంలేదు.

పైగా ఐశ్వర్య మాటలు చాలా విచిత్రంగా వున్నాయి. ఆమె ఫెయిర్‌గా మాట్లాడ్డంలేదు.

పైగా "మనిద్దరికీ పెళ్ళయిపోయింది కదా" అంటోంది.

తనకు తెలియకుండా తామిద్దరికీ పెళ్ళెప్పుడయిందో అర్ధంకావడం లేదు.

తననెవరూ గుర్తుపట్టకుండా వుండటానికే ఆమె బురఖా వేసుకొచ్చిందని తెలుసు.

కానీ ఐశ్వర్య "మీరే నా భర్త" అని తనతో ఎందుకంటోంది? ఆమె ఎవరినైనా నమ్మించవచ్చుగానీ, తననా విషయంలో నమ్మించలేదు కదా!

ఇంట్లో అందరూ ముక్కూ మొహం తెలియని అమ్మాయి ఇలా ఇంటికి వచ్చి, ఇంటి కోడలిగా పెత్తనం చెలాయిస్తానంటే అంగీకరించరు.

ఐశ్వర్య తననేడిపించడానికో, అల్లరి పెట్టడానికో ఇలా వచ్చి వుంటుందా?

దాని మూలంగా ఐశ్వర్యకేంటి లాభం?

ఇలాంటి వాటికోసం ఆమె తన విలువైన సమయాన్ని వృధాచేయదుకదా!

ఆమె భోజనం అయినా చేసిందో? లేదో?

మధ్యాహ్నం ఒంటిగంట కాగానే అతని మనసు ఇంటివైపు లాగింది.

అనుకున్నదే తడవుగా ఇంటికి వచ్చేశాడు.

వచ్చేసరికి అందరూ వంటగదిలో పీటలు వాల్చుకుని భోజనాలు చేస్తున్నారు.

ఐశ్వర్య హాల్లో ఓ మూల నేలమీద ముడుచుకుని పడుకునివుంది. గాఢనిద్రలో వుందనడానికి సూచనగా ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భారంగా కదులుతున్నాయి.

అంత నిద్రలోనూ ముఖం మీద బురఖాను చెదిరిపోకుండా జాగ్రత్తగా పట్టుకుని పడుకుంది.

త్రినాధ్‌కి ఆమెమీద జాలి కలిగింది.

ఎలాంటి ఐశ్వర్యారాయ్ ఇలా ఈ పల్లెటూళ్ళో, కటిక నేలమీద... తిండీ తిప్పలూ లేకుండా పడుకుంది.

ఇంత కష్టాన్ని ఆమె కోరి ఎందుకు తెచ్చుకుంది? అంతా అర్ధంకాని ఫజిల్‌లా వుంది.

నిట్టూర్చి ఆమె దగ్గరగా వెళ్ళి ఒంగుని ఎవరికీ వినబడకుండా "ఐష్..." మృదువుగా పిలిచాడు.

రెండు పిలుపులకే బద్ధకంగా లేచింది ఐశ్వర్య.

ట్రాన్స్‌ఫరెంట్ క్లాత్‌లోంచి అతన్ని చూసి, ఎవరూ చూడకుండా ముఖంమీద వస్త్రాన్ని కొంత తొలగించి, ఓ చిన్న నవ్వు అతని పైకి విసిరి మళ్ళీ ముసుగులోకి వెళ్ళిపోయింది.

"ముఖం కడుక్కుంటావ? భోంచేద్దువుగాని..." అడిగాడు.

తలూపి సందేహంగా అతనివైపు చూస్తూ–

"ఇక్కడ తింటే అందరూ నా ముఖం చూస్తారేమో..." అంది.

"సరే, బెడ్‌రూంలోకి వెళదాం..." ఆ మాటల్ని మధ్యలోనే మింగేశాయి.

అప్పుడే భోజనాలు ముగించుకుని వచ్చి భారతి, వాళ్ళాయన ఆ గదిలోకి వెళుతున్నారు.

"నీకు ఓ అందమైన చోటు చూపిస్తారా..." అని ఆమెను ఉత్సాహపరుస్తూ పెరట్లో నూతి దగ్గరకు తీసుకువెళ్ళాడు.

నూతి చుట్టూ నాపరాళ్ళతో చప్టా కట్టి వుంది.

నూతి పక్కనే మామిడిచెట్టు, జామచెట్టు, అరటి చెట్టూ రకరకాల పండ్ల చెట్లు వున్నాయి.

ఆ చెట్లక్రింద నులకమంచం వేసి, దానిమీద మెత్తని దిండూ, దుప్పటి పరిచి ఆమెను కూర్చోమని చెప్పాడు.

తను వంటగదిలోకి వెళ్ళాడు.

అతని ప్రతి చర్యను ఇంట్లోని వాళ్ళంతా ఓ కంట కనిపెట్టి చూస్తూనే వున్నారు.

త్రినాధ్ ప్లేట్లలో అన్నం, కూరలూ వేసి, గ్లాసులో మంచినీళ్ళు పట్టుకొని వెళ్ళడం చూసి, సావిత్రమ్మ– "ఇంటి కోడల్ని అంటుంది... మొగుడుచేత సేవలు చేయించుకుంటుందా...? ఏం ఖర్మ..." పెడసరంగా అంది.

త్రినాధ్‌కి తల్లి అమాయకత్వం చూసి ఏం అనాలో తోచలేదు.

కోడల్ని అని చెప్తున్న ఆ అమ్మాయి ఐశ్వర్యారాయ్ అని తెలిస్తే – ఆమె ఫీలింగ్స్ ఎలా ఉంటాయో...?

తనన్న దానికి సమాధానం చెప్పకుండా నవ్వుతూ వెళ్ళిపోతున్న కొడుకును చూసి, ఏం అనుకోవాలో తెలియలేదామెకు.

ఐశ్వర్య భోజనం ఎలాంటి పదార్థాలతో వండుతారో... క్రూయిజర్‌లో చూశాడతను.

ఇలాంటి పదార్థాలతో భోజనం పెట్టాలంటే అతనికి ఏంటోగా ఉంది.

ఈ వంటలు ఐశ్వర్య తినగలదా...? సందేహిస్తూనే తీసుకుని వచ్చాడు.

"చాలా ఆకలిగా ఉంది..." అంటూ ప్లేట్ తీసుకుని, ఫేస్‌ను కవర్‌చేస్తున్న క్లాత్‌ని వెనక్కి వేయబోతూ, అటూ ఇటూ చూసింది.

గుమ్మంవేపు ఆమె వీపు పోనిచ్చేలా కూర్చోపెట్టి..." ఎవరూ రారు తినండి..." అన్నాడు.

ఆమె ప్లేట్‌లోంచి ఓ కూర ముక్క తీసి నోట్లో వేసుకుంది. నోరంతా భగ్గుమంది.

పెదాలు విపరీతంగా మండాయి. గొంతు పొలమారింది.

అతను గబుక్కున ఆమె తలమీద తట్టి, మంచినీళ్ళ గ్లాసు అందించాడు.

"మైగాడ్... చాలా కారం!" అంది.

అతనికి ఏం చేయాలో తోచలేదు.

లోపలికి వెళ్ళి బ్రెడ్ ప్యాకెట్ వెతికి, తనే పెనంమీద వేసి కాల్చి, ఇంకో గిన్నెలో కొంచెం పెరుగు తీసి పట్టుకొచ్చాడు.

అతను తనకోసం పడుతున్న తపనను ముచ్చటగా చూస్తూండిపోయింది.

"ఈ పూటకి ఇలా సరిపెట్టుకోండి... రేపట్నుంచి మీకిష్టమైనట్లు నేనే వుండుతాను..." చెప్పాడు త్రినాధ్.

పకపకా నవ్వింది ఐశ్వర్యారాయ్.

ఆమె ఎవరో తెలిస్తే ఒక నష్టం, తెలియకపోతే ఒకనష్టం... ఈమెకు కావలసిన సదుపాయాలన్నీ సమకూర్చడం ఈ ఊళ్ళో అతి కష్టం.

కనీసం ఆమె ప్రత్యేకంగా వుండటానికి ఓ గదైనా కేటాయించలేక పోతున్నందుకు బాధగా వుందతనికి.

ఓ ఒంటరి ఆడపిల్ల మంచికో, చెడుకో కోరి వచ్చింది.

కనీసం ఆమెకు తిండి పెట్టాలన్న ఆలోచనకూడా ఇంట్లో ఎవరికీ రానందుకు అతనికి బాధగా అనిపించింది.

"మనం నా పొలానికి వెళ్ళిపోదాం, అక్కడ ఒక తాటాకు పాక కూడా వుంది. దాన్ని బాగుచేయించుతాను. అక్కడ చాలా స్వేచ్ఛగా, ప్రశాంతంగా వుంటుంది" అన్నాడు త్రినాధ్.

"చుట్టూ ఎవరూ వుండరా?" అడిగింది ఐశ్వర్య.

"ఊహూ! నీక్కావలసినంత ఏకాంతం అక్కడ దొరుకుతుంది. అవసరమయితే నీకు తోడుగా నేనుంటాను" చెప్పాడు త్రినాధ్.

"మీరేదన్నా పనిమీద బయటకు వెళితే?" అంటూ కళ్ళు పెద్దవి చేస్తూ భయంగా అడిగింది ఐశ్వర్య.

"ఈ పల్లెటూళ్ళో ఏ భయాలూ వుండవు... కష్టం వచ్చినప్పుడు అందరూ ఒక తాటిమీదే వుంటాం" చెప్పాడు త్రినాధ్.

"అయినా సరే ఒంటరిగా నేనుండను. నా చుట్టూ జనాలుంటే నాకు ఇష్టం" మొండికెత్తింది ఐశ్వర్య.

"మరి నువ్వు బట్టలు మార్చుకోవడానికీ, పడుకోవడానికీ ఎలా?" అడిగాడు.

"మీరే ఆలోచించండి" బ్రెడ్ తింటూ అడిగిందామె.

సుబ్బాకు కబురుచేశాడు త్రినాధ్.

ఆఘమేఘాలమీద వచ్చాడు సుబ్బు.

అతనికి ఉదయం నుంచీ ఆ ముసుగు సుందరిని చూడాలని మహకుతూహలంగా వుంది.

అందుకే త్రినాథ్ కబురు చేయగానే రెక్కలు కట్టుకుని వచ్చివాలాడు.

"ఏంట్రా...?" చెట్టు చాటునుంచే కన్పిస్తున్న నల్లటి బుర్ఖావంక చూస్తూ, నవ్వుతూ అన్నాడు.

అతని ఆరాటానికి నవ్వొచ్చింది త్రినాథ్‌కి.

"చెప్పే సమయం వస్తే ముందు నీకే చెప్తాలేరా...!" అతని కుతూహలాన్ని పసిగట్టి నవ్వుతూ అన్నాడు త్రినాథ్.

"ఇప్పుడు ఈ అమ్మాయి వుండటానికి యిక్కడ గదులు ఖాళీ లేవు... పొలం దగ్గర పాకలో తనుండలేనంటోంది. ఇప్పుడేం చేయాలి?" అడిగాడు త్రినాథ్.

"ఏం చేద్దాం మరి...?" తనూ బుర్ర గోక్కుంటూ అన్నాడు సుబ్బు.

స్నేహితులిద్దరి వరసకీ చెట్టుచాటునుంచీ ముసిముసిగా నవ్వుకుంది ఐశ్వర్య.

"ఇక్కడే నాలుగు మట్టిగోడలు లేపి, తాటాకులతో కప్పేసేద్దాం... రేపు రాత్రికల్లా పడుకోవటానికి గది సిద్ధమయిపోతుంది..." అన్నాడు సుబ్బు.

"నిజమేరా! మంచి ఆలోచన. ఈ రాత్రికి తను మా ఇంట్లో వుంటుంది. మా చెల్లెమ్మనొచ్చి తీసుకెళ్ళమని చెప్పు..." అని త్రినాథ్ అంటుండగా–

చెట్టు చాటునుండి చెయ్యూపింది ఐశ్వర్య.

అటు పరుగెత్తాడు త్రినాథ్.

"నేనొక్కదాన్నే వెళ్ళను" గారంగా అంది ఐశ్వర్య.

"మరి..." అయోమయంగా అడిగాడు.

"మీరు కూడా నాతో రావాలి" గోముగా అంది.

"సరే... సరే" తల గబగబా ఆడించేశాడు.

సుబ్బూ దగ్గరకొచ్చి–

"చెల్లెమ్మను పంపించకులే. ఇద్దరం కలిసి మీ ఇంటికొస్తాం..." చెప్పాడు.

ముసి ముసిగా నవ్వి తలూపాడు సుబ్బు.

వెంటనే పని ప్రారంభించారు.

ఊళ్ళో కుర్రకారు రాత్రి పెట్రోమాక్స్‌లైట్స్ పెట్టుకుని మరోగది అవగొట్టేశారు.

జరుగుతున్నదంతా ఇంట్లో అందరూ చూస్తూనే వున్నారు.

వాళ్ళందరికీ గుర్రుగా వుంది.

"కొడుకు ఎవత్తినో పెళ్ళిచేసుకుని వస్తే, ఇంట్లోకి రానివ్వకుండా పెరట్లోనే వుంచేశారని అందరూ అనుకోవడానికే ఈ పని..."

"మీరే లోపలకొచ్చి వుండండి. భారతి, వాళ్ళాయన వెళ్ళిపోతామంటున్నారులే" అంది.

సావిత్రమ్మ మాటలు వినగానే త్రినాథ్‌కి కోపం వచ్చింది.

సరాసరి చెల్లెలి భర్త దగ్గరకొచ్చి–

"నేనిప్పుడు కొన్ని సమస్యల్లో వున్నాను. అవి ఇప్పుడు చెప్పలేను. సమయం వచ్చినప్పుడు చెపుతాను. నన్నర్థం చేసుకోండి. మీరు యథావిధిగా వుండండి."

ఏ కళనున్నాడో అతను తల పంకించి వూరుకున్నాడు.

త్రినాథ్, సుబ్బూ వాళ్ళావిడ దగ్గరకి వెళ్ళి ఇబ్బందిపడుతూనే ఐశ్వర్య భోజన నియమాల గురించి చెప్పాడు.

రాత్రికి ఆమె భోజనం యిక్కడే చేసి పడుకుంటుందని సుబ్బూ మధ్యాహ్నమే చెప్పాడు.

అందుకే ఆమె గుంటూరు వంటలు రుచి చూపించటానికి సిద్ధమవుతుండగా, ఆ విషయాన్ని ముందే వూహించి చెప్పాడు త్రినాథ్.

"అమ్మో... మీ ఆవిడ అలవాట్లన్నీ సినిమా స్టార్ల నియామాల్లా వున్నాయే" అందా అమ్మాయి.

రాత్రి తొమ్మిది దాటాక పల్లెలో అంతా నిద్రలో జోగుతుండగా అప్పుడు ఐశ్వర్యని తీసుకుని బయలుదేరాడు.

రోడ్లమీద అలికిడి అతనికి చిన్నప్పటి నుంచీ అలవాటయిన రోడ్ల మీద తను ఐశ్వర్యతో నడుస్తున్నాడు.

ఆ ఫీలింగ్ విచిత్రంగా వుంది.

ఆ బురఖా తీయకుండానే సుబ్బు వాళ్ళావిడతో మాట్లాడింది ఐశ్వర్య.

"అదేంటండీ? ఆడవాళ్ళతో కూడా ఇలాగే మాట్లాడతారా...?" ఆ అమ్మాయి విచిత్రంగా అడిగింది.

"వాళ్ళ ఆచారంలే అది..." త్రినాథ్ సర్ది చెప్పాడు.

ఐశ్వర్య సలాడ్స్, ఫ్రూట్స్ ఎక్కువ తీసుకోవడం చూసి తను ఆశ్చర్యపోయింది.

భోజన సమయంలో కామెంట్స్ చేయ్యకూడదని ఆగిపోయింది.

భోజనాలయ్యాక సుబ్బు వాళ్ళావిడ ఏదో మాట్లాడబోతుంటే, సుబ్బు వారించి-

"వాళ్ళని వదిలేయి" చెప్పాడు.

ఆమె గెస్ట్‌లకోసం యిచ్చే బెడ్‌రూంని చూపించింది.

ఐశ్వర్యకి ఆ గదిని చూపించి-

"నేను ఇంటికి వెళ్ళి పడుకుంటాను" మొహమాటంగా అన్నాడు త్రినాథ్.

ఆమె ఏమీ మాట్లాడకపోవడం చూసి ఆత్రంగా ఆమె మొహం వైపే చూస్తూ నిల్చున్నాడు.

"నన్నిక్కడ ఒంటరిగా వదిలేసి వెళ్ళగలరా?" సవాల్ చేస్తున్నట్లుగా అంది.

గభాలున గదిలోకి వచ్చి తలుపు గడియపెట్టేశాడు.

విశాలంగా వున్న గదిలో పెద్ద పందిరి మంచం కిటికీ పక్కగా వుంది.

కిటికీ పక్కనే వున్న సన్నజాజి, విరజాజి తీగలకి గుత్తులు గుత్తులుగా పూసిన పూలు సువాసనని విరజిమ్ముతున్నాయి.

ఐశ్వర్య తన బురఖా తీసి విసిరికొట్టింది. ఎంతో ఫ్రీగా అన్పించింది.

మంచంమీద పట్టెనానుకుని కాళ్ళు మంచంమీద చాపుకుని విలాసంగా కూర్చుంది.

ఆ విలాసం ఆమె మనసుది కాదు, ఆ తనువుది. ఆమె శరీరం అద్భుతంగా మాట్లాడుతోంది.

నడుం మడత, వక్షోజాల పొంగూ రా రమ్మని ఆహ్వానిస్తున్నాయి.

అతను తన చూపుల్ని అతికష్టంమీద తిప్పుకుని, తలగడ తీసుకుని వేరేగా పడుకోవడానికి వెళ్ళబోతుంటే అతని చెయ్యి పట్టుకుంది.

ఆమె పక్కనే కూర్చున్నాడు.

అతని కళ్ళలోకి చూస్తూ కూర్చుంది.

"ఏం జరిగింది?" ఏమయినా సమస్యలున్నాయా?" అనునయంగా అడిగాడు.

"ఏం సమస్యలుంటే తీర్చగలరా?" వేళాకోళంగా అంది ఐశ్వర్య.

"తప్పకుండా నా కంఠంలో ప్రాణముండగా నీకు ఎవరయినా ఆపద కలిగిస్తే వాళ్ళ అంతు చూస్తాను" ఆవేశంగా అన్నాడు.

"ప్రాణాలిచ్చేస్తారా?" ఆశ్చర్యంగా అంది.

"వూ! దాని మూలంగా నువ్వు సేవ్ అవుతావు అనుకుంటే..." అన్నాడు.

ఆమెకి ఏడుపు వచ్చింది. అతని మెడచుట్టూ హారంలా చెయ్యి చుట్టి...

"ఎవరం ఏమీ అవ్వద్దు. ఇద్దరం జీవితాంతం సంతోషంగానే వుండాలి. అందుకోసమే నా ప్రయత్నం అంతా...?" నిట్టూరుస్తూ అంది.

"అసలేమయింది? సల్మాన్‌తో నీకు ఎఫైర్ వుందని పత్రికలు రాశాయి. నువ్వు గొడవపడ్డావా?" అతను మామూలుగానే అడిగాడు.

కానీ ఆమెలో చిలిపితనం చిందులేసింది.

"ఏం! జెలసీనా..." కొంటెగా అంది.

"ఏం కాదులే" మొహం మాడ్చుకుంటూ అన్నాడు.

ఆమె సల్మాన్‌తో తన ఎఫైర్‌ని ఏ విషయమూ దాచకుండా చెప్పింది. ఆఖరులో తనడిగిన సహాయం గురించి వివరాలు చెప్పకుండా మామూలుగా చెప్పింది.

"అదేంటో నాకు చెప్పొచ్చు కదా..." కిసుకుగా అన్నాడు.

"అది షూటింగ్స్‌కి సంబంధించిన విషయంలే" తేలిగ్గా అంది.

అంతా విని ఊరుకున్నాడు.

"మరి యిలా యిక్కడికి ఎందుకొచ్చినట్లు?" అడిగాడు.

"నా మొగుడి దగ్గరకు నేను వచ్చాను" లేచి మంచం దిగబోతూ అంది.

అతను విసురుగా లాగాడు.

తూలి అతనిమీద పడింది.

"నాకు నిజం కావాలి" కోపంగా అన్నాడు.

"నాకు కొన్ని సమస్యలున్నాయి. అవి తీరగానే యిక్కడే ఈ ఊళ్ళోనే అందరి సమక్షంలో మనం పెళ్ళిచేసుకుందాం. నా సినిమా షూటింగ్స్ ఒత్తిడిలో మనం మధ్యమధ్యలో విడివిడిగా బతకాల్సిరావచ్చు. కానీ మనిద్దరి మధ్య అధికారిక బంధం ముడిపడాలి.

నీలాంటి ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మనిషినే నేను నా భర్తగా స్వీకరించగలను.

ఆ క్రూయిజర్ ప్రమాదం నా జీవితాన్ని మలుపుతిప్పింది. మనుషుల మనస్తత్వాలు బాగా అర్థమయ్యాయి.

దయచేసి నేను చెప్పేవరకూ నన్నేమీ అడగవద్దు..." అంది ఐశ్వర్య.

నిట్టూర్చాడు త్రినాథ్.

"నీ మాటని నేను ఎప్పుడూ కాదనను. సరే... నీ యిష్టప్రకారమే చేద్దాం" అన్నాడు త్రినాథ్.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయి చివరికి నిద్రలోకి జారుకున్నారు యిద్దరూ.

❋ ❋ ❋ ❋ ❋ ❋

తెల్లవారి సాయంత్రానికల్లా గది సిద్ధమైంది. ఆ గదిలోకి అడుగుపెట్టి ఆశ్చర్యపోయాడు త్రినాథ్.

అంతా శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టి వుంది.

అక్కడ ఓ మంచం, రెండు కుర్చీలు, ఓ చెక్క బీరువా సిద్ధంగా వున్నాయి.

లోపలికి వెళ్ళగానే పచ్చి తాటాకుల వాసన కమ్మగా ముక్కుకు సోకింది.

"ఇదంతా ఎవరు చేశారు?" ఆశ్చర్యంగా అన్నాడు త్రినాథ్.

తరువాత భారతిద్వారా తెలిసింది. ఆ ఎరేంజ్‌మెంట్స్ అన్నీ వాసంతి చేసిందని.

ఆమె మనసేంటో అర్థంకాలేదు త్రినాథ్‌కి.

కొత్త గది మాత్రం తమ ఇద్దరికోసమే సృష్టించబడిన పొదరిల్లులా అందంగా వుంది.

వారం రోజుల్లో ఈ విషయం అందరికీ అలవాటయిపోయింది. ఈ బురఖా అమ్మాయి కూడా క్రమంగా ఇంట్లో అటూఇటూ తిరుగాడుతూ ఏవో పనుల్లో సహాయం చేసొస్తూ వుండేది.

అప్పుడప్పుడూ సుబ్బా వాళ్ళింటికీ, సుబ్బా వాళ్ళావిడ బలవంతం మీద వెళ్ళొచ్చేది.

ఊళ్ళో వాళ్ళు రెండుమూడుసార్లు విచిత్రంగా చూశారు.

తరువాత వాళ్ళకు కూడా అలవాటయిపయింది.

ఆ రోజు సావిత్రమ్మ ఇంట్లో చేసిన పిండివంటలు ఓ బుట్టలో సర్ది సుబ్బా వాళ్ళింటిలో ఇచ్చిరమ్మని చెప్పింది.

ఈ పద్ధతి విచిత్రంగా అన్పించింది ఐశ్వర్యకి.

దాని గురించి సావిత్రమ్మని ప్రశ్నలతో వేధించింది.

ఏమీ తెలియని మేళం కాబోలు... సావిత్రమ్మ మనసులోనే విసుక్కుంది.

ఆ పదార్థాలు తీసుకొని, సుబ్బా వాళ్ళింట్లో ఇచ్చి, కాసేపు కూర్చుని వస్తుండగా తోవలోవున్న కిళ్ళీబడ్డీ దగ్గర సిగరెట్ కాలుస్తూ, ఆ బడ్డీ అతనితో ఏవో మాట్లాడుతూ ఎదురయ్యారు ముగ్గురు మనుషులు.

వాళ్ళను చూడగానే ఆమెకి ప్రైప్రాణం పైనే పోయినంత పని అయింది.

కాళ్ళు ముందుకు కదలడానికి మొరాయించాయి.

శరీరమంతా చెమటలు పట్టాయి.

బురఖా ధరించడం తననిప్పుడు ఎంత రక్షించిందో ఆమె ఊహించగలదు.

కానీ వాళ్ళు తనని అనుమానిస్తారేమోనన్న భయం మాత్రం వదలడంలేదు.

నెమ్మదిగా అడుగులో అడుగువేసుకుంటూ వెళుతున్న ఆమెపై పడింది వాళ్ళ చూపు.

గుండె గుభేలుమంది ఐశ్వర్యకి.

నడకలో వేగం హెచ్చింది.

వాళ్ళు ఒక్కక్షణం చూసి వదిలేశారు. అయినా భయం పోలేదు ఆమెకి.

గబగబా నడుస్తూ ఇంటికి వచ్చింది.

మెట్లమీద నుంచి ఇంట్లోకి ఓ పరుగు తీసింది.

వెనక్కి తిరిగి చూసుకుంటూ పరుగెత్తడంతో హాల్లో నీళ్ళ బిందె పట్టుకొస్తున్న సావిత్రమ్మను చూసుకోకుండా గుద్దింది.

బిందె క్రిందపడి గింగిరాలు తిరుగుతూ శబ్దం చేసింది.

నీళ్ళన్నీ ఒలికిపోయాయి.

బిత్తరపోయింది సావిత్రమ్మ.

సొట్టపడిన బిందె తీసి—

"ఏంటా కంగారు? నిదానంగా నడవలేవా...?" కసురుతూ అంది.

ఆ మాట కూడా వినిపించుకునే స్థితిలో లేదామె.

గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని బయటకు రాలేదు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

అదేరోజు, అదే సమయంలో టౌన్‌లో వున్నాడు త్రినాథ్.

ఐశ్వర్యకు అవసరమైన కొన్ని వస్తువులు తేవడం కోసం గుంటూరు వచ్చాడతను.

బస్సు దిగిన దగ్గరనుంచీ అతనికి చాలా అనీజిగా వుంది. కారణం ఏంటో తెలియడంలేదు.

అటూ ఇటూ తలత్రిప్పి చూశాడు.

ఎదురుగా పాన్‌షాపు దగ్గర వున్న ఓ వ్యక్తి మొహానికి పేపర్ అడ్డం పెట్టుకున్నాడు.

అతను మళ్ళీ నడక సాగించాడు.

ఎవరో తనని వెన్నాడి వస్తున్నట్లుగా వుంది. ఆగిపోయి వెనక్కి తిరిగి చూశాడు.

ఇద్దరు వ్యక్తులు వాళ్ళల్లో వాళ్ళు ఏదో మాట్లాడుకుంటూ వస్తున్నారు.

ఏదో పనున్నట్లు రోడ్డు ప్రక్కన ఆగి నిలబడ్డారు.

వాళ్ళు అతన్ని దాటి ముందుకెళ్ళిపోయారు. తననుమానానికి తనే నవ్వుకుని ముందుకెళ్ళాడు.

మనసు మాత్రం కీడు శంకించడం మానలేదు.

మళ్ళీ నడవడం మొదలుపెట్టాడు.

కొంత దూరం వెళ్ళాక టాటా క్వాలీస్ వాహనం ఆగి వుంది. అది మెయిన్‌రోడ్ కాకపోవడంతో అంతగా జనసంచారంలేదు.

అతను ఓరకంట చూసి ముందుకు నడవబోతుండగా, తనను దాటుకొని వెళ్ళిన ఇద్దరూ అక్కడ వుండటం గమనించాడు.

వాళ్ళల్లో ఒకతను త్రినాథ్‌ని సైగచేసి పిలిచాడు.

త్రినాథ్‌లో ఏదో అనుమానం పొడచూపింది. పరిసరాలను అంచనా వేస్తూ అటు వెళ్ళాడు.

క్వాలిస్ లోపల నలుగురైదుగురు కూర్చుని వున్నారు. బయట ముగ్గురున్నారు.

"మీ పేరు త్రినాథేనా...?" లోపల కూర్చున్న వ్యక్తి మృదువుగా అడిగాడు.

"అవును..." అతని మొహాన్ని పరిశీలిస్తూ అన్నాడు.

అతను ఆంధ్రావాడిలా లేడు.

అతని వేషాధారణ, భాషా తేడాగా వున్నాయి.

అతని మనసులో మొదలయిన అనుమానం శాఖోపశాఖలుగా విస్తరించింది.

ఆ వ్యక్తి అదే టోన్‌ని మెయిన్‌టెన్ చేస్తూ—

"ఐశ్వర్య ఎక్కడ?" అడిగాడు.

వెంటనే తేరుకున్నాడు త్రినాథ్.

తన మనస్సులో కలిగిన అలజడిని ఏమాత్రం బయట పడనీయకుండా-

"ఐశ్వర్య ఎవరు?" అన్నాడు.

వాళ్ళు మొహ మొహాలు చూసుకున్నారు.

"ఐశ్వర్యారాయ్... ఎక్కడ?" మళ్ళీ అడిగాడతను.

"ఐశ్వర్యారాయ్... నాకేం తెలుసు" అయోమయంగా మొహం పెట్టి అన్నాడు.

"నిన్నసలు కాంటాక్ట్ చేయలేదా?" అన్నాడతను.

"మీరెవరు?" ఎదురు ప్రశ్నించాడు త్రినాధ్.

వాళ్ళు మాట్లాడలేదు. వాళ్ళ మొహాల్లో క్రమంగా కౄరత్వం చోటు చేసుకుంటోంది.

"ఆమె నీ దగ్గరకి రాలేదా?" అడిగాడతను.

"నేనెవర్నని నా దగ్గరకొస్తుందామె?" అడిగాడు త్రినాధ్.

"క్రూయిజర్ ప్రమాదంలో తనని మీరు రెండుసార్లు రక్షించారు కదా!" వ్యంగ్యంగా అన్నాడా వ్యక్తి.

"అయితే మాత్రం ఇప్పుడనవసరంగా నా దగ్గరికి ఎదుకొస్తుంది? అసలు మీరు ఆమె గురించి నన్నెందుకు అడుగుతున్నారు? ఐశ్వర్యారాయ్ కనబడటంలేదా?" ఏమీ తెలియనట్లన్నాడు త్రినాధ్.

వాళ్ళలో ఒకతను త్రినాధ్ భుజంపై చేయివేస్తూ, క్వాలీస్ వైపు తోస్తూ-

"నీ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్తాం మాతోరా..." అన్నాడతను.

ఏం జరిగిందో తెలుసుకొనేలోపే త్రినాధ్ ఉక్కు పిడికిలి అతని కడుపు తాకింది.

అతను "కెవ్వున" అరిచి అల్లంత దూరంలో పడ్డాడు. ముందుకు రాబోయిన మరో ఇద్దరికి అదేశాస్తి జరిగింది.

త్రినాధ్ మిగతావాళ్ళమీద కూడా ఎటాక్‌చేసి చావచితక బాదుతుంటే క్వాలిస్‌లో కూర్చున్న వ్యక్తి చేతిలో రివాల్వర్ మెరిసింది.

ఆగిపోయాడు త్రినాధ్.

"నువ్వు అమాయకుడివైతే సరే. నీ దృష్టికి ఏ విషయం వచ్చినా మాకు తెలియచెయ్యాలి."

"ఇంతటితో నిన్ను వదిలిపెడుతన్నామని అనుకోవద్దు. ఆమె నిన్ను ఎలాగైనా కలుస్తుంది. నువ్వా సమాచారాన్ని వెంటనే మాకు తెలియజేయాలి" చెప్పాడతను.

త్రినాధ్ మాట్లాడలేదు.

చూస్తూ నించున్నాడు.

ఆ వ్యక్తి సైగతో మిగతా వాళ్ళంతా అతనివంక గుర్రుగా చూస్తూ క్వాలిస్ ఎక్కారు.

ఆ వాహనం రివ్వున దూసుకుపోయింది.

❋ ❋ ❋ ❋ ❋ ❋

త్రినాధ్ గుంటూరులో బస్ ఎక్కి తన ఊరికి వస్తున్నంతసేపు అతని మనసు అలజడిగానే వుంది.

ఏదో జరుగుతోంది తనకి తెలియకుండా.

అది ఐశ్వర్య దాచి పెడుతోంది.

ఆమె అందరికన్నా తన దగ్గరే రక్షణ వుందని విశ్వశిస్తోంది.

"అయితే కేవలం రక్షణ కోసమే ఆమె దగ్గరకు వచ్చిందా?" అనుకోగానే మనసంతా బాధతో మూలిగింది.

తను ఆలోచనలలో పడి తల వంచుకుని వస్తుండడం మూలంగా కిళ్ళీబడ్డీ దగ్గర వున్న వ్యక్తులను చూడలేదు.

చూసుంటే అతను ఇంకొంచెం తొందరగా జాగ్రత్తపడి వుండేవాడు.

ఇంటికి వచ్చేసరికి ఐశ్వర్య ఆ బురఖాతోనే సావిత్రమ్మకు ఏవో కబుర్లు చెప్పేస్తోంది.

అతనికి నవ్వొచ్చింది.

బాధ కలిగింది.

కోపంగానూ వుంది.

త్రినాధ్ నుదిటిమీద తగిలిన దెబ్బను చూసి సావిత్రమ్మ కంగారు పడింది.

"ఏం(టా ఆ దెబ్బ... ఎక్కడ తగిలించుకున్నావ్?" కంగారుగా అంది.

"ఏం లేదమ్మా! రోడ్డుమీద చూసుకోకుండా నడుస్తుంటే పేవ్‌మెంట్ తగిలిపడ్డాను విసుగ్గా" అన్నాడు.

ఆవిడేదో గొణుగుతూనే వుంది.

ఐశ్వర్య కర్చీఫ్ తడిపి తెచ్చి ఆ దెబ్బను శుభ్రంచేస్తూ...

"ఏంటన్ని ఆలోచనలు... నా గురించేనా?" అడిగింది ఐశ్వర్య.

ముభావంగా తలూపాడు త్రినాథ్. అతను స్నానంచేసి, భోంచేసి తమ గదిలోకి వచ్చాడు.

అతను మంచానికి అడ్డంగా పడుకొని నుదిటిపై చెయ్యేసుకుని ఏదో ఆలోచిస్తున్నాడు.

దగ్గరగా వెళ్ళి అతని చేతిని తోసేస్తూ "ఏంటాలోచిస్తున్నారూ?" అడిగింది ఐశ్వర్య.

అతను సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

బయట బురఖా వేసుకున్నా గదిలోకి రాగానే బురఖా తీసేస్తుంది.

అమాయకంగా కన్పిస్తున్న ఆమె ముఖం చూస్తుంటే బాధగానే వుంది.

ఆమె తనతో ఏమీ చర్చించడం లేదన్న కోపంగానూ వుంది.

"ఏం జరిగింది? అలా వున్నారు?" అడిగింది ఐశ్వర్య.

"నీ వెంట పడుతున్నవాళ్ళెవరు ఐష్..." అడిగాడు త్రినాథ్.

ఆమె కళ్ళు పెద్దవిచేసి చూసింది. కంగారుగా అతని గాయాన్ని స్పృశించి...

"ఏం జరిగింది? ఈ దెబ్బెలా తగిలింది?" అనడిగింది.

"సమాధానం చెప్పాల్సింది నువ్వు" అన్నాడు త్రినాథ్.

"ఏం సమాధానం... ఏం లేదే" అంది ఐశ్వర్య.

"ఇంకా ఎందుకు నా దగ్గర దాస్తావు...?

నువ్వు ఇక్కడకు రావడంద్వారా నాకెన్ని ఇబ్బందులు కలిగినా నేను తట్టుకుంటాను.

కానీ ఇందాకటినుంచీ నీకేదయినా ఆపద వస్తుందేమోనని నా మనసు శంకిస్తోంది.

నేనేమైనా చెయ్యాలనుకున్నా నువ్వు నాకు సహకరిస్తేనే కదా" అనునయంగా అన్నాడు.

ఆమె మౌనంగా కూర్చుంది.

"చెప్పు... నీ కోసం ప్రాణాలైనా ఇస్తాను" అన్నాడు.

"అందుకే... నా కోసం నీ ప్రాణాన్ని లెక్కచెయ్యవు గాబట్టే నీకేమీ చెప్పలేదు.

నీతో జీవితాంతం ఆనందంగా గడపాలనీ కోరుకుంటున్నాను తప్ప, నీ ప్రాణాలని తీసుకొని నేను ఆనందంగా వుండాలని అనుకోవడంలేదు" అంది.

ఆ మాటలకు అతనికి ఎక్కడాలేని ఉత్సాహం వచ్చింది.

"వాళ్ళెవరో చెప్పు" ఆమెను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

ఆమె వెంట పడుతున్నది మాఫియా.

ఆమె చెప్పే ఒక్కో మాటా అతడ్ని నిశ్చేష్టుడ్ని చేసింది.

భయంతో అతని వళ్ళు జలదరించింది.

ఆమె బలహీనంగా నవ్వుకుంది.

ఈ క్షణమో... ఆ క్షణమో తనని చుట్టిన త్రినాథ్ చేతులు వదులుతాయనుకుంది.

దానికి భిన్నంగా ఆ చేతులు ఆమెను మరింత దగ్గరగా పొదువుకున్నాయి.

ఆమెను తననుంచీ ఎవరూ తీసుకువెళ్ళలేరన్నట్లుగా బిగించాయి. అప్పటికి నమ్మకం కలిగిందామెలో తమనెవరూ ఏమీ చేయలేరని.

"వాళ్ళెందుకు నీ వెంట పడుతున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు.

ఇదంతా చెప్పేముందు మీకు చాలా విషయాలు తెలియాలి. ఆమె మామూలుగా జరిగి కూర్చుంటూ అంది.

అతనాసక్తిగా చూశాడు.

"బాలీవుడ్‌లో చాలామంది తారలకీ, మాఫియాకీ విడదీయలేని సంబంధం వుంది.

నిరంతరం మాఫియా బాలీవుడ్‌ను తమ గుప్పెట్లో వుంచుకోవడానికి ప్రయత్నిస్తూనే వుంటుంది.

ఒకప్పుడు మాఫియా పేరెత్తితేనే భయపడేవాళ్ళు.

ఇప్పుడు వాళ్ళు విదేశాల్లో ఎరేంజ్ చేస్తున్న స్టేజ్ షోల్లో పాల్గొంటున్నారు.

వాళ్ళ సలహాలు పాటిస్తున్నారు.

అంతెందుకు మాఫియా బాలీవుడ్‌ని శాసించే స్థాయికి ఎదిగింది. కానీ ఇలా అసాంఘిక కార్యకలాపాల్లో యిష్టంలేని తారలు వాటికి దూరంగా వుంటారు.

బాగా గుండెధైర్యం వుంటే పోలీస్ రిపోర్ట్ చేసే వాళ్ళున్నారు. కానీ అది కూడా ప్రాణాలతో చెలగాటం ఆడటమే.

ఇప్పుడొస్తున్న సినిమాల్లో పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయింది.

దానికి సహాయం కూడా చాలామందికి మాఫియానే చేస్తుందన్న విషయం బహిరంగ సత్యం.

నేను క్రూయిజర్ ప్రమాదం నుంచి బయటపడి ముంబాయి చేరగానే నా ప్రతిష్ఠ మరింత పెరిగింది.

కుప్పలు తెప్పలుగా ఆఫర్లు వచ్చిపడ్డాయి.

కోట్లాది రూపాయలు పారితోషికం అందుకున్నాను.

అదే సమయంలో మాఫియా కన్ను నా మీద పడింది.

సాధారణంగా వాళ్ళు డిమాండ్ చేసేది డబ్బు.

కానీ నా విషయంలో మాత్రం భారీ ఎత్తున డబ్బునే కాకుండా, స్టేజ్‌షోల వంకతో నన్ను నెలకోసారి దుబాయ్ రమ్మన్నారు" చెప్పలేనట్లాగింది ఐశ్వర్య.

త్రినాథ్ ముఖం ఆవేశంతో ఎర్రబడింది.

"ఎందుకు రమ్మన్నారు?" ఆవేశంగా అన్నాడు.

"మాఫియా డాన్‌తో కలిసి నేను గడపాలంట. అతనికి నామీద ఇష్టం ఏర్పడిందట" చెప్పింది ఐశ్వర్య.

త్రినాథ్ ఒళ్ళు జలదరించింది.

"సాధారణంగా మాఫియాలో ఎవరు ఎలాంటి కోరికలు కోరినా బాలీవుడ్‌లో డెబ్బయ్ శాతంమంది కాదనరు.

ఇష్టంతో కాదు.

దాని అర్థం భయం.

వాళ్ళకెదురు నిలిచినా పోరాడే ధైర్యం లేక, వాళ్ళకి లొంగిపోతారంతా.

కానీ నేను వాళ్ళెంత బలవంతం చేసినా లొంగలేదు.

ప్రతీరోజూ బెదిరింపు కాల్స్ వచ్చేవి.

లెక్కచేయలేదు నేను.

చూసీ చూసీ కమీషనర్‌కి రిపోర్ట్ చేశాను.

అది తెలిసి కారు ఏక్సిడెంట్ చేయించడానికి ప్రయత్నించారు. మరోసారి నా మీద యాసిడ్‌తో దాడి చేయించారు.

ఆఖరి క్షణంలో తప్పించుకున్నాను.

నా చేతులమీద మచ్చలు అవే" ఆమె చూపించింది.

అతడి కళ్ళు ఆమె చేతులవంక విహ్వలం చూశాయి. చటుక్కున లేచి ఆమెను గుండెకు హత్తుకున్నాడు.

"జరిగిందంతా నాకెందుకు తెలియనివ్వలేదు" బాధగా అన్నాడు.

"ఇలా అంటాడని ఆశించే తెగిపోయిన బంధాన్ని ముడివెయ్యాలని, ముడిపడబోయే మీ బంధాన్ని తెగకొట్టకూడదని సల్మాన్‌ని ఆశ్రయించాను.

అతడేమన్నాడో తెలుసా?

ఇవన్నీ ఇక్కడ కామన్ అనీ–

పైకెదగాలంటే ఇలాంటి వాటిని ఒప్పుకోవాలని... పోలీస్ కమీషనర్ కూడా అదే మాట.

ఇంటికి వచ్చి ఆస్తుల వివరాలు చూసుకుంటే, అక్కడ కూడా కన్న తల్లిదండ్రుల వెన్నుపోటు.

జీవితంలో మనుషుల విలువని నేను సరిగ్గా అంచనా వేసిన క్షణమది.

కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

నువ్వు వాసంతితో నీ పెళ్ళి గురించి నాతో ప్రస్తావించావు.

జీవితంలో అన్ని విధాలుగా ఓడిపోయాక... నువ్వు గుర్తొచ్చి వచ్చానంటావేమోనని భయపడ్డాను.

ఆ సమయంలో అక్కడి వాళ్ళలో నేను ఎవర్నీ నమ్మే స్థితిలో లేను...

జీవితంలో అసలైన మలుపు దగ్గర ఉన్నాన్నేను.

నా అందం, పరువు, నేను సంపాదించిన కీర్తి ప్రతిష్టలూ ఇవన్నీ ఓ ఎత్తు.

నా ప్రాణాలు ఓ ఎత్తు...

నాకు కష్టం వచ్చినప్పుడు నన్నాదుకోగలవన్న నమ్మకం నాలో కలిగించిన ఆత్మీయుడవు నీవే...

అందుకే నీ దగ్గరకి రావాలనుకున్నాను.

కానీ – ఏ హక్కుతో రాగలను? బాగా ఆలోచించి వాసంతిని కలిసాను..."

"వాసంతినా...!" ఆశ్చర్యంగా అడిగాడు త్రినాథ్.

"అవును, మీ పెళ్ళి పదిరోజులుండనగా కలిసాను. నేను కార్లో కూర్చుని, డ్రైవర్‌తో కబురు పంపాను.

ఆమె ముందు నన్ను చూసి ఆశ్చర్యపోయింది.

ఆమెకి జరిగిన ప్రతి విషయం పూస గుచ్చినట్లు చెప్పి, నిర్ణయాన్ని ఆమెకే వదిలేసాను.

మా పెళ్ళిని నేనే ఆపుచేస్తానందామె. నేను చాలా బాధపడ్డాను.

ఆమె మిమ్మల్ని ఎంతగా ప్రేమించిందో... ఆమె మాటల్ని బట్టే తెలిసింది.

అంతే కాదు–

నేను చెప్పిందంతా విని అర్థం చేసుకున్న విశాలమైన హృదయం ఆమెది.

నేను ఆమెతో మాట్లాడాకా ఒకటే నిశ్చయించుకున్నాయి.

కొన్నాళ్ళిక్కడ అజ్ఞాతంలో గడిపి, మాఫియా దృష్టిని కొంత డైవర్ట్ చేశాక, మీ జీవితంలో ఇక ఎలాంటి కలతలూ సృష్టించకూడదని.

నా ఉద్దేశ్యం ప్రకారం మనిద్దరికీ మధ్య ఓ బంధం ముడిపడిపోయింది.

అది మానసికమైంది... దాన్నెవరూ తుంచలేరు.

జీవితంలో మీ సాహచర్యాన్ని తప్ప, యింకదేన్నీ కోరుకోను.

కానీ వాసంతికి అన్యాయం చేసే ఉద్దేశ్యం నాకు లేదు. ఇక ఏం జరగాలో అదే జరుగుతుంది.

నేను ఈ అపాయంనుంచి తప్పించుకుని వెళ్ళిపోయాక... మీరు వాసంతితో జీవితం ఆనందంగా గడపాలని నేను మనసారా కోరుకుంటున్నాను.

అదికాకుండా మనిద్దరం భార్యాభర్తలం కావాలని నేనాశిస్తే అది స్వార్థమే కదా!

వాసంతికి అన్యాయం చేసినట్లు కాదా...?" దీనంగా చూస్తూ అడిగింది. ఐశ్వర్య.

త్రినాథ్ చప్పున ఆమె పెదవులను వేళ్ళతో మూసి...

"నేను వాసంతితో మాట్లాడతాను. నీది స్వార్థం ఏమీకాదు – మనమిద్దరం భార్యాభర్తలం. మనని ఎవరూ విడదీయలేరు..." చెప్పాడతను.

"నేను అందాలరాణి కిరీటాన్ని ధరించాను. ఆ కిరీటం యిప్పుడు వేరొకరి సొంతం.

మరో సంవత్సరం మరో అందాల రాణి. ఇలా కాలం పరిగెడుతూనే ఉంటుంది.

ఈ రోజు నా శరీరానికున్న అందం ఏ యాసిడ్ దాడితోనో వికృతంగా మారిపోవచ్చు.

బాలీవుడ్‌లో నెంబర్ వన్ తారగా ఉన్న నన్ను కదిలించి, రేపు ఇంకో తార ఆ స్థానాన్ని ఆక్రమించవచ్చు.

ఇక నేను సంపాదించిన డబ్బు నాకు తెలియకుండానే చేతులు మారింది.

ఇక ముందు నాకు మిగిలింది, నేను సంపాదించబోయేదీ సమాజ సేవకే ఉపయోగించాలనుకుంటున్నాను.

సో... నేను నేనుగా తప్ప, నా దగ్గర అప్పుడింకేమీ వుండదు.

అప్పుడు కూడా నా మీద మీకు ఇదేరకమైన ప్రేమ ఉంటుందా?" ఆర్తిగా అడిగింది ఐశ్వర్య.

ఒక్క క్షణం ఆలోచించాడు త్రినాధ్.

ఒకప్పుడు నీ అపురూపమైన సౌందర్యానికి దాసుడనైన మాట వాస్తవం.

కానీ – మనం సముద్రపు తీర అడవిలో గడిపిన రోజుల్లో నాకు అందానికీ, బాధ్యతకీ, జీవిత పరమార్ధానికీ మధ్య వున్న రేఖలు స్పష్టంగా తెలిశాయి.

నీ చుట్టూ వున్న డబ్బూ, అందం, కీర్తి ప్రతిష్టలు అనే వలలను దూరంగా వుంచే ఐశ్వర్యమీద నాకిప్పుడు మరింత ప్రేమ పెరిగింది.

నీ కెరీర్‌కి నేనెప్పుడూ అడ్డు రాను...

జీవితంలో నీతో గడిపిన తొలి వారం రోజులను నేను మరిచిపోలేను.

అవి ఆలంబనగా నేను గడపగలను.

వాసంతితో పెళ్ళికి నేను ఒప్పుకోవడమన్నది కేవలం కృతజ్ఞతతో మాత్రమే అవుతుంది.

ఆ విషయం ఆమె ఇప్పటికే అర్ధం చేసుకొని వుంటుంది.

ఇక మాఫియా గురించి నువ్వేం దిగులుపడొద్దు..."

ఆ రాత్రంతా వాళ్ళు నిద్రపోలేదు.

రాత్రికి రాత్రే ఊళ్ళో తనకు నమ్మకస్తులైన సుబ్బూలాంటి స్నేహితులతో జరిగిందంతా చెప్పాడు. వాళ్ళు దేనికైనా సిద్ధంగా వుంటామని చెప్పారు.

ఆ మరునాటి రాత్రి రామాలయంలో తమిద్దరి పెళ్ళి ఏర్పాట్లు ప్రారంభించాడు త్రినాధ్.

ఆఖరి నిమిషం వరకూ ఆ బురఖా అమ్మాయి ఐశ్వర్యారాయ్ అన్న విషయం ఎవరికీ తెలియకూడదు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

తెల్లవారింది...

త్రినాధ్ నిద్రపోతున్న ఐశ్వర్యారాయ్‌ను లేపి, సుబ్బూ వాళ్ళావిడ ఇంటికి రమ్మందనీ, పెళ్ళికూతురుగా తయారైన తరువాత అటునుంచటే గుడికి రావచ్చని చెప్పాడు.

సరేనని ఆ బురఖాతోనే సుబ్బూ వాళ్ళింటికి బయలుదేరింది ఐశ్వర్య.

సందు మలుపులో కిళ్ళీబడ్డీ దగ్గర ఆ అగంతకులే వున్నారు.

తన మతిమరుపుకి తనే తిట్టుకుంది ఐశ్వర్య. ఆ విషయం త్రినాధ్‌తో చెప్పనందుకు.

వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేయాలంటే వాళ్ళనుమానిస్తారేమన్న భయం.

అటూ వెలితే వాళ్ళ చూపులన్నీ తన మీదే వున్నాయి. అలాగే ముందుకడుగేసింది.

వాళ్ళ చూపుల్లో ఏదో అనుమానం... వాళ్ళు ఆమెని అనుసరించారు.

కిళ్ళీబడ్డీ అతను నోరావులించి చూసి, త్రినాధ్‌తో చెప్పటానికి పరుగెత్తాడు.

తనను అనుసరించడం చూసి నడక వేగం పెంచింది ఐశ్వర్య.

వాళ్ళనుమానం బలపడింది.

వాళ్ళు తనవంకే రావటం చూసి పరుగుతీసిందామె. వాళ్ళుకూడా వెంటపడి తరమసాగారు.

ఒకతను చెయ్యిచాపి పట్టుకోబోతే బురఖా చేతికి దొరికింది. అతను గట్టిగా లాగడంతో హుక్స్‌లూడిపోయి, బురఖా మొత్తం క్రింద పడింది.

రోడ్డుమీద ఉన్నవాళ్ళంతా నిశ్చేష్టులై నిలబడిపోయారు.

వాళ్ళ కళ్ళను జిగేలుమనిపిస్తూ ఓ నిలువెత్తు సౌందర్యం అక్కడ ప్రత్యక్షమయింది.

ఆమె భయవిహ్వలంగా పరుగెత్తసాగింది. వాళ్ళ చేతిలోని యాసిడ్ బాటిల్స్ గురి చూసుకోసాగాయి.

వినీల కేశ పాశంతో, ఆకుపచ్చని కళ్ళ కాంతులతో, సూర్య కిరణంలా ఆమె పరుగెడుతోంటే...

ఆ ఊళ్ళో ప్రజలంతా ఆమె వెనుకే పరుగుతీసారు. క్షణాల్లో ఆమె వెనుక వందమంది ప్రజలు పోగయ్యారు.

ఆమె ఆయాసంతో పరుగెత్తడం ఆపి వెనక్కి తిరిగి చూసింది.

ఆమె వెనుక పరుగెత్తుతున్న వాళ్ళంతా ఠక్కున ఆగిపోయి ఆమె వంకే చూడసాగారు.

ఆమె వెంట పడినవాళ్ళు దూరంగా బాటిల్స్‌తో వస్తూ కనిపించారు. ఆమెకు ఆ క్షణంలో చాలా నిశ్చింతగా అన్పించింది.

ఈలోగా ఆ అగంతకులిద్దర్నీ సమీపించాడు త్రినాధ్.

వాళ్ళ చేతుల్లో వున్న బాటిల్స్ చూడగానే ఆవేశం పెరిగిపోయింది.

చేతిలో ఉన్న ముల్లుకర్ర గురిచూసి వదిలాడు.

ఒక కర్ర దెబ్బకి రెండు బాటిల్స్ అన్నట్లుగా ఆ సీసాలు వాళ్ళ చేతుల్లోనే పగిలిపోయాయి.

యాసిడ్ వాళ్ళ శరీరాలమీదే పడి క్షణాల్లో వంటిని కాల్చేయడం ప్రారంభించింది.

వాళ్ళు హాహాకారాలు చేస్తూ నేలపై దొర్లడం ప్రారంభించారు.

వాళ్ళను తీసుకెళ్ళి ఊరి బయట వదిలేసి వచ్చారు కొందరు.

అందరూ సమావేశమై ఐశ్వర్యారాయ్, త్రినాధ్‌ని పెళ్ళి చేసుకొంటోందని తెలిసి ఆశ్చర్యపోయారు.

ఊరంతా ఒకటే సందడి.

ఇన్నాళ్ళూ బురఖా వేసుకొని తమ మధ్య తిరిగింది ఐశ్వర్యారాయ్ అని తెలియగానే వాళ్ళలో ఒకటే సంభ్రమం.

ఆ రాత్రే కట్టుదిట్టమైన యువకుల పహరా మధ్య త్రినాధ్, ఐశ్వర్యారాయ్‌ల వివాహం జరిగింది.

ఆ మరునాడు జరిగిన విలేఖరుల సమావేశంలో ఆమె తన వివాహ వార్తను వెల్లడించడమే కాక, పవిత్రమైన నటనా రంగంలో మాఫియా ప్రవేశించి, అనేకమంది జీవితాలను అస్తవ్యస్తం చేస్తోందని, ఓ బాధ్యత గలిగిన నటిగా తన భర్త సహకారంతో మాఫియాను ఎదుర్కొంటానని, అందుకోసం తన ప్రాణాలను కోల్పోడానికయినా సిద్ధమేనని చెప్పింది...

-: శుభం :-

## నార్త్ అమెరికా లో ఆపదలో ఉన్న తెలుగు వారిని
## తక్షణం ఆదుకొనే అతిపెద్ద సేవావ్యవస్థ 'తానా'



కోటిరూపాయలు పైగా వెచ్చించి స్వగ్రామంలో తనకున్న ఎకరంన్నర భూమిలో
నిరుపేదలకు ఉచితంగా ఇల్లు కట్టించి ఇవ్వటమే కాకుండా,
ఎన్నో గుళ్లకు ముఖ ద్వారాలను కట్టించిన వితరణశీలి

## శ్రీ సతీష్ వేమన గారిని

ఆ ప్రాంత తెలుగు ప్రజలు ఎప్పటికీ స్మరించుకుంటూనేఉంటారు

For My Web Magazine Serials : www.gotelugu.com
For My eBooks : www.kinige.com
For My English Novel : www.amazon.com
: www.amazon.in
Website : www.suryadevararammohanrao.com
Email : suryadevaranovelist@gmail.com